www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

గురువారం | 19-6-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 64 | శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, బహుళ పక్షం తిథి: అష్టమి ఉ.11:56 తదుపరి నవమి, నక్షత్రం: ఉత్తరాభాద్ర రా.11:17 తదుపరి రేవతి, వర్జ్యం: ఉ.9:32-11:04, దుర్ముహూర్తం: ఉ.10:06-10:58, మ.3:19-4:11, అమృతఘడియలు: సా.6:42-8:13, రాహుకాలం: మ.1:30-3.00, సూర్యోదయం: 5:45, సూర్యాస్తమయం: 6:47 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

టోల్ ఇక సులువుగా.. చవకగా

కొత్తగా ఫాస్టాగ్ ఆధారిత వార్షిక పాస్

ఆగస్టు 15 నుంచి అందుబాటులోకి

పాస్ ధర రూ.3 వేలుగా నిర్ణయం

ఏడాది గడువు లేదా 200 ట్రిప్పులకు అనుమతి

పరిమితి దాటితే మళ్లీ కొనుక్కునే అవకాశం

వాణిజ్యేతర ప్రైవేట్ వాహనాలకే పరిమితం

న్యూఢిల్లీ, జూన్ 18: జాతీయ రహదారులపై తరచూ ప్రయాణం చేసే వాహనదారులకు కేంద్రం శుభవార్త చెప్పింది. టోల్ చార్జీల నుంచి ఉపశమనం కలిగించే ఉద్దేశంతో నాన్ కమర్షియల్ ప్రైవేట్ వాహనాల కోసం ఫాస్టాగ్ ఆధారిత వార్షిక పాస్‌ను ప్రవేశపెట్టింది. ఇది ఆగస్టు 15 నుంచి అందుబాటులోకి

మిగతా 2వ పేజీలో...

ఫోన్ ట్యాపింగ్ ముమ్మాటికీ నిజం



నా ఫోన్ రికార్డు ఆడియోను అప్పట్లో వైవీ వినిపించారు

కేటీఆర్, కేసీఆర్‌తో జగన్‌కు ఉన్న సంబంధం ముందు రక్తసంబంధం కూడా చిన్నబోయింది

చెల్లికి ఏ అన్నా చేయనన్ని ఘోరాలు చేసిన జగన్

నన్ను రాజకీయంగా, ఆర్థికంగా ఎదగనివ్వకుండా కుట్రలు

ఫోన్ ట్యాపింగ్‌పై ప్రభుత్వాలు లోతుగా దర్యాప్తు చేయాలి

విచారణకు పిలిస్తే హాజరవుతా: పీసీసీ అధ్యక్షురాలు షర్మిల

గోపాలపట్నం(విశాఖపట్నం), జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఉభయ తెలుగు రాష్ట్రాల్లో గత ప్రభుత్వాల హయాంలో ఫోన్ ట్యాపింగ్‌లు జరిగిన మాట ముమ్మాటికీ వాస్తవమేనని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల అన్నారు. అల్లూరి జిల్లా పర్యటన నిమిత్తం బుధవారం హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వచ్చిన

మిగతా 14వ పేజీలో...

చట్టంతో చెలగాటం

ఫోన్ ట్యాపింగ్‌తో జగన్ అరాచకం

రాజకీయ ప్రత్యర్థుల ఫోన్లపై గురి

జడ్జిల మాటలూ విన్నారని ఆరోపణలు

సుప్రీంకోర్టుకు ఓ కీలక న్యాయమూర్తి లేఖ

అనుకూల తీర్పులివ్వలేదనే అక్కసుతోనేనా..

బాధితుల్లో సొంత పార్టీ నేతలు, అధికారులు

చట్టబద్ధమైన అనుమతులు అవసరం లేకుండా అత్యాధునిక ట్యాపింగ్ సాంకేతికత వినియోగం

సొంత వ్యవస్థలా టెలిగ్రాఫ్ చట్టం వాడకం

చట్టం ఉల్లంఘనలకు కనీసం మూడేళ్ల శిక్ష



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఫోన్ ట్యాపింగ్... మాజీ సీఎం జగన్ హయాంలో జరిగిన ఎన్నో అరాచకాలకు ఇదే కీలకం. అప్పట్లో రాజకీయ ప్రత్యర్థుల నుంచి న్యాయమూర్తుల వరకూ ఎవరినీ వదల్లేదు. చివరకు సొంత పార్టీ నేతలు, మంత్రులు, అధికారులు, జర్నలిస్టుల ఫోన్ సంభాషణలపై కూడా దొంగచాటుగా ఓ చెవి వేశారు. చట్ట విరుద్ధం అని తెలిసి కూడా లెక్కలేనితనంతో వ్యవహరించారు. అతి క్రూరమైన బ్రిటిష్ చట్టాల అమలుతో సహా ఐదేళ్ల పాలనలో జగన్ తీసుకున్న ఎన్నో అడ్డగోలు నిర్ణయాలను కోర్టులు అడ్డుకున్నాయి. న్యాయమూర్తులు తమకు అనుకూలమైన తీర్పులు ఎందుకివ్వడం లేదు? తనకు వ్యతిరేకంగా వారిని ఎవరైనా ప్రేరేపిస్తున్నారా? వారి అంతరంగం ఏమిటో తెలుసుకోవాలని జగన్ తహతహలాడారు. ఈ క్రమంలోనే అప్పట్లో ఓ కీలక న్యాయమూర్తి అంతర్గత సంభాషణల్లో చేసిన వ్యాఖ్యలు

మిగతా 14వ పేజీలో...

వైసీపీ హయాంలో పోలీసుల చేతిలో నడిరోడ్డుపై హింసకు గురైన డాక్టర్ సుధాకర్ లాంటి వారిని పరామర్శిస్తే ఒక అర్థముంది. కానీ... రెచ్చిపోతున్న రౌడీషీటర్లపై కఠినంగా వ్యవహరించిన పోలీసులను తప్పుపట్టి, అదే రౌడీషీటర్లను పరామర్శించే వారిని ఏమనాలి?

పార్టీ కోసం కష్టపడిన వ్యక్తికి విగ్రహం పెట్టారంటే అర్థం చేసుకోవచ్చు! వారి కుటుంబాన్ని పరామర్శించవచ్చు. కానీ... వైసీపీ గెలుస్తుందని జనం సొమ్ముతో బెట్టింగులు పెట్టి, ఆ డబ్బులు కట్టలేక ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి కుటుంబాన్ని ఏడాది తర్వాత ఓదార్చే వారిని ఏమంటారు?

ప్రజాస్వామ్యబద్ధంగా చేసే నిరసనలు, ఆందోళనలకు పోలీసులు అనుమతించకపోయినా, అపరిమితమైన ఆంక్షలు విధించినా కోర్టులను ఆశ్రయించవచ్చు. కానీ... 'మాకు అనుమతులే అక్కర్లేదు. ఆంక్షలను పట్టించుకోం' అని రెచ్చిపోయే నేతలను ఎలా చూడాలి?

నరుకుతాం.. చంపుతాం!



2029లో అధికారంలోకొచ్చి ఒక్కొక్కడిని నరుకుతామంటూ వైసీపీ పోస్టర్

వైసీపీ కార్యకర్తల 'నరుకుడు' భాష

జగన్ పర్యటనల్లో ఫ్లెక్సీలు పెట్టి బెదిరింపులు

పొదిలిలో.. తొక్కి పడేస్తామని హుంకరింపు

సత్తెనపల్లిలో 'రప్పా రప్పా' అంటూ డైలాగులు

రాజారెడ్డి రాజ్యాంగం తెస్తామని ప్రకటనలు

రౌడీ షీటర్లకు పరామర్శల పేరిట అరాచకం

బెట్టింగ్‌లతో ఆత్మహత్య చేసుకుంటే విగ్రహం

జగన్ తీరు చూసి జనంలో విస్మయం

జగన్ పర్యటనలో ఇద్దరి మృతి

కాన్వాయ్‌లో వాహనం ఢీకొట్టడంతో వ్యక్తికి తీవ్ర గాయాలు.. పట్టించుకోని నేతలు

పోలీసులొచ్చి ఆస్పత్రికి తరలించేలోపే మృతి

డాన్స్ చేస్తూ కార్యకర్త కన్నుమూత

రెండు కుటుంబాల్లో అంతులేని విషాదం

కనీసం పరామర్శించని వైసీపీ అధినేత

ముదురుతున్న వైసీపీ క్షుద్ర రాజకీయం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

మొన్న: తెనాలిలో గంజాయి బ్యాచ్, రౌడీ షీటర్ల పరామర్శకు బయలుదేరినా..

నిన్న: పొదిలిలో పొగాకు రైతుల పరామర్శ పేరుతో వేలాది మందితో దండయాత్ర చేసినా...

నేడు: సత్తెనపల్లిలో ఏడాది క్రితం ఇతరుల సొమ్ముతో బెట్టింగ్ ఆడి కోట్లు నష్టపోయి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి విగ్రహావిష్కరణ, పరామర్శకు వెళ్లినా...

ప్రతిచోటా 'వైసీపీ మార్కు' అరాచకమే! వికృత రూప ప్రదర్శనే!

ఒక రాజకీయ పార్టీ ఇలా ఉంటుందా... ఒక పార్టీ కార్యకర్తలు ఇలా వ్యవహరిస్తారా... ఒక పార్టీ అధ్యక్షుడికి పద్ధతీ పాడూ ఉండక్కర్లేదా... అని జనం ఈసడించుకునే స్థాయిలో వైసీపీ క్షుద్ర రాజకీయం చేస్తోంది. నిరసన పేరుతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోంది. ప్రజాస్వామ్యంలో నిరసనలు తెలిపే హక్కు ఎవరికైనా ఉంటుంది. ప్రతిపక్షాలకు అది అవసరం కూడా! అయితే... నిరసన చేసేందుకు

మిగతా 13వ పేజీలో...

జనం చెవిలో జగన్ పూలు!

పల్నాడు పర్యటనలో కట్టుకథలు.. అబద్ధాలను నిజాలుగా నమ్మించే యత్నం.. ఓ సామాజిక వర్గంపై ఎనలేని ప్రేమ

జగన్ పర్యటనలో రచ్చ రచ్చ

పరామర్శ పేరుతో బలప్రదర్శన.. జనసమీకరణ

రెంటపాళ్లకు వంద మందికే అనుమతి

వేలాది మందిని తరలించిన నేతలు

బారికేడ్లను తోసి, పోలీసులపైనే దౌర్జన్యం

దమ్ముంటే ఆపాలంటూ అంబటి వీరంగం

13



రెంటపాళ్లలో విలేకరులతో మాట్లాడుతున్న జగన్

సినిమా చూపిస్తా..

నాగమల్లేశ్వరరావును చంద్రబాబు పొట్టనపెట్టుకున్నారు

మా పార్టీలోని కమ్మ నేతలను టార్గెట్ చేస్తున్నారు

నాని, వంశీ, అవినాశ్, తలశిలపై కేసులు పెట్టారు

ఏం చేశారని వారిని వేధిస్తున్నారు?.. జగన్ ఆక్రోశం



రవి



అరుణ

మారేడుమిల్లిలో ఎన్‌కౌంటర్..

రవి, అరుణ మృతి

ఇద్దరూ మావోయిస్టు అగ్రనేతలే..

12

మరో నక్సల్ అంజూ కూడా మృతి

కగార్ దాడులతో అల్లూరి జిల్లాలోకి రాక

మూడుసార్లు తప్పించుకున్న రవి, అరుణ

డ్రోన్లతో జాడపట్టి ఎట్టకేలకు ఎన్‌కౌంటర్

నాడు ప్రభుత్వంతో చర్చల బృందంలో రవి

వరంగల్‌లో ఆర్ఎస్‌యూ నేతగా మొదలై కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎదిగిన రవి

టెహ్రాన్‌పై నిప్పుల వాన

50 యుద్ధ విమానాలతో విరుచుకుపడిన ఇజ్రాయెల్

మిలటరీ, ప్రభుత్వ కార్యాలయాలు ధ్వంసం

ఐఆర్‌జీసీ అనుబంధ వర్సిటీ కూడా

అణు కేంద్రంలో సెంట్రీఫ్యూజ్ తయారీ యూనిట్ ధ్వంసం

మూడు హెలికాప్టర్లను కూల్చాం: ఐడీఎఫ్

మూడు విమానాల్లో ఒమన్‌కు చేరుకున్న ప్రభుత్వాధికారులు

యుద్ధం మొదలైంది: ఖమేనీ

అమెరికాను హెచ్చరించిన సుప్రీంలీడర్

ఇరాన్ లొంగేది లేదని స్పష్టీకరణ

గుడ్ లక్.. అన్న అమెరికా అధ్యక్షుడు

ఖమేనీ లొంగిపోవడమే మంచిదన్న ట్రంప్

ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడుల కొనసాగింపు

ఒక్కరాత్రి రక్షణ వ్యవస్థకు ఇజ్రాయెల్ చేస్తున్న ఖర్చు రూ.2,400 కోట్లు



టెహ్రాన్/టెల్అవీవ్/న్యూఢిల్లీ, జూన్ 18: ఇరాన్ రాజధాని టెహ్రాన్ బుధవారం దద్దరిల్లింది. ఇజ్రాయెల్ వైమానిక దళాలు 50కిపైగా యుద్ధ విమానాలతో తెల్లవారుజాము నుంచే నగర వ్యాప్తంగా క్షిపణి దాడులతో నిప్పుల వర్షం కురిపించాయి. ఇరాన్ అణు కార్యక్రమాలను టార్గెట్‌గా చేసుకున్న ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) టెహ్రాన్ శివార్లలోని రెండు 'సెంట్రీఫ్యూజ్‌'ల తయారీ కేంద్రాలపై విరుచుకుపడింది. అణు కార్యక్రమాలకు సెంట్రీఫ్యూజ్‌లు అత్యంత కీలక పరికరాలు. యురేనియం-238ను ప్రాసెస్ చేయగా వచ్చే

మిగతా 2వ పేజీలో...



జీ-7 సమావేశాల సందర్భంగా కెనడా ప్రధాని మార్క్ కార్నీతో ప్రధాని మోదీ

ఉగ్రవాదంపై రెండు నాల్కలు!

టెర్రరిజానికి మద్దతిచ్చే వారికి రివార్డులా?

అగ్ర దేశాలపై విసుర్లు

ఉగ్రవాదానికి ఊతమిచ్చే వారికి శిక్ష పడాల్సిందే

జీ7 సదస్సులో మోదీ

యుద్ధం నేనే ఆపా!

భారత్ వైపు ప్రధాని నరేంద్ర మోదీ, పాక్ వైపు ఆర్మీ చీఫ్ మునీర్ సమర్థంగా పనిచేశారు: ట్రంప్

కాల్పుల విరమణతో అమెరికాకు సంబంధం లేదని ట్రంప్‌కు మోదీ స్పష్టంచేసిన తర్వాత వ్యాఖ్య

పాక్ అభ్యర్థిస్తేనే ఆపరేషన్ ఆపామన్న మోదీ

వాణిజ్యం, మధ్యవర్తిత్వంపై అమెరికాతో చర్చే లేదని వెల్లడి

ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారి ఫోన్లో మాటామంతీ

అమెరికాకు రావాలన్న ట్రంప్ ఆహ్వానానికి తిరస్కృతి

షెడ్యూల్ ప్రకారం క్రొయేషియాకు వెళ్లనున్నట్టు వెల్లడి



న్యూఢిల్లీ, జూన్ 18: యుద్ధాన్ని ఆపడంలో భారత్ వైపు ప్రధాని మోదీ, పాకిస్థాన్ వైపు ఆ దేశ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ ప్రభావవంతంగా వ్యవహరించారని.. అయితే యుద్ధాన్ని మాత్రం తానే ఆపానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. కాల్పుల విరమణకు అంగీకరిస్తే భారీగా వాణిజ్యం చేస్తామని, లేకుంటే వాణిజ్యం మొత్తంగా నిలిపివేస్తామని తాను చేసిన హెచ్చరికలతోనే భారత్, పాక్ యుద్ధం నిలిపివేశాయని గతంలో ట్రంప్ పేర్కొన్న విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు భారత్ తరఫున మోదీ, పాక్ తరఫున మునీర్ యుద్ధాన్ని ఆపడానికి ప్రయత్నించారంటూ వారికి కొంత

మిగతా 2వ పేజీలో...

బాబు సుదీర్ఘ అనుభవంతో.. అభివృద్ధి బాటలో ఆంధ్ర

డబుల్ ఇంజన్ సర్కారుకు కేంద్రం సహకారం.. లోకేశ్‌కు అమిత్‌షా హామీ

కేంద్ర హోం మంత్రితో భేటీలో రాష్ట్ర పరిణామాలపై యువనేత చర్చ

మద్యం స్కాం, అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలూ ప్రస్తావన

యువగళం పుస్తకం అందజేత.. ముగ్గురు కేంద్ర మంత్రులతోనూ భేటీ



12

కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు యువగళం పుస్తకాన్ని అందజేస్తున్న లోకేశ్

'కబుర్ల దేవత'కు కేంద్ర బాల పురస్కారం

మైరావణ నవలకు యువ పురస్కారం

బాలసాహిత్యంలో 50ఏళ్లకుపైగా గంగిశెట్టి కృషి

పాతికేళ్లకే మూడు నవలలు రాసిన ప్రసాద్ సూరి

12

ఓటర్లకు పంచడానికి లిక్కర్ డబ్బు

చెవిరెడ్డి గన్‌మెన్, పీఏ, డ్రైవర్ల పాత్రను

కోర్టులో వివరించిన సిట్

సాంకేతికంగా అన్ని ఆధారాలూ సేకరించాం

వాటి ఆధారంగానే చెవిరెడ్డి తదితరుల అరెస్టు

చెవిరెడ్డి, వెంకటేశ్‌కు 1 వరకు రిమాండ్

సిట్ ఆఫీసులో చెవిరెడ్డి చిందులు.. ఆస్పత్రి, కోర్టు, జైలు వద్ద కేకలు, అరుపులు

హైదరాబాద్, తాడేపల్లి నుంచే తరలింపు

కార్లు, లారీల్లో రూ.250 కోట్లు పంపారు

చెవిరెడ్డి రిమాండ్ రిపోర్టులో సిట్ వెల్లడి

ట్రక్కుల్లో తరలించారు!



కోర్టు ఆవరణలో వేలు చూపిస్తూ మాట్లాడుతున్న చెవిరెడ్డి

విజయవాడ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మద్యం ముడుపుల ద్వారా వెనకేసుకున్న డబ్బులను 2024 ఎన్నికల్లో ఆంధ్ర ఓటర్లకు పంచారని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) వెల్లడించింది. ఈ డబ్బు తరలించడానికి నిందితులు ఏకంగా ఒక ట్రక్కును ఏర్పాటు చేసుకున్నారని తెలిపింది. మాజీ ఎమ్మెల్యే, ఒంగోలు లోక్‌సభ

మిగతా 14వ పేజీలో...



రైతుకు అండగా నిలవండి!

ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు చేయండి

సాంకేతికతతో క్రయవిక్రయాలను పర్యవేక్షించండి

హెచ్‌డీ బర్లీ పొగాకు కొనుగోళ్లలో వేగం పెంచండి

మామిడి, పొగాకు, కోకో పంటల మద్దతు ధరలపై సమీక్షలో అధికారులకు సీఎం చంద్రబాబు నిర్దేశం

3

ఇకపై పన్ను ఎగవేత కుదరదు

ఖజానాకు నష్టం కలిగిస్తే కఠిన చర్యలు

12

ఇబ్బంది పెట్టకుండా పన్ను వసూలు చేయాలి: సీఎం

హిందీ బోధనపై వెనక్కి తగ్గిన మహారాష్ట్ర

» మూడో భాషగా ఇతర భారతీయ భాష ఎంపికకు అవకాశం

న్యూఢిల్లీ, జూన్ 18: ఒకటి నుంచి ఐదో తరగతి వరకు మూడో భాషగా హిందీని తప్పనిసరి చేస్తూ గతంలో తీసుకున్న నిర్ణయాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకుంది. దీనిపై ప్రతిపక్షాల నుంచి, మరాఠీల నుంచి వ్యతిరేకత రావడంతో రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. తాజాగా విడుదల చేసిన నోటిఫికేషన్‌లో హిందీ తప్పనిసరిగా బోధించాలన్న నిబంధనను తొలగించింది. ఈ మేరకు మహారాష్ట్ర పాఠశాల విద్యాశాఖ బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. త్రిభాషా విధానంలో విద్యార్థులు తమ మూడో భాషగా హిందీకి బదులు ఏదైనా భారతీయ భాషను ఎంచుకునే అవకాశం కల్పించింది. అయితే ఆ భాషను నేర్చుకోవాలనుకునే వారు తరగతిలో కనీసం 20 మంది ఉండాలని, అప్పుడే ఆ భాషను పాఠశాలలో బోధిస్తామని స్పష్టం చేసింది. ఒకవేళ విద్యార్థులు అంతకన్నా తక్కువ ఉంటే ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తామని పేర్కొంది. జాతీయ విద్యావిధానంలోని త్రిభాషా సూత్రంలో భాగంగా దేశవ్యాప్తంగా విద్యార్థులు మూడు భాషలు నేర్చుకోవాలని కేంద్రం పేర్కొంది. అందులో కచ్చితంగా రెండు భారతీయ భాషలుండాలి.

భారత్‌లో ఫాల్కన్ వాణిజ్య జెట్ల నిర్మాణం

» రిలయన్స్ ఇన్‌ఫ్రా- దసో మధ్య కీలక ఒప్పందం

పారిస్, న్యూఢిల్లీ, జూన్ 18: అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇన్‌ఫ్రా, ఫ్రాన్స్‌కు చెందిన దసో ఏవియేషన్ సంస్థ సంయుక్తంగా బిజినెస్ జెట్ విమానాల నిర్మాణం చేపట్టనున్నాయి. ఫాల్కన్-2000 జెట్లను తొలిసారి ఫ్రాన్స్‌కు బయట ఉత్పత్తి చేయనున్నారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో వీటి నిర్మాణం జరగనుంది. రెండు కంపెనీల మధ్య జాయింట్ వెంచర్ 2017లోనే కుదరగా పారిస్‌లో తాజా కీలక ఒప్పందం కుదిరింది. ఇప్పటివరకు అమెరికా, ఫ్రాన్స్, కెనడా, బ్రెజిల్ మాత్రమే బిజినెస్ జెట్ విమానాల నిర్మాణం చేస్తుండగా ప్రస్తుతం ఐదో దేశంగా భారత్ నిలవనుంది. రెండు ఇంజిన్లుండే ఫాల్కన్-2000 బిజినెస్ జెట్‌లో 8 నుంచి పది మంది ప్యాసింజర్లు ప్రయాణించవచ్చు. దసో ఏవియేషన్ సంస్థ ఇప్పటివరకు 2700 ఫాల్కన్‌లతో పాటు మొత్తం 10 వేల సైనిక, పౌర విమానాలను 90 దేశాలకు సరఫరా చేసింది. భారత్‌లో తొలి ఫాల్కన్-2000 జెట్ విమానం 2028 నాటికి సిద్ధం కావొచ్చని అంచనా. ఇందుకోసం వందల మంది ఇంజినీర్లను, టెక్నీషియన్లను రిక్రూట్ చేసుకోనున్నారు.

అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో కుట్ర కోణం?

» తోసిపుచ్చలేమన్న దర్యాప్తు అధికారులు

అహ్మదాబాద్, జూన్ 18: అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదంపై భిన్న కోణాల్లో దర్యాప్తు సాగుతోంది. ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో(ఏఏఐబీ) నేతృత్వంలో గుజరాత్ పోలీసులు, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) సంయుక్తంగా విచారణ చేపట్టాయి. మరోవైపు అమెరికాకు చెందిన నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డు దీనికి సమాంతరంగా స్వతంత్ర దర్యాప్తును ప్రారంభించింది. టేకాఫ్ అయిన తర్వాత క్షణాల వ్యవధిలోనే విమానం కుప్పకూలడం వెనుక ఏం జరిగి ఉంటుందనే కోణంలో అధికారులు కూపీ లాగుతున్నారు. ఇందులో కుట్ర కోణాన్ని కూడా తోసిపుచ్చలేమని సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ 'టైమ్స్ ఆఫ్ ఇండియా' కథనం ప్రచురించింది. ప్రమాదం జరిగిన సమయంలో గ్రౌండ్ హ్యాండ్లింగ్ ఆపరేషన్లలో పాల్గొన్న సిబ్బందిని ప్రశ్నించి, వారి వాంగ్మూలాలను నమోదు చేశారు. అలాగే విమానం టేకాఫ్ కోసం క్లియరెన్స్ ఇచ్చిన కీలక సిబ్బంది ఫోన్లను దర్యాప్తు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విమానాశ్రయ ప్రాంగణంలోని సీసీ టీవీ ఫుటేజీని సేకరించారు. ఇదిలాఉండగా, అహ్మదాబాద్‌కు చెందిన వ్యాపారి రాజేశ్ పటేల్ (57)... ప్రమాదం జరిగిన స్థలం నుంచి సేకరించిన దాదాపు 70 తులాల బంగారు ఆభరణాలు, 8 నుంచి 10 వెండి వస్తువులు, రూ.50వేల నగదు, 20 అమెరికన్ డాలర్లతో పాటు కొన్ని పాస్‌పోర్టులను పోలీసులకు అప్పగించి మానవత్వం చాటుకున్నారు.

ఇకపై 15 రోజుల్లోనే ఓటరు కార్డుల జారీ: ఈసీ

న్యూఢిల్లీ, జూన్ 18: ఓటరు జాబితాలో తమ పేరును నమోదు చేసుకున్న 15 రోజుల్లోనే ఓటర్లకు గుర్తింపు కార్డులను అందజేసేలా ఎన్నికల సంఘం నూతన ప్రక్రియను ప్రవేశపెట్టింది. కొత్తగా తమ పేర్లను నమోదు చేసుకున్న వారితో పాటు, పాత వాటిల్లో వివరాలు మార్చుకున్న వారికి కూడా దీనిని అమలు చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం ఓటరు కార్డుల జారీకి నెల రోజులకు పైగా సమయం పడుతున్నట్లు ఎన్నికల సంఘం గుర్తించింది. ఆ సమయాన్ని సగానికి పైగా తగ్గించాలని నిర్ణయించింది. పేర్ల నమోదు నుంచి కార్డుల జారీ వరకు ఉన్న ప్రతి దశను తక్షణ పర్యవేక్షణ చేయనున్నట్లు వివరించింది. ఓటరు కార్డుల స్థితి గురించి ఎప్పటికప్పుడు ఎస్ఎంఎస్‌ల ద్వారా తెలియజేస్తామని పేర్కొంది.

శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్ర 22కి వాయిదా

న్యూఢిల్లీ, జూన్ 18: భారత వ్యోమగామి శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్ర మరోసారి వాయిదా పడింది. యాక్సియం-4 మిషన్‌లో భాగంగా స్పేస్ ఎక్స్‌కు చెందిన ఫాల్కన్-9 రాకెట్ ద్వారా శుభాంశు శుక్లాతోపాటు మరో ముగ్గురు వ్యోమగాములు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లనున్నారు. పలు కారణాల వల్ల వాయిదా పడుతూ వస్తున్న ఈ రోదసీ యాత్ర ఈ నెల 19న ఉంటుందని ఇస్రో ఇటీవల ప్రకటించింది. కానీ.. దీన్ని ఈ నెల 22వ తేదీకి వాయిదా వేసినట్టు యాక్సియం స్పేస్ బుధవారం వెల్లడించింది. సాంకేతిక కారణాలతో ఇప్పటికే ఈ మిషన్ పలుమార్లు వాయిదా పడింది. ఈ ప్రయోగం తొలుత మే 29న జరగాల్సి ఉంది. వాతావరణం అనుకూలించక వాయిదా పడింది.

కర్ణాటక మంత్రి ప్రియాంక్ ఖర్గేకు చేదు అనుభవం

» ప్యారిస్ నుంచి అమెరికా పర్యటనకు లభించని అనుమతి

బెంగళూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): కర్ణాటక గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, ఐటీబీటీ శాఖ మంత్రి ప్రియాంక ఖర్గేకి అమెరికాలో పర్యటించేందుకు అనుమతి లభించలేదు. దీనికి భారతీయ విదేశీ వ్యవహారాల శాఖ నిర్ణయం కారణమా? లేక అమెరికా నిరాకరించిందా.? అనే విషయంలో స్పష్టత లేదు. ప్రియాంక ఖర్గే ప్యారిస్ పర్యటనలో ఉన్నారు. అక్కడి నుంచి అమెరికా వెళ్లి.. బోస్టన్, శ్యాన్‌ఫ్రాన్సిస్కో నగరాలలో జరిగే బయో ఇంటర్నేషనల్ కన్వెన్షన్ డిజైన్ అండ్ ఆటోమేషన్ కాన్ఫరెన్స్‌లలో పాల్గొనాల్సి ఉంది. ప్యారిస్‌లో మంగళవారం అధికారిక కార్యక్రమాలను ముగించుకుని, అమెరికాకు వెళ్లేందుకు ఆయన సిద్ధమయ్యారు. కానీ అనుమతులు లభించకపోవడంతో విచారం వ్యక్తం చేశారు. భారత్‌కు తిరిగి వచ్చాక కేంద్ర ప్రభుత్వంతో నిర్దిష్టమైన కారణాలు కోరుతానని మంత్రి అన్నారు. ఇలా ఉండగా మంత్రి వెంట ఉన్న ఓ ఐఏఎస్ అధికారికి అమెరికా వెళ్లేందుకు అనుమతులు లభించాయి. ఓ మంత్రికి విదేశీ పర్యటనకు అనుమతి నిరాకరించడం, ఆయన వెంట ఉన్న ఐఏఎస్ అధికారికి అనుమతులు లభించడం రాజకీయంగా దుమారం రేపుతోంది.



మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఐష్‌బాగ్ స్టేడియం సమీపంలో నిర్మించిన 'లంబకోణ వంతెన'లో మార్పులు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. వంతెన రీడిజైనింగ్ కోసం అవసరమైన స్థలాన్ని ఇచ్చేందుకు భారతీయ రైల్వే అంగీకరించిందని వారు చెప్పారు. 648 మీటర్ల పొడవు, 8.5మీటర్ల వెడల్పు, రూ.18కోట్లతో ఈ రైల్వే ఓవర్ బ్రిడ్జిని నిర్మించారు. దీన్ని ఇంకా ప్రారంభించలేదు. అయితే, వంతెన పైన ఓ చోట 90డిగ్రీల మలుపు ఉండటం తీవ్ర విమర్శలకు కారణమైంది. అలా ఉంటే ప్రమాదాలు జరుగుతాయన్న ఆందోళనలు వ్యక్తమయ్యాయి.

యుద్ధం నేనే ఆపా!



ట్రంప్‌తో పాక్ ఆర్మీ చీఫ్ 'లంచ్' భేటీ..

భారత్‌కు భారీ ఎదురుదెబ్బ

» అఖిలపక్ష భేటీకి కాంగ్రెస్ డిమాండ్

న్యూఢిల్లీ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్ 'మధ్యాహ్న భోజన' సమావేశం కానుండటం భారత్ దౌత్య వ్యూహానికి పెద్ద ఎదురుదెబ్బ అని కాంగ్రెస్ పార్టీ ఆందోళన వ్యక్తం చేసింది. తన మూడు దేశాల పర్యటన విశేషాలతోపాటు ట్రంప్‌తో ఫోన్‌లో ఏం మాట్లాడారో ప్రధాని మోదీ జాతికి చెప్పాలన్న కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్.. దీనిపై తక్షణం అఖిలపక్ష భేటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పాక్ ఆర్మీ చీఫ్ మునీర్‌తో 'లంచ్' భేటీపై ట్రంప్‌కు ప్రధాని మోదీ తన ఫోన్ సంభాషణల్లో అసంతృప్తిని తెలియజేయాలని పీటీఐతో మాట్లాడుతూ చెప్పారు. ఒకవేళ, మోదీ స్థానంలో ఇందిరాగాంధీ ఉంటే.. అమెరికా అధ్యక్షుడెవరైనా భారత ప్రధానిగా అసంతృప్తి వ్యక్తం చేసే వారని పేర్కొన్నారు. కశ్మీర్ విషయంలో తృతీయపక్షం జోక్యాన్ని అనుమతించబోమని ట్రంప్‌తో ఫోన్ సంభాషణల్లో ప్రధాని మోదీ చెప్పారన్న విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ప్రకటనపై జైరాం ప్రతిస్పందించారు. భ్రమలకంటే వాస్తవాలపైనే మోదీ సర్కార్ తప్పనిసరి దౌత్యవ్యూహం అమలు చేయాలని ఆయన సూచించారు. అబ్బోత్తాబాద్‌లో లాడెన్‌కు ఆశ్రమిచ్చిన పాక్.. ఉగ్రవాద వ్యతిరేక దాడుల్లో తమకు అసాధారణ భాగస్వామి అన్న అమెరికా సెంట్రల్ కమాండ్ చీఫ్ జనరల్ మిచెల్ కురిల్లా ప్రకటన.., వాణిజ్య ఒప్పందం పేరుతో భారత్-పాక్ మధ్య కాల్పుల ఒప్పందం కుదిర్చినట్లు ట్రంప్ 14 సార్లు ప్రకటించుకోవడం మన దౌత్య వ్యూహానికి ఎదురు దెబ్బ లేనన్నారు. కశ్మీరుపై మూడో పక్షం జోక్యాన్ని అనుమతించబోమని ట్రంప్‌తో ఫోన్ సంభాషణల్లో ప్రధాని మోదీ చెప్పడాన్ని కాంగ్రెస్ పార్టీ జీర్ణించుకోలేక పోతున్నదని బీజేపీ ఐటీ విభాగం అధిపతి అమిత్ మాలవియా పేర్కొన్నారు.

(మొదటి పేజీ తరువాయి)

క్రెడిట్ ఇచ్చారు. భారత్, పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంలో అమెరికాకు ఎలాంటి సంబంధం లేదని ట్రంప్‌కు ప్రధాని మోదీ స్పష్టం చేసిన నేపథ్యంలో ట్రంప్ కాస్త వెనక్కి తగ్గినట్టుగా అభిప్రాయం వ్యక్తమవుతోంది. బుధవారం ట్రంప్ అమెరికా అధ్యక్ష కార్యాలయం వైట్‌హౌజ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. "పాకిస్థాన్, భారత్ మధ్య యుద్ధాన్ని నేనే ఆపాను. ఐ లవ్ పాకిస్థాన్. మోదీ ఒక అద్భుత వ్యక్తి. గత రాత్రే నేను ఆయనతో మాట్లాడాను. భారత్‌తో వాణిజ్య ఒప్పందం చేసుకోబోతున్నాం. పాకిస్థాన్ వైపు ఆ దేశ ఆర్మీ చీఫ్, భారత్ వైపు ప్రధాని మోదీ.. యుద్ధాన్ని ఆపడంలో ఇద్దరూ ప్రభావవంతమైన వ్యక్తులు. వారి పని వారు చేశారు. రెండూ అణ్వస్త్ర సామర్థ్యమున్న దేశాలు. వారి మధ్య యుద్ధాన్ని నేను ఆపాను" అని వ్యాఖ్యానించారు. తాను చేసిన గొప్పపనిని మీడియా సరిగా పట్టించుకోవడం లేదనే ఉద్దేశాన్ని ట్రంప్ వ్యక్తం చేశారు.

వాణిజ్యం, మధ్యవర్తిత్వంపై చర్చే లేదు

కెనడాలో జరుగుతున్న జీ-7 సదస్సులో పాల్గొంటున్న ప్రధాని మోదీ.. అక్కడ షెడ్యూల్ ప్రకారం అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో ఆయన భేటీ కావాల్సి ఉంది. కానీ పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ట్రంప్ అమెరికాకు వెళ్లిపోయారు. అనంతరం మోదీ, ట్రంప్ ఫోన్‌లో మాట్లాడారు. ఈ వివరాలతో భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ బుధవారం ఉదయమే ఒక ప్రకటన విడుదల చేశారు. మిస్రీ వెల్లడించిన వివరాల ప్రకారం.. ట్రంప్‌తో మోదీ 35 నిమిషాల పాటు మాట్లాడారు. పాకిస్థాన్‌తో ఘర్షణ సమయంలో వాణిజ్యం గురించి కానీ, మధ్యవర్తిత్వం గురించిగానీ అమెరికా పాలన యంత్రాంగంతో తాను చర్చించలేదని ట్రంప్‌కు ప్రధాని మోదీ స్పష్టం చేశారు. పాకిస్థాన్ అభ్యర్థన మేరకు, తమ ఇరు సైన్యాల మధ్య చర్చల ద్వారా కాల్పుల విరమణ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. భారత్, పాక్ మధ్య మూడోదేశం మధ్యవర్తిత్వాన్ని భారత్ ఇంతవరకు అంగీకరించలేదని, భవిష్యత్తులోనూ అంగీకరించబోదని స్పష్టంచేశారు. ఇక సదస్సును ముగించుకుని అమెరికాకు రావాలన్న ట్రంప్ ఆహ్వానాన్ని మోదీ సున్నితంగా తిరస్కరించారు. షెడ్యూల్ ప్రకారం తాను క్రొయేషియాకు వెళ్లనున్నట్టు తెలిపారు.


'ఆపరేషన్' తర్వాత ఇదే మొదటి సారి..

పహల్గాం ఉగ్రదాడి ఘటన జరిగిన రోజు (ఏప్రిల్ 22న) మోదీకి ట్రంప్ ఫోన్ చేసి విచారం వ్యక్తం చేశారు. ఆ తర్వాత తిరిగి వారు మాట్లాడుకోవడం ఇదే మొదటిసారి. ఆపరేషన్ సిందూర్ సాగినంతకాలం విదేశాంగ మంత్రి జైశంకర్‌తో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీవాన్స్, ఆ దేశ విదేశాంగ శాఖలోని అత్యున్నత అధికారుల బృందం తరచూ మాట్లాడింది. మే 7-9 తేదీల మధ్య మోదీతో జేడీ వాన్స్ ఫోన్‌లో మాట్లాడారని విక్రమ్ మిస్రీ వెల్లడించారు.

వైట్‌హౌస్‌లో మునీర్‌కు ట్రంప్ విందు

వాషింగ్టన్, జూన్ 18: ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం పతాక స్థాయిలో ఉన్న తరుణంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌కు వైట్ హౌస్‌లో బుధవారం విందు ఇచ్చారు. యుద్ధంలో ఇరాన్‌కు పాకిస్థాన్ నుంచి ఎలాంటి సాయం అందకుండా చూడటం ప్రధాన లక్ష్యంగా ఆయన ఈ విందు ఏర్పాటు చేసినట్లు పరిశీలకులు భావిస్తున్నారు. ఇరాన్‌ను ఏకాకిని చేయడం ట్రంప్ వ్యూహమని అంచనా వేస్తున్నారు. అదే సమయంలో చైనాకు పాకిస్థాన్‌ను దూరం చేసే యోచన కూడా ఉండొచ్చని విశ్లేషిస్తున్నారు. ఆర్మీ చీఫ్ పదవుల నుంచి పాక్ అధ్యక్షులైన వారికి అమెరికా అధ్యక్షులు గతంలో అనేకసార్లు విందు ఇచ్చారు. అయితే నేరుగా పాక్ ఆర్మీ చీఫ్‌కు వైట్ హౌస్‌లో విందు ఇవ్వడం ఇదే తొలిసారి.

లోకం తీరు



భారత్-కెనడా మళ్లీ భాయీభాయీ!

జీ-7 సదస్సు సందర్భంగా కెనడా ప్రధాని కార్నీతో మోదీ కీలక చర్చలు జరిపారు. గత ప్రధాని జస్టిన్ ట్రూడో వైఖరి కారణంగా.. ఉభయదేశాల నడుమ దెబ్బతిన్న సంబంధాల పునరుద్ధరణకు నిర్ణయించారు. ప్రధానంగా కాన్సులర్, వాణిజ్య సేవలను సాధారణ స్థాయికి తీసుకొచ్చేందుకు రెండు దేశాల రాయబార కార్యాలయాల్లో కొత్త హైకమిషనర్లను నియమించాలని నిశ్చయించారు. కొత్త హైకమిషనర్లను త్వరలోనే రెండు దేశాలు ప్రకటిస్తాయని కెనడా ప్రధాని కార్యాలయం ఆ తర్వాత ఓ ప్రకటనలో తెలిపింది. పౌరులు, పారిశ్రామికవేత్తలు ఉభయదేశాల్లో తమ నిత్య కార్యకలాపాలను తిరిగి కొనసాగించేందుకు ఇద్దరు ప్రధానులూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. కెనడాలో సిక్కు వేర్పాటువాద నేత హర్‌దీప్‌సింగ్ నిజ్జర్ హత్యలో భారత్ హస్తం ఉందని అప్పటి ఆ దేశ ప్రధాని ట్రూడో చేసిన ఆరోపణలతో ఇరు దేశాల నడుమ సంబంధాలు క్షీణించడం మొదలుపెట్టాయి. ఆయన తన ఆరోపణలు కొనసాగించడంతో గత ఏడాది అక్టోబరులో ఢిల్లీలోని కెనడా యాక్టింగ్ హైకమిషనర్ సహా పలువురు దౌత్యవేత్తలను బహిష్కరించింది.

ఉగ్రవాదాన్ని సమర్థించేవారికి రివార్డులా?

జీ-7 సదస్సులో అగ్ర దేశాలపై మోదీ విసుర్లు.. రెండు నాల్కల ధోరణి వీడాలని హితవు

ఆల్బెర్టా(కెనడా), జూన్ 18: ఉగ్రవాదాన్ని బహిరంగంగా సమర్థిస్తున్న దేశాలకు రివార్డులిస్తున్నారని ప్రధాని మోదీ అగ్రదేశాలను విమర్శించారు. ఈ విషయంలో ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నారని ఎండగట్టారు. బుధవారం కెనడాలోని ఆల్బెర్టాలో కననాస్కిస్‌లో జీ-7 దేశాల రెండో రోజు సదస్సులో ప్రసంగించారు. ఉగ్రవాదంపై భారత దృఢవైఖరిని విశదీకరించారు. ప్రపంచదేశాలన్నీ ఐక్యంగా చర్యలు తీసుకోవాలని, రెండు నాల్కల ధోరణి తగదని హితవు పలికారు. టెర్రరిజాన్ని ప్రోత్సహించే, మద్దతిచ్చే దేశాలపై కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. 'ఆయా దేశాలు పర్యవసానాలను ఎదుర్కోక తప్పదు.ఏ దేశమైనా ఉగ్రవాదానికి మద్దతిస్తే అది మూల్యం చెల్లించుకోవలసిందే' అని తేల్చిచెప్పారు. ఈ సందర్భంగా ఉగ్రవాదంపై అంతర్జాతీయంగా తీసుకుంటున్న చర్యలు ద్వంద్వప్రమాణాలతో ఉంటున్నాయని ఆక్షేపించారు. 'ఓవైపు.. మన అవసరాలకు అనుగుణంగా హడావుడిగా అన్ని రకాల ఆంక్షలు విధించేందుకు పూనుకుంటాం. మరోవైపు.. బహిరంగంగా టెర్రరిజానికి మద్దతిచ్చే దేశాలకు రివార్డులు లభిస్తున్నాయి' అని వ్యాఖ్యానించారు. పహల్గాంలో ఉగ్రవాద దాడిని ఖండించిన జీ-7 దేశాలకు ప్రధాని ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు. ఇదిలా ఉండగా, మోదీ అత్యుత్తమ ప్రధాని అని.. ఆయనలా ఉండేందుకు ప్రయత్నిస్తున్నానని ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ ఆయనతో భేటీ సందర్భంగా అన్నారు. ఆయన నవ్వుతూ 'థమ్స్ ఆప్' సంకేతమిచ్చారు. వారి సంభాషణ వీడియో వైరల్‌గా మారింది.

టెహ్రాన్‌పై నిప్పుల వాన

(మొదటిపేజీ తరువాయి)

యురేనియం-235ను వెలికితీసేందుకు సెంట్రీఫ్యూజ్‌ను వినియోగిస్తారు. ఇలా పదేపదే ప్రాసెస్ చేసి.. అణ్వాయుధాల తయారీకి అవసరమయ్యే యురేనియంను సేకరిస్తారు. ఇప్పటికే నటాంజ్ అణుకేంద్రం తీవ్రంగా ధ్వంసమైనట్లు అంతర్జాతీయ అణుశక్తి సంస్థ(ఐఏఈఏ) వెల్లడించిన విషయం తెలిసిందే..! దీంతోపాటు.. తమ వైమానిక దళాలు ఇరాన్ ఆయుధ తయారీ కేంద్రాలను ధ్వంసం చేసినట్లు ఐడీఎఫ్ ప్రకటించింది. ఈ క్రమంలో తమ యుద్ధ విమానాలపై దాడికి వచ్చిన ఐదు హెలికాప్టర్లపై దాడులు జరిపి, మూడింటిని నేలమట్టం చేసినట్లు ఐడీఎఫ్ బ్రిగేడియర్ జనరల్ డఫెరిన్ వెల్లడించారు. కాగా.. బుధవారం కూడా ఐడీఎఫ్ అధికారులు పర్షియా భాషలో టెహ్రాన్‌ను వీడి వెళ్లాలంటూ పౌరులకు హెచ్చరికలు జారీ చేశారు. ఆరు రోజుల యుద్ధంలో ఇరాన్‌లో 585 మంది మృతిచెందారని, వీరిలో 239 మంది పౌరులున్నారని, 1,326 మంది గాయపడ్డారని మానవ హక్కుల సంస్థలు వెల్లడించాయి. ఇరాన్ పౌరులు తమ స్మార్ట్ ఫోన్ల నుంచి వెంటనే వాట్సాప్ యాప్‌ను తొలగించాలని ఐఆర్‌జీసీ సూచించింది. కాగా.. బుధవారం సాయంత్రం మూడు ఇరాన్ ప్రభుత్వ విమానాలు ఒమన్‌లో ల్యాండ్ అయినట్లు ఫ్లైట్ ట్రాకింగ్ డేటా చెబుతోంది. ఈ విమానాల్లో ప్రభుత్వాధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. యుద్ధం విరమణకు చర్చల కోసమే వీరు ఒమన్ వెళ్లి ఉంటారని విశ్లేషకులు చెబుతున్నారు. అమెరికా-ఇరాన్ మధ్య అణు చర్చలకు కూడా ఒమన్ మధ్యవర్తిగా ఉన్న విషయం తెలిసిందే..! మరోవైపు ఇజ్రాయెల్ అనుకూల హ్యాకర్ల గ్రూప్ 'ప్రిడేటరీ స్పారో' బుధవారం ఇరాన్‌లోని అతి పెద్ద క్రిప్టోకరెన్సీ ఎక్స్ఛేంజ్(నోవిటెక్స్)పై సైబర్ దాడి జరిపింది. ఇరాన్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థలకు నోవిటెక్స్ నిధులను సమకూరుస్తోందని ఈ గ్రూప్ ఆరోపించింది. ఇదే బృందం మంగళవారం బ్యాంకులపై పంజా విసిరిన విషయం తెలిసిందే.

ఇజ్రాయెల్‌పై పరిమిత దాడులు

ఇజ్రాయెల్‌పై ఇరాన్ మంగళవారం రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు పరిమిత దాడులు జరిపింది. తొలిరోజు 200కు పైగా బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిన ఇరాన్.. తాజాగా రెండు దశల్లో 25 క్షిపణులకు పరిమితమైంది. అయితే.. యూఏవీలను పెద్ద ఎత్తున ప్రయోగించినట్లు ఐడీఎఫ్ వెల్లడించింది. అయితే.. తాము హైపర్‌సోనిక్ ఫతాహ్-1 బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించామని, వాటిని ఇజ్రాయెల్ గగనతల రక్షణ వ్యవస్థలు గుర్తించలేవని ఐఆర్‌జీసీ పేర్కొంది. టెల్‌అవీవ్‌కు భారీ నష్టం వాటిల్లిందని వెల్లడించింది. కాగా.. ఇరాన్ క్షిపణులను అడ్డుకునేందుకు ఇజ్రాయెల్ తన గగనతల వ్యవస్థ కోసం ఒక్క రాత్రికి రూ.2,400 కోట్లు వెచ్చిస్తోందని అంచనా. ఇజ్రాయెల్ వద్ద మరో 10-12 రోజులకు సరిపడా గగనతల రక్షణ క్షిపణులున్నట్లు అమెరికా తాజా నివేదిక స్పష్టం చేస్తోంది.

బ్లడ్ క్యాన్సర్ చికిత్సకు వచ్చి..

ఉక్రెయిన్‌లోని ఒడెస్సాకు చెందిన నస్త్యబోరిక్ అనే ఏడేళ్ల చిన్నారి బ్లడ్‌క్యాన్సర్ చికిత్సకు ఆ కుటుంబం ఇజ్రాయెల్‌కు వచ్చింది. ఇటీవల జరిగిన ఇరాన్ క్షిపణి దాడుల్లో ఆ కుటుంబానికి చెందిన లీనా పెష్కోరోవా(60), మరియా పెష్కోరోవా(30), నస్త్య బోరిక్(7), కాన్ స్టాంటిన్(9), ఇలియా పెష్కురోవ్(13) మరణించినట్లు ఐడీఎఫ్ బుధవారం ప్రకటించింది.

లొంగిపోవడమే మంచిది: ట్రంప్

ఖమేనీ వ్యాఖ్యలపై ట్రంప్ స్పందించారు. యుద్ధం మొదలైందంటూ ఖమేనీ అనడంతో.. "గుడ్‌లక్" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. యుద్ధాన్ని ఆపేందుకు చర్చల కోసం ఇరాన్ అధికారులు వైట్ హౌస్‌కు వస్తామన్నారని, తాను అందుకు "ఇప్పటికే చాలా ఆలస్యం జరిగింది" అని బదులిచ్చినట్లు చెప్పారు. "ఇరాన్‌పై అమెరికా దాడి చేస్తుందో.. లేదో.. చెప్పలేను. వారికి(ఇరాన్-ఇజ్రాయెల్) చాలా సమస్యలున్నాయి. వారు పరస్పరం చర్చలు జరుపుకోవాలని కోరుకుంటున్నా. అయితే.. చర్చలకు ఇప్పటికే ఆలస్యం జరిగింది. అందుకే.. బేషరతుగా లొంగిపోవడమే మంచిది" అని సూచించారు. కాగా.. ఈ యుద్ధంలో ఇజ్రాయెల్‌కు అమెరికా సాయం చేయకూడదని రష్యా విదేశాంగ శాఖ ఉప మంత్రి సెర్గీ రియాబ్కోవ్ కోరారు. తమ అధినేత పుతిన్ కూడా ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య శాంతి చర్చలు జరగాలని ఆకాంక్షించినట్లు వివరించారు.

యుద్ధం మొదలైంది.. మేం లొంగేది లేదు: ఖమేనీ

ఇరాన్ లొంగిపోవాలంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఇరాన్ సుప్రీంలీడర్ అయతుల్లా అలీ ఖమేనీ తీవ్రంగా స్పందించారు. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం మొదలయ్యాక.. తొలిసారి ఆయన బహిరంగ ప్రకటన చేశారు. ఇరాన్ లొంగేది లేదని తేల్చిచెప్పారు. తమపై దాడితో ఇజ్రాయెల్ పెద్దతప్పు చేసిందని, దానికి ఆ దేశం మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. "యుద్ధం మొదలైంది. ఈ యుద్ధంలో అమెరికా జోక్యం చేసుకుంటే.. ఆ దేశానికి కోలుకోలేని దెబ్బతగులుతుంది. 7వ శతాబ్దంలో యూదుల పట్టణమైన ఖైబర్‌పై షియా ఇస్లాం మొదటి ఇమాం యుద్ధం చేసి, ఘన విజయం సాధించారు. బెదిరింపులకు బయపడే చరిత్ర ఇరాన్‌కు లేదు. మేం బలంగా ప్రతిస్పందిస్తాం. ఎవరిపైనా దయ చూపేది లేదు" అని ఆయన ఓ పోస్టులో వ్యాఖ్యానించారు.

ట్రంప్‌నకు పరిమిత యుద్ధ అధికారాలు?

ఇరాన్‌పై స్వరం పెంచుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యుద్ధ అధికారాలను పరిమితం చేసే దిశలో ఆ దేశ చట్టసభ్యులు ముందుకు సాగుతున్నారు. ఈ మేరకు ట్రంప్ స్వపక్షం రిపబ్లికన్, విపక్షం డెమోక్రాట్ సభ్యులు పలువురు ఈ మేరకు కాంగ్రెస్‌లో బిల్లును ప్రవేశపెట్టనున్నారు. అమెరికా రాజ్యాంగం మేరకు ఎగువ, దిగువ సభల ఆమోదంతోనే యుద్ధంలో పాలుపంచుకోవడంపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని, ఏకపక్షంగా కుదరదని వారు గుర్తుచేస్తున్నారు.

టోల్ చెల్లింపులు సులువుగా.. చౌకగా

(మొదటిపేజీ తరువాయి)

వస్తుంది. ధర రూ. 3 వేలుగా నిర్ణయించింది. యాక్టివేట్ తేదీ నుంచి ఏడాది లేదా 200 ట్రిప్పుల వరకు (ఏది ముందు పూర్తయితే అది) పాస్ చెల్లుబాటు అవుతుంది. ఈ వివరాలను కేంద్ర రవాణా మంత్రి నితిన్ గడ్కరీ బుధవారం ఎక్స్‌లో వెల్లడించారు. ఈ పాస్‌ను వాణిజ్యేతర ప్రైవేట్ వాహనాలు.. అంటే కార్లు, జీపులు, వ్యాన్లు తదితరాల కోసమే ప్రత్యేకంగా ప్రవేశపెడుతున్నామన్నారు. తక్కువ ఖర్చుతో దేశం మొత్తం ప్రయాణించేందుకు పాస్‌ను తీసుకొచ్చామన్నారు. పాస్ యాక్టివేషన్, రెన్యువల్ కోసం రాజ్‌మార్గ్ యాప్‌తో పాటు ఎన్‌హెచ్‌ఏఐ, మోర్త్ అధికారిక వెబ్‌సైట్లలో ప్రత్యేక లింక్‌ను త్వరలో అందుబాటులో ఉంచుతామన్నారు. 60 కి.మీ. లోపే టోల్‌ప్లాజాలు ఉండటంపై వస్తున్న ఫిర్యాదుల పరిష్కారానికి ఈ కొత్త పాలసీని తీసుకొచ్చారు. ఒకేసారి చెల్లింపు విధానంతో టోల్ ప్లాజాల విషయంలో స్పష్టత తీసుకురావచ్చని ప్రభుత్వ చెప్పింది. కొత్త విధానంతో వాహనదారులకు సులువైన, చవకయిన ప్రయాణం అందుబాటులోకి వస్తుందని ప్రభుత్వం పేర్కొంది.

ఫాస్టాగ్ పాస్‌లో విశేషాలు

- రూ.3 వేలు ఫిక్స్‌డ్ పేమెంట్ ఉంటుంది. 200 ట్రిప్పులు లేదా ఏడాది పాటు చెల్లుబాటు అవుతుంది. దేశవ్యాప్తంగా హైవేలన్నింటికి వర్తిస్తుంది.
- ప్రత్యేకంగా కార్లు, జీపులు, వ్యాన్లు వంటి ప్రైవేట్ ఫోర్ వీలర్స్‌కు మాత్రమే పాస్ ఇస్తారు.
- ట్రిప్పుల పరిమితి లేదా గడువు పూర్తయ్యే వరకు ఫాస్టాగ్ నుంచి టోల్ మినహాయించరు.
- ప్రస్తుతం ఫాస్టాగ్ ఉన్న వారు పాస్ కోసం కొత్తగా మరో ఫాస్టాగ్ తీసుకోవాల్సిన అవసరం లేదు. పాస్ కూడా తప్పనిసరి కాదు. పాస్ తీసుకోని వారు ఫాస్టాగ్ ద్వారా చెల్లింపులు చేయవచ్చు.
- ఒక టోల్ ప్లాజాను దాటి వెళితే దానిని ఒక ట్రిప్పుగా, అదే టోల్ ప్లాజా నుంచి వెనక్కి వస్తే (రౌండ్ ట్రిప్) రెండు ట్రిప్పులుగా పరిగణిస్తారు. అంటే పాస్ తీసుకుంటే ఒక ట్రిప్పునకు రూ.15 చెల్లించినట్లు అవుతుంది.
- ఏడాది గడువు తీరకుండా 200 ట్రిప్పుల పరిమితి పూర్తయిన వారు మళ్లీ పాస్‌ను కొనుక్కోవచ్చు. ఇలా ఎన్నిసార్లు అయినా పర్చేజ్ చేయవచ్చు.

మన 'టైమ్' వచ్చింది!



న్యూఢిల్లీ, జూన్ 18: 'టైమెంత?' అని ఎవరైనా అడిగితే యథాలాపంగా చెప్పేస్తాంగానీ.. సమయ నిర్ణయం వెనుక పెద్ద ఎత్తున ఉపగ్రహ వ్యవస్థలు, పరమాణు గడియారాల వంటివి ఉంటాయని చాలా మందికి తెలియదు! అలా మనం ఇప్పటిదాకా సమయ నిర్ధారణకు, నిర్వహణకు.. గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ (జీపీఎస్) వంటి విదేశీ వ్యవస్థలపైనే ఆధారపడుతున్నాం. కానీ.. ఇప్పుడు మన 'టైమ్' వచ్చేసింది! ఇకపై దేశంలో నిర్వహించే అన్ని రకాల న్యాయ, వాణిజ్య, డిజిటల్, పరిపాలనా కార్యకలాపాలకూ తప్పనిసరిగా... మన 'నావిక్' ఉపగ్రహ వ్యవస్థతో అనుసంధానమైన భారత ప్రామాణిక సమయాన్నే (ఐఎస్‌టీ) పాటించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 'ఒక దేశం-ఒకే సమయం' పేరిట అమలు చేయనున్న ఈ విధానానికి సంబంధించిన మార్గదర్శకాలను త్వరలోనే నోటిఫై చేయనున్నట్టు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడించారు. "ప్రస్తుతం దేశంలో చాలా వ్యవస్థలు జీపీఎస్ వంటి విదేశీ సమయ వ్యవస్థలపై ఆధారపడి పని చేస్తున్నాయి. దీనివల్ల సైబర్ దాడులు జరిగే ప్రమాదం ఉంది" అని ఆయన ఆందోళన వెలిబుచ్చారు.

ఇదీ నేపథ్యం..

కార్గిల్ యుద్ధ సమయంలో మన సైన్యం జీపీఎస్‌పై ఆధారపడడం, అది సరిగ్గా ఉపయోగపడకపోవడంతో.. దేశీయ ఉపగ్రహ వ్యవస్థల ప్రాముఖ్యాన్ని భారత ప్రభుత్వం గుర్తించింది. నేవిగేషన్‌కు మాత్రమే కాదు.. బ్యాంకింగ్ కార్యకలాపాలకు, శాస్త్ర పరిశోధనలకు, అంతరిక్ష ప్రయోగాలకు ఇలా అన్నింటికీ సమయ కచ్చితత్వం కీలకం. అందుకే మన ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి సారించి.. ఏడు ఉపగ్రహాలతో దేశీయ నావిక్‌ను అభివృద్ధి చేసింది. ఈ ఏడు ఉపగ్రహాల్లో ఒక్కో దాంట్లో మూడు పరమాణు గడియారాలు ఉంటాయి. ఈ ఉపగ్రహాలు.. దేశంలోని ఐదు 'రీజనల్ రిఫరెన్స్ స్టాండర్డ్ లాబొరేటరీస్'కు అనుసంధానమై ఉంటాయి. అహ్మదాబాద్, బెంగళూరు, భువనేశ్వర్, ఫరీదాబాద్, గువాహటి నగరాల్లోని ఆ ల్యాబుల్లోనూ పరమాణు గడియారాలు ఉంటాయి. వాటిలో.. ఫరీదాబాద్ ల్యాబ్ నావిక్ ఉపగ్రహాల్లోని పరమాణు గడియారాల నుంచి వచ్చిన టైమ్ సిగ్నల్స్‌ను స్వీకరించి.. వాటిని ఆప్టికల్ ఫైబర్ లింక్స్ ద్వారా మిగతా నాలుగు కేంద్రాలకూ పంపుతుంది. ఇలా ఆ ఐదు కేంద్రాలూ మైక్రో సెకన్లతో సహా కచ్చితమైన సమయాన్ని దేశానికి అందిస్తాయి.

రైతుకు అండగా నిలవండి!

- ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు చేయండి
- సాంకేతికతతో క్రయవిక్రయాలను పర్యవేక్షించండి
- పంట ఉత్పత్తులను వాణిజ్య కోణంలోనే చూడండి
- ఎగుమతులు పెరిగేలా గ్రేడింగ్ విధానం ఉండాలి
- హెచ్‌డీ బర్లీ పొగాకు కొనుగోళ్లలో వేగం పెంచండి
- మామిడి, పొగాకు, కోకో పంటల మద్దతు ధరలపై సమీక్షలో అధికారులకు సీఎం చంద్రబాబు నిర్దేశం



పంట ఉత్పత్తుల కొనుగోలుపై జరిగిన సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు, మంత్రి అచ్చెన్నాయుడు

అమరావతి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): పొగాకు, మామిడి తదితర పంట ఉత్పత్తుల విషయంలో ప్రస్తుతం నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా రైతులకు అండగా నిలవాలని అధికారులకు సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు. హెచ్‌డీ బర్లీ పొగాకు కొనుగోళ్లలో వేగం పెంచాలని, రైతులకు ఇబ్బంది లేకుండా పంట ఉత్పత్తుల కొనుగోళ్లు చేయాలని ఆదేశించారు. "పంట వివరాలు, కొనుగోళ్ల పర్యవేక్షణకు సాంకేతికతను వినియోగించాలి. ఎగుమతులను పెంచేందుకు అత్యుత్తమ గ్రేడింగ్ విధానాన్ని అమలు చేయాలి" అని సీఎం అధికారులకు సూచించారు. పొగాకు, మామిడి, కోకో ఉత్పత్తులకు మద్దతు ధరతో పాటు కొనుగోళ్ల అంశాలపై బుధవారం అమరావతి సచివాలయంలో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ పంట ఉత్పత్తులను వాణిజ్య కోణంలోనే చూడాలని స్పష్టం చేశారు. రైతుకు వీలైనంత మెరుగైన ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలని, అంతర్జాతీయ మార్కెట్‌కు అవసరమైనట్లుగా పంట ఉత్పత్తుల ఎగుమతులు పెంచేందుకు అత్యుత్తమ గ్రేడింగ్ విధానాన్ని అమలు చేయాలని చంద్రబాబు నిర్దేశించారు.

మరిన్ని పండ్ల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు

రాష్ట్రవ్యాప్తంగా పండ్లకు సంబంధించిన ప్రాసెసింగ్ యూనిట్లను మరిన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని అధికారులకు చంద్రబాబు సూచించారు. పొగాకు విషయంలో ఈ ఏడాది హెచ్‌డీ బర్లీ రకం 80 మిలియన్ కిలోల ఉత్పత్తి వచ్చిందని, ఇప్పటి వరకు 27 మిలియన్ కిలోలు విక్రయాలు పూర్తయ్యాయని అధికారులు చెప్పగా, మిగిలిన 53 మిలియన్ కిలోల హెచ్‌డీ బర్లీ పొగాకును త్వరగా కొనుగోలు చేయాలని సీఎం ఆదేశించారు. ఇందులో 33 మిలియన్ కిలోల పొగాకును 24 కంపెనీల ద్వారా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకున్నట్లు అధికారులు చెప్పారు. మిగతా 20 మిలియన్ కిలోల పొగాకును బాపట్ల, గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లోని 7 కేంద్రాల్లో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలుకు ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలపగా, కొనుగోలు కేంద్రాల వివరాలతో పాటు సంబంధిత సమాచారాన్ని ప్రతి పొగాకు రైతుకూ తెలిసేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు.

జీఎస్టీ తగ్గింపుపై కేంద్రంతో మాట్లాడాను

పామాయిల్‌పై సుంకం తగ్గింపు, మ్యాంగో పల్ప్‌పై జీఎస్టీని 12శాతం నుంచి 5శాతానికి తగ్గించే అంశంపై ఇప్పటికే కేంద్రంతో మాట్లాడానని, దీనిపై అధికారులు సంబంధిత కేంద్ర ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకోవాలని చంద్రబాబు సూచించారు. మామిడికి సంబంధించి పంట ప్రణాళికపై రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. పండించిన పంటకు సరైన ధర దక్కాలంటే ఆ పంటకు మార్కెట్‌లో ఎలాంటి డిమాండ్ ఉందనే సమాచారం రైతుకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం మామిడికి ఒక్కో కిలోకు రూ.4 చొప్పున అదనంగా మద్దతు ధర ఇస్తున్నామని, ప్రాసెసింగ్ యూనిట్లు రూ.8కి తగ్గకుండా కొనుగోలు చేసేలా చూడాలని అధికారులను చంద్రబాబు ఆదేశించారు. రైతుకు నష్టం రాకుండా ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. అలాగే కోకో పంట 12వేల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి రాగా, ఇప్పటికే 10వేల టన్నులు విక్రయం కూడా జరిగిందని, రోజూ 80-100 టన్నుల టన్నుల మేర కొనుగోలు చేస్తున్నట్లు అధికారులు వివరించారు. జూలై మొదటి వారానికి మిగిలిన ఉత్పత్తిని కూడా కొనుగోలు చేయించాలని సీఎం ఆదేశించారు. సమీక్షలో మంత్రి అచ్చెన్నాయుడు, వ్యవసాయ, ఉద్యానశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

'కొడాలి నాని అరెస్ట్' అవాస్తవం: కృష్ణా ఎస్పీ

మచిలీపట్నం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కొడాలి నానీని అరెస్ట్ చేశారనే వార్త అవాస్తవమని కృష్ణా జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొడాలి నానిపై నమోదై ఉన్న కేసుల నేపథ్యంలో కోల్‌కత్తా విమానాశ్రయంలో ఆయనను అరెస్ట్ చేశారంటూ బుధవారం ఉదయం నుంచి సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరిగింది. దీంతో ఎస్పీ స్పందించారు. ఈ వార్తలో నిజం లేదని ఆయన తెలిపారు. కొడాలి నానీని అరెస్ట్ చేస్తే తానే స్వయంగా సమాచారం తెలియజేస్తానని పేర్కొన్నారు. నిరాధారమైన వా ర్తను సామాజిక మాధ్యమాల్లో పెట్టిన వారిపై చట్టపరం గా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

షార్‌కు బాంబు బెదిరింపు కేసులో సేలం వాసి అరెస్ట్

సూళ్లూరుపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం.. షార్‌లో ఉగ్రవాదులు ఉన్నారని, బాంబు పెట్టారంటూ బెదిరింపు కాల్ చేసిన తమిళనాడు రాష్ట్రం సేలం వాసి బాలకృష్ణ విజయ్ బాబును బుధవారం శ్రీహరికోట పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం అర్ధరాత్రి చెన్నై పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఫోను చేసి ఈ మేరకు బెదిరింపునకు పాల్పడిన విషయం తెలిసిందే.

సముద్రంపై తిరుగులేని శక్తిగా భారత్

- స్వదేశీ పరిజ్ఞానంతో 98 నౌకలు తయారీ
- 'అర్నాల' ప్రారంభోత్సవంలో డిఫెన్స్ స్టాఫ్ చీఫ్ జనరల్ అనిల్ చౌహాన్



ఐఎన్ఎస్ 'అర్నాల'పై సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్, తూర్పు నౌకాదళం చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేశ్ పెంధార్కర్, వార్‌షిప్ ప్రొడక్షన్ అండ్ ఎక్విజిషన్ కంట్రోలర్ వైస్ అడ్మిరల్ రాజారామ్ స్వామినాథన్

విశాఖపట్నం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నిన్న మొన్నటి వరకు ఇతర దేశాల నుంచి ఆయుధాలు కొనుగోలు చేసిన భారత్ ఇప్పుడు వాటిని తయారుచేసే స్థాయికి ఎదిగిందని, సముద్రంపై తిరుగులేని శక్తిగా మారిందని డిఫెన్స్ స్టాఫ్ చీఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ అన్నారు. కోల్‌కతా గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ అండ్ ఇంజనీర్స్ తయారు చేసిన యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్-షాలో వాటర్ క్రాఫ్ట్ ఐఎన్ఎస్ 'అర్నాల'ను విశాఖపట్నం నేవల్ డాక్‌యార్డ్‌లో బుధవారం ప్రారంభించి జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత్ ఇప్పటివరకూ స్వదేశీ పరిజ్ఞానంతో 98 యుద్ధ నౌకలు తయారు చేసిందని, అందులో విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్, న్యూక్లియర్ సబ్‌మెరైన్లు, ఫ్రిగేట్లు, కార్వెట్లు, డెస్ట్రాయర్లు, సర్వే నౌకలు ఉన్నాయని చెప్పారు. ఇవి కాకుండా మరో 60 నౌకలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని, మరో 180 నౌకల నిర్మాణానికి ఒప్పందాలు తయారవుతున్నాయన్నారు. కొత్తగా నౌకాదళంలో చేరిన 'అర్నాల'కు పెద్ద సవాళ్లను స్వీకరించగల సత్తా ఉందని, భారత తీర ప్రాంత రక్షణలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. కార్యక్రమంలో తూర్పు నౌకాదళం చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేశ్ పెంధార్కర్, వార్‌షిప్ ప్రొడక్షన్ అండ్ ఎక్విజిషన్ కంట్రోలర్ వైస్ అడ్మిరల్ రాజారామ్ స్వామినాథన్, గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్ అండ్ ఇంజనీర్స్ సీఎండీ కమొడోర్ పి.హరి తదితరులు పాల్గొన్నారు.

నేహారెడ్డి కంపెనీపై చర్యలకు అంత నిర్లక్ష్యమా?

- నెలలు గడుస్తున్నా ఉత్తర్వులు అమలు చేయరా?
- ఇలాగైతే మా ముందు హాజరుకండి
- ఏపీసీజెడ్ఎంఏ మెంబర్ సెక్రటరీపై హైకోర్టు ఆగ్రహం

అమరావతి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లా భీమిలి పరిధిలో సీఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధంగా సముద్రానికి అతి సమీపంలో కాంక్రీట్ నిర్మాణాలు జరిపిన వైసీపీ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె పెనక నేహారెడ్డి కంపెనీపై క్రిమినల్ చర్యలు ప్రారంభించడంలో నిర్లక్ష్యం చూపిన ఏపీ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఏపీసీజెడ్ఎంఏ) మెంబర్ సెక్రటరీపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తాము ఆదేశాలు ఇచ్చి నెలలు గడుస్తున్నా ఎలాంటి పురోగతీ లేదని మండిపడింది. క్రిమినల్ చర్యలు ప్రారంభించే విషయంలో మేజిస్ట్రేట్‌కు ఇచ్చిన ఫిర్యాదు రిటర్న్ అయినప్పటికీ, తిరిగి దానిని దాఖలు చేసేందుకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించింది. తదుపరి విచారణ నాటికి తమ ఉత్తర్వులు అమలు చేయకుంటే ఆన్‌లైన్ ద్వారా తమ ముందు హాజరు కావాలని స్పష్టం చేసింది. అవసరమైతే ఏపీసీజెడ్ఎంఏ మెంబర్ సెక్రటరీని తొలగింపునకు ఆదేశాలిస్తామని హెచ్చరించింది. బుధవారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చింది. అడ్డగోలుగా కాంక్రీట్ గోడ నిర్మిస్తున్నా కళ్లు మూసుకున్న అప్పటి జీవీఎంసీ, రెవెన్యూ అధికారుల పేర్లను తమ ముందు ఉంచాలని ఏపీసీజెడ్ఎంఏ మెంబర్ సెక్రటరీ, జీవీఎంసీ కమిషనర్‌ను ఆదేశించింది. మరోవైపు తీర ప్రాంతంలో అనుమతులకు భిన్నంగా రెస్టోబార్లు నిర్మించినట్లు సర్వేలో అధికారులు గుర్తించారని పేర్కొంది. సంబంధిత రెస్టోబార్ల యజమానులకు షోకాజ్ నోటీసులు జారీ చేసి, వారి నుంచి వివరణ తీసుకోవాలని జీవీఎంసీ కమిషనర్, జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. వ్యక్తిగతంగా హాజరై వాదనలు చెప్పుకొనేందుకు అవకాశం ఇవ్వాలని స్పష్టం చేసింది. ఈ ప్రక్రియ మొత్తాన్ని 6 వారాల్లో పూర్తి చేయాలని, తదుపరి విచారణలో వివరాలను కోర్టు ముందు ఉంచాలని అధికారులను ఆదేశించింది. సముద్రానికి అతిసమీపంలో విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి కంపెనీ అవ్యాన్ రియల్టర్స్ ఎల్ఎల్‌పీ శాశ్వత కాంక్రీట్ నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొంటూ జనసేన కార్పొరేటర్ పీఎల్‌వీఎన్ మూర్తి యాదవ్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే. అలాగే సీఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన నాలుగు రెస్టోబార్లను తొలగించడంతో పాటు సహజ ఆవాసాలను పునరుద్ధరించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ గ్రామాభివృద్ధిసేవా సంఘం అధ్యక్షుడు గంటా నూకరాజు పిల్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై ఇటీవల విచారణ జరిపిన ధర్మాసనం నేహారెడ్డి కంపెనీపై క్రిమినల్ చర్యలు ప్రారంభించాలని ఏపీసీజెడ్ఎంఏ మెంబర్ సెక్రటరీని ఆదేశించింది. అలాగే భీమునిపట్నం సమీపంలో నిర్వహిస్తున్న నాలుగు రెస్టోబార్లు సీఆర్‌జెడ్ ప్రాంతంలో ఉన్నాయా? లేవా? అనేదానిపై సర్వే జరిపి నివేదిక సమర్పించాలని ఏపీసీజెడ్ఎంఏ మెంబర్ సెక్రటరీ, జీవీఎంసీ కమిషనర్, విశాఖ జిల్లా కలెక్టర్‌తో కూడిన కమిటీని ధర్మాసనం ఆదేశించింది. ఈ వ్యాజ్యం బుధవారం మరోసారి విచారణకు వచ్చింది. ఏపీ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ తరఫు న్యాయవాది సోమరాజు వాదనలు వినిపిస్తూ.. ఇప్పటికే సంబంధిత మేజిస్ట్రేట్ కోర్టులో ఫిర్యాదు దాఖలు చేశామన్నారు. వివిధ కారణాలతో అది రిటర్న్ అయ్యిందని, లోపాలను సవరించి తిరిగి దాఖలు చేస్తామన్నారు. ప్రభుత్వం తరఫున ఎస్‌జీపీ ఎస్.ప్రణతి వాదనలు వినిపిస్తూ.. క్షేత్రస్థాయిలో పర్యటించి అనుమతులకు విరుద్ధంగా రెస్టోబార్లు నిర్మించినట్లు కోర్టు ఏర్పాటు చేసిన కమిటీ తేల్చిందన్నారు. రెస్టోబార్ల యాజమాన్యాలు హైకోర్టును ఆశ్రయించి కూల్చివేతపై స్టే ఉత్తర్వులు పొందాయన్నారు. ఈ నేపథ్యంలో అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోలేకపోతున్నారన్నారు. మూర్తి యాదవ్ తరఫున సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి వాదనలు వినిపిస్తూ.. అక్రమ నిర్మాణాలు జరిగే సమయంలో ఉన్న అధికారుల వివరాలు ఇచ్చేందుకు జీవీఎంసీ నిరాకరిస్తోందని తెలిపారు. అప్పటి అధికారుల పేర్లతో కూడిన జాబితాను కోర్టు ముందు ఉంచారు. వివరాలు సమర్పించేలా జీవీఎంసీ కమిషనర్‌ను ఆదేశించాలని కోరారు.



ఏలూరులో కమిటీ ముందు సమస్యలు చెబుతున్న మహిళలు

కొల్లేరుపై సమగ్ర సమాచారమివ్వండి

- అధికారులకు సాధికార కమిటీ ఆదేశం
- ముగిసిన రెండ్రోజుల పర్యటన

ఏలూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): 'కొల్లేరుపై సమగ్ర సమాచారాన్ని మాకు అందించండి. కొల్లేరు అభయారణ్యం పరిధిలో రోడ్ల నిర్మాణం, నిర్వహణ, ఏలూరు పారిశుధ్య వ్యర్థాలు, శుద్ధీకరణ సామర్థ్యం, సరస్సు పరిధిలో చేపల పెంపకానికి వినియోగించే రసాయన ఎరువులు, పురుగు మందుల వివరాలు మాకివ్వండి. ఏ ఒక్క అంశాన్ని వదలకండి. మేము కోరిన సమాచారం త్వరితగతిన అందేలా చూడండి' అని జిల్లా యంత్రాంగానికి కేంద్ర సాధికార కమిటీ ఈ ఆదేశాలిచ్చింది. కొల్లేరు కాలుష్యం, ఇతర అంశాలపై కూడా క్షుణ్ణంగా పరిశీలించి నివేదిక సమర్పించాల్సిందిగా మత్స్యశాఖ అధికారులను ఆదేశించింది. కొల్లేరులో వాస్తవ పరిస్థితులను పరిశీలించి మూడు నెలల్లోపు సమగ్ర నివేదిక సమర్పించేందుకు వీలుగా కేంద్ర సాధికార కమిటీ ఏలూరు జిల్లాలో రెండ్రోజుల పర్యటన బుధవారంతో ముగిసింది.

ఎస్సీలకు పదోన్నతిలోనూ వర్గీకరణ అమలు

- నిబంధనలు సవరిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు

అమరావతి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను రాష్ట్రంలో అమలు చేసేందుకు ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల నిబంధనలు, 2025 నోటిఫికేషన్ విడుదల చేస్తూ ఈ ఏడాది ఏప్రిల్ 18న ఉత్తర్వులు జారీచేసింది. తాజాగా ఈ నిబంధనలను సవరిస్తూ ఎస్సీలకు పదోన్నతుల్లోనూ వర్గీకరణ అమలు చేయాలని ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. జీఓ నెం.7లోని రూల్-8 తర్వాత 8(ఏ) కింద ఎస్సీల మూడు గ్రూపులకు పదోన్నతిలో రిజర్వేషన్ అమలు తీరును జీఓ నెం.19లో పేర్కొన్నారు. గ్రూప్-1లో 12 కులాలకు పదోన్నతులకు 1 శాతం రిజర్వేషన్ అమలు చేస్తారు. అదే విధంగా గ్రూప్-2 లోని 18 కులాలకు 6.5 శాతం రిజర్వేషన్, గ్రూప్-3లో 29 కులాలకు 7.5 శాతం రిజర్వేషన్ పదోన్నతుల్లో అందించనున్నారు. కేడర్ స్ట్రెంత్ 5 కంటే ఎక్కువగా ఉద్యోగులు ఉన్న చోట పదోన్నతుల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తారు. పదోన్నతులకు సంబంధించి 2024-25 ప్యానెల్ ఏప్రిల్ 18, 2025కు ముందుగా సిద్ధమైనా, కాకపోయినా దానిని తిరిగి సమీక్షించవచ్చు. 2024-25 ప్యానెల్ ఏప్రిల్ 18, 2025కు ముందు సిద్ధమై... పాక్షికంగా లేక పూర్తిగా అమలు చేసి ఉంటే అది అలాగే కొనసాగిస్తారు. మహిళలకు దక్కాల్సిన 33.33 శాతం రిజర్వేషన్లు ఆయా గ్రూపులు మూడింటికి సమాంతరంగా పదోన్నతుల్లోనూ అమలు చేస్తారు. అంటే ప్రతి గ్రూపులో ఆయా మహిళలకు 33.33 శాతం పదోన్నతుల్లోనూ దక్కేలా చూస్తారు. ఏదైనా ఒక ప్యానెల్‌కు, ఓ గ్రూప్‌నకు సంబంధించిన అర్హులైన అభ్యర్థులు లేకపోతే ఆ ఖాళీని అదే గ్రూపునకు తదుపరి ప్యానెల్‌లో అవకాశమిస్తారు. రెండో ప్యానెల్‌లో కూడా ఆయా గ్రూప్‌నకు సంబంధించిన అర్హులైన అభ్యర్థులు భర్తీ కాకపోతే, మూడో ప్యానెల్‌లో తదుపరి గ్రూపునకు అవకాశం కల్పిస్తారు.

రాష్ట్రంలో 17మంది జీవిత ఖైదీలు విడుదల

విజయవాడ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం 17 మంది జీవిత ఖైదీలు ప్రత్యేక రిమిషన్ కింద విడుదలవుతున్నారు. ఈ ఖైదీల విడుదలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. విడుదల అవుతున్న వారిలో రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి ఇద్దరు, విశాఖపట్నం నుంచి ముగ్గురు, నెల్లూరులో ఇద్దరు, కడపలో నలుగురు, అనంతపురం ప్రిజనర్స్ అగ్రికల్చరల్ కాలనీ నుంచి నలుగురు, సత్తెనపల్లి సబ్‌జైలు నుంచి ఒకరు, పెనుకొండ సబ్‌జైలు నుంచి ఒకరు ఉన్నారు. రూ.50 వేలతో వ్యక్తిగత బంధపత్రం అమలుచేసి, ప్రతి మూడు నెలకొకసారి జిల్లా ప్రొబేషన్ ఆఫీసర్, సంబంధిత పోలీస్ స్టేషన్‌లో హాజరుకావాలని షరతులు విధించింది. ఇతర నేరారోపణల్లో ఉంటే రిమిషన్ రద్దుచేసి మళ్లీ అరెస్ట్ చేసే అవకాశం ఉంది.

ఎస్సీ గురుకులాల్లో మిగిలిన సీట్లకు దరఖాస్తులకు ఆహ్వానం

అమరావతి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులాల్లో 6, 7, 8, 9వ తరగతుల్లో మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. గురువారం నుంచి ఆయా పాఠశాలల్లో ఈ దరఖాస్తులు స్వీకరిస్తారని, దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ఈ నెల 25వ తేదీ పరీక్ష నిర్వహిస్తారని పేర్కొంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరింది రాష్ట్ర వ్యాప్తంగా 6వ తరగతి-3095, 7వ తరగతి-1255, 8వ తరగతి-882, 9వ తరగతి-875 ఖాళీలున్నట్లు తెలిపింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పర్యాటకానికి మచ్చ

ఉత్తరాఖండ్‌లో ఆదివారం హెలికాప్టర్ ప్రమాదం జరిగిన వెంటనే నిలిపివేసిన సర్వీసులను రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం నుంచి తిరిగి అనుమతించింది. సర్కారు సరేనని అన్నప్పటికీ, వాతావరణం అనుకూలంగా లేక ఒక్క హెలికాప్టర్ కూడా ఆ రోజు గాలిలోకి లేవలేదని వార్తలు వచ్చాయి. ఉత్తరాఖండ్ సివిల్ ఏవియేషన్ డెవలప్‌మెంట్ అథారిటీకీ, రాష్ట్ర ప్రభుత్వానికీ ఈ మార్గంలో నడిచే హెలికాప్టర్ల సమర్థతమీద ఇంతలోనే అంతనమ్మకం ఎలా కుదిరిందో తెలియదు కానీ, ఏడుగురి ప్రాణాలు తీసిన ఆ ఘోర దుర్ఘటన ఒక తీవ్రహెచ్చరిక. లండన్ బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానం నింగిలోకి లేచిన కొద్దిక్షణాల్లోనే భగ్గుమన్న ఆ భయానక ఘటన మనలను ఇంకా వెంటాడుతూండగానే, కేదార్‌నాథ్ ఆలయానికి యాత్రికులను తీసుకువెడుతున్న ఈ హెలికాప్టర్ గౌరీకుండ్ అడవుల్లో కూలిపోయింది. మంటలురాజుకొని హెలికాప్టర్‌లో ఉన్నవారంతా మృతిచెందారు. ప్రతికూల వాతావరణమే ఈ ప్రమాదానికి కారణమని అనుకుంటున్నప్పటికీ, ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) దర్యాప్తు జరిపి, కనీసం ప్రాథమికంగా ఓ అవగాహనకు వచ్చేవరకూ ఏదీ నిర్ధారించలేం.

హెలికాప్టర్ సేవలను సత్వరమే తిరిగి ఆరంభించిన ఈ నిర్ణయం వెనుక ప్రైవేటు సర్వీసుల ఒత్తిడికూడా పనిచేసివుండవచ్చు. పదిహేనేళ్ళ అనుభవం గల పైలట్ చేతిలో ఉంటూకూడా ఈ హెలికాప్టర్ చిగురుటాకులాగా వొణికి, కట్టుతప్పి కూలింది. వాతావరణం ఒక్కసారిగా మారిపోయి, హెలికాప్టర్‌ను పైలట్ సరిగా నియంత్రించలేకపోయారట. చార్‌ధామ్ యాత్ర ఆరంభమైన నెలన్నరలో ఈ తరహా ప్రమాదాలు ఐదు జరిగాయని మీడియా విశ్లేషిస్తోంది. మే 8న కూడా ఇటువంటి తీవ్రప్రమాదమే జరిగి ఆరుగురు ప్రయాణికులు మరణించారు. మూడు హెలికాప్టర్ ప్రమాదాల్లో అదృష్టవశాత్తూ ప్రాణనష్టం లేకున్నా మార్గమధ్యంలో ఇంజన్ విఫలమైనమాట నిజం. ఈ నేపథ్యంలో, ప్రతీప్రమాదాన్ని తీవ్రంగా పరిగణించి కారణాలను అన్వేషించడం, తగిన పరిష్కారాలతో ముందుకు వెళ్లడం ముఖ్యం. దట్టమైన పొగమంచువల్ల ముందున్న కొండను ఢీకొని ఈ హెలికాప్టర్ కూలివుండవచ్చు. అయితే, కేదార్‌నాథ్‌లో వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఉదయం ఆరు దాటితే కానీ హెలికాప్టర్లు బయలుదేరకూడదన్న నియమం ఉన్నప్పటికీ, ఈ హెలికాప్టర్ 5.17 నిముషాలకే కుప్పకూలడాన్ని బట్టి చూస్తే ఆర్యన్ ఏవియేషన్ లిమిటెడ్ సంస్థ ఆ నిబంధనలను ఉల్లంఘించిందని అర్థం. ఎత్తయిన కొండలు, లోయలతో కూడిన ఈ ప్రాంతంలో, వాతావరణం కూడా నిలకడగా ఉండని పరిస్థితుల్లో, కనీసం తెల్లారేవరకూ కూడా ప్రైవేటు సంస్థలు ఆగలేకపోతున్నాయి. డబ్బుతప్ప వీటికి ప్రజల ప్రాణాలు పట్టడం లేదని, వీటిని నియంత్రించే శక్తి రాష్ట్ర ప్రభుత్వానికి లేకపోతున్నదని విమర్శకులు అంటున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ముఖ్యమంత్రి హెలికాప్టర్ సంస్థలకోసం కఠినమైన నిబంధనావళిని తయారుచేయమన్నారు. సర్వీసులను క్రమబద్ధీకరించడంతో పాటు ఒక కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను కూడా ఏర్పాటుచేస్తామన్నారు. ఈ ప్రమాదఘటనను సూమోటోగా స్వీకరించిన ఉత్తరాఖండ్ హైకోర్టు సోమవారం ప్రభుత్వాన్ని ఉద్దేశించి చక్కని ప్రశ్నలు వేసింది, సరైన సూచనలు చేసింది. హిమాలయసానువుల్లో హెలికాప్టర్లు నడిపే పైలట్లకు ఎప్పటికప్పుడు శిక్షణ ఇస్తూండటం నుంచి, హెలికాప్టర్ల నిర్వహణ వరకూ అనేకం ఇందులో ఉన్నాయి. సర్వీసుల సంఖ్యను నిర్ణయించడం, నియంత్రించడం నుంచి ఉల్లంఘనకు పాల్పడిన సంస్థలను తీవ్రంగా శిక్షించడం వరకూ కోర్టు చాలా సూచనలు చేసింది. ఈ ఘోర ప్రమాదం తరువాతైనా ప్రభుత్వం తన మొహమాటాలు పక్కనబెట్టి గట్టిగా వ్యవహరించడం ముఖ్యం. కాలినడకన వెళ్ళలేనివారు, ఖర్చు భరించగలిగేవారు ఈ హెలికాప్టర్ సర్వీసుకు మొగ్గుచూపడం సహజం. సుదూరప్రాంతాలనుంచి సైతం సునాయాసంగా ఈ హెలికాప్టర్‌ను బుక్‌చేసుకోగలిగే మార్గాలూ పెరిగాయి. చార్‌ధామ్ యాత్రరద్దీకి అనుగుణంగా సర్వీసులు పెంచి, ఎక్కువ సొమ్ముచేసుకోవాలన్న తాపత్రయం ఈ ప్రైవేటు సంస్థలది. ఈ యాత్ర గురించి అధికవ్యయంతో విస్తృతప్రచారం చేస్తూ, మతపర్యాటకం నుంచి వచ్చే ఆదాయాన్ని గణనీయంగా పెంచుకుంటున్న ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఈ హెలికాప్టర్ సంస్థల వీరంగానికి అడ్డుకట్టవేయాలి. ఎంతో భక్తితో, అధికశ్రమకోర్చి నాలుగు ధామాలను దర్శించవస్తున్నవారి అభీష్టాన్ని నెరవేర్చి, క్షేమంగా వెనక్కుపంపే బాధ్యత ప్రభుత్వంమీద ఉంది.

ధిక్కార ఉక్రెయిన్ భవిష్యత్తు ఏమిటి?

రెండు దేశాల మధ్య ఘర్షణలకు, ముఖ్యంగా సాయుధ సమరాలకు కారణాలను కేవలం వర్తమానంలోనే చూడకూడదు. గత చరిత్రలోకి కూడా వెళ్ళాలి. ఇది, ప్రస్తుతం భీకర యుద్ధంలో ఉన్న ఉక్రెయిన్, రష్యా విషయంలో మరింత అవసరం. 24, ఫిబ్రవరి 2022న ఉక్రెయిన్‌పై రష్యా పెద్ద ఎత్తున సైనిక దాడిని ప్రారంభించడంతో ఆ రెండు దేశాల మధ్య ఘర్షణ పూర్తి స్థాయి యుద్ధంగా మారింది. ఈ చర్యకు ముందు– 2021 చివర, 2022 ప్రారంభంలో శిక్షణ విన్యాసాలు పేరుతో ఉక్రెయిన్ సరిహద్దుల వెంబడి 1,00,000 మందికి పైగా తన సైనికులను రష్యా సమీకరించింది. ఫిబ్రవరి 21, 2022న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఒక ప్రసంగంలో ఉక్రెయిన్‌ను సార్వభౌమ దేశంగా గుర్తించడాన్ని తిరస్కరించారు. అది సోవియట్ యూనియన్ సృష్టి అని, పశ్చిమ దేశాలు ఉక్రెయిన్‌ను రష్యాకు వ్యతిరేకంగా యుద్ధానికి రెచ్చగొడుతున్నాయని ఆరోపించారు. తూర్పు ఉక్రెయిన్‌లోని రష్యా మద్దతు గల, స్వయం–ప్రకటిత ప్రాంతాలైన డొనెట్స్క్, లుహాన్స్క్‌లను స్వతంత్ర రాష్ట్రాలుగా గుర్తిస్తున్నట్టు అదే ప్రసంగంలో ఆయన ప్రకటించారు. పిదప, మూడు రోజుల తర్వాత (ఫిబ్రవరి 24) ఉక్రెయిన్‌పై ప్రత్యేక సైనిక చర్యకు పుతిన్ ఆదేశించారు.

రష్యా సైన్యం రష్యా, బెలారస్, ఆక్రమిత క్రిమియా నుంచి బహుళ దిశలలో ఉక్రెయిన్‌పై దాడి చేసింది. కీవ్, ఖార్కివ్, డాన్‌బాస్ ప్రాంతంలోని కీలక నగరాలను లక్ష్యంగా చేసుకుంది. ఈ దాడి, 2014 నుంచి కొనసాగుతున్న సంఘర్షణను తీవ్రతరం చేసింది. నాటో, యూరోపియన్ యూనియన్‌తో ఉక్రెయిన్ సన్నిహితంగా ఉండకుండా నిరోధించడం, ఆ దేశంపై రష్యా నియంత్రణను పూర్తి స్థాయిలో స్థాపించడం అనే భౌగోళిక, రాజకీయ లక్ష్యాలు ఆ దాడి వెనుక ఉన్నాయి. ఉక్రెయిన్ లాంటి ఒక చిన్న దేశం పొరుగున ఉన్న ఒక అగ్రరాజ్యంతో తలపడటంలో (అమెరికా, ఐరోపా దేశాల మద్దతుతోనే అయినప్పటికీ) ఆ చిన్న దేశ ప్రజలు, మేధావుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవలేదు. ఇందుకు బలమైన కారణాలు తప్పక ఉంటాయి. ఈ కోణంలో చరిత్ర విలోకిస్తే ఉక్రెయిన్, రష్యాల మధ్య శతాబ్దాల ప్రగాఢ సంబంధాలు ఉన్నాయి. సాంస్కృతిక, రాజకీయ సంబంధాలూ బలంగానే ఉండేవి. అదే సందర్భంలో విభేదాలు, హింసతో కూడిన సంఘటనలు చాలానే ఉన్నాయి.

ఉక్రెయిన్ 18, 19 శతాబ్దాలలో రష్యన్ సామ్రాజ్యంలో భాగమైంది. రష్యనీకరణ విధానాలు ఉక్రెయిన్ భాష, సంస్కృతుల గుర్తింపును అణచివేశాయి. రష్యన్ విప్లవం తర్వాత ఉక్రెయిన్ స్వల్పకాలం (1917–20) స్వతంత్ర దేశంగా వర్ధిల్లింది. ఆ తరువాత సోవియట్ యూనియన్‌లో బలవంతంగా చేర్చబడింది. జోసెఫ్ స్టాలిన్ హయాం (1924–53)లో ఉక్రెయిన్‌పై కఠిన విధానాలు అమలు చేశారు. జార్ చక్రవర్తుల వలే స్టాలిన్ కూడా ఉక్రెయిన్‌ను సోవియట్ నియంత్రణలో ఉంచడానికి, రష్యనీకరణను ప్రోత్సహించడానికి శతథా ప్రయత్నించారు. ఉక్రెయిన్ సంస్కృతి, భాష, జాతీయ గుర్తింపును అణచివేశారు. మొదటి నుంచి ఉక్రెయిన్ ప్రజలలో జాతీయవాద చైతన్యం బలంగా ఉంది. ఈ విషయాన్ని నొక్కి చెప్పేందుకు Anne Applebaum (పోలిష్–అమెరికన్ జర్నలిస్ట్, చరిత్రవేత్త) తన రచన 'Red Famine: Stalin's War on Ukraine' ఒక కవితను ఉటంకించారు: 'నేను చనిపోయినప్పుడు / నన్ను నా ప్రియమైన ఉక్రెయిన్‌లో ఖననం చేయండి/ ఒక ఎత్తైన సమాధి కొండపై/ విశాలమైన సమతల భూమిలో/ అక్కడ నా కళ్లు చూడగలవు, నా చెవులు వినగలవు/ విశాలమైన పొలాలను, అపారమైన పచ్చిక బయళ్ళను/ డ్నీపర్ నది ఒడ్డును/ గర్జించే శక్తివంతమైన నది శబ్దాన్ని'.



నాడు సోవియట్ రాజ్యంగానూ, నేడు స్వతంత్ర దేశంగానూ ఉక్రెయిన్ ఒక దుఃఖమయ భూమి. ఈ చిన్న దేశం విలక్షణ అస్తిత్వాన్ని అణచివేసేందుకు జోసెఫ్ స్టాలిన్ భయంకర కృత్రిమ కరువును సృష్టించగా, వ్లాదిమిర్ పుతిన్ దురాక్రమణకు పాల్పడుతున్నాడు. ఈ అన్యాయాలకు ఉక్రెయిన్ అప్పుడు ఆక్రోశించింది, నేడు ప్రతిఘటిస్తోంది. ఫలితమే రష్యాతో ప్రస్తుత యుద్ధం.

1920ల చివరలో స్టాలిన్ నిర్బంధ సమిష్టి వ్యవసాయ వ్యవసాయ విధానాన్ని ప్రవేశపెట్టారు. రైతులు తమ వ్యక్తిగత భూములను వదులుకొని సోవియట్ నియంత్రిత సమిష్టి వ్యవసాయ క్షేత్రాలలో పనిచేయవలసి వచ్చింది. ఇందుకు వ్యతిరేకించిన రైతులను, ముఖ్యంగా 'కులక్స్' అని పిలిచే సంపన్న రైతులను వర్గ శత్రువులుగా చిత్రీకరించి, వారి భూములు, ఇతర ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. వేలాది రైతులను సైబీరియాకు బహిష్కరించారు. మేధావులు, రచయితలు, సమిష్టి వ్యవసాయ క్షేత్రాలను వ్యతిరేకించిన రాజకీయ నాయకులను సోవియట్ వ్యతిరేకులుగా ముద్రించి అరెస్టు చేశారు. చాలా మందిని హత్య చేశారు. సోవియట్ యూనియన్ పారిశ్రామికీకరణకు నిధులు సమకూర్చడానికి ఉక్రెయిన్ నుంచి భారీ మొత్తంలో ధాన్యాన్ని సేకరించారు, దీనివల్ల స్థానిక రైతులకు ఆహార కొరత ఏర్పడింది. 1932–33లో స్టాలిన్ విధానాల ఫలితంగా హోలోడోమోర్ (Holodomor) అనే భయంకరమైన కృత్రిమ కరువు ఉక్రెయిన్‌లో సంభవించింది. 'హోలోడోమోర్' అనే పదానికి ఉక్రెయిన్ భాషలో అర్థం 'ఆకలితో చావు' (death by hunger). ఇది 1932 నుంచి 1933 మధ్య సోవియట్ ఉక్రెయిన్‌లో సంభవించిన ఒక మహా కాటకం. ఈ విపత్తులో 35 నుంచి 50 లక్షల వరకు ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఇది సహజ విపత్తు కాదని, జోసెఫ్ స్టాలిన్ నేతృత్వంలోని సోవియట్ పాలకుల విధానాల ఫలితంగా సృష్టించబడిన విపత్తుగా చరిత్ర గుర్తించింది. దీనిని కొంత మంది చరిత్రకారులు జాతి నిర్మూలన (genocide)గా ప్రకటించారు.

స్టాలిన్ ప్రవేశపెట్టిన సమిష్టి వ్యవసాయ విధానం వల్ల ఉత్పత్తి తగ్గినప్పటికీ, సోవియట్ అధికారులు అసాధారణంగా అధిక ధాన్య సేకరణ కోటాలను విధించారు. కోటాలను పరిపూర్తి చేయలేని గ్రామాల నుంచి ధాన్యాన్ని బలవంతంగా స్వాధీనం చేసుకున్నారు. రైతులను ఆహారం లేకుండా వదిలేశారు. ఉక్రెయిన్ గ్రామాలను 'బ్లాక్‌లిస్ట్' చేసి, ఆహార సరఫరాను నిషేధించారు. ఈ కరువు ఉక్రెయిన్ జాతీయవాదాన్ని అణచివేయడానికి, సోవియట్ నియంత్రణను బలోపేతం చేయడానికి ఉద్దేశపూర్వకంగా ఉపయోగించబడిందని చరిత్రకారులు భావిస్తారు. ఈ కరువు వల్ల గ్రామాలు ఖాళీ అయ్యాయి. వేలాది కుటుంబాలు ఆకలితో మరణించాయి. ఉక్రెయిన్ సమాజంపై ఈ కరువు దీర్ఘకాలిక ప్రభావం చూపింది. ఉక్రెయిన్లలో రష్యాపై ద్వేషం, స్వీయ జాతీయతా చైతన్యం బలపడ్డాయి.

కరువు వల్ల ఆహారం దొరకక కొంతమంది ఉక్రెయిన్ ప్రజలు బతకడానికి నరమాంస భక్షణకు (cannibalism) పాల్పడ్డారు. సోవియట్ పోలీసు ఆర్కైవ్‌లు ఆకలితో పిచ్చివాళ్లైన వ్యక్తుల వైనాలు, క్షుదార్తులు శవాలను తిన్న సందర్భాలను రికార్డు చేశాయి. కొంత మంది తమ సొంత పిల్లలను తిన్న సందర్భాలూ ఉన్నాయి! తమని తినేస్తారని పిల్లలు తల్లిదండ్రుల నుంచి పారిపోయిన సంఘటనలు అనేకం ఉన్నాయి. Robert Conqest పుస్తకం 'The Harvest of Sorrow: Soviet Collectivization and the Terror–Famine', పైన ప్రస్తావించిన Anne Applebaum పుస్తకం 'Red Famine: Stalin's War on Ukraine'లో ఈ కృత్రిమ కాటకం వివరాలు విపులంగా ఉన్నాయి.

1991లో సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమైన తర్వాత ఉక్రెయిన్ మళ్లీ స్వతంత్ర దేశంగా ప్రభవించింది. అయితే రష్యాతో సంబంధాలలో ఉద్రిక్తత కొనసాగుతూనే వచ్చింది. సరిహద్దు, ఇంధనం ఇత్యాది విషయాలలో వివాదాలు అపరిష్కృతంగానే ఉండిపోయాయి. ఈ నేపథ్యంలో 24 ఫిబ్రవరి 2022న ఉక్రెయిన్‌పై పూర్తి స్థాయి దాడికి రష్యా ఉపక్రమించింది. ఈ యుద్ధంలో ఇప్పటికే లక్షలాది ప్రజలు మరణించారు, మరెన్నో లక్షల మంది నిరాశ్రయులు అయ్యారు. నగరాలకు నగరాలే ధ్వంసమయ్యాయి. రష్యా పశ్చిమ దేశాలను నిందిస్తోంది. యూరోపియన్ యూనియన్/నాటోతో ఉక్రెయిన్ తన సంబంధాలను కొనసాగిస్తోంది.

చారిత్రక దృష్టికోణం నుంచి పరిశీలిస్తే ఈ యుద్ధం ఒక లోతైన సమస్య. సోవియట్ యుగం తర్వాత ఏర్పడే రాజకీయ వ్యవస్థ ఎలా ఉండాలి, సమాజం ఎలా రూపుదిద్దుకోవాలి అనే అంశాలపై జరుగుతున్న పోరాటమిది. ప్రచ్ఛన్న యుద్ధానంతర కాలంలో ఏర్పడిన ఏకధ్రువ ప్రపంచ వ్యవస్థకు పుతిన్ విసిరిన సవాలులో భాగమే ఈ యుద్ధం. అందువల్ల, ఈ ఘర్షణకు పరిష్కారం కేవలం ఉక్రెయిన్ స్థానిక స్థాయిలో సాధ్యపడదు. అంతర్జాతీయ స్థాయిలో, విశాలమైన చట్రంలో మాత్రమే దీనికి పరిష్కారం సాధ్యమవుతుంది. ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పడం అనేది స్థానికం కాదు, ప్రపంచ స్థాయిలో చర్చించాల్సిన అంశం. అయితే వర్తమాన సందర్భంలో అది సాధ్యమయ్యేలా లేదు. ఉక్రెయిన్ నాటో సభ్య దేశమైతే అనివార్యంగా రష్యాకు పక్కలో బల్లెం అవుతుందనేది వాస్తవం. అటువంటి పరిస్థితిని నివారించుకోవటం రష్యాకు అత్యవసరం. అమెరికాతో పాటు ఐరోపా దేశాలన్నీ రష్యాకు వ్యతిరేకంగానే ఉన్నాయి. సోవియట్ యూనియన్ కాలంలో రష్యా పాల్పడిన చారిత్రక తప్పిదాలు దాన్ని ఇప్పటికీ వెంటాడుతున్నాయి. ఐరోపా దేశాల అవకాశవాదంతో పాటు, రష్యా చారిత్రక తప్పిదాలు ఉక్రెయిన్‌కి శక్తినిస్తున్నాయి. జర్మన్ తాత్త్వికుడు నీషె అన్నట్లు When you look long into an abyss, the abyss also looks into you. అవకాశవాద శక్తులనుంచి వస్తున్న సహాయంతో ఉక్రెయిన్ నిలబడగలదా?

■ ప్రొ. బి.తిరుపతిరావు
ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం

పీఎం కిసాన్ మార్గదర్శకాలు సవరించాలి

దేశంలోని రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం 2019లో ప్రవేశపెట్టిన ప్రధాని కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం కిసాన్) పథకం ప్రారంభంలో ఎంతో ఆశాజనకంగా కనిపించింది. అర్హత కలిగిన రైతు కుటుంబానికి ఏటా రూ. 6,000 నేరుగా వారి ఖాతాల్లో జమ చేసే విధంగా రూపొందిన ఈ పథకం, రైతులకు సీజనల్ ఖర్చులకు కొంత ఉపశమనం కలిగించేది.

ఈ పథకం తొలి నిబంధనల ప్రకారం, 2019 ఫిబ్రవరి 1 నాటికి ఎవరి పేరున భూమి ఉందో వారే ఈ పథకానికి అర్హులు. అయితే, తర్వాత భూమిని కొనుగోలు చేసినవారు, గిఫ్ట్ డీడ్, పార్టీషన్ లేదా వారసత్వంగా భూమి పొందిన రైతులు పథకానికి అనర్హులుగా ప్రకటించారు. ఈ మార్గదర్శకాలు 2020 మార్చి 29న కేంద్రం జారీ చేసి, ఐదేళ్లపాటు అమల్లో ఉంటాయని ప్రకటించింది. దీంతో వేలాది చిన్న, సన్నకారు రైతులకు న్యాయం జరగడం లేదు.

ఈ 'కట్–ఆఫ్' నిబంధన వాస్తవిక పరిస్థితులకు పూర్తిగా విరుద్ధం. భూమి కొనడం, అమ్మడం, పంచుకోవడం ఎప్పుడూ జరుగుతూ ఉంటాయి. 2019 తర్వాత భూమిని సొంతం చేసుకున్న రైతు కూడా అదే విధంగా సాగు చేస్తుంటే, అలాంటి వారికి పథకం అమలు చేయకపోవడం అన్యాయం కాదా? ఇకనైనా కేంద్ర ప్రభుత్వం ఈ విషయాన్ని పునః సమీక్షించి, మార్గదర్శకాలను రైతు ప్రయోజనాలకు అనుగుణంగా సవరించాలి. ప్రస్తుతం ఎవరి పేరు మీద భూమి ఉంది, ఎవరు సాగు చేస్తున్నారు అనే అంశాల ఆధారంగా ఎప్పటికప్పుడు అర్హతలను నిర్ధారించాలి. ఇది కేవలం నిబంధనల సమస్య కాదు, రైతుల జీవితాలపై నేరుగా ప్రభావం చూపే మానవీయ సమస్య.

ఇదే తరుణంలో ఈ పథకం ద్వారా ఇచ్చే ఆర్థిక సహాయం మొత్తాన్ని పెంచడం అవసరం. ఈ పథకం ప్రారంభమైనప్పుడు, ఏడాదికి రూ.6,000 ఇవ్వడం రైతులకు కొంత ఉపశమనం కలిగించేది. కానీ ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఎరువుల ధరలు, విత్తనాలు, కూలీల ఖర్చు పెరిగింది. పైగా వాతావరణ మార్పులతో పంటలకు నష్టాలు కూడా ఎక్కువయ్యాయి. ఇలాంటి సమయంలో ఒక రైతు కుటుంబానికి ఏడాదికి కేవలం రూ.6,000 ఇవ్వడం ద్వారా ఎలాంటి ఉపశమనం కలుగుతుంది? నెలకు 500 రూపాయలు మాత్రమే వస్తున్నాయంటే, అది సాగు అవసరాలే కాదు, నిత్యవసరాల కోసం కూడా సరిపోదు. కనీసం ఈ పథకం ద్వారా అందే మొత్తాన్ని రూ.10,000కి పెంచేలా కేంద్రం పునరాలోచించాలి. దానిని మూడు విడతల్లో రూ.3,333 చొప్పున ఇవ్వడం ద్వారా రైతుకు కొంత భద్రత కలిగించవచ్చు.

ఈ మొత్తాన్ని పెంచడం వల్ల ప్రభుత్వంపై కొంత భారం పడవచ్చు. కానీ దీన్ని వ్యయంగా కాక, పెట్టుబడిగా చూడాలి. రైతు చేతిలో డబ్బు ఉంటేనే అతడు ఖర్చు చేస్తాడు. తద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కదులుతుంది. కూలీలకు, వ్యవసాయ ఉపకరణాల విక్రేతలకు, చిన్న వ్యాపారులకు లబ్ధి చేకూర్చుతుంది. అంటే ఈ చర్య దేశ ఆర్థిక వ్యవస్థకే లాభదాయకంగా మారుతుంది. ఇక రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర కూడా ఇందులో ముఖ్యమైనది. రాష్ట్ర రెవెన్యూ శాఖ, భూ నమోదిత శాఖ, వ్యవసాయ శాఖల మధ్య సమన్వయంతో రైతుల వివరాలు, సాగు స్థితి వంటి సమాచారం కేంద్రానికి అందేలా వ్యవస్థను రూపొందించాలి. అలాగే గ్రామీణ స్థాయిలో పథకం వివరాలపై అవగాహన కల్పించి, అర్హత కలిగిన ప్రతి రైతుకు లబ్ధి చేకూరేలా చూడాలి. ఈ విషయాలన్నింటిపై కేంద్రం తక్షణ నిర్ణయం తీసుకుని పీఎం కిసాన్ పథకం రూపురేఖలు మార్చాలి. లక్షలాది రైతులను నిబంధనల పేరుతో పక్కన పెట్టకుండా, వారికి ఆర్థిక ప్రోత్సాహాన్ని పెంచి అందించాలి.

– అప్పన్న గొనప, విశాఖపట్నం

'మహిళల ఉచిత బస్సు' వృథా కాకూడదు!

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రవేశపెట్టబోతుందన్న వార్త ఆనందాన్ని కలిగించింది. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డనరీ బస్సులకు పరిమితమైన ఈ పథకం మహిళల ఆర్థిక, సామాజిక పరిస్థితులు మరింత మెరుగుపర్చేందుకు ప్రవేశపెట్టబడిందని ప్రభుత్వ ప్రకటన కూడా వెలువడింది. ఈ పథకం వల్ల ప్రభుత్వానికి ఏటా అదనంగా రూ.3,150 కోట్ల భారం పడుతుందని చెపుతున్నారు. ప్రస్తుతం ఆర్టీసీలో ఉన్న దాదాపు ఎనిమిదివేల బస్సుల కొరత ఈ పథకంతో పదివేలకు పెరగబోతుందని, ఇంకా 11,479 మంది సిబ్బందిని కూడా నియమించాల్సి ఉంటుందని గణాంకాలు చెపుతున్నాయి. ప్రభుత్వానికి వాగ్దానాలను నెరవేర్చుకునే ప్రక్రియలో రాజకీయంగా ఇది తప్పనిసరి.

అయితే ఈ పథకం అమలుచేసే ముందు ఆచరణలో సాధ్యాసాధ్యాలు పరిశీలించి అవసరమైన సవరణలు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పొరుగు రాష్ట్రమైన తెలంగాణలో ఈ పథకం విజయవంతంగా నడుస్తున్నా, క్షేత్రస్థాయిలో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. టికెట్ కొన్నప్పటికీ నిలబడి ప్రయాణం చేయాల్సిరావటంతో ఎక్కువ మంది పురుషులు రైలు, ఆటో, మోటారు సైకిలు వంటి ప్రత్యామ్నాయాలను ఎంచుకోవడంతో ఆర్టీసీ ఆదాయం గణనీయంగా పడిపోయింది. అలాగే మొదటి స్టేజిలోనే బస్సులు మహిళలతో నిండిపోవటంతో మిగిలిన స్టేజీలలో ఆపకుండా వెళ్లిపోవాల్సి వస్తున్నది. ఇది ఆర్టీసీ విశ్వసనీయతను దెబ్బతీస్తున్నది. కాగా ఉచితం సహజంగానే మనిషికి లేని అవసరాలను జ్ఞప్తికి తెస్తుంది. కొత్త అవసరాలను సృష్టిస్తుంది. ఆ విధంగా చూస్తే అమలవుతున్న చాలాచోట్ల ఈ ఉచిత బస్సు పథకం దాదాపు ఇరవైశాతం వరకూ దుర్వినియోగం అవుతున్నది. దీనర్థం ఈ పథకం మంచిది కాదని కాదు. దీని ప్రాథమిక సూత్రాలను పకడ్బందీగా తయారుచేయాలి. ఇతర రాష్ట్రాలలో ఈ పథకం ప్రయోజనాలను, లోటుపాట్లు సమీక్షించుకుని, కట్టుదిట్టంగా అమలు చేయాలి.

మహిళలలో దివ్యాంగులు, వయోవృద్ధులు, పిల్లలకు ఉచితం వర్తింపచేస్తూ, మిగిలిన వారికి ఆ ఉచితాన్ని నిర్దిష్ట ఆదాయం లోపు వారికి పరిమితం చేయటం ఒక పరిష్కారం. అలాగే ఈ పథకం కింద స్త్రీలకు ప్రత్యేక ఉచిత బస్సులు ఏర్పాటు చేసి, వాటిని ప్రధాన మార్గాలలో నిర్దేశిత వేళలలో నడపటం ఒక ఆచరణీయమైన పరిష్కారం. అలాగే సంబంధిత అధికారులు, నిపుణులతో ఒక కమిటీ వేయటం ద్వారా మరిన్ని మెరుగైన సూచనలు, సలహాలు పొందవచ్చు. ఏమైనా ముందుగా ప్రకటించినట్లు మహిళలకు ఆర్థిక, సామాజిక ప్రయోజనం చేకూరేలా... అదే సమయంలో ఇతర ఆర్థిక, సామాజిక సమస్యలు తలెత్తకుండా ఈ మహిళల ఉచిత బస్సు పథకం పట్ల ప్రభుత్వం జాగరూకతతో వ్యవహరిస్తుందని ఆశిద్దాం.

– ఆర్.వి. రాఘవరావు, అద్దంకి

విహారం... విషాదం కారాదు!

ఇటీవల కాలంలో చెరువులు, నదులలో ఈతకు దిగి పదుల సంఖ్యలో పిల్లలు చనిపోతున్నారు. గత రెండు నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా చాలా మంది మరణించారు. అలాగే వాగులు, చెరువు గట్లు, సముద్ర తీరాల్లో సెల్ఫీల మోజులో పడి మృత్యువు బారిన పడుతున్నారు. చిన్న పిల్లలయితే పొరబాటున నీళ్లలోకి తెలియక వెళ్లారు అనుకోవచ్చు. కానీ 18 ఏళ్ళు దాటినవారు కూడా ప్రమాదాల బారినపడి మరణిస్తున్నారు. విహారయాత్రల్లో నదీ స్నానాలు విషాదయాత్రలుగా మారుతున్నాయి. ఇటీవల విదేశాలకు చదువు, ఉద్యోగాల నిమిత్తం వెళ్లిన తెలుగువారు కూడా అక్కడ నదుల్లో ప్రమాదాల బారినపడి మరణిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. ముఖ్యంగా యువకులు, చదువుకున్నవారు నీటిని చూడగానే ఉబలాటపడి... లోతు, ప్రవాహపు వడి పట్ల అంచనా లేకుండా ఈతకు దిగి మరణిస్తూ తల్లిదండ్రులకు గుండెకోత పెడుతున్నారు.

ప్రమాదం జరిగిన తరువాత ఆ ప్రాంతాల్లో అధికారులు హెచ్చరిక బోర్డులు, గస్తీ పెట్టడం లేదని, అలాగే మునిగిన వ్యక్తుల శరీరాలను త్వరగా వెలికితీయడం లేదని పిల్లల తల్లిదండ్రులు ఆగ్రహం వెలిబుచ్చిన సందర్భాలు కూడా ఉన్నాయి. విహారయాత్రకి వెళ్లే పిల్లలకు చెరువులు, వాగులు, కాలువల వద్ద జాగ్రత్తగా ఉండాలని తల్లిదండ్రులు చెప్పాలి. పత్రికల్లో ఈతకు దిగి మరణించిన వార్తలు విద్యార్థులకు చూపుతూ ఉపాధ్యాయులు, లెక్చరర్లు హెచ్చరించాలి. విహార యాత్ర ఆనందంగా చేయాలి కాని, కన్నవాళ్లకు కడుపు కోత మిగల్చకూడదని, విలువైన జీవితాన్ని కాపాడుకోవాలని సూచించాలి. ఒకవేళ ఈత వచ్చినా కొత్త ప్రాంతంలో తగిన జాగ్రత్తలు లేకుండా నీటిలోకి దిగే సాహసం చేయొద్దని హితవు చెప్పాలి. ప్రభుత్వం కూడా టీవీ, సినిమాల్లో సెలబ్రిటీలతో ప్రకటనల ద్వారా చెప్పించాలి.

– మారిశెట్టి జితేంద్ర, రాజమహేంద్రవరం

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

గోదావరి వరద జలాలపై తెలంగాణ మొండి వాదన!

గోదావరి వరదజలాల వినియోగంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో పాటు ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ వైఖరి చిన్న పిల్లల పుస్తకాల్లో ఉన్న పులి–మేక కథను తలదన్నే విధంగా ఉంది. నది ఎగువ భాగంలో నీళ్లు తాగుతున్న పులి కింద భాగంలో నీళ్లు తాగుతున్న మేకను ఉద్దేశించి తను తాగే నీళ్లు ఎంగిలి చేస్తున్నావని బెదిరించిన కథ అందరికీ తెలుసు! అచ్చం అలాగే ఉంది తెలంగాణ వ్యవహార సరళి. గోదావరికి ఎగువ భాగంలో తెలంగాణ ఉంది. గోదావరిలో నీటి ఎద్దడి ఏర్పడి తెలంగాణ బంద్ చేస్తే, ఆంధ్రప్రదేశ్ కటకటలాడవలసిందే. కృష్ణనదిలో ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాలు నిండితే గాని జూరాలకు నీళ్లు రావనేది తెలంగాణ నేతలకు తెలుసు. గోదావరి అయినా అంతే. తెలంగాణలో గోదావరి మీద గత పదేళ్లుగా పలు ప్రాజెక్టులు నిర్మించారు. ఇంకా కొన్ని నిర్మాణంలో ఉన్నాయి. మరికొన్ని ప్రాజెక్టులకు రూపకల్పన చేస్తున్నారు.

రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నీటివాటాల వివాదం అపరిష్కృతంగా ఉన్నా, గోదావరి ట్రిబ్యునల్ కేటాయించిన 1486.85 టీఎంసీల్లో 957.85 టీఎంసీల నీళ్లు తమవని ఏకపక్షంగా తెలంగాణ చెబుతున్నది. కానీ ట్రిబ్యునల్ నియామకానికి ఇష్టపడటం లేదు. ట్రిబ్యునల్ నియామకమైతే దాని ముందు తన వాటాను గురించి వాదించవచ్చుకదా? ప్రస్తుతం తను చెబుతున్న వాటా మేరకు కొన్ని ప్రాజెక్టుల డీపీఆర్‌లు ఆమోదం కోసం పట్టు వదలకుండా కృషి చేస్తున్నది. తెలంగాణ దృష్టిలో దీన్ని తప్పు పట్టలేం. అయితే దిగువ రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ ఎన్ని ప్రాజెక్టులు కట్టుకున్నా ఆచరణలో తెలంగాణకు వచ్చిన నష్టం ఏమిటి? పోలవరం జలాశయం ముంపు తప్ప. తెలంగాణ వాడుకోగా మిగిలిన నీళ్లు కిందకు వస్తేనే ఆంధ్రప్రదేశ్ ఉపయోగించుకొంటుంది. బాబ్లీ ప్రాజెక్టు తలుపులు ఎత్తితేనే శ్రీరామ్‌సాగర్‌కు నీళ్లు వస్తున్నాయి. గోదావరి నదిలో దిగువ రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ తన వాటాకు మించి ప్రాజెక్టులు కట్టుకొంటే పై నుంచి అవసరమైన మేరకు నీళ్లు రాకుంటే వాటిని ఎండబెట్టుకోవలసిందే!

ఎగువ రాష్ట్రాలు నిర్మించే ప్రాజెక్టులపై సాధారణంగా దిగువ రాష్ట్రాలు అభ్యంతరాలు చెబుతాయి. దిగువన ఉండే ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టులు కట్టుకొంటే ఎగువన వుండే తెలంగాణకు ఏ విధంగా నష్టం? తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అన్ని ప్రాజెక్టులకు వాడుకోగా ఒక నీటి సంవత్సరంలో ఒక నెల రోజులు అపారమైన వరద వెల్లువెత్తుతుంది. ఈ వరదనీటిని వాడుకొనేందుకే గోదావరి–బనకచర్ల అనుసంధానం రూపకల్పన చేస్తున్నారు.

ఈ వివాదం జటిలం కావడానికి తన పబ్బం గడుపుకొనే కేంద్ర ప్రభుత్వ వైఖరే మూల హేతువు. దీంతో పాటు జగన్మోహన్‌రెడ్డి కూడా బాధ్యులే. 2020లో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో కృష్ణ జలాలు పంపకానికి తోడు, గోదావరి జలాల వాటాలు తేల్చేందుకు ట్రిబ్యునల్ వేయాలని తీర్మానం చేశారు. అయితే కృష్ణ జలాల ట్రిబ్యునల్ కోసమే

ఎగువ రాష్ట్రాలు నిర్మించే ప్రాజెక్టులపై సాధారణంగా దిగువ రాష్ట్రాలు అభ్యంతరాలు చెబుతాయి. దిగువన ఉండే ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టులు కట్టుకొంటే ఎగువన వుండే తెలంగాణకు ఏ విధంగా నష్టం? తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అన్ని ప్రాజెక్టులకు వాడుకోగా ఒక నీటి సంవత్సరంలో ఒక నెల రోజులు అపారమైన వరద వెల్లువెత్తుతుంది. ఈ వరదనీటిని వాడుకొనేందుకే గోదావరి–బనకచర్ల అనుసంధానం.



కేసీఆర్ పట్టుబట్టారు. దానితో బీజేపీ 2023 ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసం కృష్ణా ట్రిబ్యునల్ వేసింది. కానీ గోదావరి ట్రిబ్యునల్ ఇంతవరకు వేయలేదు. కేసీఆర్ లాగా జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం గోదావరి ట్రిబ్యునల్ కోసం కేంద్రం వెంట పడలేదు. సంవత్సరం గడచిపోయినా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం కూడా గోదావరి ట్రిబ్యునల్‌పై అంత పట్టుదలగా లేదు. గోదావరి ట్రిబ్యునల్ నియామకమై ఎవరి వాటాలు ఎంతో తేలిపోయి ఉంటే, ఇప్పుడు గోదావరి –బనకచర్ల అనుసంధానంపై తెలంగాణ యాగీ చేసే అవకాశం ఉండేది కాదు. పైగా ఏ నదీ పరీవాహక ప్రాంతంలోనైనా చిట్టచివరన వుండే రాష్ట్రానికి మిగులుతో పాటు వరద జలాలపై హక్కును సహజ న్యాయసూత్రాల ప్రకారం ట్రిబ్యునల్స్ కల్పిస్తాయి. ఆ వెసులుబాటు ఉపయోగించుకొనే అవకాశం ఉండేది.


గోదావరి–బనకచర్ల అనుసంధానంపై రగడను బీఆర్ఎస్ పార్టీ ప్రముఖంగా లేవదీసింది. ఆ పార్టీ అధికార మీడియాలో ప్రతిరోజూ వరసబెట్టి ఈ అనుసంధానానికి, ఆంధ్రప్రదేశ్‌కు వ్యతిరేక కథనాలు వస్తున్నాయి. కృష్ణ నది నీళ్లన్నీ దోచుకోవడం అయిందని, ఇప్పుడు గోదావరి నీళ్లపై కన్ను పడిందని పుంఖానుపుంఖాలుగా వార్తా కథనాలు వండి వారుస్తున్నారు. ఎగువ రాష్ట్రమైన తాము ఉపయోగించుకోగా మిగిలిన నీరే కిందకు పోతాయనే స్పృహ లేకుండా బీఆర్ఎస్ తీరు ఉంది. గోదావరి–బనకచర్ల అనుసంధానంపై వ్యతిరేక ప్రచారం మొదలు పెట్టడానికి కారణం కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ కుంభకోణం బీఆర్ఎస్ పార్టీ మెడకు చుట్టుకోవడమే. దాన్ని పక్కదారి పట్టించేందుకు గోదావరి–బనకచర్లకు ముడిబెట్టారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పట్ల రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సానుకూలంగా ఉందని, చంద్రబాబు నాయుడు–రేవంత్‌రెడ్డి మధ్య గురుశిష్యుల సంబంధం ఉండడం వల్లే రేవంత్‌రెడ్డి మెతక వైఖరి అవలంబిస్తున్నారని నిరాధారమైన ఆరోపణలు గుప్పిస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీలో పిల్లర్లు దెబ్బ తిని నీటిని నిల్వ చేయకపోవడానికి, గోదావరి–బనకచర్ల అనుసంధానానికి బీఆర్ఎస్ పార్టీ లింకుపెట్టి ప్రచారం చేస్తున్నది.

మేడిగడ్డతో పాటు అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో కూడా నిర్మాణ లోపాలు బయటపడటంతో వాటిలో కూడా నీళ్లు నిల్వ చేయడం లేదు. మొత్తం ప్రాజెక్టు నిర్మాణంపై ఒక పక్క విజిలెన్స్ అధికారులు పరిశీలించి నివేదిక ఇచ్చారు. ప్రాజెక్టు నిర్మాణంలో పాల్గొన్న పలువురు అధికారులను ఈ నివేదిక దోషులుగా నిర్ధారించింది. మరోవైపు ఈ ప్రాజెక్టు నిర్మాణంపై న్యాయ విచారణ జరుపుతున్న ఘోష్ కమిషన్ ముందు కేసీఆర్ విచారణకు హాజరై ప్రశ్నలకు సమాధానమిచ్చారు. అయితే కాళేశ్వరం ఎపిసోడ్ నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు బీఆర్ఎస్ పార్టీ గోదావరి–బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టుపై దుమ్మెత్తి పోస్తోంది. ఇది ఎంతవరకు వెళ్లిందంటే రాయలసీమలో 350 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్లు ఉన్నాయని పేర్కొన్నారు.

ఇదిలా వుండగా బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారంతో తామెక్కడ వెనుకబడిపోతామోననే భయంతో తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి గోదావరి–బనకచర్ల అనుసంధానం అమలు చేసేందుకు తాము వ్యతిరేకమని కేంద్ర జలవనరుల శాఖ మంత్రి పాటిల్‌తో చెప్పినట్లు ప్రకటించారు. ఈ విమర్శనా ధోరణి ఎంతవరకు వెళ్లిందంటే శ్రీశైలం కుడి ప్రధాన కాలువ లైనింగ్ కూడా చేయకూడదని తాజాగా కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శికి తెలంగాణ నీటి పారుదల శాఖ కార్యదర్శి లేఖ రాశారు. వరద రోజుల్లో తప్ప కృష్ణ జలాల పంపిణీ... యాజమాన్య బోర్డు అధీనంలో ఉండగా ఆంధ్రప్రదేశ్‌లో ఎన్ని మౌలిక సదుపాయాలు కల్పించుకున్నా తెలంగాణకు వచ్చిన నష్టం ఏమిటి? వరద నీరు సముద్రంలో కలిసేందుకైనా ఇష్టపడతారు గాని ఆంధ్రప్రదేశ్ వాడుకోవడానికి ఇష్టపడటం లేదు.

ఇంత రాజకీయ రగడ జరుగుతుంటే బీఆర్ఎస్ పార్టీ నేతలకు, వారి మీడియా దుష్ప్రచారాలకు ఆంధ్రప్రదేశ్ రాజకీయ నాయకులు దీటైన సమాధానం ఇవ్వడం లేదు. గతంలో వైసీపీ పాలనలో కూడా ఇలాగే జరిగేది. తెలంగాణ నుంచి ఎన్ని విమర్శలు వచ్చినా, ఎవరూ పట్టించుకొనేవారు కాదు. వాస్తవంలో అప్పుడు మ్యాచ్ ఫిక్సింగ్ కాబట్టి సరిపోయింది.

◆ వి. శంకరయ్య
విశ్రాంత పాత్రికేయులు



ఆసుపత్రిలో అష్టకష్టాలు

ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో పేద రోగుల దుస్థితి

వైద్యం చేయించుకుందామని పెద్దాసుపత్రికి వస్తే.. అక్కడి పరిస్థితులు చూసి పై ప్రాణాలు పైనే పోయే దుస్థితి ఏర్పడింది. ఆసుపత్రి గేటు నుంచి వెళ్లడం ఓ ఎత్తయితే, ఓపీ తీసుకోవడం, అవసరమైతే అడ్మిట్ కావడం మరో ఎత్తు. ఇక నడవలేని, ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని లోపలకు తీసుకెళ్లాలంటే నరకమే. రోగులకు వినియోగించే స్ట్రెచర్లు, వీల్‌చైర్లు సరిపడా లేకపోవడంతో చాలామంది పాక్కుంటూ, మోసుకుంటూ వెళ్తున్న హృదయ విదారకమైన దృశ్యాలు మన జీజీహెచ్‌లో రోజూ కోకొల్లలు.

- స్ట్రెచర్లు, వీల్‌చైర్లు ఉన్నా.. వినియోగంలో సున్నా
- చిన్నచిన్న మరమ్మతులకు పక్కన పడేసి..
- రోగులకు అందుబాటులో లేకుండా చేసి..
- చేసేదేమీ లేక ఎత్తుకెళ్తున్న రోగుల బంధువులు
- సింగిల్‌గా వస్తున్నవారు పాక్కుంటూనే..
- అధికారుల నిర్లక్ష్యంపై రోగుల సహాయకుల ఆగ్రహం

ఆంధ్రజ్యోతి ఫోకస్



స్ట్రెచర్ ఇవ్వకపోవడంతో రోగిని ఎత్తుకెళ్లి ఆటో ఎక్కిస్తున్న బంధువు

విజయవాడ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : నాలుగు జిల్లాలకు ప్రధానమైన ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో రోగులను తీసుకెళ్లడానికి స్ట్రెచర్లు, వీల్‌చైర్లు లేని దుస్థితి ఏర్పడింది. రోజూ వందలాది మంది రోగులు నడవలేని పరిస్థితిలో వైద్యసేవల కోసం వస్తుండగా, వారిని తీసుకెళ్లే స్ట్రెచర్లు, వీల్‌చైర్లను ఆసుపత్రిలో ఓ మూలనపడేయడంపై విమర్శలు వస్తున్నాయి. ఇలా పక్కనపడేసిన వాటిలో అనేక స్ట్రెచర్లు పనిచేయడానికి అనువుగానే ఉన్నప్పటికీ ఉపయోగించకుండా వదిలేశారు. ఓవైపు మిగతా 6లో..



ఆడవాళ్లం ఎలా ఎత్తుకెళ్తాం..

మా అత్తకు కొన్నిరోజుల నుంచి కడుపులో నొప్పిగా ఉందంటే ఎయిమ్స్‌లో వైద్యం చేయిస్తున్నాం. ఎయిమ్స్ వైద్యుల సూచన మేరకు ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చాం. ఇక్కడి వరకు ఆటోలో వచ్చాం. మా అత్తను లోపలకు తీసుకెళ్లడానికి వీల్‌చైర్ కావాలని సిబ్బందిని అడిగితే ప్రస్తుతం ఖాళీ లేవని, కొంత సమయం వేచి ఉండాలని చెబుతున్నారు. ఎంత సమయం వేచి ఉన్నా వీల్‌చైర్ ఇవ్వలేదు. ఆమె నడిచే పరిస్థితిలో లేదు. ఆవిడను నేను ఎత్తుకుని ఎలా తీసుకెళ్లగలను. వీల్‌చైర్ లేని ఈ ఆసుపత్రిలో వైద్యం ఎలా ఉంటుందోనని భయమేస్తుంది. - కుమారి, భవానీపురం



ఆసుపత్రిలో నిరుపయోగంగా పడి ఉన్న స్ట్రెచర్లు వీల్‌చైర్లు





కాలుకు ఇన్‌ఫెక్షన్ అయిన వ్యక్తిని తీసుకెళ్తున్న సహాయకులు

వీల్‌చైర్ లేక పాక్కుంటూ వస్తున్నా..

నా కాలుకు ఇన్‌ఫెక్షన్ అయ్యింది. ఇక్కడి వరకు ఆటోలో వచ్చా. కానీ, ఆసుపత్రి లోపలకు వెళ్లాలంటే నడవలేకపోతున్నా. వీల్‌చైర్ కావాలని అడిగితే ఎవరూ స్పందించట్లేదు. ఎంత సమయం ఉన్నా ప్రయోజనం లేదని పాక్కుంటూ పోతున్నా. సిబ్బందిని అడుగుతున్నా ఎవరూ స్పందించట్లేదు.
- నారాయణరావు, పటమట



రాజధానిలో జాబ్‌మేళాకు విశేష స్పందన

110 మందికి ఉద్యోగాలు



అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

విజయవాడ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : రాజధాని ప్రాంతంలోని స్కిల్‌హబ్ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. మొత్తం 264 మంది అభ్యర్థులు ఈ జాబ్‌మేళాలో పాల్గొనగా, 110 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారు. మరో 137 మంది రెండో రౌండ్‌కు ఎంపికయ్యారు. సీఆర్డీఏ ఆధ్వర్యంలో నైపుణాభివృద్ధి, శిక్షణ శాఖ నిర్వహించిన ఈ జాబ్‌మేళాలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఆటోమొబైల్, ఫైనాన్స్, స్కిల్ డెవలప్‌మెంట్ రంగాలకు చెందిన ఐదు ప్రముఖ కంపెనీలైన వరుణ్ మోటార్స్, స్కిల్‌క్రాఫ్ట్ లిమిటెడ్, ఎంవీఆర్ ఇన్‌ఫ్రా, కేఎంవీ ప్రాజెక్ట్స్, శ్రీరామ్ ఫైనాన్స్ సంస్థలు పాల్గొన్నాయి. ఈ కంపెనీల్లో 400 ఉద్యోగాలు భర్తీ చేయడానికి జాబ్‌మేళా నిర్వహించారు. ప్రపంచ బ్యాంక్, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ బృందాలు స్కిల్‌హబ్ ప్రాంగణంలో పర్యటించి అభ్యర్థులతో మాట్లాడాయి. ఇంటర్వ్యూలు జరిగిన తీరును పరిశీలించాయి. నైపుణ్య శిక్షణాధికారి సాయిశ్రీనివాస్, ప్లేస్‌మెంట్ అధికారి అరుణకుమారి బాధ్యతలు నిర్వహించగా, ఎస్‌ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ వి.నరసింహారావు, సీఆర్డీఏ డీసీడీవో బి.శ్రీనివాసరావు, సీనియర్ లైవ్‌లీహుడ్ ఆఫీసర్ శంకర్ తదితరులు విధులు నిర్వహించారు.

కాల్వ కనుమరుగు

విజయవాడ రూరల్ మండలంలో బుడమేరుపై ఆక్రమణలు

రియల్టర్ల బారిన పడుతున్న ఇరిగేషన్ భూములు

- దాదాపు నాలుగు కిలోమీటర్ల మేర ఇదే తంతు
- నీటి ప్రవాహం లేక ఎగదన్నుతున్న వరద నీరు
- పంట నష్టపోతున్న అన్నదాతలు

అంబాపురం పంచాయతీ పరిధిలోని కరకట్ట పక్కన ఉన్న కాల్వ పూడ్చివేత





మీనాక్షి నగర్‌లో కాల్వ పూడ్చివేసి చేపట్టిన నిర్మాణం

బుడమేరు ముంపు నివారణ కోసం మూడు దశాబ్దాల క్రితం ఏర్పాటుచేసిన కరకట్ట వెంబడి ఇరిగేషన్ భూములు కనుమరుగవుతున్నాయి. బుడమేరు ప్రవాహం, రైతుల పొలాల నీళ్ల కోసం ఏర్పాటు చేసిన కాల్వ అంచెలంచెలుగా ఆక్రమణదారుల చెరలోకి వెళ్లిపోతోంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా విజయవాడ రూరల్ మండల పరిధిలోని పలు గ్రామాల రైతులు వర్షాల సమయంలో తీవ్రంగా నష్టపోతున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ రూరల్/పాయకాపురం) : అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురం ప్రాంతాలు గతంలో తరచూ బుడమేరు వరద ముంపునకు గురయ్యేవి. దీంతో మూడు దశాబ్దాల కిత్రం అజిత్‌సింగ్‌నగర్ రైల్వేట్రాక్ వద్ద నుంచి పైపుల రోడ్డు, సుందరయ్యనగర్, రాజీవ్‌నగర్, కండ్రిక కాలనీ వరకు సుమారు ఏడు కిలోమీటర్ల మేర కరకట్టను అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కరకట్ట కోసం తవ్విన మట్టి కారణంగా కాల్వ ఏర్పడింది. బుడమేరుకు వరద వస్తే.. పక్కనే ఉన్న పాయకాపురం, సింగ్‌నగర్ ప్రాంతాలకు తగలకుండా ఈ కాల్వ నుంచే వరద వెళ్లిపోయేలా అప్పట్లో విస్తరించారు. దీంతో బుడమేరు వరద అప్పట్లో అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురం ప్రాంతాలపై ప్రభావం చూపేది కాదు.

ఇష్టానుసారంగా కాల్వల పూడ్చివేత

అజిత్‌సింగ్‌నగర్ రైల్వేట్రాక్ నుంచి పైపులరోడ్డు వరకు మినహాయించి, అంతకు దిగువన ఉన్న పాయకాపురం ప్రాంతంలో కరకట్టను ఆనుకుని ఉన్న కాల్వ ఆక్రమణల పాలవుతోంది. ప్రధానంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్ల కోసం చాలాచోట్ల దీనిని పూడ్చేశారు. దీంతో కాల్వ పూడిపోయి వరద నీరు ముందుకు కదిలే పరిస్థితి లేకుండాపోయింది. రియల్టర్లకు తోడు సమీప స్థల యజమానులు, వ్యాపారులు తమ స్థలాలను ఆనుకుని ఉన్న కాల్వను పూడ్చి భవన నిర్మాణాలు చేస్తున్నారు. ప్రధానంగా ఉడాకాలనీ, మీనాక్షినగర్, ఎల్‌బీఎస్‌నగర్ సమీపంలో ఆక్రమణలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

నష్టపోతున్న రైతులు

ఇటు పాయకాపురం, అటు విజయవాడ రూరల్ మండలం మధ్యలో ఉన్న కాల్వను పూడ్చి వేయడం వల్ల పలు గ్రామాల్లోని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వర్షాల సమయంలో ఎగువ నుంచి వచ్చిన వరద నీరు దిగువకు వెళ్లే దారి లేక ఎక్కడికక్కడ స్తంభించిపోతోంది. ఈ నీరు వెనక్కి ఎగదన్నడంతో రూరల్ మండలంలోని గ్రామాల్లో రైతుల పంట పొలాలు మునిగిపోతున్నాయి. ముఖ్యంగా అంబాపురం, పాతపాడు, పి.నైనవరం గ్రామాల రైతులపై ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. నాలుగు కిలోమీటర్ల మేర కాల్వను వెంచర్ల కోసం పూడ్చి వేస్తున్నా, అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాల్వను పరిరక్షించకపోతే భవిష్యత్తులో మరిన్ని ఇబ్బందులు తలెత్తే పరిస్థితి ఏర్పడింది.

మచిలీపట్నంలోని బీసీ సంక్షేమ శాఖ కార్యాలయం



సిబ్బంది లేక ఇబ్బంది

ఉమ్మడి కృష్ణా బీసీ సంక్షేమ శాఖాధికారి నిర్వాకం

- హాస్టల్ వర్కర్లు అధికారుల ఇళ్లలో పనులకు కేటాయింపు
- సిబ్బంది లేక ఇంకా తెరుచుకోలేని హాస్టళ్లు ఎన్నో..
- కొన్ని మూతపడే పరిస్థితికి వచ్చినా మారని తీరు
- ఇళ్లకు వెళ్లిపోతున్న చాలామంది విద్యార్థులు

ఉమ్మడి కృష్ణాజిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి రూటే సెపరేటుగా ఉంది. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి వార్తల్లో నిలిచిన ఆయన తాజాగా హాస్టల్ వర్కర్లను అధికారుల ఇళ్లలో ఊడిగం చేయిస్తూ వివాదాస్పదమయ్యారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉమ్మడి కృష్ణాజిల్లా బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి మరోసారి వివాదంలో చిక్కుకున్నారు. ఇటీవల జరిగిన ఉద్యోగుల సాధారణ బదిలీల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి అనేక ఆరోపణలు ఎదుర్కొన్నారు. అడ్డగోలుగా చేపట్టిన బదిలీలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందినా ఆయన వెనక్కి తగ్గలేదు. తాజాగా హాస్టళ్లలో పనిచేయాల్సిన అవుట్‌సోర్సింగ్ వర్కర్ల విషయంలో ఈ అధికారి వ్యవహరిస్తున్న తీరుపై మిగతా 6లో..

29న దుర్గమ్మకు బంగారు బోనం 6

జలాసనం

శ్రీరామపాదక్షేత్రంలో ఘనంగా జలయోగాంధ్ర



దివ్యాంగుడైన తలశిల రాము పద్మాసనం

శవాసనాలు వేస్తున్న ఔత్సాహికులు

నాగాయలంక, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సంధ్య సమయంలో చుట్టూ వివిధ వర్ణాల తెరచాప పడవల నడుమ కృష్ణానదిలో వందలాది మంది ప్రదర్శించిన వినూత్న జల యోగాసనాలతో నాగాయలంకలోని శ్రీరామపాదక్షేత్రం పులకించింది. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్ర వేడుకల్లో భాగంగా బుధవారం ఈ జలయోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. నాగాయలంక, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 150 మంది చిన్నారులు, పెద్దలు నీటిలో శవ, పద్మ, వృక్ష, వాయు దిగ్బంధనం వంటి యోగాసనాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ముఖ్య అతిథులుగా అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు విచ్చేసి జల యోగాసనాలను వీక్షించారు. ఈ కార్యక్రమాన్ని తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో నమోదు చేసి కలెక్టర్ బాలాజీకి ఫౌండర్, చైర్మన్ చింతపట్ల వెంకటాచారి ధ్రువీకరణ పత్రం అందజేశారు. యోగాసనాల్లో పాల్గొన్న దివ్యాంగుడు తలశిల రాము, చిన్నారి పద్యాల నిత్యశ్రీ ప్రియలకు జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందజేసి అభినందించారు.

నదిలో అడ్డుకట్ట!

కృష్ణానదిలోని చిన్న ఏరుకు అడ్డుకట్ట వేస్తున్నారు. నగరంలోని భవన నిర్మాణ వ్యర్థాలను తీసుకొచ్చి డంప్ చేస్తున్నారు. దీంతో కృష్ణా రీటైనింగ్ వాల్‌కు సమాంతరంగా నది లోపల చిన్నపాటి కొండ ఏర్పడింది. వరదలు వస్తే నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి పద్మావతి ఘాట్ నుంచి రామలింగేశ్వరనగర్ వరకు రీటైనింగ్ వాల్‌కు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని స్థానికులు భయపడుతున్నారు.

రామలింగేశ్వరనగర్ దగ్గర నిర్వాకం

నగరంలోని భవన నిర్మాణ వ్యర్థాలతో చిన్న ఏరు పూడ్చివేత

- ర్యాంపులు ఏర్పాటు చేసుకున్న ఇసుక అక్రమార్కులు
- అసాంఘిక శక్తులకు అడ్డాగా మారిన వైనం
- వరదలు వస్తే నీటి ప్రవాహానికి ఆటంకమే!



కృష్ణానదిలో కొండలా పేరుకుపోయిన భవన నిర్మాణ వ్యర్థాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నగరంలో ఉత్పత్తి అయ్యే భవన నిర్మాణ వ్యర్థాలను క్రషింగ్ చేసి గుంతలను పూడ్చటం, పల్లపు ప్రాంతాలు మెరక చేయడం వంటి వాటికి వినియోగించకుండా కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు కృష్ణానదిలో రామలింగేశ్వరనగర్ దగ్గర డంపింగ్ చేస్తున్నారు. ఇవి కృష్ణానదిలో ఓ చిన్నపాటి కొండను తలపిస్తున్నాయి. కార్పొరేషన్ ప్రజారోగ్య శాఖ అధికారులు నగరంలోని డ్రెయిన్లలో నుంచి తొలగించిన సిల్ట్‌ను తీసుకువచ్చి ఇక్కడ పోస్తుండటంతో రాళ్లలోకి సిల్టు జారిపోయి ఓ కృత్రిమ కొండలా తయారైంది. కృష్ణా రీటైనింగ్ వాల్ అంత ఎత్తున ఏర్పడింది. కృష్ణా రీటైనింగ్ వెంబడి ప్రకాశం బ్యారేజీ నుంచి రెండు ప్రధాన ఏరులు ముందుకు సాగుతాయి. ఒకటి చిన్న ఏరు కాగా, రెండోది పెద్ద ఏరు. వరద రాకున్నా ఈ రెండు ఏరుల్లో ఎప్పుడూ నీరు ఉంటుంది. బ్యారేజీ గేట్ల నుంచి లీకేజీ అయ్యే నీరు ఈ రెండు ఏర్ల ద్వారా దిగువకు వెళ్తుంది. ఈ రెండు ఏరుల మధ్య పలు లంక భూములు ఉన్నాయి. వీటిలో చాలావరకు లంకలు పిచ్చిమొక్కలతో ఉండగా, కొన్ని రైతులు వ్యవసాయం చేసేవి కూడా ఉన్నాయి. కృష్ణానదికి వరద వచ్చిన సందర్భంలో చాలా వేగంగా వరద దిగువకు ఈ రెండు ఏరుల్లో ప్రవహిస్తుంది. చిన్న ఏరు అనేది కృష్ణానది రీటైనింగ్ వాల్ వెంబడే ఉంటుంది. ఈ చిన్న ఏరును పూడ్చేలా భవన నిర్మాణ వ్యర్థాలు పోస్తున్నారు. కార్లు కూడా రీటైనింగ్ వాల్ మీదుగా నదిలోకి వెళ్లిపోయేలా అడ్డుగోడను నిర్మించుకుంటూ పోతున్నారు. వరద మిగతా 6లో..



సంగమ ప్రాంతాలపై నిర్లక్ష్యపు నీడ

- అభివృద్ధికి దూరంగా పవిత్ర సంగమం, సాగర సంగమం
- మౌలిక సదుపాయాలు లేక పర్యాటకుల అవస్థలు
- వసతులు కల్పించకుండా హంసలదీవిలో టోల్ వసూళ్లా..!
- రివర్ ఫ్రంట్, బీచ్ టూరిజం ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలి

8

తెరవెనుక ఎవరు?

- కొడాలి నాని అరెస్టు ఫేక్ ప్రచారం వెనుక కుట్రకోణం
- కేసు విషయం తేల్చాలని కృష్ణాజిల్లా పోలీసులకు ఆదేశం
- నేడు అనుమానితులను అదుపులోకి తీసుకునే అవకాశం

సర్పంచ్‌ల పిల్లలకూ తల్లికి వందనం ఇవ్వాలి

» ప్రభుత్వానికి సర్పంచ్‌ల సంఘం విజ్ఞప్తి

అమరావతి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచ్‌లను తల్లికి వందనం పథకానికి అనర్హులుగా చేశారని సర్పంచ్‌ల సంక్షేమ సంఘం అధ్యక్షులు చిలకలకూడి పాపారావు ఆవేదన వ్యక్తం చేశారు. సీఎఫ్‌ఎంఎస్‌లో రూ.3 వేలు గౌరవ వేతనం అందుకుంటున్న సర్పంచ్‌లకు ఈ పథకం దక్కకపోవడం బాధాకరమని తెలిపారు. పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజను సర్పంచ్‌ల సంఘం నేతలు బుధవారం కలిసి పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు వెంటనే విడుదల చేయాలని, ఉపాధి మెటీరియల్ కాంపోనెంట్ నిధులివ్వాలని విజ్ఞప్తి చేశారు. వైసీపీ హయాంలో సర్పంచ్‌ల పిల్లలకు అమ్మఒడి ఇచ్చారని, ఈ ప్రభుత్వం కూడా తల్లికి వందనం ప్రథకానికి సర్పంచ్‌లను అర్హులుగా ప్రకటించాలని కోరారు. గత మూడేళ్లుగా 5వ ఆర్థిక సంఘం ద్వారా గ్రామ పంచాయతీకి రావాల్సిన నిధులను, గ్రామపంచాయతీలకు రావాల్సిన వాటాను బదిలీ చేయాలన్నారు. కమిషనర్ కృష్ణతేజ స్పందిస్తూ ప్రభుత్వంతో సంప్రదించి 15వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీ ఖాతాల్లో జమ అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు.

ప్రధానికి లంకా దినకర్ ధన్యవాదాలు

» కామన్ సెంట్రల్ సెక్రటేరియట్‌కు నిధులు మంజూరుపై హర్షం

అమరావతి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో కామన్ సెంట్రల్ సెక్రటేరియట్ నిర్మాణానికి రూ.2787 కోట్లను కేంద్రం మంజూరు చేయడంపై 20 సూత్రాల కార్యక్రమాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ హర్షం వ్యక్తం చేశారు. నిధులు మంజూరు చేసినందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలిపారు. బుధవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నిధులు మంజూరు ద్వారా రాష్ట్రానికి సంబంధించిన కేంద్ర ప్రభుత్వ కార్యకలాపాలు అమరావతి నుంచి జరగాలనే స్ఫూర్తి కనపడుతుందన్నారు. త్వరలో అమరావతిలో 50కి పైగా కేంద్ర ప్రభుత్వ సంస్థల నిర్మాణం పూర్తై ప్రజలకు సేవలు అందించేందుకు వేగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు.

ఏపీఈఆర్‌సీ సభ్యుని నియామకానికి దరఖాస్తులకు ఆహ్వానం

అమరావతి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) సభ్యుడి నియామకం కోసం ఇంధనశాఖ అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరింది. ఈ మేరకు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అర్హులైన అభ్యర్థులు వారి నామినేషన్లను వచ్చే నెల 9వ తేదీలోగా స్పెషల్ చీఫ్ సెక్రటరీ (ఎనర్జీ), గ్రౌండ్ ఫ్లోర్, బ్లాక్-2, ఏపీ సెక్రటేరియేట్, వెలగపూడి- 522 238 చిరునామాకు పంపాలని విజయానంద్ కోరారు. Tappalene01@ap.-gov.in, www.ap.gov.in& www.aperc.gov.inకు ఇ-మెయిల్ చేయాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారం ఉద్యోగుల బాధ్యత: మంత్రి కొల్లు

అమరావతి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారానికి ఉద్యోగులు బాధ్యతగా పని చేయాలని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు. సమాజాభివృద్ధి కోసం ఉద్యోగ సంఘాలు కూడా తమ వంతు కృషి చేయాలని కోరారు. ఎక్సైజ్ గెజిటెడ్ అధికారుల సంఘం నూతన కార్యవర్గ సభ్యులు.. మంత్రిని సచివాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఎక్సైజ్‌శాఖ అభివృద్ధితోపాటు పారదర్శకమైన పనితీరుతో ఉద్యోగ సంఘానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని ఈ సందర్భంగా రవీంద్ర సూచించారు.

బలవంతపు రుణ వసూళ్లు చేస్తే జైలు శిక్ష పడాలి

» ముఖ్యమంత్రికి సీపీఐ రామకృష్ణ లేఖ

అమరావతి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): బలవంతంగా అప్పులు వసూలు చేసేవారికి జైలుశిక్ష పడేలా తమిళనాడు ప్రభుత్వం తరహాలో రాష్ట్ర శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. ఈ దిశగా తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు బుధవారం ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలో ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలు, ఆన్‌లైన్ లోన్ యాప్‌లు, వడ్డీ వ్యాపారుల ఆగడాలు మితిమీరిపోతున్నాయని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో తమ వద్ద అప్పులు చేసినవారిని రకరకాలుగా వేధిస్తూ.. బెదిరింపులకు గురిచేస్తూ బలవంతంగా అప్పులు వసూలు చేయడం, ఆస్తులను స్వాధీనం చేసుకోవడం వంటి దురాగతాలకు పాల్పడుతున్నారని వివరించారు. విజయవాడలో కాల్‌మనీ వ్యాపారుల దందా ఘటనలు గతంలోనే వెలుగులోకి రాగా.. ఇటీవల చిత్తూరు జిల్లా కుప్పం మండలం, నారాయణపురం గ్రామానికి చెందిన శిరీషను చెట్టుకు కట్టేసి, తన భర్త చేసిన అప్పులు తీర్చాలంటూ దాడి చేయడం దుర్మార్గమైన చర్య అని రామకృష్ణ ఖండించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బలవంతపు రుణ వసూళ్లపై కఠిన చర్యలు తీసుకునేలా శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టేందు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమలకు నిధులు

అమరావతి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రధాన మంత్రి మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పీఎంఎఫ్‌ఎంఈ)లకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి 50 శాతం కేంద్ర వాటా కింద రావాల్సిన నిధుల్లో మొదటి విడతగా వివిధ కాంపోనెంట్ల కింద సుమారు రూ. 57 కోట్లు అందిస్తోంది. ఈ నిధుల వినియోగానికి పరిపాలన అనుమతినిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

రుణభారం యమపాశమైంది!

» తిరుపతిలో రైతు దంపతుల ఆత్మహత్యాయత్నం

» వారం తర్వాత భర్త మృతి, భార్య పరిస్థితి విషమం



నాగేంద్ర రెడ్డి

తిరుపతి(నేరవిభాగం), జూన్ 18(ఆంధ్రజ్యోతి): వ్యవసాయం కోసం చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యాయత్నం చేసిన రైతు దంపతుల్లో భర్త మృతి చెందగా, భార్య ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతోంది. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. కడప జిల్లా సిద్దవటం మండలం డేగనావాండ్లపల్లెకు చెందిన నిమ్మకాయల నాగేంద్రరెడ్డి(35)కి కొంత పొలం ఉంది. సాగు కోసం లక్షలాది రూపాయలు అప్పులు చేశారు. వీటిని ఎలా తీర్చాలో తెలియక సతమతమైన భార్యాభర్తలిద్దరూ కలిసి చనిపోవాలని భావించారు. ఇద్దరు కుమార్తెలను ఇంటి వద్ద వదిలి.. తిరుమలకు వెళ్తొస్తామని చెప్పారు. ఈ నెల 9న తిరుపతికి వచ్చిన నాగేంద్ర రెడ్డి, పుష్పవేణి పెద్దకాపు లేఅవుట్‌లోని ఓ లాడ్జిలో గది తీసుకున్నారు. మరుసటి రోజు గదిలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. ఈస్ట్ పోలీసులు వారిని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్సపొందుతూ నాగేంద్ర రెడ్డి బుధవారం మృతి చెందగా, పుష్పవేణి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతోంది.

ముగ్గురిపై ఎలుగుబంట్ల దాడి.. ఒకరికి తీవ్రగాయాలు

వెంకటగిరి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా వెంకటగిరి మండలం పాలెంకోట సమీపంలోని వెలుగొండ అటవీ ప్రాంతంలో బుధవారం ముగ్గురిపై రెండు ఎలుగుబంట్లు దాడి చేశాయి. ఈ ఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. పాలెంకోటకు చెందిన కటారి అంకయ్య, కావడి మునెయ్య, వెంకటగిరి చెందిన మరొకరు వెదురు కర్రల కోసం వెలుగొండ అడవిలోకి వెళ్లారు. రెండు ఎలుగుబంట్లు వీరిపై దాడి చేశారు. ఘటనలో కటారి అంకయ్యకు తీవ్ర గాయాలు కాగా, మిగిలిన ఇద్దరూ తప్పించుకున్నారు. వీరితోపాటు వెళ్లిన కుక్క ఎలుగుబంట్లపై తిరగబడటంతో అవి వెళ్లిపోయాయి. మునెయ్యను అటవీశాఖ అధికారులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది.

దుర్గమ్మను దర్శించుకున్న ప్రముఖులు

ఇంద్రకీలాద్రి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కనకదుర్గమ్మను బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఈవో శీనా నాయక్, అర్చకులు వారికి అమ్మవారి దర్శనం చేయించారు. దర్శనానికి వచ్చిన కేంద్ర సాధికార కమిటీ సభ్యుడు చంద్రశేఖర్ గోయల్, జె.ఆర్.భట్, సునీల్ లిమాయే, శాసనసభ ఉపసభాపతి రఘు రామ కృష్ణంరాజు, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌కు అమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.



కేంద్ర సాధికార కమిటీ సభ్యుడు చంద్రశేఖర్ గోయల్‌కు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న ఈవో శీనానాయక్, ఉపసభాపతి రఘురామకృష్ణంరాజు, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

మిర్చి సాగుపై అనాసక్తి!

ఈ ఏడాది ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు, కౌలురైతుల మొగ్గు



ఎన్టీఆర్ జిల్లాలో మిర్చి రైతుల పరిస్థితి కడు దయనీయంగా ఉంది. గత సీజన్‌లో దిగుబడి తగ్గడం, మార్కెట్లో గిట్టుబాటు ధర రాకపోవటం వల్ల మిర్చి సాగు చేసిన రైతులందరూ అప్పుల ఊబిలో కూరుకుపోయారు. ఇంతకు ముందెన్నడూ లేనంతగా తీవ్రంగా నష్టపోయిన రైతులు, కౌలుదారులు మిర్చి సాగుపట్ల ఆసక్తి చూపడం లేదు. ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో జిల్లాలో మిర్చి సాగు విస్తీర్ణం సగానికి తగ్గనున్నది.

- గత సీజన్‌లో తోటలపై నల్లి దాడి
- తోటలు కకావికలమై తగ్గిన దిగుబడులు..
- గిట్టుబాటుధర రాక భారీ నష్టాలు
- అప్పుల ఊబిలో సాగుదారులు..
- సగానికి పడిపోయిన కౌలు ధరలు

(ఆంధ్రజ్యోతి, కంచికచర్ల): గత సీజన్‌లో జిల్లాలో 30 వేల ఎకరాల్లో రైతులు మిర్చి తోటలు సాగు చేశారు. పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లో ఎకరం రూ.30 వేల నుంచి రూ.40 వేలకు కౌలుకు తీసుకుని కౌలుదారులు కూడా ఎంతో ఆశతో మిర్చి వేశారు. కౌలు, వ్యవసాయం, ఎరువులు, పురుగుమందులు, నీటి తడులు ఇతరత్రా ఖర్చులు కలిపి ఎకరానికి రూ.1.80 లక్షల నుంచి రెండు లక్షల వరకు పెట్టుబడి అయ్యింది. కోత, గ్రేడింగ్, టిక్కీల తొక్కుడు, రవాణా కలిపి క్వింటాకు రూ.5 వేల నుంచి రూ. 6 వేల వరకు ఖర్చు అయ్యింది. ఆగస్టు చివర్లో, సెప్టెంబరు మొదట్లో కురిసిన భారీ వర్షాలకు, వరదలకు మిర్చి తోటలు దెబ్బతిన్నాయి. ఖర్చుకు వెనుకాడకుండా రైతులు మళ్లీ తోటలు సాగుచేశారు. ఎర్ర నల్లి, నల్ల నల్లి ఉధృతంగా దాడి చేయడంతో రోజుల వ్యవధిలోనే తోటలు కకావికలమయ్యాయి. పూత రాలిపోయింది. ఆకులు, పిందెలు నల్లగా మాడిపోయాయి. చిగుళ్లు సైతం వాడిపోయాయి. మిరప మొక్కలు గిడసబారి, జీవచ్ఛవాల్లా మారాయి. వేరుకుళ్లు సోకినట్టుగా తోటలు ఎర్రబడి నిలువునా ఎండిపోయాయి. ఖరీదైన మందులు పిచికారీ చేసినప్పటికీ నల్లి అదుపులోకి రాలేదు. తోటల్లో దిగుబడులు గణనీయంగా తగ్గాయి. ముదురు తోటల్లో ఎకరానికి 20 క్వింటాళ్ల లోపు, లేత తోటల్లో పది క్వింటాళ్ల లోపు దిగుబడి వచ్చింది.

రైతును చావు దెబ్బ కొట్టిన ధరలు

మార్కెట్ ధర కూడా మిర్చి రైతులను చావు దెబ్బకొట్టింది. తేజ రకానికి క్వింటా రూ.ఎనిమిది వేల నుంచి రూ.13 వేల లోపే ధర వచ్చింది. లావు రకాలకు రూ.8 వేల నుంచి రూ.10 వేల లోపు, మధ్యస్థ రకాలకు రూ.పది వేల నుంచి రూ.11 వేల లోపు ధర వచ్చింది. ఇప్పటికీ మార్కెట్ కు దుటపడలేదు. ధరల్లో మార్పు రాలేదు. అంతకు ముందు సీజన్‌లో తాలు (తెల్ల)కాయలకు వచ్చిన ధర కూడా ఇప్పుడు ఎర్రకాయలకు రావటం లేదు. అప్పట్లో తెల్లకాయలకు వచ్చిన రూ.10 వేల నుంచి రూ.13 వేలే ఇప్పుడు ఎర్రకాయలకు పలికింది.

ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు నష్టం

మిర్చి సాగు చేసిన రైతుల్లో 90 శాతం మంది నష్టాలను మూటగట్టుకున్నారు. ఎకరానికి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు నష్టం వాటిల్లింది. 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చిన రైతులకు కూడా మిగులు లేకపోగా నష్టపోయారంటే మిర్చి సాగు చేసిన రైతులు ఎంతగా కుదేలయ్యారో అర్థం చేసుకోవచ్చు. మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకం వల్ల కూడా రైతులకు ఎలాంటి ప్రయోజనం కలగలేదు. కొద్దోగొప్పో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సాయం అందుతుందని ఆశించిన రైతులు భంగపడ్డారు. ఇప్పటి వరకు ప్రభుత్వాల నుంచి ఒక్క పైసా కూడా రైతులకు సమకూరలేదు.

మొక్కజొన్న, సుబాబుల్, జామాయిల్ సాగువైపు మొగ్గు..

కోలుకోలేనంతగా నష్టపోయిన రైతులు, కౌలుదారులు మిర్చి అంటేనే భయపడుతున్నారు. ఆర్థికంగా బాగా చితికిపోయిన కౌలుదారులు అప్పుల్లో కూరుకుపోయారు. దీంతో పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లో కౌలు ధరలు సగానికి సగం పడిపోయాయి. మిర్చి తోటలకు కౌలుకు తీసుకునేందుకు కౌలుదారులు ఎవరూ ముందుకు రావటం లేదు. గత సీజన్‌లో రూ.40 వేలున్న కౌలు ఈ సీజన్‌లో రూ.20వేలకు, రూ.20వేలున్న కౌలు రూ.10 వేలకు పడిపోయింది. ఎక్కువ మంది రైతులు మొక్కజొన్న సాగుకు మొగ్గు చూపుతున్నారు. ఇంకొందరు సుబాబుల్, జామాయిల్ తోటలు వేస్తున్నారు. ఈ సీజన్‌లో మిర్చి సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గనున్నది.



దుర్గగుడి ఈవో శీనానాయక్‌కు లేఖ అందిస్తున్న భాగ్యనగర్ మహంకాళీ బోనాల జాతర కమిటీ ప్రతినిధులు

29న కనకదుర్గమ్మకు బంగారు బోనాలు

ఇంద్రకీలాద్రి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): సప్తమాతృకలకు సప్త బంగారు బోనం సమర్పణ పేరుతో ఈనెల 29వ తేదీన భాగ్యనగర్ మహంకాళీ బోనాల జాతర ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మకు బోనం, పట్టువస్త్రాలను సమర్పించనుంది. ఈమేరకు బుధవారం దుర్గామల్లేశ్వర దేవస్థానం ఈవో శీనానాయక్‌కు కమిటీ అధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేందర్, ఎంపీ గౌడ్ తదితర ప్రతినిధులు లేఖ ఇచ్చారు. బంగారు బోనాల సమర్పణకు హైదరాబాద్ నుంచి సాంస్కృతిక బృందాలతో సహా 500 మంది భక్తులు ఈనెల 28న విజయవాడకు చేరుకుంటారని ఆయన తెలిపారు. 29వ తేదీన ఉదయం బ్రాహ్మణవీధిలోని జమ్మిదొడ్డి నుంచి బంగారు బోనాల ఊరేగింపు సాగుతుందని వివరించారు. వసతి, కనకదుర్గమ్మ దర్శనం, బోనం సమర్పణ, ప్రసాదాల పంపిణీకి ఏర్పాట్లు చేయాలని ఆయన కోరారు. బోనాల కమిటీ కోరిన అన్ని ఏర్పాట్లను లోటుపాట్లు లేకుండా చేయాలని అధికారులకు ఈవో సూచించారు.

పార్ట్‌టైమ్ ఉద్యోగం

పేరుతో మోసం

- యువతికి రూ.27 లక్షలు టోకరా

పెనమలూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): టెలిగ్రామ్ యాప్ ద్వారా పార్ట్‌టైమ్ ఉద్యోగంలో చేరిన యువతిని రూ.27లక్షలకు ముంచిన కేటుగాళ్లపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కానూరు గ్రామానికి చెందిన గోపు దివ్య పార్ట్‌టైమ్ ఉద్యోగాలున్నాయని ఆన్‌లైన్‌లో ఒక ప్రకటన చూసింది. మంగళవారం ప్రకటన ఇచ్చిన వారిని సంప్రదించింది. వారు తాము పార్టుటైమ్ ఉద్యోగాల రిక్రూట్‌మెంటు ఏజెన్సీ నిర్వాహకులుగా పరిచయం చేసుకొన్నారు. షేర్‌చాట్‌లో పోస్టులను లైక్ చేయడం ద్వారా డబ్బులు సంపాదించొచ్చని ప్రతి పోస్టుకు రూ.50 ఇస్తామని నమ్మబలికారు. ఆమెకు అనేక రకాల లింకులను పంపించడం మొదలుపెట్టారు. వారిని నమ్మిన ఆ యువతి వారు చెప్పినప్పుడల్లా డబ్బులు చెల్లించింది. ఎక్కువ మొత్తంలో చెల్లించి అధిక లాభం పొందండని చెప్పడంతో ఆమె పేరుతో ఉన్న ఖాతాలు, యూపీఐ ద్వారా రూ.27లక్షలను వారికి పంపింది. ఆమె ఖాతాలు ఖాళీ అయ్యాక కేటుగాళ్లు ఫోన్లు స్విచ్ ఆఫ్ చేశారు. తాను మోసపోయానని దివ్య 1930కు సైబర్ కంప్లయింట్ ఇచ్చి, పెనమలూరు పోలీసులకు సమాచారమిచ్చింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పీఏసీఎస్‌లలో పారదర్శక సేవలు

- ఉమ్మడి జిల్లాలోని 213 పీఏసీఎస్‌లలో

కంప్యూటరీకరణ పూర్తి: కేడీసీసీబీ ఛైర్మన్ నెట్టెం రఘురాం

మచిలీపట్నం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా కేంద్ర సహకారబ్యాంకు(కేడీసీసీబీ) పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో(పీఏసీఎస్‌లు) రైతులకు సత్వర, పారదర్శకమైన సేవలు అందించాలని సిబ్బందిని కేడీసీసీబీ ఛైర్మన్ నెట్టెం రఘురాం ఆదేశించారు. పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణలో భాగంగా సిబ్బందికి శిక్షణ తరగతులను కేడీసీసీబీ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఆయన ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలోని 213 పీఏసీఎస్‌లలో కంప్యూటరీకరణ ప్రక్రియ పూర్తయిందన్నారు. ఇకనుంచి డిజిటల్ పద్ధతిలోనే పాలనా వ్యవహారాలు పీఏసీఎస్‌లలో నడపాల్సి ఉందన్నారు. ప్రస్తుతం మీసేవా కేంద్రాల ద్వారా భూములకు సంబంధించిన వన్‌బీ, అండగల్‌పత్రాలు ఇస్తున్నారని, ఇకనుంచి పీఏసీఎస్‌ల ద్వారా అందించేలా చూస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుచూపుతో వ్యవహరిస్తున్నారని, సహకార వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తున్నారని అన్నారు. పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణలో కేంద్ర ప్రభుత్వం 60శాతం, రాష్ట్ర ప్రభుత్వం 30శాతం, నాబార్డు 10శాతం ఖర్చును భరిస్తోందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో కేడీసీసీబీ సీఈవో శ్యామ్‌మనోహర్, జీఎం చంద్రశేఖర్, ఆప్కాబ్ ఏజీ ఎం అశోక్, కేడీసీసీబీ అధికారులు జి.పవన్ కుమార్, టి.జగదీష్‌బాబు, విజయసారథి పాల్గొన్నారు.



పీఏసీఎస్‌ల సిబ్బంది శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కేడీసీసీబీ ఛైర్మన్ నెట్టెం రఘురాం



కంచికచర్లలో డ్రోన్ పనితీరును పరిశీలిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య

వ్యవసాయాన్ని లాభసాటిగా మారుద్దాం

- సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోండి
- సబ్సిడీపై వ్యవసాయ పరికరాల పంపిణీ

కార్యక్రమంలో రైతులకు కలెక్టర్ లక్ష్మీశ పిలుపు

కంచికచర్ల రూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): 'ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రైతుల అభ్యున్నతికి తోడ్పాటును అందిస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ సాగు ఖర్చులు తగ్గించుకోండి. ప్రతికూల పరిస్థితులను అనుకూలంగా మార్చుకుని వ్యవసాయాన్ని లాభసాటిగా మారుద్దాం.' అని రైతులకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. కంచికచర్ల రైతుసేవా కేంద్రం వద్ద బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలను ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్యతో కలిసి ఆయన అందించారు. జిల్లాలో 867 మంది చిన్న సన్నకారు రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలకు రూ.1.67 కోట్ల చెక్కులను అందించారు. వైవిధ్య పంటలు సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు. జిల్లా వ్యవసాయాధికారిణి ఎం.విజయకుమారి, కోగంటి బాబు, తహసీల్దార్ మానస, ఎంపీడీవో లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

రైతు ప్రభుత్వమిది: తంగిరాల సౌమ్య

'వ్యవసాయ యాంత్రీకరణకు సబ్సిడీపై పరికరాలు అందించడం ద్వారా కూటమి ప్రభుత్వం రైతు ప్రభుత్వమని మరో మారు రుజువైంది. వైసీపీ ఐదేళ్ల పాలనలో సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందించలేదన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఈనెల చివరికి అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతుంది. అని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య అన్నారు.

ఉపరాష్ట్రపతి, కేంద్ర మంత్రులను కలిసిన

మంత్రి లోకేశ్, ఎంపీ కేశినేని చిన్ని

వన్‌టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్‌తో కలిసి ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) బుధవారం ఢిల్లీలో ఉపరాష్ట్రపతి జగదీప్ ధనకర్, పలువురు కేంద్ర మంత్రులను కలిశారు. లోకేశ్‌తో కలిసి మంత్రులతో చర్చల్లో పాల్గొన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి చిరాగ్ పాశ్వన్, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రదాన్, పలువురు మంత్రులను కలిశారు.

జగన్‌కు పొలిటీషియన్ లక్షణాల్లేవు

- కులాల కుంపట్లు రాజేయడమే ఆయన నైజం: మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ

వన్‌టౌన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్‌కు పొలిటీషియన్ లక్షణాలు లేవని, కులాల కుంపట్లు రాజేయటమే ఆయన నైజమని మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ విమర్శించారు. బుధవారం మొగల్రాజపురం సిద్ధార్థనగర్‌లోని ఓ హోటల్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పోలీస్ వ్యవస్థను అందరూ గౌరవిస్తారని, మాజీ ముఖ్యమంత్రిగా జగన్‌కు ఒక రూల్, సాధారణ వ్యక్తులకు మరో రూల్ ఉండవని ఆమె స్పష్టంచేశారు. పల్నాడు పర్యటనకు పోలీసుల అనుమతి ఇవ్వకపోతే కోర్టుకెళ్లి అనుమతి తీసుకోవాలి, కానీ బలప్రదర్శన చేసేలా జగన్ పర్యటన సాగిందన్నారు.పాదయాత్రలో లోకేశ్, పర్యటనల్లో పవన్ కల్యాణ్ పోలీసులు అనుమతి ఇవ్వకపోతే రూల్ ప్రకారమే నడుచుకున్నారని ఆమె తెలిపారు. పల్నాడు పర్యటనలో పోలీసులను అసభ్యకరంగా దూషించటం, రాళ్లు రువ్వటం ఏమిటి అని ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు లేకుండా చేయాలని జగన్ చూస్తున్నారన్నారు. జగన్‌ను చూసి నేరస్థులు పేట్రేగిపోతారన్నారు. పల్నాడు పర్యటనలో కాన్వాయ్ ఢీకొని ఒకరు, తొక్కిసలాటలో మరొకరు గుండెపోటుతో చనిపోయారని వారికి జగన్ సంతాపం తెలిపారా..అని వాసిరెడ్డి పద్మ ప్రశ్నించారు. ఎన్నికల్లో వైసీపీ గెలుస్తుందని బెట్టింగ్‌లు కట్టి చనిపోయిన వారందరి కుటుంబాలను జగన్ పరామర్శించారా అని ఆమె నిలదీశారు. ఏడాది క్రితం చనిపోయిన వ్యక్తి కుటుంబాన్ని పరామర్శించడానికి జగన్‌కు ఇప్పటిదాకా సమయం దొరకలేదా? అని ఆమె ప్రశ్నించారు.

కమ్మ కులంలో పుట్టడమే తప్పా..

జగన్..కమ్మ సామాజికవర్గం వారిని వాడుకుని అందరూ ద్వేషించేలా చేస్తాడని వాసిరెడ్డి పద్మ అన్నారు. తనకు జగన్ చేసిన ద్రోహం ఎప్పటికీ మరిచిపోనన్నారు. తాను కమ్మకులంలో పుట్టటమే తప్పా అని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను ఎన్నో అవమానాలకు గురిచేశాడని తెలిపారు. రాష్ట్రంలో గొడవలు చేయాలని జగన్ చూస్తున్నాడని రాష్ట్ర ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఆమె కోరారు. పార్టీ నడపటంలోను, ప్రభుత్వం నడపటంలోనూ జగన్‌కు బాధ్యత లేదని, తాను రాజీనామా చేసిన సమయంలోనే ఈ విషయాలు చెప్పానని వాసిరెడ్డి పద్మ తెలిపారు.

ఆసుపత్రిలో అష్టకష్టాలు

(5వ పేజీ తరువాయి)

రోగులు నడవలేక ఇబ్బందిపడుతుంటే, మరోవైపు ఆసుపత్రి లోపల, బయట స్ట్రెచర్లు కుప్పలుగా పడేసి ఉండటంపై రోగుల సహాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పేదలకు సరైన వైద్యసదుపాయాలు కల్పించాలనే భావనతో ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుంటే, అధికారులు మాత్రం అందుకు విరుద్ధంగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

మోసుకెళ్లాల్సిందే..

అనేక ప్రమాదాల్లో గాయపడి నడవలేని స్థితిలో ఉన్నవారు, వృద్ధులు, అస్వస్థతకు గురైన ఎమర్జెన్సీ రోగులను కచ్చితంగా స్ట్రెచర్, వీల్‌చైర్‌పైనే వార్డుల్లోకి వెళ్లాలి. కానీ, అందుబాటులో ఉన్నవి కూడా సరిగ్గా పనిచేయట్లేదు. దీంతో సహాయకులుగా ఉన్నవారు రోగులను ఎత్తుకెళ్తుండగా, సహాయకులు లేని రోగులు పాక్కుంటూ వెళ్తున్నారు. ఎవరైనా ఆసుపత్రి సిబ్బందిని ప్రశ్నించగా, వీల్‌చైర్లు ఖాళీ లేవని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. దాతలు సేవా స్ఫూర్తితో అందజేసిన స్ట్రెచర్లు, వీల్‌చైర్లను కూడా చిన్నచిన్న సమస్యలకే మూలనపడేస్తున్నారు. మరమ్మతులు చేయించాలనే కనీస శ్రద్ధ లేకపోవడంతో ఆసుపత్రిలో రోజురోజుకూ మూలనపడేసిన స్ట్రెచర్లు ఎక్కువవుతున్నాయి.

నదిలో అడ్డుకట్ట!

(5వ పేజీ తరువాయి)

వస్తే చిన్నఏరు ప్రవాహానికి విఘాతం కలుగుతుంది. అది రీ టెయినింగ్ వాల్‌ను బలంగా తాకే ప్రమాదం ఉంది. దీని వల్ల రీ టెయినింగ్ వాల్ భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది.

అక్రమార్కులకు అనువుగా ర్యాంపులు

కృష్ణానదిలోని లంక భూములు నిర్మానుష్యం ప్రాంతాలు కావటంతో అక్రమార్కులు, అసాంఘిక శక్తులు వీటిని తమ స్థావరాలుగా ఏర్పాటు చేసుకుంటున్నాయి. నదిలో నుంచి అక్రమంగా ఇసుకను తవ్వుకుపోయేందుకు వీలుగా రీ టెయినింగ్ వాల్‌తో సమాంతరంగా ఏర్పాటైన ఈ కొండను చదును చేసుకుని ఏకంగా తూర్పు, పశ్చిమల వైపు ర్యాంపులు ఏర్పాటు చేసుకున్నారు. ఈ ర్యాంపుల మీదుగా లారీలు, ట్రాక్టర్లు, ఇతర వాహనాలు అనేకం తేలిగ్గా రాకపోకలు సాగించటానికి అవకాశం ఏర్పడింది. ఇసుక అక్రమ వ్యాపారులకు ఈ ర్యాంపులు మరింత అనుకూలంగా మారాయి. గంజాయి, మద్యం తాగేవారు ఈ ర్యాంపుల మీదుగానే నదిలోకి దిగి లంక భూముల్లోకి వెళ్తున్నారు. సాయంత్రం ఐదు గంటల తర్వాత మహిళలను అక్కడకు తీసుకెళ్లి అసాంఘిక కార్యకలాపాలు సాగిస్తున్నారని తెలిసింది. ఇవన్నీ ఒక ఎత్తు అయితే పేకాట రాయుళ్లు పెద్ద సంఖ్యలో లంకల్లో వెళ్లి జూదాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఈ ప్రాంతం ఇసుక అక్రమ తవ్వకాలు, సంఘవిద్రోహ శక్తులకు నిలయంగా మారిపోవటంతో రామలింగేశ్వరనగర్ ప్రాంత వాసులు తీవ్ర భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

సిబ్బంది లేక ఇబ్బంది

(5వ పేజీ తరువాయి)

విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనల ప్రకారం ప్రతి హాస్టల్‌కు ముగ్గురు వర్కర్లు ఉండాలి. కానీ, ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లోని ఏ ఒక్క హాస్టల్‌లో కూడా ఆ పరిస్థితి లేదు. ఉమ్మడి కృష్ణాలో అంతర్భాగంగా ఉన్న ఒకప్పటి నూజివీడు సహా అన్ని డివిజన్లలోనూ ఇలాగే ఉంది. ప్రొటోకాల్ పేరుతో హాస్టల్ వర్కర్లను ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారుల ఇళ్లలో పనిచేయించడమే ఇందుకు కారణం. చాలామంది హాస్టల్ వర్కర్లు అధికారుల ఇళ్లలో వంట మనుషులుగా, కారు డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. ఈ వ్యవహారంలో జిల్లా అధికారి వ్యక్తిగత ప్రయోజనాలు ఉన్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి.

హాస్టళ్లలో ముగ్గురు వర్కర్లు ఉండాల్సిందే..

నిబంధనల ప్రకారం ప్రతి వసతి గృహానికి ముగ్గురు వర్కర్లు ఉండాలి. ఒకరు వంట చేయటానికి, మరొకరు విద్యార్థులను పర్యవేక్షించటానికి, మూడోవారు హాస్టల్‌ను పరిశుభ్రంగా ఉంచడం, వంటకు అవసరమైన కూరగాయలు కట్ చేయటానికి. కానీ, పిల్లలున్న హాస్టళ్లలో ఒకరు లేదా ఇద్దరు వర్కర్లే ఉంటున్నారు. వంట బాగా వచ్చిన వారిని అధికారుల ఇళ్లలో వంట పనులు చేసేందుకు పంపుతున్నారు. పనిచేయలేనివారు, దివ్యాంగులుగా ఉన్నవారు హాస్టళ్లలో ఉంటున్నారు.

విద్యార్థుల పాట్లు

అధికారుల నిర్లక్ష్యం కారణంగా వసతి గృహాల్లోని విద్యార్థులు నానా పాట్లు పడుతున్నారు. నిర్వహణలో కీలకమైన సిబ్బంది లేకపోవడంతో అసలు హాస్టళ్లే ప్రారంభించవద్దని ఉన్నతాధికారులే మౌఖిక ఆదేశాలు ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. విద్యాసంస్థలు తెరుచుకుని వారం అవుతున్నా.. ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో ప్రభుత్వ వసతి గృహాలు ప్రారంభం కాలేదు. తెరుచుకున్నవి కూడా వర్కర్ల సమస్య కారణంగా క్లాసులకు సన్నద్ధం కాలేదు. దీంతో విద్యార్థులు ఇళ్లకు వెళ్లిపోయే పరిస్థితి ఏర్పడింది. దీనికి తాము బాధ్యులం కాదంటూ అధికారులు, ఉన్నతాధికారులు ఏకంగా హాస్టళ్లను మూసివేసే పరిస్థితికి తీసుకొచ్చారు. దీంతో పిల్లల భవిష్యత్తు ఏమవుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పెనమలూరు, అవనిగడ్డ, బందరు, గుడివాడ, నూజివీడు, విజయవాడ, గన్నవరం, నందిగామ డివిజన్ల పరిధిలోని పలు హాస్టళ్లు సిబ్బంది కొరత కారణంగానే ఇప్పటికీ తెరుచుకోలేదు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	104,112, 123
చికెన్ విత్ స్కిన్	198
చికెన్ స్కిన్‌లెస్	208

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 530

కులగణన, జనగణన షెడ్యూల్ ప్రకటన పై హర్షం

వన్‌టౌన్: దేశవ్యాప్తంగా జనగణన, కులగణన నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదలపై బీసీ సంక్షేమ సంఘం ఆనందం వ్యక్తం చేసింది. బుధవారం విజయవాడలోని సంఘ కార్యాలయంలో నాయకులతో సమావేశమైన బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకర్‌రావు మాట్లాడుతూ 16ఏళ్ల తరువాత సమగ్ర జనగణన జరగాలని నిర్ణయించటం శుభ దాయకమన్నారు. చట్టసభల్లో రిజర్వేషన్‌లు ఇచ్చి ఓబీసీలకు రాజకీయంగా, సామాజికంగా న్యాయం చేయాలన్నారు. అన్ని రాజకీయ పార్టీలు కూడా ఇందుకు సహకరించాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఉమామహేశ్వరరావు, వెంకటేశ్వరరావు, చందు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చెత్తకు నిప్పు..పొగతో ఉక్కిరిబిక్కిరి

4వ డివిజన్ నిర్మాణ్ భవనం రోడ్లో తగలబెడుతున్న చెత్త ..ఇబ్బందులు పడుతున్న జమాక్ అపార్టుమెంట్‌వాసులు



ఏపీఐఐసీ కాలనీ జమాక్ అపార్టుమెంట్ సమీపంలో, శ్రీసాయి ఇంజనీరింగ్ వర్క్స్ కంపెనీకి వెళ్లే రోడ్లో తగలబడుతున్న చెత్తకుప్ప

భారతీనగర్, ఆంధ్రజ్యోతి: కొందరి నిర్లక్ష్యం పలువురి ప్రాణాలకు ప్రమాదాన్ని తెచ్చి పెడుతున్నాయి. నిర్మాణ్ భవన్ రోడ్లో చెత్తకు నిప్పుపెట్టడం వల్ల పొగతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. తూర్పు నియోజకవర్గ పరిధి నాల్గో డివిజన్ ఏపీఐఐసీ కాలనీ కొంత భాగం మున్సిపల్ పరిధిలో, మరికొంత భాగం ఆటోనగర్ పరిధిలోనికి వస్తుంది. కార్పొరేషన్ పరిధిలోని వచ్చే ప్రాంతాన్ని వీఎంసీ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకుంటూ ఉంటారు. ఈ కాలనీలోని జమాక్ అపార్టుమెంట్ సమీపంలోని నిర్మాణ్ భవనం రోడ్డు వెంబడి పలు ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. ఈ రోడ్డును సరిహద్దుల కారణంగా అధికారులు చిన్న చూపు చూడడంతో అధ్వానంగా మారుతోంది. ప్రస్తుతం ఈ రోడ్లో వీధిలైట్లు వెలగడం లేదు. రోడ్డు మార్జిన్ భారీ వాహనాల పార్కింగ్‌కు నిలయంగా మారుతోంది. దీనిని ఆసరాగా తీసుకుని కొందరు శానిటరీ సిబ్బంది కాలనీలోని పలు అంతర్గత రోడ్లో ఊడ్చిన చెత్త, ఎండుటాకులను నిర్మాణ్ భవనం రోడ్డు మార్జిన్‌లో వేసి తగలబెడుతున్నారు. దీంతో సమీపంలోని జమాక్ అపార్టుమెంట్‌లోకి దట్టమైన పొగ ఒక్కసారిగా రావడంతో అపార్టుమెంట్‌లోని పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళితే కొద్ది రోజులు ఆగుతున్నారు. తరువాత మళ్లీ తగలబెడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● శ్రీసాయి ఇంజనీరింగ్ వర్క్సు కంపెనీ రోడ్డులో పాత వైర్లను కుప్పలుగా వేసి మంట పెడుతున్నారని, ఈ మంటల నుంచి విపరీతమైన దుర్వాసన, దట్టమైన పొగ రావడంతో ఆ సమయంలో చుట్టు పక్క నివాసాలైన సాయి శ్రీకా అపార్టుమెంట్ వాసులు తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పొగతో ఇబ్బంది పడుతున్నాం

నిర్మాణ్ భవనం రోడ్డు ఆటోనగర్ పరిధిలోకి రావడంతో తరుచుగా కొందరు శానిటరీ సిబ్బంది, చెత్తను కుప్పలుగా వేసి తగలబెడుతున్నారు. ఈ మంటల నుంచి విపరీతమైన దుర్వాసనతో పాటు దట్టమైన పొగ రావడంతో ఆ సమయంలో చుట్టు పక్కల నివాసాలైన అపార్టుమెంట్ వాసులు తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తుంది.

సోమేష్, స్థానికుడు

తిరుమలకు 10 టన్నుల కూరగాయల వితరణ



తిరుమలకు బయలుదేరిన కూరగాయల లారీ

పటమట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానంలో జరిగే నిత్యాన్నదానం పథకంలో తాము కూడా భాగస్వాములు కావడం ఆనందంగా ఉందని ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ సుంకర అక్కయ్య నాయుడు తెలిపారు. పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ కళాశాలలో తనతో పాటు విద్యనభ్యసించిన మిత్రుల సహకారంతో అశోక్‌నగర్‌లోని వెల్లంకి రామమోహన్ రావు వీధి నుంచి తిరుమలకు బయలుదేరిన 10 టన్నుల కూరగాయల వాహనానికి జెండా ఊపి సాగనంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో కళాశాల స్థాయి నుంచి తమ మిత్ర బృందం అంతా చాలా చురుగ్గా పాల్గొనే వారమన్నారు. ఈ కార్యక్రమంలో మరన నాగేంద్ర, అక్కయ్య నాయుడు మిత్రబృందం సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఇద్దరు మైనర్లు పారిపోయిన ఘటనపై కేసు

వన్‌టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాల దొంగతనం కేసులో పోలీసులు అదుపులోకి తీసుకున్న ఇద్దరు మైనర్లను విజయవాడ జువైనల్ హోమ్ (పిల్లల పరిశీలనా కేంద్రం)కు తరలిస్తుండగా మంగళవారం బస్టేషన్‌లో తప్పించుకుని పారిపోయినట్లు కృష్ణలంక పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. బాపట్ల టౌన్‌లో పలు ద్విచక్ర వాహనాల కేసులలో అక్కడ పోలీసులు ఇద్దరు మైనర్లను అదుపులోకి తీసుకుని మంగళవారం గుంటూరు కోర్టులో హాజరుపరిచారు. కోర్టు వారిని విజయవాడలోని జువైనల్ హోమ్‌కు తరలించాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో పోలీసులు వారిని విజయవాడ బస్టేషన్‌కు తీసుకురాగా, వారు పోలీసుల కళ్లుగప్పి తప్పించుకుని పారిపోయారు. జువైనల్ హోమ్‌కు తీసుకువచ్చిన పోలీసు సిబ్బంది పైస్థాయి ఆదేశాల మేరకు కృష్ణలంక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

రాణిగారితోట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం గురువారం ఉదయం 8 గంటల నుంచి 10.30 వరకు స్క్యూ బ్రిడ్జి సెక్షన్, కృష్ణలంక విద్యుత్ ఉపకేంద్రం, 11కేవీ గీతానగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి. రవీంద్రబాబు తెలిపారు. తారకరామానగర్, భూపేష్ గుప్తానగర్, రాణిగారితోట, చలసానినగర్, గీతానగర్, బాలాజీనగర్, పోలీస్‌కాలనీ తదితర ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.



బ్రెయిన్ సర్జరీ చేయించుకుని కోలుకుంటున్న పూర్ణచంద్రరావును పరిశీలిస్తున్న డాక్టర్ జాన్ డేవిడ్

హోప్ హాస్పిటల్‌లో విజయవంతంగా బ్రెయిన్ సర్జరీ

ఉయ్యూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల రోడ్డు ప్రమాదంలో తలకు గాయమై మెదడులో రక్తం చేరి లెగ్‌మంట్ గాయాలతో హాస్పిటల్‌కు వచ్చిన ఎస్. పూర్ణచంద్రరావుకు మూడు మేజర్ ఆపరేషన్లు విజయవంతంగా చేసి కోలుకునేలా మెరుగైన వైద్యసేవలందించినట్టు ఉయ్యూరు హోప్ హాస్పిటల్ అధినేత డాక్టర్ జాన్ డేవిడ్ తెలిపారు. హాస్పిటల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ జాన్ డేవిడ్ పూర్ణచంద్రరావుకు చేసిన శస్త్రచికిత్సలు, వైద్యం గురించి వివరించారు. ఉయ్యూరు ప్రాంతంలో జరిగిన మొట్టమొదటి మేజర్ సర్జరీ హోప్ హాస్పిటల్‌లో జరగడం గర్వకారణమన్నారు.



విద్యార్థిని బంధువులకు చెక్కు అందజేస్తున్న సబ్కా సభ్యులు

విద్యార్థిని చికిత్సకు రూ.లక్ష వితరణ

లబ్బీపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థినికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేసింది. విట్ కళాశాలకు చెందిన విద్యార్థిని బ్లడ్ క్యాన్సర్, బోన్ మ్యారోతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న సబ్కా అసోసియేషన్ చికిత్స నిమిత్తం విద్యార్థిని బంధువులకు ఈ చెక్కును అందించింది. బుధవారం అసోసియేషన్ కార్యాలయంలో సంఘం మాజీ అధ్యక్షుడు పీపీ రాజు, అడ్వయిజర్ కృష్ణారావు, సబ్కా కృష్ణా జిల్లా అధ్యక్షుడు మండవ సాయిలు అందజేశారు.



ఫన్‌టైమ్స్ క్లబ్ ప్రాంగణంలో యోగాభ్యాసం చేస్తున్న సాధకులు



డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయంలో..

యోగా ఆధ్యాత్మిక చైతన్యానికి నాంది



ఎన్టీఆర్ యూనివర్సిటీలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థినులు

పటమట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): యోగా ఆరోగ్యం, ఆధ్యాత్మిక చైతన్యానికి మార్గదర్శకంగా నిలుస్తుందని పతంజలి యోగా ఫన్‌టైమ్స్ సీనియర్ యోగా గురువు టి.వి రాఘవయ్య అన్నారు. 1997 నుంచి యోగాను జీవన శైలిలో భాగంగా చేస్తున్నామన్నారు. ఫన్‌టైమ్స్ క్లబ్ ప్రాంగణంలో విజయవాడ వాసులకు యోగాభ్యాసనం నేర్పిస్తూ లాభాపేక్ష లేకుండా అన్ని తరగతులకు యోగా ప్రాధాన్యతను తెలపడమే మా లక్ష్యమన్నారు. ఉదయం 5.30 నుంచి 7 గంటల వరకు ప్రతి రోజు విరామం లేకుండా యోగా క్లాసులు ఉంటున్నాయన్నారు. జూన్ 21న జరిగే యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు కేంద్రంలో యోగాసనాలు వేయిస్తున్నామన్నారు. దేశ సౌభాగ్యానికి తమ వంతు సహకారం తమ సంస్థ అందిస్తుందని సీనియర్ యోగా గురువు డాక్టర్ మొగళ్లపు శరత్‌బాబు, కొసరాజు ఉమా చౌదరి, మస్తాన్‌లు తెలిపారు. **ఉచిత యోగా శిక్షణా తరగతులు:** అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా విజయవాడ అయోధ్య నగర్‌లో లోటస్ ల్యాండ్ మార్క్ ఆవరణలో ఆకాష్ అపార్ట్‌మెంట్ ఎదురుగా ఉన్న వెల్ఫేర్ హాల్‌లో ప్రతి రోజు ఉదయం 5.30 నుంచి 6.15 గంటల వరకు, సాయంత్రం 5.30 నుంచి 6 గంటల వరకు ఉచిత యోగా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని యోగా సమన్వయ కర్త దంతులూరి తిరుపతిరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9866041332 నంబరులో సంప్రదించాలన్నారు.

యోగా దైనందిన జీవితంలో భాగం కావాలి

ప్రభుత్వాసుపత్రి: యోగా ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో భాగం కావాలని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ పూలల చంద్రశేఖర్ అన్నారు. ఈనెల 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం యూనివర్సిటీలో ఉద్యోగులు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒత్తిడి అధిగమించేందుకు యోగా దోహదం చేస్తుందన్నారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ బోర్డు చైర్మన్ త్రిమూర్తి యోగాసనాలు పర్యవేక్షించారు. యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఉద్యోగులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అధిక ఫీజులకు వ్యతిరేకంగా ఏఐఎస్ఎఫ్ ఆందోళన

- పోలీసుల ఆందోళనను అడ్డుకునే క్రమంలో ఉద్రిక్తత
- విద్యార్థి సంఘ నాయకులకు గాయాలు...స్టేషన్‌కు తరలింపు



విద్యార్థి సంఘం నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

లబ్బీపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పుస్తకాలు, ఫీజుల పేరుతో వేలాది రూపాయలు విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్నారంటూ బందర్ రోడ్డులోని ఒక ప్రైవేట్ కళాశాల వద్ద ఏఐఎస్ఎఫ్ నాయకులు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. కళాశాల ముందు విద్యార్థి సంఘం నాయకులు ఆందోళన చేస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వారి ఆందోళన అడ్డుకుని అదుపులోకి తీసుకునే క్రమంలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ క్రమంలో విద్యార్థి సంఘం నాయకులకు గాయాలు అయి రక్తం కారింది. వారిని పోలీసులు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ శాంతియుతంగా నిరసన చేస్తుంటే పోలీసులు అత్యుత్సాహంతో కళాశాల యాజమాన్యానికి వంతపాడుతూ తమను అన్యాయంగా రక్తం కారేలా దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాల యాజమాన్యం ఫిర్యాదు చేయకుండానే పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారని ఆరోపించారు.

ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు గుజ్జుల వలరాజు, బందెల నాసర్జి, సహాయ కార్యదర్శులు ఫణీంద్ర, పాబిర్ షేక్ మస్తాన్, సాదిక్‌బాబు, కార్తీక్, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

జన శిక్షణా సంస్థాన్ ఆధ్వర్యంలో

నిరుద్యోగులకు ఉపాధి శిక్షణ

మొగల్రాజపురం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జనశిక్షణా సంస్థాన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోర్సులలో శిక్షణ కార్యక్రమం రూపొందించినట్లు డైరెక్టర్ ఏ. పూర్ణిమ ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థాన్ చైర్‌పర్సన్ నాగళ్ల విద్యాఖన్నా ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత శిక్షణలో చేరే యువతీ యువకులు 15 నుంచి 45 ఏళ్లలోపు వారై ఉండాలని తెలిపారు. అసిస్టెంట్ డ్రెస్‌మేకర్, లేయర్ మేన్, దర్జీ, బ్యూటీకేర్ అసిస్టెంట్, అసిస్టెంట్ హెయిర్ డ్రెస్సర్, హెల్పర్ వైర్‌మెన్, ఫ్రూట్స్ అండ్ వెజిటెబుల్స్ ప్రాసెసింగ్ అండ్ ప్రిజర్వేషన్, బేకింగ్ టెక్నీషియన్, పాపడ్, పికిల్స్ మసాల పౌడర్ మేకింగ్, డేటా అనాలసిస్ట్, కంప్యూటర్ కాన్సెప్ట్స్ క్యాండిల్ మేకర్, క్రియేటివ్ సాఫ్ట్‌టాయ్స్, ఫ్యాషన్ జ్యూయలరీ, జ్యూట్‌మేకర్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, ఎలక్ట్రికల్ టెక్నీషియన్, టెక్సలైట్ ప్రింటర్ తదితర కోర్సులకు శిక్షణ ఇస్తారని తెలిపారు. వివరాలకు ప్రోగ్రాం ఆఫీసర్ డి.కోటేశ్వరరావు 8099621461 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

యోగాతో ఆరోగ్యం

చిట్టినగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ప్రతిరోజు యోగా చేయడం వలన ఆరోగ్యంగా ఉంటారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ అన్నారు. అవిజయవాడ నగరపాలకసంస్థ, అబ్దుల్ కలాం వాకర్స్ అసోసియేషన్ సంయుక్తంగా కేఎల్ రావు పార్క్‌లో బుధవారం యోగా కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీరామ్ మాట్లాడుతూ యోగాను ప్రతి ఒక్కరు అభ్యసించాలని కోరారు. కార్యక్రమంలో యోగా గురువు సుబ్బారావు, అవ్వారు బుల్లబ్బాయి, బలివాడ శివకుమార్ పట్నాయక్, జగుపిళ్ల శ్రీనివాసరావు, బీరం శ్రీనివాసరావు, ఓబులేశ్వరరావు పాల్గొన్నారు.

బైక్‌తో యువకుల విన్యాసాలు

- ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో వైరల్
- ఇద్దరిపై కేసు నమోదు చేసిన కృష్ణలంక పోలీసులు



వన్‌టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా పెనుమాక ప్రాంతానికి చెందిన ఇద్దరు యువకులు బైక్‌పై కృష్ణలంక జాతీయ రహదారి మీద ప్రాణాంతకమైన విన్యాసాలు చేశారు. ప్రచారం కోసం వారి ఇన్‌స్టాగ్రామ్‌లో ఆ వీడియోను అప్‌లోడ్ చేయటంతో వైరల్ అయ్యింది. దీనిపై విమర్శలు రావటంతో పోలీసు అధికారులు స్పందించి వారి వివరాలు తెలుసుకుని ఇద్దరిపై కృష్ణలంక స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం పెనుమాక ప్రాంతానికి చెందిన సురేష్ అదే ప్రాంతానికి చెందిన స్నేహితుడి బైక్ తీసుకున్నాడు. సురేష్ మరో స్నేహితుడుతో కలిసి విజయవాడ కృష్ణలంక అంబేడ్కర్‌పార్క్ వద్ద జాతీయ రహదారిపై వివిధ విన్యాసాలు చేసి వీడియో చిత్రీకరించుకున్నారు. ఆ వీడియోను వారి ఇన్‌స్టాగ్రామ్‌లో అప్‌లోడ్ చేశారు. ఈ వీడియోలు మూడు రోజుల నుంచి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. పోలీసు ఉన్నతాధికారులు విన్యాసాల వీడియోపై ప్రత్యేక దృష్టి సారించి వారిని గుర్తించారు. కృష్ణలంక పోలీసులు బైక్ యజమానిని స్టేషన్‌కు పిలి పించి విచారించారు. ఈ విచారణలో సుమారు ఆరు నెలల క్రితం స్నేహితుడు సురేష్ అలియాస్ హంగామా గంటలో వస్తానని తన బైక్ తీసుకుని వెళ్లాడని, ఆ తరువాత కృష్ణలంక జాతీయ రహదారి మీద విన్యాసాలు చేసి వారి ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టుకున్నట్లు బైక్ యజమాని పోలీసులకు తెలిపాడు. దీంతో పోలీసులు అతని ఫిర్యాదు మేరకు సురేష్, అతని స్నేహితుడిపై కేసు నమోదు చేశారు. పోలీసులు సురేష్‌ను అదుపులోకి తీసుకోగా, అతనిస్నేహితుడు వేరొక ఘటనలో జరిగిన ప్రమాదంలో గాయాలకు గురికావటంతో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. కాగా, జాతీయ రహదారి మీద యువకులు బైక్‌పై విన్యాసాలు చేస్తే చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

సంగమ ప్రాంతాలపై నిర్లక్ష్యపు నీడ

అభివృద్ధికి దూరంగా పవిత్ర సంగమం, సాగర సంగమం


సౌకర్యాలు లేకున్నా సందడిగా మారిన పవిత్ర సంగమం

- మౌలిక సదుపాయాలు లేక పర్యాటకుల అవస్థలు
- కనీస వసతులు కల్పించకుండా హంసలదీవిలో టోల్ వసూళ్లా..!
- రివర్ ఫ్రంట్, బీచ్ టూరిజం ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలి

రాష్ట్రంలోని రెండు అద్భుతమైన సంగమ క్షేత్రాలు హంసలదీవిలోని సాగర సంగమం, ఇబ్రహీంపట్నంలోని పవిత్ర సంగమం. పర్యాటక రంగంలో ఎంతో ఆదరణ పొందినప్పటికీ, నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. కృష్ణమ్మ సముద్రంలో కలిసే హంసలదీవి, గోదావరి-కృష్ణానదులు సంగమించే ఇబ్రహీంపట్నం ఈ రెండూ సహజ సిద్ధమైన ప్రదేశాలు. రివర్ ఫ్రంట్, బీచ్ టూరిజంగా అభివృద్ధి చేసేందుకు ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో ఇవి ఎంతో అనువైనవి. ఒకప్పుడు ఈ ప్రాంతాలు వెలుగులో మెరిసినవే. కానీ, కాలక్రమేణా నిర్లక్ష్యం వల్ల పర్యాటకులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తగిన మౌలిక సదుపాయాలు లేకపోయినా, ఈ ప్రాంతాలకు పెద్ద ఎత్తున సందర్శకులు వస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విజన్-2047ను సాకారం చేయాలంటే ఈ రెండు సంగమ క్షేత్రాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి.

\- ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం/కోడూరు

ఇబ్రహీంపట్నంలో గోదావరి, కృష్ణానదులు కలిసే పవిత్ర సంగమం 2014లో టీడీపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆరంభమైంది. పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణానదిలో కలిపి, ఈ సంగమానికి పవిత్ర సంగమం అని నామకరణం చేశారు. 2 కిలోమీటర్ల నదీతీరంలో రివర్ ఫ్రంట్ ఘాట్లు, స్నాన ఘాట్లు ఏర్పాటు చేసి పర్యాటకులకు అనేక మౌలిక సదుపాయాలు కల్పించారు. నిత్యహారతులు, కొండపల్లి ఖిల్లాపై లేజర్ షోలతో ఈ ప్రాంతం ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా ఒక వెలుగు వెలిగింది. రాష్ట్రంతోపాటు దేశవ్యాప్తంగా సందర్శకులను ఆకర్షించింది. ప్రతి సాయంత్రం వేలాది మంది నిత్యహారతులను వీక్షించేందుకు చేరుకునేవారు. కానీ, 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ ప్రాంతం చీకటిలోకి నెట్టబడింది. నిత్యహారతులు ఆగిపోయాయి, అభివృద్ధి పనులు స్తంభించాయి. ఐదేళ్ల పాలనలో ఒక్క పని జరగలేదు. 2024లో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా అభివృద్ధి పనులు ప్రారంభం కాలేదు. ముగ్గురు మంత్రులు సందర్శించి, నిత్యహారతులు తిరిగి ప్రారంభిస్తామని హామీ ఇచ్చి 9నెలలు గడిచినా అమలు కాలేదు.

ఇదీ హంసలదీవి దుస్థితి..!

హంసలదీవిలో కృష్ణానది సముద్రంలో కలిసే సాగర సంగమం మరో అద్భుత దృశ్యం. ఈ బీచ్ ప్రాంతం తెలుగు రాష్ట్రాల్లోనే కాక, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి కూడా పర్యాటకులను ఆకర్షిస్తుంది. సమీపంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం దీని ఆధ్యాత్మిక విలువను పెంచుతుంది. కానీ, సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడంతో పర్యాటకులు దూరమవుతున్నారు. పాలకాయ తిప్ప నుంచి బీచ్‌కు వెళ్లే రహదారి పాడైపోయింది, కనీస మరమ్మతులు కూడా జరగడం లేదు. అటవీ శాఖ అధికారులు సౌకర్యాలు కల్పించకుండానే టోల్ వసూలు చేయడం సందర్శకులపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. మరుగుదొడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి, మహిళలకు దుస్తులు మార్చుకునే సౌకర్యం లేదు. మంచినీరు కావాలంటే 2 కిలోమీటర్ల దూరంలోని పాలకాయ తిప్పకు వెళ్లాల్సిందే. స్థానిక వ్యాపారులను సముద్రతీరంలో విక్రయాలకు అనుమతించకపోవడంతో వారు జీవనోపాధి కోల్పోతున్నారు. ఈ పరిస్థితుల వల్ల ఇటీవల సందర్శకుల సంఖ్య తగ్గిందని స్థానికులు వాపోతున్నారు.


సాగర సంగమం వద్ద పర్యాటకులు


నిరుపయోగంగా బయో టాయిలెట్స్

ఇలా చేస్తే..

ఈ రెండు సంగమ క్షేత్రాలు రాష్ట్ర పర్యాటక రంగంలో మణిహూసలుగా మారే అవకాశం ఉంది. పవిత్ర సంగమంలో నిత్యహారతులను పునరుద్ధరించి, రివర్ ఫ్రంట్ సౌకర్యాలను మెరుగుపరచాలి. హంసలదీవిలో రహదారులు, మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యాలను అభివృద్ధి చేయాలి. టోల్ వసూలును తాత్కాలికంగా నిలిపివేసి, స్థానిక వ్యాపారులకు అవకాశం కల్పించాలి. ప్రభుత్వం, ప్రైవేటు సంస్థల సహకారంతో ఈ ప్రాంతాలను అభివృద్ధి చేస్తే, స్థానిక ఆర్థిక వ్యవస్థ బలపడడంతోపాటు రాష్ట్రానికి ఆదాయం పెరుగుతుంది. ఈ సంగమ క్షేత్రాలను పర్యాటక ప్రాంతాలుగా మార్చడం ద్వారా, రాష్ట్రం తన విజన్ - 2047కు ఒక అడుగు దగ్గరవుతుంది. కానీ, ఇందుకు జిల్లా అధికారులు, పర్యాటక శాఖ తక్షణ చర్యలు తీసుకోవాలి. ఈ ప్రాంతాల సహజ సౌందర్యం, ఆధ్యాత్మిక విలువలను కాపాడుతూ, వాటిని ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దే బాధ్యత ప్రభుత్వంపై ఉంది.


శిథిలావస్థకు చేరిన సంగమానికి వెళ్లే రహదారి

జగన్ లాంటి ఉన్మాది ప్రజాస్వామ్యానికి ప్రమాదకారి

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నే

వన్‌టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జగన్ లాంటి ఉన్మాది ప్రజాస్వామ్యానికి ప్రమాదకారి అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ (అన్నా) అన్నారు. బుధవారం విజయవాడ హనుమాన్‌పేటలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డికి బుధవారం పల్నాడు పర్యటనకు పోలీసులు కేవలం 100 మందికి మాత్రమే అనుమతివ్వగా, వైసీపీ నేతలు వేలాది మందిని సమీకరించి బలప్రదర్శన చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడారన్నారు. ఫలితంగా ఇద్దరు అమాయకులు ప్రాణాలు కోల్పోయారన్నారు. జగన్ పరామర్శ పేరుతో ఒక్కరిని కలవడానికి వచ్చి మరో ఇద్దరి మరణానికి కారణమవడం విషాదకరమన్నారు. వైకాపా నాయకత్వం ఎంత బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తుందో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చన్నారు. జరిగిన ఘటనపై జగన్ స్పందించకుండా పర్యటన కొనసాగించడం మరింత దారుణమని, తన పర్యటనతో ప్రాణనష్టమొచ్చినా స్పందించని వ్యక్తి ప్రజల బాగోగులు చూస్తాడని ఎలా నమ్మాలని ప్రశ్నించారు.

అరుణ్ కుమార్ జైన్ సేవలు శ్లాఘనీయం

- సికింద్రాబాద్‌లో జరిగిన అభినందన సభలో కార్మిక సంఘాల నేతలు

రైల్వే స్టేషన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ సేవలు శ్లాఘనీయమని కార్మిక సంఘాల నేతలు పేర్కొన్నారు. అరుణ్ కుమార్ జైన్ ఈనెల 30న పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా సికింద్రాబాద్ రైల్ నిలయంలో బుధవారం ఎస్‌సీఆర్ఎంయూ, హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో అభినందన సత్కార సభ జరిగింది. ఈ సందర్భంగా నేతలు అరుణ్ కుమార్ జైన్ సేవలను విస్తృతంగా పేర్కొంటూ అభినందించారు. ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్‌కు అనుబంధ సంస్థ అయిన సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ (ఎస్‌సీఆర్ఎంయూ) హిందూ మజ్దూర్ సభల సంయుక్త ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని ఎస్‌సీఆర్ ఎంయూ సెంట్రల్ ఆఫీసులో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు ప్రసంగించారు. ఎస్‌సీఆర్ఎంయూ ప్రెసిడెంట్ కే శ్రీనివాస్ అరుణ్ కుమార్ జైన్ సాధించిన విజయాలను, ప్రగతిని ప్రశంసించారు. జనరల్ సెక్రటరీ డాక్టర్ సీహెచ్ శంకర్‌రావు మాట్లాడుతూ అరుణ్ కుమార్ జైన్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఇక ముందు రాబోయే జనరల్ మేనేజర్లు అభివృద్ధితో పాటు రైల్వే ఉద్యోగుల శ్రేయస్సుకు కూడా పాటుపడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎస్‌సీ రైల్వే అదనపు జనరల్ మేనేజర్ నీరజ్ అగర్వాల్ మాట్లాడుతూ అరుణ్ కుమార్ జైన్ మార్గదర్శకత్వంలో తీసుకున్న చర్యలను కొనియాడారు. ఎస్‌సీఆర్ఎంయూ నేతలు కూడా ఎంతో సహకరించారన్నారు. తనకు జరిగిన సత్కారానికి కృతజ్ఞతలు చెబుతూ అరుణ్ కుమార్ జైన్ తన ప్రసంగంలో యూనియన్ నాయకత్వాన్ని కొనియాడారు. రైల్వే ఉద్యోగులు, వారి కుటుంబాల సంక్షేమానికి ఎంతో పాటుపడ్డారని చెప్పారు. తాను జనరల్ మేనేజర్‌గా ఉన్న కాలంలో సహకరించిన వారందరికీ అభినందనలు తెలిపారు. సెంట్రల్, డివిజనల్ ఆఫీస్ యూనియన్ బాధ్యులు, హైదరాబాద్, సికింద్రాబాద్ ఏరియా పరిధిలోని లోకల్ ఆఫీసు బ్రాంచి, ఆఫీసుల బాధ్యులు, శాలువాలతో, పుష్పగుచ్ఛాలతో అరుణ్ కుమార్ జైన్‌ను సత్కరించారు. ఎస్‌సీఆర్ఎంయూ అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ జి.ఉదయభాస్కర్‌రావు సభకు స్వాగతం పలికారు. జోనల్ ట్రెజరర్ ఎస్ సరోజినీరెడ్డి వందన సమర్పణ చేశారు.


సభలో ప్రసంగిస్తున్న అరుణ్‌కుమార్ జైన్

క్రైస్తవ మైనార్టీల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈఽటె

విద్యాధరపురం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవ మైనార్టీల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలుగుదేశం పార్టీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాసు పేర్కొన్నారు. బుధవారం పున్నమిఘాట్‌లో జరిగిన ఆంధ్రప్రదేశ్ బిషప్ కౌన్సిల్ సమావేశంలో టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాసు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు సీఎంగా ఉంటేనే అన్ని వర్గాల ప్రజలు బాగుపడతారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో గుంటూరు-విజయవాడ సమీపంలో రెండెకరాలు స్థలం కేటాయించి, క్రిస్టియన్ భవన్ ఏర్పాటుకు రూ.10 కోట్లు నిధులు విడుదల చేశారన్నారు. 80 శాతం పూర్తయిన క్రిస్టియన్ భవనాన్ని వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. క్రైస్తవులు వ్యాపారం చేసుకునేందుకు వీలుగా రూ.లక్ష సబ్సిడీపై 2,494 మందికి బడ్జెట్ విడుదల చేశారన్నారు. ఏపీ బిషప్ కౌన్సిల్ అధ్యక్షుడు బాలరాజు, జేఏసీ ప్రధాన కార్యదర్శి మన్నెం జానయ్య, బిషప్‌లు డేవిడ్ రాజు, మల్లెల విజయ్ భాస్కర్, సంతోష్‌తో పాటు 250 మంది పాల్గొన్నారు.


కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఈటె స్వామిదాసు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం: కలెక్టర్ లక్ష్మీశ

సత్యనారాయణపురం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రోజువారీ జీవితంలో ఎదురయ్యే ఒత్తిళ్లను ఎదుర్కొనేందుకు యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. బీఆర్‌టీఎస్ రోడ్డు యోగా స్ట్రీట్‌లో జిల్లా అధికారులు, వీఎంసీ ఆధ్వర్యంలో బుధవారం థీమ్ యోగా జరిగింది. వివిధ బ్యాంక్ అధికారులు, సిబ్బందితో కలిసి కలెక్టర్ యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యోగాంధ్రకు విశేష స్పందన వస్తుందన్నారు. ఇంటర్నేషనల్ వాసవీ క్లబ్ మాజీ అధ్యక్షుడు వేముల హజరత్తయ్యగుప్తా మాట్లాడుతూ రోజూ యోగాతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చునన్నారు.

యూబీఐ రీజనల్ హెడ్ ఎంవీ తిలక్, గౌతమ్ లక్ష్మీనారాయణ, కే ప్రియాంక, ఎస్‌బీఐ ఆర్ఎం శ్రీనివాస్, ఇండియన్‌బ్యాంక్ జోనల్ మేనేజర్ రాజేష్, వీఎంసీ అదనపు కమిషనర్ డీ చంద్రశేఖర్ అదితరులు పాల్గొన్నారు.



'విజయవాడ-విశాఖ' అమరావతి ఏసీ బస్సుల్లో నెలరోజుల పాటు

10 శాతం రాయితీ

బస్టేషన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): విజయవాడ - విశాఖపట్నం మధ్య నడుస్తున్న అమరావతి ఏసీ బస్సుల్లో ఈనెల 26 నుంచి జులై 24 వరకు చార్జీల్లో 10 శాతం రాయితీ ఇస్తున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎంవై దానం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని అమరావతి ఏసీ బస్సుల్లోనూ రూ.1070 చార్జీకిగాను రూ.970 మాత్రమే వసూలు చేస్తారన్నారు. మరోవైపు రాను, పోను టిక్కెట్లను రిజర్వ్ చేసుకున్నవారికి కూడా 10 శాతం రాయితీ లభిస్తుందన్నారు.

పూరి రథయాత్రకు ప్రత్యేక బస్సులు

ఈనెల 27న పూరీలో జరగనున్న జగన్నాథ్ రథయాత్రను పురస్కరించుకుని పీఎన్‌బీఎస్ నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎంవై దానం తెలిపారు. ఈ బస్సులు ఈనెల 25న రాత్రి 10 గంటలకు బస్టేషన్ నుంచి బయలుదేరతాయి. 26న అన్నవరం, సింహాచలం, విశాఖపట్నం ఆర్కే బీచ్‌ను చూసుకుని సాయంత్రం 6 గంటలకు బయలుదేరతాయి. 27న కోణార్క్ సూర్యదేవాలయం చేరుకుంటాయి. అక్కడ దర్శనానంతరం పూరీ జగన్నాథుని దర్శనం, రథయాత్ర నుంచి 27న రాత్రి ఒంటి గంట వరకు కూడా అక్కడే ఉండి అక్కడి నుంచి బయలుదేరి మళ్లీ రాత్రి 7 గంటలకు విజయవాడ చేరుకుంటారు. సూపర్ లగ్జరీ, హైటెక్ ప్రయాణానికి ఒక్కొక్కరికి రూ.3,600, ఇంద్ర ఏసీ ఒక్కొక్కరికీ రూ.4,800 చార్జీ చెల్లించాల్సి ఉంటుంది. ఆన్‌లైన్, లేదా ఆర్టీసీ అధీకృత టిక్కెట్ బుకింగ్ ఏజెంట్ల ద్వారా రిజర్వేషన్ చేసుకోవచ్చునన్నారు. 30మంది గ్రూప్‌గా ఉన్నట్టయితే వారి నివాస ప్రాంతం నుంచే బస్సును ఏర్పాటు చేస్తామన్నారు. ప్రయాణంలో భోజనం, ఇతర ఖర్చులన్నీ ప్రయాణికులే భరించాల్సి ఉంటుందన్నారు. తిరువూరు, జగ్గయ్యపేట నుంచి కూడా 30 మంది ఉన్నట్టయితే అక్కడి నుంచే బస్సులు బయలుదేరతాయన్నారు. వివరాలకు 8074298487 (విజయవాడ) 9515860465 (తిరువూరు) 8247451915 (విజయవాడ) 7382893197 (జగ్గయ్యపేట)లో సంప్రదించవచ్చన్నారు.

ఐకానిక్ అసెంబ్లీ పనులు ప్రారంభం!

గుంటూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి గుండెకాయ అయిన ఐకానిక్ అసెంబ్లీ నిర్మాణ ప్రక్రియ ఎట్టకేలకు ప్రారంభమయింది. రాజధాని మొత్తానికి తలమానికమైన ఈ నిర్మాణ కాంట్రాక్టును పొందిన ఇంజనీరింగ్ సంస్థ సోమవారం నుంచి పనులను ప్రారంభించింది. నిర్మాణ ప్రాంతంలోకి భారీ డ్రిల్లర్లు, సరంజామాను తరలించుకుని ఏర్పాట్లు చేసుకుంటోంది.

2 నెలలుగా కొనసాగుతున్న పనులు

రాజధాని అమరావతిలో 103 ఎకరాల్లో దాదాపు 11.22 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 250 మీటర్ల ఎత్తులో వ్యూ పాయింట్ ఉండేలా నిర్మిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక నిర్మాణం కావడంతో నిర్మాణ సంస్థ అనేక జాగ్రత్తలు తీసుకుంటోంది. రెండు నెలలుగా అక్కడి భూమి స్వభావం, నాణ్యతపై అధ్యయనం చేస్తోంది. నిర్మాణానికి కావాల్సిన మెజర్మెంట్స్ తీసుకుంటోంది. ఆ పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. కాగా సోమవారం నుంచి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. భారీ డ్రిల్లర్లను నిర్మాణ స్థలంలోకి తరలించి సిద్ధం చేసుకుంటున్నారు. నిర్మాణ పునాదుల కోసం కావాల్సిన గుంతలు తీసే పనులు ప్రారంభించారు.

గతవారమే మొదలైన జీఏడీ టవర్ల పనులు

కిందటివారమే జీఏడీ, సెక్రటేరియట్ టవర్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. పరిపాలానా భవనాన్ని 17.03 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 47 అంతస్తులతో నిర్మిస్తున్నారు. దీంతోపాటు 68.88 లక్షల చదరపు అడుగులు విస్తీర్ణంలో 40 అంతస్తులు ఉండేలా సెక్రటేరియట్ భవనాలను నిర్మించాలని ప్రభుత్వం భావించింది. దీనికి సంబంధించిన ఎల్‌ఓసీలు ఈనెల 2న పూర్తయ్యాయి. మొత్తం రూ. 3,673.44 కోట్లకు టెండర్లు ఖరారయ్యాయి. దీంతో సెక్రటేరియట్ టవర్ 1, టవర్ 2ల పనులు ప్రారంభమయ్యాయి. కిందటి వారమే పనులు ప్రారంభం కావడంతో పునాదుల్లోకి చేరిన నీరు, బురదను ఇప్పటికే పూర్తిగా తొలగించివేశారు. ఇప్పటికే కొంతమేర పూర్తై ఉన్న రాఫ్ట్ ఫౌండేషన్ల వద్ద సేఫ్‌హోల్డులు నిర్మించుకుని తదుపరి పనులకు సన్నద్ధమవుతున్నారు. భారీ వాహనాలు నేరుగా రాఫ్ట్ ఫౌండేషన్ వద్దకు చేరుకునేలా రోడ్ల నిర్మాణాన్ని కూడా పూర్తి చేసుకున్నారు. పాడైపోయిన ఐరన్ రాడ్లను వెల్డింగ్ ద్వారా కట్ చేసి తొలగిస్తున్నారు.


పునాదుల కోసం గుంతలు తీసేందుకు వచ్చిన డ్రిల్లర్, పనిముట్లు, పిల్లర్ బాక్స్

ఫేక్ బ్రేకింగ్ న్యూస్ తెర వెనుక ఎవరు?

కొడాలి నాని అరెస్టు ఫేక్ ప్రచారం వెనుక కుట్ర కోణం!

- వైసీపీ శ్రేణుల భావోద్వేగాలు రెచ్చగొట్టేందుకే ఫేక్ న్యూస్ వదిలారా?
- సరిగ్గా జగన్ పర్యటనకు కొద్ది నిమిషాల ముందే న్యూస్ వైరల్
- ఈ విషయం తేల్చాలని కృష్ణా జిల్లా పోలీసులకు ఆదేశం
- ఈ రెండింటికీ సంబంధం ఉందా.? అన్నకోణంలో విచారణ
- ప్రధాన మీడియా ప్రతినిధులకు ఫోన్లు చేసి వాకబు
- నేడు అనుమానితులను విచారించే అవకాశం



ఆంధ్రజ్యోతి, విజయవాడ: మాజీ మంత్రి కొడాలి నానిని అరెస్టు చేసినట్టు సోషల్ మీడియాలో జరిగిన ప్రచారం వైసీపీ పనేనన్న అనుమానాలు కలుగుతున్నాయి. చాలా పకడ్బందీగా.. చేసిందెవరో తెలియకుండా జాగ్రత్త పడటం వెనుక కుట్రకోణం ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తమ చేతికి మట్టి అంటకుండా ఉండేందుకు ముందు ప్రచారం చేయించినట్టుగా తెలుస్తోంది. తద్వారా సోషల్ మీడియాలో చక్కెర్లు కొట్టినట్టు అనుమానాలు కలుగుతున్నాయి. కోల్‌కతా ఎయిర్‌పోర్టు నుంచి విదేశానికి వెళుతుండగా ఇమిగ్రేషన్ అధికారులు అడ్డుకున్నారంటూ బిగ్ బ్రేకింగ్ న్యూస్ పేరుతో పోస్టులు వైరలయ్యాయి. దీనిపై కృష్ణాజిల్లా పోలీసులు విచారణ జరపగా అలాంటిదేమీ జరగలేదని తేలింది. అసత్య వార్తలను ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించటంతో ఈ వైరల్ పోస్టు వెనుక ఎవరున్నారన్న దానిపై పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. జగన్ పల్నాడు జిల్లాకు బయలుదేరటానికి కొద్ది నిమషాల ముందు ఎయిర్‌పోర్టులో కొడాలి నానీని అదుపులోకి తీసుకున్న వార్త వైరల్ అయింది. దీని వెనుక రెండు కారణాలున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. మాజీ సీఎం జగన్ పర్యటన సందర్భంగా కొడాలి నాని అరెస్టు పేరుతో వైసీపీ శ్రేణుల భావోద్వేగాలను రెచ్చగొట్టి అల్లర్లు సృష్టించే కుట్ర ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే పల్నాడు జిల్లాలో జగన్ పర్యటనకు ఇబ్బందులు లేకుండా డైవర్షన్ గేమ్ ఆడినట్టుగా చర్చ జరుగుతోంది. ఈ బ్రేకింగ్ వార్తలను ఆధారంగా చేసుకుని కొడాలి నానిపై కార్యకర్తలకున్న కసిని టీడీపీ తీర్చిందన్న కోణంలో స్టోరీలు రావటం ప్రారంభమయ్యాయి. దీంతో కొడాలి నాని అనుచరులకు ఫోన్లు చేసి ఆయన ఎక్కడున్నారో తెలుసుకునే ప్రయత్నం చేశారు. అయితే ఆయన హైదరాబాద్‌లోని తన నివాసంలోనే ఉన్నారని సమాచారం వచ్చింది. దీనికి గంటకు పైగా సమయం పట్టింది. ఈలోపు పల్నాడు జిల్లాలో జగన్ ప్రవేశం జరిగిపోయింది. ఈ రెండు సంఘటనలకు ఏ మైనా సంబంధం ఉందా అన్న కోణంలో పోలీసులు పరిశీలన జరుపుతున్నారు. ఈ ఫేక్ వార్తల ప్రచారం వెనుక ఎవరున్నారో తేల్చాలని రాష్ట్ర ప్ర భుత్వం కృష్ణా జిల్లా పోలీసులను ఆదేశించింది. దీంతో ఆయా పోస్టులపై ఆరా తీస్తున్నారు. ప్రధాన మీడియాలో మాత్రం ఎక్కడా కొడాలి నాని అరెస్టు వార్తలు రాలేదు. కేవలం సామాజిక మాధ్యమాల్లోనే వచ్చింది. గురువారం కొంతమంది అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించే అవకాశం ఉంది.

దేశానికి సుదీర్ఘ సేవలందించిన మహనీయుడు జగ్జీవన్‌రామ్: మంద కృష్ణమాదిగ

రాణిగారితోట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): దేశానికి సుదీర్ఘ సేవలు చేసిన మహనీయుల్లో మొదటి వరసలో ఉండే వ్యక్తి బాబూ జగ్జీవన్ రామ్ అని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణ మాదిగ అన్నారు. రాణిగారితోట 17వ డివిజన్ ఫీడర్ రోడ్డులో ఆదివారం బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహ ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి విగ్రహావిష్కరణ చేశారు. అనంతరం మాట్లాడుతూ తెలుగు ప్రజలు ఆత్మగౌరవాన్ని, ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు ఎన్టీఆర్ విగ్రహం పక్కనే మరో మహనీయుడు జగజ్జీవన్ రామ్ విగ్రహన్ని కూడా ఏర్పాటు చేయడం మంచి కార్యక్రమమన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని కులవ్యవస్థ మన దేశంలో ఉందని, దానివలన ఏ కులంలో పుట్టి సేవ చేసిన ఆ సేవ చేసిన వ్యక్తిని అన్ని కులాల వారు గౌరవించుకునే సంప్రదాయం ఇంకా రాలేదని ఇది చాలా దురదృష్టకరమన్నారు. దేశంలో కుల వ్యవస్థ లేకపోతే మాజీ ఉపప్రధాని జగ్జీవన్ రామ్ చేసిన సేవలను ఈ దేశ సమాజం గుర్తించేదని, గౌరవించేదని, దేశంలోని అన్ని రాజకీయ నేతల ఇళ్లల్లో మహనీయుల విగ్రహాల స్థానంలో ఉండేదన్నారు. అనంతరం ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలోనూ, స్వరాజ్యం వచ్చిన తరువాత ఆధునిక భారతదేశ నిర్మాణంలోనూ స్ఫూర్తివంతమైన సేవలు దేశానికి బాబూ జగ్జీవన్ రామ్ అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమానికి మంద కృష్ణమాదిగ రావడం చాలా సంతోషంగా ఉందని, ప్రధాని మోదీ గుర్తించే స్థాయికి మంద కృష్ణ మాదిగ ఎదిగారంటే ఆయన చేసిన ఉద్యమం వెనుక నిబద్ధత, నిజాయితీ ఉండడమేనన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు మంద కృష్ణ మాదిగ అండగా నిలబడ్డారన్నారు. బడుగు బలహీన వర్గాలకు తెలుగుదేశం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. స్థానిక ఎంఆర్‌పీఎస్ నేతలు పాల్గొన్నారు.


దుర్గమ్మ సన్నిధిలో శీనానాయక్

దుర్గగుడి ఈవో శీనా నాయక్‌కు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి

ఇంద్రకీలాద్రి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న శీనా నాయక్‌కు బుధవారం స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా ఈవో శీనా నాయక్ బుధవారం సాయంత్రం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితులు వేద ఆశీస్సులు అందజేశారు. అధికారులు, ఉద్యోగులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

సముద్రపు ఒడ్డున మృతదేహం

మచిలీపట్నం టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సముద్ర స్నానాలకు వచ్చి ఒడ్డున బైక్‌పై స్పీడ్‌గా డ్రైవ్ చేస్తూ కిందపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం సాయంత్రం మంగినపూడి బీచ్‌లో జరిగింది. స్థానికుల సమాచారం మేరకు ముదినేపల్లికి చెందిన గణేష్ (34) సముద్ర స్నానానికి వచ్చి ఒడ్డున బైక్ రైడింగ్ చేస్తుండగా అదుపుతప్పి పైప్‌లైన్‌కు ఢీకొట్టాడు. దీంతో గణేష్ కిందపడి మృతి చెందాడు. అయితే ఈ ఘటన పలు అనుమానాలకు తావిస్తోంది. సముద్ర తీరం మట్టి మెత్తగా ఉంటుందని, బైక్‌పై నుంచి పడితే ప్రాణనష్టం జరగదని కొందరంటున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ఇల్లు అందంగా...

ఇంట్లోకి ప్రవేశించగానే తాజాగా అహ్లాదకరమైన అనుభూతి కలిగేలా ఉండాలని ప్రతిఒక్కరూ కోరుకుంటూ ఉంటారు. అందుబాటులో ఉన్నవాటితోనే ఇంటిని అందంగా అలంకరించుకుంటారు కూడా. ఇలా ఇంటిని మరింత శోభాయమానంగా మార్చుకోవడానికి నిపుణులు సూచిస్తున్న చిట్కాలు ఇవే...



- ఇంటిని పూర్తిగా ఫర్నిచర్‌తో నింపేయకూడదు. ఇంటి విస్తీర్ణాన్ని అనుసరించి ఫర్నిచర్ ఏర్పాటు చేసుకోవాలి. ఇల్లు చిన్నగా ఉంటే మల్టీపర్పస్ ఫర్నిచర్‌ను ఎంచుకోవచ్చు. ఇంట్లో సామాన్లను చిందరవందరగా పడేయకుండా ఎక్కడికక్కడ పొందికగా సర్దుకోవాలి.
- ఇంట్లోకి రాగానే హాల్ విశాలంగా వెలుతురుతో కనిపిస్తే బాగుంటుంది. సోఫా వెనక గోడకి పోల్కా డాట్స్, పేపర్ ఫ్యాన్‌లు, చిన్న చిన్న పూలచెట్లు-సరస్సు-ఎగిరే పక్షుల డిజైన్లతో ఉన్న స్టిక్కర్లు అంటిస్తే ఇల్లు ఆకర్షణీయంగా కనిపిస్తుంది. సోఫాకి ఇరుపక్కలా మొక్కల కుండీలు పెడితే తాజా అనుభూతి కల్గుతుంది. సోఫా మీద వెల్వెట్ పిల్లోలు, టీపాయ్ మీద ఫ్లవర్ వాజ్ అదనపు ఆకర్షణగా నిలుస్తాయి.
- ఇల్లు అందంగా కనిపించేలా చేయడంలో కర్టెన్లదే ప్రధాన పాత్ర. లేత రంగుల్లో డిజిటల్ ప్రింటింగ్ ఉన్న కర్టెన్లు ఇంటికి శోభనిస్తాయి. కిటికీలకు రకరకాల పక్షులు, పచ్చిక బయళ్లు, సాగర తీరాలు, రాజభవనాల బొమ్మలతో కూడిన కర్టెన్లు వేస్తే ఇంటికి మరే ప్రత్యేకమైన అలంకరణ అవసరం ఉండదు.
- వంటగదిని సౌకర్యవంతంగా ఏర్పాటు చేసుకోవడం మాత్రమే కాదు అందంగా తీర్చిదిద్దుకోవడం కూడా చాలా ముఖ్యం. అల్మారాలు, కప్‌బోర్డులకు అందమైన లామినేషన్ షీట్లు అమరిస్తే చూడడానికి బాగుంటుంది. సిరామిక్, క్రిస్టల్, పీవీసీ, చెక్క సామాగ్రిని వాడితే వంటగది ఆకర్షణీయంగా ఉంటుంది.
- పడక గది, పిల్లల గది చిన్నగా ఉన్నాయనిపిస్తే నేలమీద చిన్నపాటి కార్పెట్ పరచి గది మూలల్లో పొడవుగా పెరిగే మొక్కల కుండీలు పెడితే చాలు గది విశాలంగా ఉన్నట్లు కనిపిస్తుంది.

అతిగా తాగితే..!

కొందరికి ఉదయం, సాయంత్రం టీ లేదా కాఫీ తాగడం అలవాటు. అయితే వర్షాకాలంలో వాతావరణం మారి చిరుజల్లులు మొదలవగానే సమయంతో సంబంధం



లేకుండా టీ తాగుతుంటారు. ఇలా అతిగా టీ, కాఫీలు తీసుకోవడం వలన పలు అనారోగ్య సమస్యలు వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అవేంటో తెలుసుకుందాం.

- టీ, కాఫీల్లో కెఫిన్ ఉంటుంది. ఇది కడుపులో యాసిడ్ ఉత్పత్తిని పెంచుతుంది. దాంతో గుండెలో మంట వచ్చే ప్రమాదముంది.
- కడుపు ఉబ్బరం, ఎసిడిటి సమస్యలు కూడా వస్తాయి.
- టీ, కాఫీలు అతిగా తాగడం వలన శరీరంలో చక్కెర స్థాయులు పెరిగిపోతాయి. ఫలితంగాడయాబెటిస్, ఊబకాయం వచ్చే ప్రమాదం పెరుగుతుంది.
- టీ, కాఫీ వలన కొలెస్ట్రాల్ పేరుకుపోయి, గుండె సంబంధిత వ్యాధులకు దారి తీయవచ్చు.
- కెఫిన్ మెలటోనిన్ ఉత్పత్తిని తగ్గిస్తుంది. దాంతో నిద్ర సరిగా పట్టదు.
- టీ, కాఫీల్లో ఉండే సుక్రోజ్ కాలేయం, చిన్న ప్రేగు మీద చెడు ప్రభావం చూపుతుంది.



కుప్పడం చీరలు.. చాలా మందికి ఇంకా తెలియని అద్భుతమైన నేత చీరలు. తాజాగా ఈ చీరలకు 'ఒక జిల్లా - ఒక ఉత్పత్తి' (ఓడీఓపీ) కార్యక్రమంలో భాగంగా జాతీయ అవార్డు లభించింది. దీనిని వచ్చే నెల 14వ తేదీన ఢిల్లీలో అందిస్తారు..

విభిన్నం

కుప్పడం చీరలకు కొత్త గుర్తింపు

విపత్కర పరస్థితుల్లో

వాతావరణం ప్రతికూల సమయాల్లో మగ్గం సాగక చాలా ఇబ్బందులు పడుతుంటాము. ఇటువంటి పరిస్థితులలో ప్రత్యేక భరోసా కల్పించాలి. కూలీల ధరలు అంతంతమాత్రంగానే ఉంటున్నాయి. దీంతో ఆకలి కేకలు తప్పడంలేదు. చేనేత కార్మికులకు ప్రభుత్వం భరోసా కల్పించాలి.

- భువనేశ్వరి, చేనేత కార్మికురాలు



బాపట్ల జిల్లాలోని చీరాలకు జాతీయోద్యమంలో ఒక ప్రత్యేకత ఉంది. స్వదేశీ ఉద్యమంలో భాగంగా మహాత్మాగాంధీకి మద్దతుగా ఈ ప్రాంత ప్రజలు విదేశీ గుడ్డలను బహిష్కరించారు. వేల సంఖ్యలో నేత కార్మికులు గుడ్డలను నేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ఆ రోజుల్లో దీనిని చాలా మంది ఒక అరుదైన సంఘటనగా అభివర్ణించేవారు. ఆ సమయంలో ప్రారంభమయిన నేత ఉద్యమం కొనసాగుతూ వచ్చింది. స్వాతంత్ర్యం వచ్చిన చాలా కాలం తర్వాత కూడా చీరాలకు చెందిన నేతకు.. ముఖ్యంగా కుప్పాడం చీరలకు మంచి ఆదరణ లభించింది. కానీ ఆధునిక కాలంలో నేత వస్త్రాలకు ఆదరణ తగ్గటంతో కుప్పాడం చీరలను నేసేవారి సంఖ్య కూడా తగ్గుతూ వచ్చింది. ప్రస్తుతం చీరాల ప్రాంతంలో ఐదువేల నేత మగ్గాలు ఉంటే- కేవలం రెండు వేల మగ్గాలపై మాత్రమే చీరలను నేస్తున్నారు. తాజాగా వచ్చిన జాతీయ అవార్డు వల్ల దేశ వ్యాప్తంగా ఈ చీరలకు ఆదరణ పెరుగుతుందని.. ఎక్కువ మంది కొనుగోలు చేస్తారని స్థానిక చేనేత కార్మికులు ఆశిస్తున్నారు.

ప్రత్యేకతలివే...

చీరకు అంచు ఒక ప్రత్యేకతను ఇస్తుంది. ఈ అంచు ఎంత భిన్నంగా ఉంటే- చీర అంత అందంగా తయారవు



తుంది. సాధారణంగా దేశంలో వివిధ ప్రాంతాల్లో నేసే నేత చీరల అంచు ఐదు అంగుళాలకు మించదు. కానీ కుప్పాడం చీరల అంచు మాత్రం 18 అంగుళాలు ఉంటుంది. "చీర అంచే కుప్పడం ప్రత్యేకత. ఈ అంచులో నేసే డిజైన్లు మిగిలిన చేనేతలకు భిన్నంగా ఉంటాయి. నేతలోనే ఈ అంచు కూడా తయారవుతుంది. ఈ అంచులను తయారుచేయటానికి ప్రత్యేకమైన నాడులు.. అచ్చులు ఉంటాయి. ఒక సారి నేసిన తర్వాత చీరలోనే అంచు కలిసిపోతుంది." అంటారు ఈ చీరలను నేసే హెచ్చిన భువనేశ్వరి. ఈ చీరలను నేయటానికి ఎక్కువ సమయం కూడా పడుతుంది. "రోజుకు ఇద్దరు పనిచేస్తే- ఒక చీర నేయటానికి మూడు నుంచి నాలుగు రోజులు పడుతుంది. అందువల్ల ఖరీదు పెరుగుతుంది. మంచి కుప్పడం సిల్క్ చీరను తయారుచేయటానికి ముడి సరుకుతో కలిపి 3 నుంచి 8వేల వరకూ అవుతుంది. పట్టణాలలో పెద్ద పెద్ద దుకాణాలలో వీటిని రెట్టింపు ధరకు అమ్ముతారు" అంటారు భువనేశ్వరి.

కాలంతో పరిగెట్టి...

ఈ ఆధునిక యుగంలో ప్రజలు కొత్త కొత్త డిజైన్లను కోరుకుంటున్నారు. ఈ డిజైన్లను అందించలేని చేనేతలకు ఎక్కువ డిమాండ్ ఉండటం లేదు. "కొత్త డిజైన్లు తయారుచేసి మార్కెట్‌లో ప్రవేశపెట్టాలంటే డిమాండ్ ఎక్కువగా ఉండాలి. అంతే కాకుండా ఈ కళపై ఆసక్తి ఉండాలి. ఈ ఆసక్తి రావాలంటే యువతీ, యువకులకు మంచి వేతనాలు లభించాలి. ప్రభుత్వం నుంచి బ్యాంకుల నుంచి ప్రోత్సాహం లభించాలి. ప్రస్తుతం కుప్పడం చీరల నేత విషయంలో మేము ఎదుర్కొంటున్న సమస్యలివే.." అంటారు మాస్టర్ వీవర్ సిద్ది బుచ్చేశ్వరరావు. ప్రస్తుతం ఎక్కువ ఆదరణ లేకపోయినా- ప్రతి రోజూ కనీసం రెండు వేల మంది కార్మికులు మగ్గాలపై చీరలను నేస్తున్నారు. ఈ చీరకు లభించిన జాతీయ అవార్డు వల్ల ప్రజలకు ఈ చీరలపై అవగాహన పెరుగుతుందని.. దీని ద్వారా డిమాండ్ వస్తుందని చేనేత కార్మికులు ఆశిస్తున్నారు. వీరి ఆశలు ఫలించాలని.. ఈ చీరలకు జాతీయ, అంతర్జాతీయ వ్యాప్తంగా గుర్తింపు రావాలని కోరుకుందాం.

• తాళ్లూరి ప్రదీప్, చీరాల

కౌన్సెలింగ్

లింఫోడీమా ఎందుకు?

డాక్టర్! నాకు ముంజేయి వాపు ఎక్కువగా ఉంది. ఈ పరిస్థితి ఎంతో అసౌకర్యాన్ని కలిగిస్తోంది. ఇలా ఎందుకు జరుగుతోంది. ఈ సమస్యకు పరిష్కారం సూచించగలరు?

- ఓ సోదరి, హైదరాబాద్

Q A

దీన్ని లింఫోడీమా అంటారు. లింఫోడీమా అంటే అవయవ వాపు. లింఫ్ గ్రంథుల నుంచి స్రవించే స్రావం కణజాలాలకు చేరకుండా, నిల్వ ఉండిపోతే ఇలా జరుగుతుంది. ఫలితంగా ఆయా ప్రదేశాలతో సంబంధం ఉన్న కాళ్లు, చేతులు, ముఖం... వాచిపోతాయి.

వాపు నియంత్రణ మన చేతుల్లోనే

ఈ సమస్య క్రమేపీ పెరుగుతుంది. కాబట్టి ప్రారంభంలోనే గుర్తించి జాగ్రత్తపడడం అవసరం. లింఫోడీమా వాపు సాధారణ వాపు కంటే భిన్నంగా ఉంటుంది. కాళ్లలో తలెత్తే లింఫోడీమా అయినా, చేతుల్లో తలెత్తే లింఫోడీమా అయినా, వేళ్ల పైన ఉండే చర్మం ఉబ్బిపోయి, వేళ్లతో పట్టుకుని లాగడానికి సాధ్యపడదు. ఇలా ప్రారంభంలోనే గుర్తిస్తే బిగుతైన 'లింఫాటిక్ గార్మెంట్స్' వేసి వాపును అదుపులో ఉంచుకోవచ్చు.



చికిత్స ఇలా

లింఫ్ స్రావం పేరుకుపోవడం కారణంగా లింఫోడీమా తలెత్తినప్పుడు, ఆ స్రావాన్ని తిరిగి ఆ ప్రదేశం నుంచి వెనక్కి వెళ్లేలా చేయడమే ఈ సమస్యకు ప్రధాన చికిత్స. ఇందుకోసం మూడు రకాల పద్ధతులను అనుసరించాలి. అవేంటంటే....

మర్దన: మర్దన వల్ల మూసుకుపోయిన నాళాలు తెరుచుకోకపోయినా, చర్మం అడుగున కొత్త నాళాలు ఏర్పడేలా చేయవచ్చు. ఫలితంగా స్రావం వెనక్కి వెళ్లిపోతుంది. అయితే మర్దన కోసం ఎలాంటి నూనెలూ వాడకూడదు. మర్దన విధానం వైద్యుల దగ్గరే నేర్చుకుని అనుసరించాలి.

శుభ్రత: లింఫోడీమా తలెత్తిన అవయవం చర్మాన్ని శుభ్రంగా ఉంచుకోవాలి. మరీ ముఖ్యంగా వేళ్ల సందుల్లో ఎక్కువగా శుభ్రం చేసుకోవాలి. కేవలం చర్మం శుభ్రం చేసుకోవడానికే ఉదయం, సాయంత్రం చెరొక అరగంట కేటాయించాలి. జీరో పిహెచ్ రకం సబ్బునే వాడాలి. లేదంటే వాపు వల్ల ఏర్పడే ముడతల్లో బ్యాక్టీరియా చేరి ఇన్‌ఫెక్షన్లు మొదలవుతాయి. ఇలా కొత్తగా వచ్చే ఇన్‌ఫెక్షన్లు తిరిగి లింఫ్ నాళాలను మూసుకుపోయేలా చేసి పరిస్థితిని మరింత క్లిష్టం చేస్తాయి.

లింఫాటిక్ కంప్రెషన్ పంప్: ఈ పరికరం కూడా అవయవాల్లో పేరుకుపోయిన స్రావాన్ని వెనక్కి పంపిస్తుంది. ప్రారంభంలో వైద్యుల సహాయంతో ఈ చికిత్స తీసుకోవాలి. తర్వాత ఇంట్లోనే ఉపయోగించుకోవచ్చు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం గంట నుంచి గంటన్నర సమయం పాటు ఈ పరికరాన్ని ఉపయోగించాలి.

ఈ జాగ్రత్తలన్నీ నేర్చుకుని, అనుసరించడం కోసం ఆస్పత్రిలో వైద్యుల దగ్గర 8 రోజుల పాటు శిక్షణ తీసుకోవలసి ఉంటుంది. ఈ జాగ్రత్తలు పాటించగలిగితే లింఫోడీమాను 70% నుంచి 80% వరకూ తగ్గించవచ్చు. అయితే వాపు తగ్గినా కంప్రెషన్ గార్మెంట్స్ జీవితాంతం వాడుతూనే ఉండాలి.

ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్ష

లింఫోడీమాలో చర్మానికి గాయమెతే సూక్ష్మజీవులు తేలికగా ఆకర్షితమవుతాయి. దాంతో ఇన్‌ఫెక్షన్లు పెరుగుతాయి. ఈ అవకాశాలు ఎక్కువ కాబట్టి ఎటువంటి ఇన్‌ఫెక్షన్లకు గురయ్యే వీలు లేకుండా 'లాంగ్ టర్మ్ యాంటీబయాటిక్స్' తీసుకోక తప్పదు. ఈ చికిత్సలో భాగంగా తక్కువ మోతాదులో ప్రతి 21 రోజులకు ఒక ఇంజక్షన్ తీసుకోవలసి ఉంటుంది. అలాగే బాడీ మాస్ ఇండెక్స్ 30 కంటే తక్కువ ఉన్న వారితో పోలిస్తే, అంతకంటే ఎక్కువ ఉన్న వారిలో లింఫోడీమా వచ్చే అవకాశాలు మూడు రెట్లు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి బరువు అదుపులో ఉంచుకోవడం అవసరం.

డాక్టర్ రాజా వి. కొప్పాల,
ఫెలో ఇన్ ఇంటర్వెన్షనల్ రేడియాలజీ,
ఎఐజీ హాస్పిటల్, హైదరాబాద్.

విజయానికి మార్గాలు...

ఎందులోనైనా విజయం సాధించాలంటే మంచి క్రమశిక్షణతోపాటు సానుకూలదృక్పథాన్ని అలవరచుకోవాలి. వీటితోపాటు కొన్ని నైపుణ్యాలను కూడా మెరుగుపరచుకుంటే మార్గం సుగమం అవుతుందని నిపుణులు సూచిస్తున్నారు..

- వినడం, మాట్లాడడం, స్పందించడం అనేవి విషయ పరిజ్ఞానాన్ని పెంపొందిస్తాయి. ముందుకు సాగేందుకు దిశానిర్దేశం చేస్తాయి. అనుకున్నది సాధించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఇలాంటి కమ్యూనికేషన్ స్కిల్స్ మీద దృష్టి పెట్టడం తప్పనిసరి.
- భావోద్వేగాలను నియంత్రించుకోవడం అలవాటు చేసుకోవాలి. నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి. సమిష్టి కృషి ప్రాధాన్యాన్ని అర్థం చేసుకోవాలి. జట్టు సామర్థ్యాన్ని పెంచే ప్రయత్నం చేయాలి.
- సామాజిక సంబంధాలను పెంపొందించుకోవాలి. సమాజంలోని వ్యక్తులను అర్థం చేసుకోవడం, వారిని సరిగా అంచనా వేయగల్గడం నేర్చుకోవాలి. అనుబంధాలకు విలువ ఇస్తూనే నియమ నిబంధనలకు కట్టుబడి ఉండాలి.
- లక్ష్య సాధన కోసం స్వీయ ప్రేరణ అత్యవసరం. ఏదైనా సాధించాలనే తపనే ముందుకు నడిపిస్తుంది.
- సమయపాలన అనేది ఎన్నో పనులను సఫలీకృతం చేస్తుంది. ఉత్పాదకతను మెరుగుపరచి వ్యక్తిగత అభివృద్ధికి తోడ్పడుతుంది.
- ఆలోచనా విధానాన్ని సానుకూలంగా మార్చుకోవాలి. సత్సంబంధాలను ఏర్పరచుకోవాలి. వ్యక్తిగత బలహీనతలను అధిగమించే ప్రయత్నం చేయాలి. కొత్త అంశాల గురించి తెలుసుకోవడానికి ఉత్సుకతతో ఉండాలి. స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి.
- ఏదైనా సమస్య ఎదురైనప్పుడు విశ్లేషణాత్మకంగా ఆలోచించి పరిష్కారమార్గాన్ని అన్వేషించడం నేర్చుకోవాలి. దీనివల్ల ఆలోచనా సామర్థ్యం పెరుగుతుంది. మనో నిబ్బరం అలవడుతుంది.
- మార్పులను స్వీకరించడం అలవాటు చేసుకోవాలి. వాటికి అనుగుణంగా నడచుకోవడం, కొత్త సవాళ్లను ఎదుర్కోవడం అనేవి అనుభవాన్ని పెంచుతాయి. విజయానికి చేరువ చేస్తాయి.



పెద్ద చదువులకు నోచుకోలేదు... అడుగడుగునా కట్టుబాట్లు...
చిన్న వయసులోనే వివాహం, కుటుంబ బాధ్యతలు...
ఆర్తి రాణా జీవితం అందరు తెహ్రీ మహిళల్లాంటిదే.
కానీ పేదరికం నుంచి బయటపడి, స్వావలంబన సాధించాలనే పట్టుదలతో ఆమె ముందుకు నడిచారు.
ఆమె కృషి 44 గ్రామాలకు చెందిన 10 వేల మంది ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి దోహదం చేసింది.
'నారీశక్తి' అవార్డుతో సహా పలు పురస్కారాలు అందుకున్న ఆర్తి కథ ఇది...



మహిళ ఆర్థిక స్వావలంబనకు..

"మాది ఉత్తరప్రదేశ్‌లోని గోబరోలా గ్రామం. లక్ష్మీపురి కెహ్రీ జిల్లాలోని పలిలా బ్లాక్‌లో థారు గిరిజన తెగ ప్రజలు నివసిస్తున్న 46 గ్రామాల్లో అది ఒకటి. నేపాల్‌ను ఆనుకొని ఉంటుంది. నేపాల్‌లో, దేశంలోని ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, బిహార్ రాష్ట్రాల్లో మా తెగవారు అధికం. వ్యవసాయం, పశువుల పెంపకం మా ప్రధాన వృత్తి. పితృస్వామ్య భావాలు, కట్టుబాట్లు మా గ్రామాల్లో ఇప్పటికీ ఎక్కువే. అలాంటిది నలభయ్యేళ్ల క్రితం ఎలా ఉండేదో ఊహించుకోవచ్చు. ఆడపిల్లల్ని చదివించేవారు కాదు. పన్నెండేళ్లకే పెళ్లి చేసేవారు. అప్పటి నుంచి వాళ్లకు ఇల్లు, సంసారమే లోకం. తమ గ్రామం బయట ఏం ఉంటుందో చూడకుండానే వాళ్ళు జీవితకాలం గడిపేసేవాళ్ళు. అలాంటి చోట పుట్టి ఎనిమిదో తరగతి వరకూ చదవడం పెద్ద విషయమే. నాకు పెద్ద చదువులు చదవాలని ఉండేది. దానికి మా ఇంట్లో ఒప్పుకోలేదు. పద్దెనిమిదేళ్ళు రాకుండానే పెళ్ళి చేశారు. రెండేళ్ళకల్లా పిల్లలు, వాళ్ళ బాధ్యతలు. 'వాళ్ళా ఈ గ్రామంలో... అరకొర చదువులతో, పేదరికంలో మగ్గిపోవాల్సిందేనా' అనే బాధ నన్ను వేధిస్తూ ఉండేది. మా అత్తవారింట్లో మగ్గం ఉండేది. ఇంటి ఖర్చుల కోసం వాటి మీద నేయడం నేర్చుకున్నాను. కుట్టుపని కూడా చేసేదాన్ని.

గ్రామం దాటి మొదటిసారి...

2008లో... 'వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్' (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) ప్రతినిధులు మా ప్రాంతంలోని దుధ్వా నేషనల్ పార్క్‌ను సందర్శించారు. మా ఇంట్లో మగ్గం మీద నేస్తున్న నన్ను చూశారు. గ్రామీణ ప్రజల్లో హస్తకళా నైపుణ్యాలను మెరుగుపరిచి, ఉపాధి అవకాశాలు కల్పించే శిక్షణ కార్యక్రమంలో చేరాల్సిందిగా వారు నన్ను ప్రోత్సహించారు. సీతాపూర్ నగరంలో శిక్షణ. మా ఇంట్లో వద్దంటే పట్టుపట్టి ఒప్పించాను. నేను మా గ్రామం దాటి బయటకు వెళ్ళడం అదే మొదటిసారి. ఆ శిక్షణ నాకు ఎంతో ఉపయోగపడింది. మగ్గంపై మరింత నైపుణ్యంతో వస్త్రాలు ఎలా నేయవచ్చనేది నేర్చుకున్నాను. అలాగే మ్యాట్లు, బాస్కెట్లు, బ్యాగ్‌ల తయారీ తెలుసుకున్నాం.

ఆంక్షలు తగ్గాయి...

మా శిక్షణ ముగిసిన తరువాత... జిల్లా మేజిస్ట్రేట్ మాకు సర్టిఫికెట్లు అందజేశారు. మేము గ్రామాల్లో స్వయం సహాయక బృందాలను ఏర్పాటు చేసుకొని, మిగిలినవారికి చేతివృత్తుల్లో శిక్షణ ఇస్తే... దానికి అవసరమైన వనరులు సమకూరుస్తామని చెప్పారు. మా పంచాయతీ తరఫున ఆ బాధ్యతలు నాకు అప్పగించారు. మొదట మా పంచాయతీ అంతా తిరిగాను. 'జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్' (ఎన్ఆర్ఎల్ఎం) తరఫున మహిళా బృందాల ఏర్పాటు కోసం ప్రయత్నించాను. కానీ తమ ఇంట్లోని ఆడవారు బయటకు వెళ్ళడానికి ఏ కుటుంబం ఒప్పుకోలేదు. కష్టపడి రెండు బృందాలను తయారు చేసి శిక్షణ ఇచ్చాను. 'ఎన్ఆర్ఎల్ఎం' నుంచి సాయం అందింది. ఉత్పత్తులు తయారు చేసి, విక్రయించడం ప్రారంభించాం. ఈలోగా తీవ్రమైన వాతావరణ పరిస్థితుల వల్ల పెంపుడు పశువులు మరణించడం, వ్యవసాయం లాభదాయకంగా లేకపోవడం, మరోవైపు మా బృందాల ద్వారా మహిళలు ఆదాయం పొందుతూ ఉండడంతో... గ్రామస్తుల్లో మెల్లగా మార్పు వచ్చింది. ఆ తరువాత వెనుతిరిగి చూసింది లేదు. ఇప్పటివరకూ నా నేతృత్వంలో 44 గ్రామాల్లో 350 గ్రూపులు ఏర్పడ్డాయి. పదివేల మంది మహిళలు శిక్షణ పొందారు. వారిలో చాలామంది రూ.10-15 వేల కనీస ఆదాయం పొందుతున్నారు. దీంతో గ్రామాల్లో పరిస్థితుల కూడా క్రమంగా మారాయి. ఇప్పుడు మహిళలపై ఆంక్షలు బాగా తగ్గాయి. ఆడపిల్లలను కూడా బాగా చదివించాలనే ఆలోచన పెరిగింది.

> **అవి పురోగతి సాధించాలంటే...**
>
> నా కృషికి గుర్తింపుగా 2016లో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం 'రాణీ ఝాన్సీ లక్ష్మీబాయ్ బ్రేవరీ అవార్డు' ఇచ్చింది. 2022లో 'నారీ శక్తి' పురస్కారంతోపాటు, 'గ్రామస్వరాజ్ అవార్డ్' లాంటివి ఎన్నో అందుకున్నాను. ఒకప్పుడు మా గ్రామం తప్ప మరేదీ తెలియని నేను దేశమంతటా తిరిగాను. మా బృందాలు సాధించిన ఆర్థిక స్వావలంబన గురించి ఎన్నో సమావేశాల్లో ప్రసంగించాను. గ్రామీణ ప్రాంతాలు, పురుషాధిక్యత ఇప్పటికీ ఉన్న సమాజాలు పురోగతి సాధించాలంటే మహిళల ఆర్థిక స్వావలంబనే ఏకైక మార్గం.

స్థానికమైనవే ముడిసరుకుగా...

సభ్యుల సంఖ్య పెరగడంతో మార్కెట్‌ను విస్తరించాల్సిన అవసరం ఏర్పడింది. మేము సాధారణంగా ముడి సరుకుల కోసం సీతాపూర్ వరకూ వెళ్ళాల్సి వచ్చేది. కరోనా సమయంలో అది వీలు కాకపోవడంతో... మా ప్రాంతంలో పుష్కలంగా పెరిగే మూంజ్ గడ్డితో బాస్కెట్లు, పెన్ను స్టాండుల్లాంటి వస్తువుల తయారీని సభ్యులకు నేర్పించాం. దాని కోసం ఐటిడిపి, డబ్ల్యూడబ్ల్యూఎఫ్‌ల సాయం తీసుకున్నాం. ఇప్పుడు ఎక్కువగా స్థానికంగా దొరికే వాటినే ముడిసరుకుగా ఉపయోగిస్తున్నాం. చేనేత వస్త్రాలు, హస్తకళాకృతులతో పాటు నిత్యం వినియోగించే బాస్కెట్లు, బ్యాగులు, డోర్‌మ్యాట్లు, పూల కుండీలు, పేపర్ స్టాండ్‌లు, మొబైల్ కవర్లు, శాండల్స్‌తో సహా ఎన్నెన్నో రూపొందిస్తున్నాం. వాటికి మంచి ఆదరణ లభిస్తోంది."

ఇవి తినిపించాలి

పసిపిల్లలకు ఆరోనెల రాగానే అన్నప్రాసన చేసి ఘనాహారాన్ని తినిపించడం మొదలుపెడతారు. అప్పటివరకూ తల్లిపాలు మాత్రమే తాగుతారు కాబట్టి పిల్లల జీర్ణాశయం సున్నితంగా పనిచేస్తూ ఉంటుంది. ఇది అన్ని రకాల ఆహారపదార్థాలను జీర్ణం చేయలేదు. అందుకే త్వరగా జీర్ణమయ్యే తేలికపాటి ఆహారాన్ని మాత్రమే ఈ పిల్లలకు తినిపించాలి. ఆ వివరాలు...

- బాగా పండిన అరటి పండు గుజ్జును తినిపించవచ్చు. ఇందులో పొటాషియం, పీచుపదార్థాలు అధికంగా ఉంటాయి. ఇవి పిల్లల్లో మలబద్ధకం సమస్యను నివారిస్తాయి. యాపిల్, బొప్పాయి పండ్లను కూడా గుజ్జులా చేసి పెట్టవచ్చు.
- పచ్చి బఠానీలను కుక్కర్లో ఉడికించి మెత్తగా మెదిపి కొద్దికొద్దిగా తినిపించాలి. ఇందులో ఎ, సి విటమిన్లతో పాటు ప్రోటీన్లు, ఐరన్, కాల్షియం లాంటి పోషకాలు ఉంటాయి. ఇవి పిల్లల ఎదుగుదలకు తోడ్పడతాయి.
- చిలగడ దుంపలను బాగా కడిగి ఉడికించి తొక్క తీసి వ్రేళ్లతో మెత్తగా చిదిమి తినిపించవచ్చు. ఇందులో అధికంగా గ్లూకోజ్ ఉంటుంది. ఇది పిల్లలకు శక్తిని అందిస్తుంది.
- అవకాడోను కూడా మెత్తగా చేసి తినిపించడం మంచిది. ఇందులో ఆరోగ్యకరమైన క్రొవ్వులు అధికంగా ఉంటాయి. ఇవి పిల్లల మెదడు పనితీరుని మెరుగుపరుస్తాయి.



- రకరకాల కూరగాయలను మెత్తగా ఉడికించి పెట్టవచ్చు. టమాటా రసం, ఉడికించిన కందిపప్పు మీద తేరిన నీరు లాంటివి తాగించవచ్చు. మెత్తగా వండిన అన్నం, క్వినోవాలతోపాటు బొంబాయిరవ్వ ఉప్మా, ఇడ్లీ లాంటివాటిని మెల్లగా అలవాటు చేయాలి.
- క్యారెట్‌కు తొక్క తీసి ఉడికించి తినిపించాలి. దీనిలోని యాంటీ ఆక్సిడెంట్లు పిల్లలకు రోగ నిరోధక శక్తిని అందిస్తాయి. కళ్ల ఆరోగ్యాన్ని కాపాడతాయి.
- మధ్యాహ్న సమయాల్లో రాగిజావ, పెసరపప్పు రసం పెట్టవచ్చు. వీటిలోని ప్రోటీన్లు, ఐరన్, కాల్షియం, పీచు పదార్థాలు, ఇతర విటమిన్లు కలిసి పిల్లలు ఆరోగ్యంగా ఎదిగేందుకు సహకరిస్తాయి.

ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్
బ్రాండ్ అంబాసిడర్‌గా కంగన



న్యూఢిల్లీ: నటి, పార్లమెంట్ సభ్యురాలు కంగన రనౌత్ ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌నకు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమితురాలైంది. ఈ మెగా టోర్నమెంట్ ఈ సెప్టెంబరు 26 నుంచి అక్టోబరు 5 వరకు ఢిల్లీ వేదికగా జరగనుంది. వంద దేశాలకు పైగా పారా అథ్లెట్లు పోటీపడే ఈ చాంపియన్‌షిప్‌నకు అసలైన అంబాసిడర్ కంగన అని భారత పారాలింపిక్ కమిటీ తెలిపింది. అంబాసిడర్ హోదాలో మన చాంపియన్లకు మద్దతుగా నిలిచే అదృష్టం దక్కినందుకు చాలా సంతోషంగా ఉందని కంగన వ్యాఖ్యానించింది.

విరాట్ స్థానం గిల్‌దే..



హెడింగ్లీ: ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లో శుభ్‌మన్ గిల్ నాలుగో స్థానంలో బ్యాటింగ్ చేస్తాడని వైస్-కెప్టెన్ పంత్ తెలిపాడు. తాను ఐదో స్థానంలోనే బరిలో దిగుతానని బుధవారం ఇక్కడ జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించాడు. విరాట్ రిటైరైన నేపథ్యంలో నాలుగో నెంబర్‌లో ఎవరు బ్యాటింగ్ చేస్తారోననే చర్చ బయలుదేరింది. దానికి పంత్ తెరదించాడు. 'మూడో నెంబర్ బ్యాటర్‌పై ఇంకా చర్చ జరుగుతోంది. కానీ 4, 5 స్థానాలలో ఎవరొస్తారో ఖరారైంది. గిల్ నాలుగో నెంబర్‌లో బరిలో దిగే చాన్సుంది. నేను మాత్రం ఐదో స్థానంలోనే బ్యాటింగ్ చేస్తా' అని పంత్ వివరించాడు.

గిల్ సేన.. సాధించేనా?

రేపటి నుంచే ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్



ప్రాక్టీస్‌లో గిల్, నితీశ్, శార్దూల్

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

టెస్టుల్లో భారత్, ఇంగ్లండ్ పోరు దశాబ్దాలనాటిది. 1932 నుంచి ఇంగ్లండ్‌లో టీమిండియా పర్యటిస్తున్నా సిరీస్ గెలిచిన సందర్భం ఒక్కటే..! అంటే పర్యాటక జట్టుకు ఎంత కష్టమో రికార్డులను చూస్తేనే అర్థమవుతోంది. 2007లో రాహుల్ ద్రవిడ్ సారథ్యంలో మూడు టెస్టుల సిరీస్‌ను భారత్ 1-0తో దక్కించుకుంది. నాటింగ్‌హామ్‌లో జరిగిన రెండో టెస్టులో జహీర్ ఖాన్ నిప్పులు చెరగగా.. సచిన్, గంగూలీ, లక్ష్మణ్ బ్యాట్‌తో చెలరేగడంతో భారత్ 7 వికెట్ల తేడాతో నెగ్గింది. లార్డ్స్, ఓవల్‌లో జరిగిన మ్యాచ్‌లను టీమిండియా డ్రాగా ముగించింది. ఆ తర్వాత రోహిత్ శర్మ, కోహ్లీ, అశ్విన్, బుమ్రాలతో భారత్ మేటి జట్టుగా ఎదిగినా.. ఇంగ్లండ్‌లో మాత్రం మరో సిరీస్‌ను సొంతం చేసుకోలేక పోయింది. 2021 పర్యటనలో భారత్ 2-1తో ఆధిక్యం సాధించినా.. కరోనా కారణంగా సిరీస్‌లో నాలుగో, ఆఖరి టెస్టును 2022కు వాయిదా వేశారు. ఎడ్జ్‌బాస్టన్‌లో జరిగిన ఆ మ్యాచ్‌లో భారత్ ఓడడంతో సిరీస్ 2-2తో సమమైంది.

సంధి దశలోనే..

ఈసారి పర్యటనలో యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సారథ్యంలో భారత్ బరిలోకి దిగుతోంది. కోహ్లీ, రోహిత్ రిటైర్మెంట్‌తో జట్టులో అనుభవలేమి కనిపిస్తోంది. అయితే, అరంగేట్రం బ్యాటర్ సాయి సుదర్శన్, యశస్వి జైస్వాల్, రాహుల్, కరుణ్ నాయర్, రిషభ్ పంత్, జడేజాతో బ్యాటింగ్ బలంగానే ఉంది. పేస్ విభాగానికి బుమ్రా, సిరాజ్ ప్రధానం కాగా.. అశ్విన్ లేకపోవడంతో స్పిన్ భారం జడేజాపైనే పడనుంది. మరోవైపు ఇంగ్లండ్ పరిస్థితి కూడా టీమిండియాలాగే సంధి దశలో ఉంది. అండర్సన్, బ్రాడ్ రిటైర్మెంట్ తర్వాత జరుగుతున్న తొలి సిరీస్ ఇది. ఓవర్టన్, క్రిస్ వోక్స్, షోయబ్ బషీర్‌తో బౌలింగ్ విభాగం కొత్తగా కనిపిస్తోంది.

ఇరు జట్ల ముఖాముఖి

మొత్తం ఆడిన టెస్టులు: 36
భారత్ గెలిచినవి: 11
ఇంగ్లండ్ నెగ్గినవి: 17
డ్రాగా ముగిసినవి: 8

బ్యాటింగ్ వికెట్ సిద్ధమా!

లీడ్స్: వేడి వాతావరణం, ఇంగ్లండ్ బజ్‌బాల్ నేపథ్యంలో శుక్రవారం నుంచి జరిగే తొలి టెస్టుకు ఎలాంటి పిచ్‌ను సిద్ధం చేస్తారా? అనేది ఆసక్తిగా మారింది. అయితే, లీడ్స్ గ్రౌండ్ హెడ్ రిచర్డ్ రాబిన్సన్ మాత్రం మొదటి టెస్ట్‌కు చక్కని బ్యాటింగ్ వికెట్ లభించే అవకాశం ఉందని చెప్పాడు. సాధారణంగా ఈ గ్రౌండ్‌లో సిరీస్ మధ్యలో మ్యాచ్‌ను నిర్వహిస్తుంటారు. కానీ, ఈసారి తొలి మ్యాచ్‌నే ఇక్కడ షెడ్యూల్ చేయడం ఎక్కువమంది దృష్టిని ఆకర్షిస్తోంది. 'చక్కని వికెట్ కావాలని ఇంగ్లండ్ కోరుతోంది. బంతి బ్యాట్‌మీదకు రావాలని చెప్పార'ని రాబిన్సన్ చెప్పాడు. తొలి రోజు పేసర్లకు అనుకూలించినా.. వేడి వాతావరణం కారణంగా పిచ్ ఫ్లాట్‌గా మారే అవకాశాలున్నాయన్నాడు. అంతగా అనుభవంలేని భారత బ్యాటర్లకు కూడా ఇది అనుకూలమన్నాడు. టాస్ గెలిచిన జట్టు బ్యాటింగ్ ఎంచుకొనే చాన్సుందన్నాడు.

ఆ ఆల్‌రౌండర్ ఎవరు?

టీమిండియా తుది జట్టు కూర్పు చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ స్థానం కోసం నితీశ్ కుమార్, శార్దూల్ ఠాకూర్ పోటీపడుతుండడంతో..ఎవరు తుది జట్టులో ఉంటారోనన్న ఆసక్తి నెలకొంది. ఆస్ట్రేలియా టూర్‌కు శార్దూల్‌ను పక్కనబెట్టి నితీశ్‌కు అవకాశం ఇచ్చారు. మెల్‌బోర్న్ టెస్టులో శతకం బాదిన నితీశ్ బ్యాట్‌తో ఆకట్టుకొన్నా, బంతితో రాణించలేక పోయాడు. పరుగులను నియంత్రించ గలుగుతున్నా.. వికెట్ల విషయంలో నితీశ్ వెనకబడ్డాడు. ఈ నేపథ్యంలో ఆల్‌రౌండర్ స్థానానికి అతడు న్యాయం చేస్తాడా? అనే ప్రశ్న తలెత్తుతోంది. పైగా గాయం నుంచి కోలుకొన్న నితీశ్ ఫిట్‌నెస్‌పై సందేహాలున్నాయి. ఇక.. 2023 డిసెంబరులో దక్షిణాఫ్రికాతో టెస్టు తర్వాత ఫిట్‌నెస్ సమస్యలతో ఇబ్బందిపడిన శార్దూల్ ఠాకూర్ క్రమంగా కోలుకొన్నాడు. దేశవాళీల్లో రాణించి మళ్లీ టీమిండియాలోకి ఎంట్రీ ఇచ్చాడు. పైగా ఇంగ్లండ్ గడ్డపై ఆడిన అనుభవంతోపాటు పార్ట్‌నర్‌షిప్ బ్రేకర్‌గా ఠాకూర్‌కు పేరుంది. బ్యాట్‌తోనూ ఆకట్టుకొంటున్న అతడు ప్రాక్టీస్ మ్యాచ్‌లోనూ సెంచరీ సాధించాడు.

నేనైతే అతడే అంటాను: రవిశాస్త్రి

పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ స్థానం కోసం నితీశ్, శార్దూల్‌లలో ఎవర్ని ఎంపిక చేయాలన్న అంశంపై టీమిండియా మాజీ కోచ్ రవిశాస్త్రి ఆసక్తికరమైన సమాధానం చెప్పాడు. తానైతే ఠాకూర్‌వైపే మొగ్గుచూపుతానని శాస్త్రి అన్నాడు. 'నేనైతే ముగ్గురు పేసర్లు, శార్దూల్‌తో ఆడతా. నితీశ్, ఠాకూర్ మధ్య ఒకరిని ఎంపిక చేయడం కష్టమే. కానీ, ఎక్కువ ఓవర్లు బౌలింగ్ చేయగల సామర్థ్యం ఎవరికి ఉందనేది ముఖ్యం. నితీశ్ 12-14 ఓవర్లు వేయగలిగితే అతడికే నా మద్దతు. ఎందుకంటే అతడు కూడా బ్యాటింగ్ చేయగలడ'ని రవి చెప్పాడు. బుమ్రా, సిరాజ్‌తోపాటు ప్రసిద్ధ్ కృష్ణను మూడో పేసర్‌గా ఎంపిక చేయాలన్నాడు.

రూ. 538 కోట్లు చెల్లించాల్సిందే..

బీసీసీఐకి బాంబే హైకోర్టు షాక్
కొచ్చి టస్కర్స్ కేసులో తీర్పు

ముంబై: బాంబే హైకోర్టులో బీసీసీఐకి పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. ఐపీఎల్ జట్టు కొచ్చి టస్కర్స్‌కు అనుకూలంగా హైకోర్టు తీర్పు ఇచ్చింది. కొచ్చి ఫ్రాంచైజీకి రూ. 538 కోట్లు పరిహారంగా చెల్లించాలని ఆర్బిట్రేషన్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పును హైకోర్టు సమర్థించింది. వివరాలేంటంటే.. ఐపీఎల్‌లో కొచ్చి టస్కర్స్ 2011 సీజన్‌లో మాత్రమే ఆడింది. ఆపై..తమతో చేసుకున్న ఒప్పందాన్ని ఉల్లంఘించిందంటూ టస్కర్స్‌ను ఐపీఎల్ నుంచి బీసీసీఐ తొలగించింది. బ్యాంకు గ్యారెంటీనీ సరైన సమయంలో అందజేయకపోవడంతో ఆ నిర్ణయం తీసుకున్నట్టు బోర్డు వివరించింది. దాంతో కొచ్చి జట్టు 2012 ఆర్బిట్రేషన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించగా.. ట్రిబ్యునల్ కొచ్చికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. తొలగింపునకు పరిహారంగా రూ. 538 కోట్లను టస్కర్స్‌కు చెల్లించాలని బోర్డును ఆదేశించింది. అయితే ట్రిబ్యునల్ తీర్పును బాంబే హైకోర్టులో బీసీసీఐ సవాలు చేసింది. దీనిపై విచారించిన ఏకసభ్య ధర్మాసనం జడ్జి ఆర్ఐ చాగ్లా బీసీసీఐ పిటిషన్‌ను కొట్టివేశారు. కొచ్చికి రూ. 538 కోట్లు చెల్లించాలన్న ఆర్బిట్రేషన్ ట్రిబ్యునల్ తీర్పును సమర్థించారు. కాగా..తీర్పుపై బీసీసీఐ స్పందన తెలియరాలేదు. హైకోర్టును తీర్పును సుప్రీం కోర్టులో సవాలు చేస్తుందేమో చూడాలి.

పాక్‌తో భారత్ తొలి పోరు

మహిళల టీ20 వరల్డ్‌కప్-2026 షెడ్యూల్ విడుదల



దుబాయ్: మహిళల టీ20 వరల్డ్‌కప్-2026లో తమ తొలి మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో భారత్ తలపడనుంది. ఇంగ్లండ్‌లో వచ్చే ఏడాది జూన్ 12 నుంచి జూలై 5 వరకు.. 24 రోజులపాటు జరిగే పొట్టికప్ షెడ్యూల్‌ను ఐసీసీ బుధవారం విడుదల చేసింది. టోర్నీలో పాల్గొనే 12 జట్లను రెండు గ్రూపులుగా విభజించారు. గ్రూప్-1లో భారత్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, పాకిస్థాన్‌తో పాటు రెండు క్వాలిఫయర్ జట్లు.. గ్రూప్-2లో వెస్టిండీస్, ఇంగ్లండ్, న్యూజిలాండ్, శ్రీలంకతోపాటు రెండు క్వాలిఫయర్ టీమ్‌లు ఆడనున్నాయి. జూన్ 12న ఎడ్జ్‌బాస్టన్‌లో జరిగే ఆరంభ మ్యాచ్‌లో ఆతిథ్య ఇంగ్లండ్‌తో శ్రీలంక తలపడనుండగా.. ఇదే వేదికపై 14న జరిగే పోరులో పాక్‌తో భారత్ ఆడనుంది. గ్రూప్‌లో టాప్-2లో నిలిచిన జట్లు సెమీస్‌కు అర్హత సాధిస్తాయి. జూన్ 30, జూలై 2న సెమీ ఫైనల్స్. జూలై 5న లార్డ్స్‌లో టైటిల్ ఫైట్ జరగనున్నాయి.

కోహ్లీ లేకపోవడంతో..

ఇంగ్లండ్ కెప్టెన్ స్టోక్స్



లీడ్స్: బ్లాక్‌బస్టర్‌లాంటి టెస్ట్ సిరీస్‌లో విరాట్ కోహ్లీవంటి గొప్ప ఆటగాడిని ఎదుర్కోలేకపోవడం ఎంతో విచారకరమని ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ వ్యాఖ్యానించాడు. కోహ్లీ లేని భారత జట్టులో మునుపటి పోరాటతత్వం, గెలవాలన్న తపన సన్నగిల్లుతాయని అన్నాడు. టెస్ట్ ఫార్మాట్‌కు గత నెలలో విరాట్ వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. అంతకుముందు కొద్ది రోజుల కిందటే రోహిత్ శర్మ కూడా టెస్ట్‌లకు రిటైర్మెంట్ ప్రకటించాడు. దాంతో సంధి దశలో ఉన్న భారత జట్టు యువ కెప్టెన్ గిల్ ఆధ్వర్యంలో ఇంగ్లండ్‌ను ఐదు టెస్ట్‌ల్లో ఢీకొనబోతోంది. ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) విడుదల జేసిన ఓ వీడియోలో స్టోక్స్..కోహ్లీ నిష్క్రమణపై తన అభిప్రాయాలను వెల్లడించాడు. మైదానంలో తామిద్దరిదీ ఒకే తరహా మైండ్‌సెట్ అనీ, అతనితో తలపడే అవకాశం లభించకపోవడం తనకే మాత్రం నచ్చడంలేదని స్టోక్స్ చెప్పాడు. ఇదే విషయాన్ని కోహ్లీకి మెసేజ్ చేశానని అన్నాడు. 'జెర్సీ నెంబర్ 18ని విరాట్ తనదిగా చేసుకున్నాడు. ఇకపై ఆ నెంబర్ ఏ భారత జట్టు క్రికెటర్ జెర్సీపైనా కనిపించకపోవడాన్ని జీర్ణించుకోవడం కష్టమే. కోహ్లీ ఆ నెంబర్‌కు అంతలా వన్నె తెచ్చాడు' అని బెన్ చెప్పుకొచ్చాడు.

విరాట్‌లేని లోటు సుస్పష్టం: బాయ్‌కాట్

ఇంగ్లండ్‌తో టెస్ట్ సిరీస్‌లో రోహిత్ శర్మకన్నా విరాట్ కోహ్లీలేని లోటు భారత్‌కు స్పష్టంగా కనిపిస్తుందని దిగ్గజ బ్యాటర్ బాయ్‌కాట్ అభిప్రాయపడ్డాడు. 'కోహ్లీ లేకపోవడం టీమిండియాపై పెను ప్రభావం చూపుతుంది' అన్నాడు.

ఇంగ్లండ్‌కు సూర్యకుమార్



న్యూఢిల్లీ: టీమిండియా టీ20 సారథి సూర్యకుమార్ యాదవ్ ఇంగ్లండ్ వెళ్లాడు. స్పోర్ట్స్ హెర్నియా (గజ్జల్లో లేదా పొత్తి కడుపులో నొప్పి) సంబంధిత గాయానికి చికిత్స కోసం అతను ఇంగ్లండ్ వెళ్లినట్టు బీసీసీఐ అధికారి ఒకరు వెల్లడించాడు. అవసరమైతే సూర్య తన గాయానికి శస్త్రచికిత్స కూడా చేయించుకునే అవకాశముందని తెలిపాడు. ఐపీఎల్ ముగిశాక సూర్య ముంబై టీ20 టోర్నీలో ఆడాడు. ఆ టోర్నీ సందర్భంగా అతనికి నొప్పి తీవ్రమైనట్టు సమాచారం. 'గాయానికి చికిత్స తీసుకోవడానికి ఇదే సరైన సమయమని సూర్య భావించాడు. చికిత్స అనంతరం పునరావాసం కోసం అతను బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో చేరనున్నాడు' అని బీసీసీఐ అధికారి పేర్కొన్నాడు.

బంగ్లాదేశ్ 484/9

శ్రీలంకతో తొలి టెస్ట్

గాలె: శ్రీలంకతో తొలి టెస్ట్‌లో రెండో రోజు ఆఖరికి బంగ్లాదేశ్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో తొమ్మిది వికెట్లకు 484 పరుగులు చేసింది. ఓవర్‌నైట్ 292/3 స్కోరుతో బుధవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లాదేశ్ మరో 192 పరుగులు జోడించి 6 వికెట్లు కోల్పోయింది. కిందటి రోజు బ్యాటర్లు షంటో (148), ముష్ఫికర్ రహీమ్ (163) నాలుగో వికెట్‌కు 264 పరుగులు జోడించారు. అనంతరం లిటన్ దాస్ (90) జతగా ఐదో వికెట్‌కు ముష్ఫికర్ మరో 149 రన్స్ జత చేశాడు. అయితే రెండు గంటల పాటు వర్షంతో ఆటకు అంతరాయం ఏర్పడి తిరిగి మొదలయ్యాక లంక బౌలర్లు విజృంభించారు. 20.4 ఓవర్లు బౌల్ చేసి 61 పరుగులే ఇచ్చి 5 బంగ్లా వికెట్లు పడగొట్టారు.

క్వితోవాకు వింబుల్డన్ వైల్డ్‌కార్డ్



లండన్: రెండుసార్లు వింబుల్డన్ చాంపియన్ పెట్రా క్వితోవా (చెక్ రిపబ్లిక్)కు ఆ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో వైల్డ్‌కార్డ్ లభించింది. దీంతో ఈనెల 30 నుంచి జరిగే వింబుల్డన్‌లో క్వితోవా నేరుగా మెయిన్ డ్రాలో తలపడనుంది. ఏడాదిన్నరపాటు ఆటకు దూరంగా ఉన్న ఆమె.. ప్రస్తుతం 572వ ర్యాంక్‌లో ఉంది.

పీఎస్‌యూల స్వచ్ఛంద డీలిస్టింగ్‌కు
సెబీ లైన్ క్లియర్



- రీట్స్, ఇన్విట్స్‌కు ఈక్విటీ షేర్ల హోదా
- క్యూఐపీ వెల్లడి నిబంధనల సరళీకరణ

న్యూఢిల్లీ: పెట్టుబడుల మార్కెట్‌లో మరిన్ని సంస్కరణలకు సెబీ శ్రీకారం చుట్టింది. చైర్మన్ తుహిన్ పాండే అధ్యక్షతన బుధవారం సమావేశమైన సెబీ బోర్డు దీనికి సంబంధించి పలు ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది.

సెబీ బోర్డు తీసుకున్న కీలక నిర్ణయాలు...

ప్రభుత్వ రంగ సంస్థల (పీఎస్‌యూ) స్వచ్ఛంద డిలిస్టింగ్‌కు అనుమతిస్తూ సెబీ కీలక నిర్ణయం తీసుకుంది. ఈక్విటీలో 90 శాతం లేదా అంతకంటే ఎక్కువ వాటా ప్రభుత్వానికి ఉన్న పీఎస్‌యూలకు మాత్రమే ఈ వెసులుబాటు ఉంటుంది. కాకపోతే ఇందుకు మెజారిటీ వాటాదారుల ఆమోదంతో పాటు, రెగ్యులేటరీ సంస్థల అనుమతి అవసరం. ఈ సంస్కరణతో పీఎస్‌యూల వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ మరింత వేగంగా పూర్తవుతుందని భావిస్తున్నారు.

స్టార్టప్స్- ఈసాప్స్: ఐపీఓల తర్వాత కూడా స్టార్టప్ కంపెనీల ప్రమోటర్లు ఉద్యోగుల తరహాలో ఎంప్లాయిస్ స్టాక్ ఓనర్‌షిప్ ప్లాన్స్ (ఈసాప్స్) కలిగి ఉండేందుకు సెబీ బోర్డు ఆమోదం తెలిపింది. కాకపోతే ఐపీఓకు ఏడాది ముందే వీరు ఈ షేర్లను డీమ్యాట్ రూపంలో కలిగి ఉండాలని స్పష్టం చేసింది. ఇప్పటి వరకు ఉన్న నిబంధనల ప్రకారం ఐపీఓల తర్వాత స్టార్టప్‌ల వ్యవస్థాపకులను ప్రమోటర్లుగా పరిగణించి ఈసాప్ షేర్లు కలిగి ఉండేందుకు అనుమతించరు. తాజా సంస్కరణ స్టార్టప్ కంపెనీల దీర్ఘకాలిక వృద్ధిలో ప్రమోటర్లు మరింత మమేకమయ్యేందుకు వీలవుతుందని భావిస్తున్నారు.

ఏఐఎఫ్‌లకు వెసులుబాటు: ప్రత్యామ్నాయ పెట్టుబడి పథకాల్లో (ఏఐఎఫ్) మదుపు చేసే వారికి సెబీ కొత్త వెసులుబాటు కల్పించింది. ఇక ఈ మదుపరులు ఏఐఎఫ్‌లు పెట్టుబడులు పెట్టిన అన్‌లిస్టెడ్ కంపెనీల్లో అదనపు పెట్టుబడులు పెట్టేందుకు అనుమతిస్తారు. కాకపోతే ఏఐఎఫ్‌లు ఇందుకోసం ప్రత్యేక పథకంలా ఒక స్వతంత్ర కో ఇన్వెస్ట్‌మెంట్ వెహికల్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అలాగే ఏఐఎఫ్‌ల మేనేజర్లు అన్ని రకాల మదుపరులకు సలహా సేవలు అందించేందుకూ సెబీ ఆమోదం తెలిపింది.

ప్రభుత్వ రుణ పత్రాలు - ఎఫ్‌పీఐలు: ప్రభుత్వ రుణ పత్రాల్లో విదేశీ పోర్టుఫోలియో మదుపరుల పెట్టుబడుల రిజిస్ట్రేషన్, కంప్లయన్స్ ప్రక్రియను సెబీ మరింత సులభం చేసింది. దీంతో ఎఫ్‌పీఐలు మరింత చురుగ్గా పెద్దగా నష్ట భయం లేని ప్రభుత్వ రుణ పత్రాల్లో దీర్ఘకాలిక పెట్టుబడులు పెట్టేందుకు మార్గం సుగమమైంది. వీటికి తోడు ఇన్‌ఫ్రా కంపెనీలు, రియల్ ఎస్టేట్ కంపెనీలు జారీ చేసే ఇన్విట్స్, రీట్స్‌ను ఈక్విటీ షేర్లుగా పరిగణించేందుకు సెబీ బోర్డు ఆమోదం తెలిపింది. క్యూఐపీ ఇష్యూల నిబంధనల వెల్లడినీ మరింత సులభతరం చేసింది.

వెంటాడిన యుద్ధ భయం

- 138 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్

ముంబై: స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా రెండో రోజూ నష్టపోయాయి. సెన్సెక్స్ 138.64 పాయింట్ల నష్టంతో 81,444.66 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 41.35 పాయింట్లు కోల్పోయి 24,812.05 వద్ద ముగిసింది. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం కారణంగా ముడిచమురు ధరలు పెరగుతుండటంతో పాటు అమెరికా ఫెడరల్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీ రేట్లపై తన నిర్ణయాన్ని ప్రకటించనున్న నేపథ్యంలో మదుపరులు అప్రమత్తమై అమ్మకాలకు మొగ్గుచూపడం ఇందుకు కారణం.

● డాలర్‌తో రూపాయి మారకం విలువ 9 పైసలు క్షీణించి రూ.86.43 వద్ద ముగిసింది. ఈక్విటీ నష్టాలు, క్రూడ్ ధరల పెరుగుదల ఇందుకు కారణం.

● అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ ముడిచమురు పీపా ధర ఒకదశలో 77 డాలర్ల ఎగువన ట్రేడైంది.

వెండి సరికొత్త రికార్డు

హైదరాబాద్ మార్కెట్లో కిలో రూ.1.21 లక్షలు
అంతర్జాతీయ విపణిలో 37 డాలర్ల పైకి ఔన్స్ సిల్వర్



వెండి సరికొత్త జీవనకాల గరిష్ఠ స్థాయికి ఎగబాకింది. హైదరాబాద్ మార్కెట్లో కిలో వెండి రేటు బుధవారం రూ.1,000 పెరిగి రూ.1.21 లక్షలకు చేరింది. వెండి ధర పెరగడం వరుసగా ఇది మూడో రోజు. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో (ఎంసీఎక్స్) కూడా వెండి ఫ్యూచర్స్ కాంట్రాక్టు ధరలు ఆల్‌టైం రికార్డు స్థాయిని తాకాయి. జూలై గడువు కాంట్రాక్టు ధర రూ.1,09,748కి, సెప్టెంబరు గడువు కాంట్రాక్టు రేటు రూ.1.11 లక్షలకు ఎగబాకింది. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో ఇన్వెస్టర్లు అనిశ్చితుల్లో భద్రమైన పెట్టుబడి సాధనంగా పేరున్న విలువైన లోహాలపైకి దృష్టి మళ్లించారు. అయితే, బంగారం ధరలు ఇప్పటికే రికార్డు స్థాయిల్లో కొనసాగుతుండటంతో వెండిలో పెట్టుబడులకు ఇన్వెస్టర్లు ఎక్కువగా మొగ్గుచూపుతున్నట్లు విశ్లేషకులు తెలిపారు. అలాగే, పారిశ్రామిక అవసరాలకు తగినంత స్థాయిలో సరఫరా లేకపోవడం కూడా వెండి ధర లు ఎగబాకడానికి మరో కారణం. దాంతో అంతర్జాతీయ విపణిలో ఔన్స్ (31.10 గ్రాములు) వెండి రేటు ఒక దశలో 37.23 డాలర్లకు చేరింది. 2012 ఫిబ్రవరి తర్వాత వెండికిదే గరిష్ఠ స్థాయి. దశాబ్దానికి పైగా కాలంలో ఔన్స్ సిల్వర్ 37 డాలర్లు దాటడం ఇదే మొదటిసారి.

భవిష్యత్‌లో రూ.2 లక్షలు?

వెండి ధరలు భవిష్యత్‌లో రెట్టింపు కానున్నాయని, ఔన్స్ సిల్వర్ 70 డాలర్లకు చేరుకోవచ్చని రిచ్ డాడ్.. పూర్ డాడ్ పుస్తక రచయిత, ప్రముఖ ఇన్వెస్టర్ రాబర్ట్ కియోసాకీ అంచనా వేశారు. అంతర్జాతీయంగా రాజకీయ భౌగోళిక అనిశ్చితులు పెరుగుతుండటంతోపాటు ఎలక్ట్రానిక్స్ రంగం శరవేగ వృద్ధి నేపథ్యంలో ఇండస్ట్రీ అవసరాలకు తగినంత వెండి సరఫరా జరగకపోవడం ఇందుకు కారణమన్నారు. రాబర్ట్ అంచనాలు నిజమైతే, దేశీయ మార్కెట్లో కిలో వెండి రూ.2 లక్షలు దాటుతుంది.

ఈ ఏడాదిలో రూ.23,000 పెరుగుదల

2025 జనవరి 1న హైదరాబాద్ మార్కెట్లో కిలో వెండి ధర రూ.98,000గా ఉంది. అంటే, ఈ ఏడాదిలో ఇప్పటి వరకు రేటు రూ.23,000 పెరిగింది. ముున్ముందు మరింత ఎగబాకే అవకాశం ఉందని బులియన్ విశ్లేషకులు భావిస్తున్నారు. అంతర్జాతీయ విపణిలో ఔన్స్ వెండి 36.89 డాలర్ల వద్ద కీలక నిరోధ స్థాయిని అధిగమించడమే ఇందుకు కారణం. తదుపరి దశలో 40 డాలర్ల దిశగా పరుగు తీయవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అయితే, 38.34 డాలర్ల స్థాయిలో గట్టి నిరోధం ఎదురుకావచ్చని వారు భావిస్తున్నారు.

రూ.లక్షపైన బంగారం

మేలిమి (24 క్యారెట్లు) బంగారం ధర 10 గ్రాములకు రూ.540 పెరుగుదలతో రూ.1,00,910కి చేరింది. 22 క్యారెట్ల లోహం రేటు రూ.500 పెరుగుదలతో రూ.92,500కు ఎగబాకింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ఒకదశలో 3,400 డాలర్ల ఎగువన ట్రేడైంది.

విప్రో ఇన్‌ఫ్రా ఇంజనీరింగ్‌కు
ఫ్రెంచ్ కంపెనీలో మెజారిటీ వాటా

న్యూఢిల్లీ: ఫ్రాన్స్‌కు చెందిన విమానాల విడిభాగాల తయారీదారు లౌక్ గ్రూప్‌లో మెజారిటీ వాటా కొనుగోలు చేస్తున్నట్లు ఇంజనీరింగ్ అండ్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ విప్రో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంజనీరింగ్ (డబ్ల్యూఐఎన్) బుధవారం తెలిపింది. ప్రస్తుతం ప్యారిస్‌లో జరుగుతున్న ఎయిర్‌షోలో ఇరువర్గాలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. అయితే, ఎంత వాటా, ఎంతకు కొనుగోలు చేస్తున్న వివరాలను మాత్రం డబ్ల్యూఐఎన్ వెల్లడించలేదు. మరికొద్ది నెలల్లో ఈ కొనుగోలు ఒప్పందం పూర్తి కావచ్చని అంచనా. ఈ డీల్ పూర్తయ్యాక కంపెనీ పేరును విప్రో లౌక్‌గా మార్చనున్నారు. 50 ఏళ్ల నాటి కుటుంబ యాజమాన్య సంస్థ అయిన లౌక్ గ్రూప్.. పలు అంతర్జాతీయ ఏరోస్పేస్ కంపెనీలకు విమానాల విడిభాగాలను సరఫరా చేస్తోంది.

ప్యారిస్ ఎయిర్ షోలో రఘు వంశీ

హైదరాబాద్‌కు చెందిన రఘు వంశీ ఏరోస్పేస్ గ్రూప్ ప్రస్తుతం పారిస్‌లో జరుగుతున్న 55వ అంతర్జాతీయ ఎయిర్ షోలో తన ఆధునిక డిఫెన్స్ అండ్ ప్రొపల్షన్ టెక్నాలజీలను ప్రదర్శించింది. దేశీయంగా తయారు చేసిన మైక్రో టర్బోజెట్ ఇంజన్ల నుంచి హై పెర్‌ఫార్మెన్స్ కామికేజ్ డ్రోన్లను ప్రదర్శనలో ఉంచినట్లు కంపెనీ తెలిపింది.

ఎన్‌కేఐ మేనేజింగ్ డైరెక్టర్‌గా సంపత్ కుమార్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఇంజనీరింగ్ కన్సల్టెన్సీ సంస్థ నిప్పన్ కోయి ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (ఎన్‌కేఐ) మేనేజింగ్ డైరెక్టర్‌గా డాక్టర్ జీ సంపత్ కుమార్ నియమితులయ్యారు. ఈ కంపెనీకి ఎండీగా ఒక భారతీయుడు నియమితుడు కావడం ఇదే ప్రథమం. ప్రస్తుతం ఆ పదవిలో ఉన్న కత్సుయా ఫుకసకు కంపెనీ చైర్మన్‌గా బాధ్యతలు చేపడుతున్నారు. ఐఐటీ బీహెచ్‌యూ పూర్వ విద్యార్థి అయిన సంపత్ కుమార్‌కు సివిల్ ఇంజనీరింగ్, ఐటి కన్సల్టెన్సీలో 35 సంవత్సరాల అనుభవం ఉంది.

మేక్‌మై ట్రిప్‌లో తగ్గనున్న చైనా వాటా

న్యూఢిల్లీ: చైనా కంపెనీల ఈక్విటీలో వాటా కుదించుకుంటున్న భారత కంపెనీల జాబితాలో ట్రావెల్ బుకింగ్ కంపెనీ మేక్‌మై ట్రిప్ కంపెనీ చేరింది. ఈ కంపెనీ ఈక్విటీలో ప్రస్తుతం చైనా కంపెనీ ట్రిప్.కామ్‌కు 45.34 శాతం వాటా ఉంది. ఈ వాటాను 19.99 శాతానికి కుదించేందుకు మేక్‌మై ట్రిప్ సిద్ధమైంది. ఇందుకోసం చైనా కంపెనీకి ఉన్న వాటా నుంచి 25.35 శాతం వాటాను కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. షేర్లుగా మార్చుకోదగిన రుణ పత్రాలు, షేర్ల విక్రయం ద్వారా ఇందుకు అవసరమైన 250 కోట్ల డాలర్లు (సుమారు రూ.21,617 కోట్లు) సమీకరించాలని కంపెనీ నిర్ణయించింది.

బిజినెస్

అమెరికాలో
వడ్డీరేట్లు యథాతథం

వాషింగ్టన్: కీలక స్వల్ప కాలిక వడ్డీరేట్లను 4.25-4.5 శాతం వద్ద యథాతథంగా కొనసాగించాలని అమెరికా కేంద్ర బ్యాంకు ఫెడ్ రిజర్వు నిర్ణయించింది. చైర్మన్ జెరోం పోవెల్ అధ్యక్షతన జరిగిన ఫెడరల్ ఓపెన్ మార్కెట్స్ కమిటీ సమావేశం ఈ నిర్ణయం తీసుకుంది. వడ్డీరేట్లను యథాతథంగా కొనసాగించడం వరుసగా ఇది నాలుగో సారి. రిటైల్ ద్రవ్యోల్బణం, నిరుద్యోగం అదుపులోనే ఉన్నా ప్రస్తుత అంతర్జాతీయ ఉద్రిక్తతలను దృష్టిలో ఉంచుకుని ఫెడ్ రిజర్వు ఈ నిర్ణయం తీసుకుందని భావిస్తున్నారు.

వొడాఫోన్ నుంచి శాట్‌కామ్ సర్వీసులు

న్యూఢిల్లీ: పీకల్లోతు అప్పులు, నష్టాల్లో ఉన్నా వొడాఫోన్ ఐడియా కంపెనీ కూడా ఉపగ్రహ ఆధారిత బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందించేందుకు సిద్ధమవుతోంది. ఇందుకోసం ఏఎస్‌టీ స్పేస్‌మొబైల్ అనే కంపెనీతో వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఈ కంపెనీని ఎలాన్ మస్క్ నేతృత్వంలోని స్పేస్‌ఎక్స్ కంపెనీకి ప్రధాన పోటీదారుగా భావిస్తారు. ఈ ఒప్పందం ద్వారా వొడాఫోన్ ఐడియా కంపెనీ వాణిజ్య, ప్రభుత్వ శాఖలకు స్మార్ట్‌ఫోన్ల ద్వారా ఈ సేవలు అందిస్తుంది. ఎప్పటి నుంచి సేవలు ప్రారంభమయ్యేది వొడాఫోన్ ఐడియా వెల్లడించలేదు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



19వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	530
వరంగల్	512	గోదావరి	510
చిత్తూరు	583	విశాఖపట్నం	555
		దజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	93	విజయవాడ	97
వరంగల్	93	గుంటూరు	102
కరీంనగర్	93	ఒంగోలు	105
మహబూబ్‌నగర్	93	చిత్తూరు	95
కర్నూలు	93	నెల్లూరు	100
విశాఖపట్నం	87	అనంతపురం	100
గోదావరి	97		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,00,910 ▲	92,500 ▲	1,21,000 ▲
విజయవాడ	1,00,200 ▲	94,200 ▲	1,12,000 ▲
విశాఖపట్నం	1,02,450 ▲	92,500 ▲	1,21,000 ▲
రాజమండ్రి	1,00,910 ▲	92,500 ▲	1,12,700 ▲
ప్రొద్దుటూరు	98,200 ▲	90,340 ▲	1,08,700 ▲
ముంబై	99,450 ▲	91 ,100 ▲	1,09,410 ▲

బనకచర్లకు పునాది వేసిందే కేసీఆర్

- రాష్ట్రానికి తీరని ద్రోహం చేశారు: తెలంగాణ సీఎం రేవంత్

హైదరాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు పాపానికి పునాది వేసిందే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని.. తెలంగాణకు ఆయన తీరని ద్రోహం చేశారని ఆ రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టుపై చర్చించేందుకు బుధవారం అన్ని పార్టీల లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. గోదావరి బేసిన్‌లో తెలంగాణ ప్రాజెక్టులకు అన్యాయం, తీరని ద్రోహం జరిగితే.. ఆ విషయంలో శిక్షించి, ఉరి తీయాల్సింది కేసీఆర్, హరీశ్‌రావునేనని ధ్వజమెత్తారు. వారు ఏనాడూ తెలంగాణ ప్రయోజనాల కోసం కృషి చేయలేదని.. కాంట్రాక్టర్లు ఇచ్చే కమీషన్లకు కక్కుర్తి పడి, కుట్రలు చేశారని మండిపడ్డారు. 'బనకచర్ల ప్రాజెక్టుపై సీఎం రేవంత్ మాట్లాడట్లేదు' అంటూ తనపై బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారంటూ నిప్పులు చెరిగారు. బనకచర్ల ప్రాజెక్టు గురించి ఏపీ శాసనసభలో సీఎం చంద్రబాబు మాట్లాడిన వెంటనే తాము కేంద్ర మంత్రిని కలిసి.. ఆ ప్రాజెక్టుతో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంతో పాటు అన్ని వివరాలనూ తెలిపామని సీఎం చెప్పారు. దీనిపై కేంద్ర ఆర్థిక మంత్రితోనూ చర్చించామని.. ఇప్పటికే ఈ విషయంలో కేంద్ర జల్‌శక్తి మంత్రికి రాష్ట్ర సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ లేఖలు రాశారని గుర్తుచేశారు. తమ లేఖలకు స్పందించిన కేంద్ర మంత్రి.. తెలంగాణ అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోకుండా ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వబోమంటూ తిరిగి రాష్ట్రానికి లేఖలు రాశారని చెప్పారు. ఏపీ సీఎం చంద్రబాబు మొదలుపెట్టిన గోదావరి-బనకచర్ల ప్రాజెక్టును గతంలో 2016లో చంద్రబాబు, కేసీఆర్ మాట్లాడుకున్న అంశాల ప్రాతిపదికనే ముందుకు తీసుకెళ్తున్నారని రేవంత్ ఆరోపించారు. జగన్ సీఎం అయ్యాక.. అప్పటి మంత్రి రోజా ఇంటిదగ్గర కేసీఆర్ ఏం మాట్లాడారో కూడా అందరూ చూశారని పేర్కొన్నారు. "బేసిన్లు లేవు, భేషజాలు లేవు.. కలిసి పనిచేస్తాం. సమర్థమైన సీఎంగా జగన్ ఉన్నారు. నేను పెద్దన్నగా పూర్తిగా సహకరిస్తా. రాయలసీమను రతనాలసీమగా చేస్తా" అని కేసీఆర్ అప్పుడు చేసిన వ్యాఖ్యలను గుర్తుచేశారు.

చంద్రబాబు అలా అనుకుంటే పొరపాటే..

"చంద్రబాబుకు సూచన చేస్తున్నా. కేంద్రంలో పలుకుబడి ఉంది కాబట్టి ప్రాజెక్టులు పూర్తవుతాయనుకుంటే పొరపాటే" అని తెలంగాణ సీఎం రేవంత్ మీడియా సమావేశంలో వ్యాఖ్యానించారు. "గోదావరి జలాల్లో 3 వేల టీఎంసీల మిగులు జలాలు ఉన్నాయని చంద్రబాబు నమ్మితే.. 968 టీఎంసీలు వాడుకునేందుకు తెలంగాణకు సంపూర్ణ అనుమతులు ఇవ్వాలి" అన్నారు. కృష్ణా జలాల్లో 500 టీఎంసీలు, గోదావరిలో 968 టీఎంసీలు తెలంగాణ వాడుకునేందుకు అనుమతులు ఇచ్చాక.. ఏపీ ఏ నీరు వాడుకున్నా తమకేమీ అభ్యంతరం ఉండదన్నారు. "చంద్రబాబు దూరం పెంచుకుంటే సమస్య పరిష్కారం కాదు. కృష్ణా గోదావరి బేసిన్‌లో తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చాక.. మిగిలిన నీరు మీరు ఎలాగైనా వాడుకోండి" అని వ్యాఖ్యానించారు. గురువారం కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసి బనకచర్లపై తెలంగాణ అభ్యంతరాలను వివరిస్తామన్న సీఎం.. ఇందుకోసం రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు.

సాగునీటి ప్రాజెక్టులకు నిధులివ్వండి: నిమ్మల

అమరావతి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలు, యాజమాన్య నిర్వహణ పనుల కోసం నిధులు మంజూరు చేయాలని మంత్రి నిమ్మల రామానాయుడు కోరారు. ఈ మేరకు వెలగపూడి సచివాలయంలో బుధవారం ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. గడచిన ఐదేళ్ల జగన్ పాలనలో సాగునీటి రంగాన్ని నిర్లక్ష్యం చేశారని, అన్నమయ్య వంటి ప్రాజెక్టులు కొట్టుకుపోయాయని, పోలవరం ప్రాజెక్టులో డయాఫ్రమ్‌వాల్, గైడ్‌బండ్ దెబ్బతిన్నాయని, చాలా ఎత్తిపోతల పథకాలు, వంతెనలు దెబ్బతిన్నాయని వివరించారు. వాటికి మరమ్మతులు చేసేందుకు బడ్జెట్‌లో కేటాయింపు మేరకు నిధులు ఇవ్వాలని కోరారు. దీనిపై పయ్యావుల సానుకూలంగా స్పందించారు. రాష్ట్ర ఆర్థిక స్థితిగతుల గురించి వివరించి .. నిధులను విడుదల చేస్తానని హామీ ఇచ్చారు.

బనకచర్లపై అనవసర రాద్ధాంతం

వరద నీటిని వాడుకుంటే ఎగువ రాష్ట్రాలకు ఇబ్బందే ఉండదు

- తెలంగాణకు ఎలా నష్టమో అక్కడి నేతలు చెప్పలేకపోతున్నారు
- రాష్ట్ర జలవనరుల శాఖ ఆక్షేపణ
- ప్రాజెక్టుకు కేంద్ర ఆమోదంపై ధీమా
- పర్యావరణ అనుమతులపైనా.. టీఏసీ అంగీకరించగానే డీపీఆర్ రూపకల్పన
- అధికార వర్గాల వెల్లడి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



ఎగువ రాష్ట్రాలకు ఎలాంటి నష్టమూ లేకుండా పూర్తిగా వరద జలాలపై ఆధారపడి నిర్మించే పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకానికి కేంద్రం ఆమోదం లభిస్తుందని రాష్ట్ర జల వనరుల శాఖ ధీమా వ్యక్తం చేస్తోంది. ఇప్పటికే కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ ప్రాథమిక సమీక్ష జరిపిందని.. గోదావరి వరద నీటిని మాత్రమే వినియోగించుకుంటామని వివరించడంతో సంతృప్తి వ్యక్తం చేసిందని అంటోంది. సాంకేతిక సలహా కమిటీ (టీఏసీ) అనుమతులు రాగానే సమగ్ర పాజెక్టు నివేదిక (డీపీఆర్)ను తయారు చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఈ పథకంపై తెలంగాణ నేతలు అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారని అంటున్నారు. 'గత 50 ఏళ్ల చరిత్రను చూస్తే.. ఏటా సగటున 3,000 టీఎంసీల వరద సముద్రంలోకి వృధాగా పోతోంది. ఇందులో 200 టీఎంసీలు తీసుకోవాలనుకుంటున్నాం. అది కూడా వరద వచ్చిన సమయంలో రోజుకు రెండు టీఎంసీల చొప్పున 100 రోజుల్లో తీసుకుంటాం. ఆ నీటిని కరువు ప్రాంతం రాయలసీమకు తరలిస్తాం. దీనివల్ల ఎగువన ఉన్న తెలంగాణకు ఎలా నష్టమో సాంకేతికంగా చెప్పలేకపోతోంది' అని జలవనరుల శాఖ అంటోంది. ప్రాజెక్టు ఇంకా ప్రాథమిక దశలోనే ఉండగానే.. దీనికి కేంద్ర జలశక్తి మంత్రి ఆధ్వర్యంలోని అపెక్స్ కౌన్సిల్ ఆమోదం లేదని, గోదావరి, కృష్ణా నదీ యాజమాన్య బోర్డుల ఆమోదం కూడా లేదని తెలంగాణ చెప్పడాన్ని తప్పుబడుతోంది. తెలంగాణలోని కాళేశ్వరం, సీతారామసాగర్, పాలమూరు-రంగారెడ్డి, సమక్క బ్యారేజీలను ఎలాంటి అనుమతులూ లేకుండా.. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టలేదా? సమ్మక్క బ్యారేజీ పూర్తయింది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు ఇప్పటిదాకా టీఏసీ ఆమోదం లభించలేదు. అయితే మనం పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకం ప్రారంభ దశలోనే సాధ్యాసాధ్యాల నివేదికను సిద్ధం చేసి కేంద్రానికి అందజేశాం. ఈ నివేదికను పరిశీలించి అభిప్రాయం చెప్పాలని గోదావరి పరివాహక రాష్ట్రాలకు కేంద్ర జల సంఘం పంపింది' అని గుర్తుచేసింది.

రాజకీయ కారణాలతో అడ్డుకునే యత్నం..

వరద జలాలను మళ్లించడం వల్ల తెలంగాణకు ఎలాంటి నష్టమూ లేనప్పటికీ .. రాజకీయ కారణాలతోనే ఆ రాష్ట్రంలోని రాజకీయ నాయకులంతా ఏకమై అడ్డుపడుతున్నారని జల వనరుల శాఖ ఆక్షేపించింది. అయితే ఆంధ్రప్రదేశ్‌లోని మిగతా రాజకీయ పక్షాలు మాత్రం పోలవరం-బనకచర్లను సమర్థిస్తూ ప్రకటనలు చేయకపోవడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. అధికారంలో ఉండగా సాగునీటి రంగాన్ని నిర్లక్ష్యం చేసిన వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఇప్పటికీ అదే పంథాను కొనసాగిస్తున్నారని సాగునీటి రంగ నిపుణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బనకచర్లకు సానుకూలంగా ఆయన మాట్లాడకపోవడాన్ని తప్పుబడుతున్నారు. ఏ నష్టం లేని ఈ ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం బుధవారమే అఖిలపక్ష భేటీ నిర్వహించింది. ఏపీ ప్రభుత్వం కూడా ఇదే తరహాలో అఖిలపక్ష సమావేశం పెట్టి పథకం ప్రాధాన్యాన్ని పార్టీలకు, రాష్ట్ర ప్రజలకు కూడా వివరించాలని అధికార వర్గాలు, నిపుణులు సూచిస్తున్నారు.

వెంటనే ఫ్యాకల్టీని భర్తీ చేయాలి

మెడికల్ కాలేజీల్లో 25% పైగా సిబ్బంది కొరత

- వైద్యుల హాజరు కూడా 70 శాతమే..
- మీ యాక్షన్ ప్లాన్ ఏమిటో చెప్పండి
- సమీక్షించిన తర్వాత తదుపరి నిర్ణయం
- అధికారులకు స్పష్టం చేసిన ఎన్ఎంసీ

అమరావతి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కొత్త మెడికల్ కాలేజీల్లో సిబ్బంది కొరత లేకుండా చూడాలని, ఫ్యాకల్టీని వెంటనే భర్తీ చేయాలని నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) రాష్ట్ర అధికారులను ఆదేశించింది. విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల మెడికల్ కాలేజీల్లో లోపాలను ఎన్ఎంసీ తీవ్రంగా పరిగణించింది. రెండేళ్లు గడువిచ్చినా ప్రభుత్వం కనీసం లోపాలు సరిదిద్దకపోవడంతో ఏపీ అధికారులకు ఘాటు లేఖ రాసింది. వెంటనే ఢిల్లీకి వచ్చి సమాధానం చెప్పాలని కోరింది. దీంతో రాష్ట్ర అధికారులు ఆగమేఘాల మీద ఢిల్లీకి పరుగులు తీశారు. బుధవారం ఎన్ఎంసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఏపీ డీఎంఈ డాక్టర్ నరసింహం, ఆన్‌లైన్‌లో సెక్రటరీ డాక్టర్ మంజుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎంసీ అధికారులు 5 కాలేజీల్లోని లోపాలను రాష్ట్ర అధికారుల ముందుంచారు. 25 శాతానికిపైగా సిబ్బంది కొరత ఉందని, సిబ్బంది హాజరు కూడా 70-75 శాతం కూడా లేదని తెలిపింది. చాలామంది సెలవుల్లో ఉంటున్నారని, ఇలా అయితే అడ్మిషన్లకు అనుమతులివ్వడం కష్టమేనని హెచ్చరించింది. కాలేజీల్లోని లోపాలపై మీ యాక్షన్ ప్లాన్ ఏమిటని అధికారులను ప్రశ్నించింది. యాక్షన్ ప్లాన్ ఇస్తే దానిపై సమీక్షించి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది.

పేదలపై ఎంత కక్ష..!

ఆ వాహనాలన్నీ ఎస్సీ కార్పొరేషన్‌వట..

- 2019లో కక్షతో పంపిణీ చేయకుండా ఆపేసిన వైసీపీ
- అధికారులను కదలించిన 'ఆంధ్రజ్యోతి' కథనం

నెల్లూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలోని బుజబుజ నెల్లూరు ప్రాంతంలో ఆరేళ్లుగా మూలన పడి ఉన్న చెత్త తరలింపు వాహనాలన్నీ పేదలకు పంపిణీ చేయాల్సినవని తేలింది. నిరుద్యోగులకు సబ్సిడీతో అందించాల్సిన వాహనాలను గత ప్రభుత్వం కక్షగట్టి పంపిణీ చేయకుండా నిలిపేసినట్లు స్పష్టమైంది. 2019 మార్చిలో 23 మినీ ట్రాక్టర్లు, 53 ఈ-ఆటోలు జిల్లాకు రాగా... వాటిని లబ్ధిదారులకు అందించకుండా ఆపేశారు. వీటి విలువ సుమారు రూ.4.50 కోట్లు ఉంటుందని అంచనా. బుధవారం 'చెత్తలా వాహనాలు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో ప్రచురితమైన కథనం అధికార యంత్రాంగాన్ని కదిలించింది. ఈ వాహనాలన్నీ ఎస్సీ కార్పొరేషన్‌కు చెందినవిగా తేలింది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో ఈ వాహనాలను పేదలకు సబ్సిడీతో అందించేందుకు అప్పటి టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. దానికోసం ఓ ఏజెన్సీ నుంచి ఈ వాహనాలను కొనుగోలు చేయగా, అవి 2019 మార్చిలో నెల్లూరుకు చేరాయి. వెంటనే ఎన్నికల కోడ్ రావడంతో పంపిణీ జరగలేదు. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ వాహనాలను పంపిణీ చేయకుండా ఆపేసింది. ఇప్పుడు 'ఆంధ్రజ్యోతి' ఈ వాహనాల దుస్థితిని వెలుగులోకి తీసుకురావడంతో యంత్రాంగం కదిలింది. మరి ఇప్పటికైనా ఈ వాహనాలను లబ్ధిదారులకు అందిస్తారో లేదో చూడాలి.

న్యాయవ్యవస్థపై జస్టిస్ కృపాసాగర్ చెరగని ముద్ర

- 30 ఏళ్లుగా సేవలందించారు: సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్
- పదవీ విరమణ సందర్భంగా హైకోర్టులో ఘనంగా వీడ్కోలు



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపా సాగర్ పదవీ విరమణ కార్యక్రమంలో సీజే జస్టిస్ ఠాకూర్, న్యాయమూర్తులు

అమరావతి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్‌కు హైకోర్టు ఘనంగా వీడ్కోలు పలికింది. ఆయన పదవీ విరమణ చేస్తున్న నేపథ్యంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ నేతృత్వంలో బుధవారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. జస్టిస్ కృపాసాగర్ అందించిన న్యాయసేవలను ఈ సందర్భంగా సీజే కొనియాడారు. ఎంతో ఓపిక, సహనంతో ఇరువైపుల వాదనలు విని నిర్ణయాన్ని వెల్లడిస్తారనే మంచి పేరు తెచ్చుకున్నారని, న్యాయాధికారిగా, న్యాయమూర్తిగా వివిధ హోదాల్లో 30 ఏళ్లకు పైగా న్యాయవ్యవస్థకు సేవలందించి చెరగని ముద్రవేశారని తెలిపారు. జస్టిస్ కృపాసాగర్ మాట్లాడుతూ వృత్తి జీవితం ఎంతో సంతృప్తిని, మధుర స్మృతులను అందించిందన్నారు. సుదీర్ఘ వృత్తి జీవితంలో తనకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కాగా, ఆయన ఎన్నో క్లిష్టమైన కేసులను పరిష్కరించారని అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ చల్లా ధనంజయ, ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం కొనియాడారు. హైకోర్టు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలోనూ జస్టిస్ కృపాసాగర్ దంపతులను ఘనంగా సత్కరించారు. శాలువా కప్పి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. అలాగే, హైకోర్టు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వేణుగోపాలరావు, కార్యవర్గం ఆధ్వర్యంలో జస్టిస్ కృపాసాగర్‌ను సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యే చిత్రమిది



అనంతిక సునీల్‌కుమార్ లీడ్‌రోల్ పోషించిన చిత్రం '8 వసంతాలు'. ఫణీంద్ర నర్సెట్టి దర్శకత్వంలో నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించారు. ఈనెల 20న విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం ఇటీవలే ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ 'సినిమా విజువల్‌గా చాలా బాగుంది. ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యే చిత్రమిది. ఒక అమ్మాయి జీవిత ప్రయాణమే '8 వసంతాలు' సినిమాగా మీ ముందుకొస్తోంది. తప్పకుండా మీకు నచ్చుతుంది' అన్నారు. 'ఇది చాలా డిఫరెంట్ మూవీ. కథ బాగా నచ్చి మేము చేసిన ఈ ప్రయత్నం మీ అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది' అని నవీన్ యెర్నేని అన్నారు. ఫణీంద్ర నర్సెట్టి మాట్లాడుతూ 'మా నిర్మాతలు ఒక మంచి కథతో వస్తే సినిమా తీస్తారు అనే దానికి మా '8 వసంతాలు' చిత్రం ఓ నిదర్శనం. ఈ సినిమాతో ఒక మంచి చిత్రాన్ని నిర్మించారనే పేరు వారికి వస్తుంది. అనంతిక నటన ఈ చిత్రానికి ప్రత్యేకాకర్షణ' అని అన్నారు. అనంతిక మాట్లాడుతూ 'మైత్రీ లాంటి పెద్ద నిర్మాణ సంస్థలో సినిమా చేసినందుకు ఆనందంగా ఉంది. ఫణీంద్ర గారి వల్ల ఈ సినిమాలో ఒక బలమైన పాత్రను చేశాను. ఇది నాకు చాలా ప్రత్యేకమైన చిత్రం' అన్నారు.

వచ్చే నెలలో కెన్యాకు



రాజమౌళి దర్శకత్వంలో మహేశ్‌బాబు కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. 'ఎస్ఎస్ఎమ్‌బీ 29' వర్కింగ్ టైటిల్. ఈ సినిమాకు సంబంధించిన కీలక షెడ్యూల్ కెన్యాలో ప్రారంభమవుతున్నట్లు తెలిసింది. వచ్చే నెలాఖరు నుంచి 15 రోజుల పాటు సాగనున్న ఈ షెడ్యూల్‌లో మహేశ్‌బాబుతో పాటు ప్రియాంక కూడా పాల్గొంటారని సమాచారం. అడవి నేపథ్యంలో కీలకమైన సన్నివేశాలు చిత్రీకరిస్తారట. కె.ఎల్.నారాయణ నిర్మిస్తున్నారు. రెండు భాగాలుగా రూపొందుతున్న ఈ సినిమా మొదటి భాగాన్ని 2027లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

కాంతారావు తనయుడికి ఆర్థిక సాయం



ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ తన గొప్ప మనసును చాటుకున్నారు. ఇటీవల జరిగిన తెలంగాణ గద్దర్ అవార్డుల వేడుకల్లో ఆయన రఘుపతి వెంకయ్యనాయుడు అవార్డును అందుకున్న విషయం తెలిసిందే. ఈ అవార్డుతో పాటు ప్రభుత్వం అందించిన నగదులో అధిక శాతం సామాజిక సేవకే ఖర్చుచేస్తానని ఆయన తెలిపారు. అలనాటి మేటి నటుడు కాంతారావు కుమారుడు రాజా ఆర్థిక పరిస్థితి బాగాలేదని, ఇంటి అద్దెకు కూడా కష్టంగా ఉందన్న విషయం తెలుసుకున్న యండమూరి రాజాను ఇంటికి పిలిచి రూ.లక్ష ఆర్థిక సాయం చేశారు.

ఇంతకంటే నేను కోరుకునేదేమి లేదు

శేఖర్ కమ్ముల



'దర్శకుడిగా నా 25 ఏళ్ల ప్రయాణాన్ని తరచి చూసుకున్నప్పుడు ఉద్వేగానికి లోనయ్యా. ఒక చిన్న ఇంట్లో తొలి సినిమా తీసిన నేను ఇప్పుడు 'కుబేర' లాంటి పెద్ద సినిమా తీయగలిగాను. ప్రేక్షకులు నాకు చాలా ప్రేమని ఇచ్చారు. వారు నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే నాకు చాలా ఆనందాన్నిచ్చే విషయం. నా సినిమాలను ఆదరించిన ప్రేక్షకులు దర్శకుడిగా నాకంటూ ఒక స్థాయిని ఇచ్చారు. ఈ జీవితంలో ఇంతకంటే నేను కోరుకునేదేం లేదు' అని శేఖర్ కమ్ముల అన్నారు. ధనుష్ కథానాయకుడిగా ఆయన తెరకెక్కించిన చిత్రం 'కుబేర'. ఈ నెల 20న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శేఖర్ కమ్ముల మీడియాతో ముచ్చటించారు.

- బిలియనీర్ వర్సెస్ బెగ్గర్... అనే లైన్ ఆసక్తికరంగా అనిపించి కథగా మలిచాను. ధనవంతులు, పేదల మధ్య జరిగే కథ ఇది. రెండు ప్రపంచాల మధ్య సంఘర్షణలా ఉంటుంది. కథను సిద్ధం చేసే క్రమంలో అదొక ఎమోషనల్ థ్రిల్లర్‌గా రూపొందింది. జీవితంలో ఇక తనకు ఏమీ వద్దు అనుకునే బిచ్చగాడు, ప్రపంచంలో అన్నీ తన సొంతం కావాలని కోరుకునే బిలియనీర్ మధ్య పోరాటం ఆసక్తికరంగా ఉంటుంది.
- నా కెరీర్‌లో అగ్రనటులతో, భారీ బడ్జెట్‌తో తీసిన చిత్రం ఇదే. నిర్మాతలు సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్‌రావు సహకారం వల్లే ఇది సాధ్యమైంది. సినిమాకోసం ఏదడిగినా కాదనకుండా సమకూర్చారు. ఈ చిత్రంలో కథానాయకుడి పాత్రను ధనుష్ తప్ప వేరెవ్వరూ చేయలేరు. అంత అద్భుతంగా నటించారు. ఎంత కష్టమైన షాట్ అయినా ఆయన సింగిల్ టేక్‌లో చేస్తారు. ఈ కథలో నాగార్జున బలమైన పాత్ర చేశారు. ఆయన ఆహార్యం, లుక్, భాష, ఎమోషన్స్ బాగా కుదిరాయి. రష్మిక పాత్ర చిత్రణ నవ్యపంథాలో ఉంటుంది. ఆమె పాత్ర ప్రభావం బలంగా ఉంటుంది.
- ఈ మధ్యకాలంలో విభిన్న కథాంశాలతో చిత్రాలు వస్తున్నాయి. కానీ ఇలాంటి ఒక గొప్ప కథను నేను చెప్పినందుకు ఆనందంగా ఉంది. ఇది తప్పకుండా చెప్పాల్సిన కథ. సమాజంలో చైతన్యాన్ని తీసుకొస్తుంది. కథా నేపథ్యం వల్లే ఇది పాన్ ఇండియా చిత్రం అయింది తప్ప మేం కావాలని చేసింది కాదు. దేశం మొత్తం రిలేట్ అయ్యే కథ ఇది. తెలుగు, తమిళ భాషల్లో చిత్రీకరణ జరపడం వల్ల కొంచెం ఎక్కువ సమయం పట్టింది.
- సున్నితమైన భావోద్వేగాలు, సామాజికపరమైన అంశాలతో సినిమాలు చేస్తాడంటూ నాకంటూ ఓ ఇమేజ్ క్రియేట్ అయింది. అయితే నాకంటూ ఒక మార్క్ ఉండాలని నేనెప్పుడూ సినిమాలు చేయలేదు. ఏ సినిమా చేసినా కథకు అవసరమైనది మాత్రమే చేశాను.



ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌తో మంత్రి లోకేశ్, కేంద్రమంత్రి పెమ్మసాని, ఎంపీలు లావు, శివనాథ్, శబరి, శ్రీనివాసుల రెడ్డి, సానా సతీశ్



కేంద్ర మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్‌తో మంత్రి లోకేశ్, ఎంపీలు లావు, శివనాథ్, కేంద్రమంత్రి పెమ్మసాని తదితరులు

బాబు సుదీర్ఘ అనుభవంతో...

అభివృద్ధి బాటలో ఆంధ్ర

- డబుల్ ఇంజన్ సర్కారుకు కేంద్రం సహకారం
- ఢిల్లీలో లోకేశ్‌కు అమిత్‌షా హామీ
- ముగ్గురు కేంద్ర మంత్రులతోనూ యువనేత భేటీ

న్యూఢిల్లీ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిగా చంద్రబాబు సుదీర్ఘ పాలనానుభవం ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి బాటలో నడిపిస్తోందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. రాష్ట్రంలోని డబుల్ ఇంజన్ సర్కారుకు కేంద్ర సహకారం కొనసాగుతుందని భరోసా ఇచ్చారు. రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి లోకేశ్ బుధవారం ఢిల్లీలో అమిత్‌షాను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో కొత్త ప్రాజెక్టులకు సహకారం అందించాలని కోరారు. అమలవుతున్న ప్రాజెక్టుల పురోగతిని వివరించారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలు, కేంద్ర సహకారంతో అమలుచేస్తున్న వివిధ అభివృద్ధి పనుల ప్రగతిని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ నెల 21న విశాఖలో ప్రధాని మోదీ హాజరయ్యే యోగాంధ్ర కార్యక్రమానికి విస్తృతమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. అనంతరం రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులపై ఉభయులూ చర్చించినట్లు తెలిసింది. మద్యం కుంభకోణం, అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యల వంటివి కూడా చర్చకు వచ్చినట్లు సమాచారం. 226 రోజులు 3,132 కిమీల మేర తాను చేసిన పాదయాత్రలో ఎదురైన అనుభవాలతో రూపొందించిన యువగళం పుస్తకాన్ని ఆయనకు అందజేశారు. సుదీర్ఘ పాదయాత్రతో ప్రజల్లో చైతన్యాన్ని నింపిన లోకేశ్‌ను షా ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రాభివృద్ధికి సహకారం కోరడానికి చేపట్టిన ఢిల్లీ పర్యటనలో భాగంగా లోకేశ్ బుధవారం కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్, న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి చిరాగ్ పాసవాన్‌తో కూడా వరుసగా సమావేశమయ్యారు. యువగళం పుస్తకాన్ని అందజేశారు.

కాంక్లేవ్ చాన్సు ఏపీకి ఇవ్వండి..

విద్యాభివృద్ధిలో తల్లిదండ్రులను భాగస్వాములుగా చేయడంలో భాగంగా వచ్చే నెల 5న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించబోయే మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్‌కు రావాలని ప్రధాన్‌కు



కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు 'యువగళం' పుస్తకాన్ని అందజేస్తున్న మంత్రి లోకేశ్

లోకేశ్ విజ్ఞప్తి చేశారు. ఆగస్టులో విద్యా శాఖ మంత్రుల కాంక్లేవ్ ఏర్పాటు అవకాశాన్ని ఆంధ్రప్రదేశ్‌కు ఇవ్వాలని కోరగా ఆయన అంగీకరించారు. 'రాష్ట్రంలో అత్యుత్తమ మౌలిక సదుపాయాలతో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 లీప్ స్కూళ్లను అభివృద్ధి చేస్తున్నాం. 9,600 మోడల్ ప్రైమరీ స్కూళ్లలో వన్ క్లాస్-వన్ టీచర్ విధానం ప్రవేశపెట్టాం. మూడేళ్లలో నూరుశాతం అక్షరాస్యత సాధనే లక్ష్యంగా 'ప్రాజెక్టు అ, ఆ(అక్షర ఆంధ్ర)'ను చేపట్టాం. రాజకీయం జోక్యం లేకుండా టీచర్ల బదిలీల చట్టం తెచ్చి సీనియారిటీ ప్రాతిపదికను బదిలీలు, పదోన్నతులు విజయవంతంగా పూర్తిచేశాం' అని వివరించారు.

హైకోర్టు బెంచ్ సీమ ప్రజల చిరకాల కోరిక..

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు సహకరించాలని మేఘ్వాల్‌ను లోకేశ్ అభ్యర్థించారు. హైకోర్టు బెంచ్ ఏర్పాటు రాయలసీమ ప్రజల చిరకాల కోరికగా పేర్కొన్నారు. వారు హైకోర్టులో కేసుల కోసం అమరావతికి రావడానికి 500 కిమీకు పైగా ప్రయాణించాల్సి వస్తోందన్నారు. యువగళం పాదయాత్ర సందర్భంగా సీమ ప్రజలు, న్యాయవాదులు హైకోర్టు బెంచ్ కోసం తనకు విజ్ఞప్తి చేశారని తెలిపారు.

సీమను హార్టికల్చర్ హబ్‌గా..

రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు సహకరించాలని పాసవాన్‌కు లోకేశ్ విజ్ఞప్తిచేశారు. సీమ రైతులు మామిడి, అరటి, టమోటా, బత్తాయి, దానిమ్మ వంటి పండ్లతోటలను పెద్దఎత్తున సాగు చేస్తున్నారని ఆహార శుద్ధి యూనిట్ల ఏర్పాటు చేస్తే వారికి మెరుగైన రేట్లు లభించి ఆదాయం పెరిగే అవకాశం ఉందన్నారు. పాసవాన్ సానుకూలంగా స్పందించారు. తిరుపతి ట్రిపుల్ ఐటీలో ఫుడ్ ప్రాసెసింగ్ ఇంక్యుబేషన్ సెంటర్ ప్రారంభోత్సవానికి తాను జూలై 11, 12 తేదీల్లో వస్తున్నానని, మీరు కూడా వస్తే క్షేత్ర స్థాయిలో పర్యటించి ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుకు గల అవకాశాలపై అధ్యయనం చేద్దామని లోకేశ్‌కు సూచించారు. పర్యటనలో ఆయన వెంట కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, నాగరాజు, కృష్ణప్రసాద్, బైరెడ్డి శబరి, కేశినేని చిన్ని, మాగుంట, సానా సతీశ్ ఉన్నారు.

టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో బాబు ముందుంటారు: ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అధునాతన టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో చంద్రబాబు ఎల్లప్పుడూ ముందుంటారని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ వ్యాఖ్యానించారు. బుధవారం ఆయన్ను లోకేశ్ కలిశారు. దేశంలోనే తొలిసారిగా ఏపీ రాజధాని అమరావతిలో క్వాంటమ్ వ్యాలీని ఏర్పాటు చేస్తున్నామని లోకేశ్ చెప్పగా.. ఉపరాష్ట్రపతి పై వ్యాఖ్యలు చేశారు. రాజధాని పనుల పురోగతిపై ఆరా తీశారు. రూ.64 వేల కోట్ల వ్యయంతో పనులు ప్రారంభించామని, వేగంగా పూర్తి చేస్తామని లోకేశ్ తెలిపారు. ప్రత్యక్ష రాజకీయాల్లో ప్రవేశానికి గత 40 ఏళ్లలో టీడీపీ ఎప్పుడూ గెలవని మంగళగిరిని ఎంచుకున్నానని లోకేశ్ చెప్పగా.. తాను కూడా తొలిసారి పరిచయం లేని నియోజకవర్గాన్నే ఎంచుకుని పోరాడానని ధన్‌ఖడ్ అన్నారు. యువగళం పుస్తకాన్ని లోకేశ్ అందజేయగా.. ఆయన అభినందించారు.



అగ్రనేత గాజర్ల రవి

ఎన్‌కౌంటర్

మారేడుమిల్లి ఫారెస్ట్‌లో కాల్చివేత

- అగ్ర నాయకురాలు అరుణ, అంజూ కూడా..

చింతూరు/రంపచోడవరం, పాడేరు, చర్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): దళపతి నంబాల కేశవరావును, సీనియర్ నాయకులను వరుస ఎన్‌కౌంటర్లలో కోల్పోయి కుదేలైన మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. కేంద్ర కమిటీ సభ్యుడు, ఏవోబీ కార్యదర్శి గాజర్ల రవి అలియాస్ ఉదయ్ అల్లూరి జిల్లా మారేడుమిల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కింటుకూరు అటవీ ప్రాంతంలో బుధవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటరులో మరణించారు. మరో అగ్ర నాయకురాలు, ఏవోబీ కమిటీ సీనియర్ సభ్యురాలు రావి వెంకటగిరి చైతన్య అలియాస్ అరుణ (54), మరో నక్సల్ అంజూ కూడా ఈ ఘటనలో చనిపోయారు. వీరిలో అరుణ ఇటీవలి ఎన్‌కౌంటర్‌లో మరణించిన కేంద్ర కమిటీ సభ్యుడు రాంచంద్రారెడ్డి అలియాస్ చలపతి భార్య. ఉమ్మడి ఏపీలో 2004లో ప్రభుత్వంతో చర్చలు జరిపిన మావోయిస్టుల బృందంలో ఉదయ్ ఒకరు. 2026 మార్చి 31లోగా మావోయిస్టులను పూర్తిగా తుడిచిపెట్టడం కోసం కేంద్ర ప్రభుత్వం.. రాష్ట్రాలతో సమన్వయం చేసుకుంటూ ఆపరేషన్ కగార్‌ను తీవ్రతరం చేసింది. ఒడిశా అడవుల్లో కూంబింగ్‌ను ముమ్మరం చేసింది. దీంతో అక్కడ ఉండటం తమకు క్షేమం కాదని ఉదయ్ టీమ్ భావించింది. ఆయనతోపాటు యాభైమంది మావోయిస్టులు నెల క్రితం అల్లూరి సీతారామరాజు జిల్లాలోకి ప్రవేశించారు.

డ్రోన్లతో జాడ పట్టి..

ఏపీ గ్రేహౌండ్స్ బలగాలు అల్లూరి జిల్లాలోకి ప్రవేశించిన మావోయిస్టుల కోసం తీవ్రంగా గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో ఎదురుకాల్పుల నుంచి మూడుసార్లు ఉదయ్, అరుణ త్రుటిలో తప్పించుకున్నారు. కాకురి పండన్న అలియాస్ జగన్ కోరాపుట్ డీసీఎం రమేశ్ ఈ ఘటనల్లో చనిపోయారు. మరోవైపు, కీలక నేతల ఎన్‌కౌంటర్లను నిరసిస్తూ ఈనెల 20న ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో బంద్‌కు మావోయిస్టులు పిలుపునిచ్చారు. దీంతో గ్రేహౌండ్స్ బలగాలు మరింతగా అప్రమత్తమయ్యాయి. డ్రోన్‌లను ఉపయోగించి ఉదయ్ బృందం ఉన్న ప్రాంతాన్ని ఎట్టకేలకు కనిపెట్టాయి. పక్కా వ్యూహంతో మంగళవారం రంగంలోకి దిగాయి. దేవీపట్నం మండల పరిధిలోని ఆకూరు, కొయ్యలగూడెం గ్రామాల సరిహద్దుల్లోని కింటుకూరు అటవీ ప్రాంతంలో కూంబింగ్ మొదలుపెట్టాయి. ఈ బలగాలకు బుధవారం ఉదయం మావోయిస్టులు తారసపడ్డారు. ఈ సందర్భంగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఉదయ్ సహా ముగ్గురు మావోయిస్టులు చనిపోయారని పోలీసులు ప్రకటించారు. ఘటనా స్థలం నుంచి మూడు ఏకే 47లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మావోయిస్టుల మృతదేహాలను రంపచోడవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గెరిల్లా యుద్ధ నిపుణుడు..

నాలుగు దశాబ్దాలపాటు గాజర్ల రవి మావోయిస్టు ఉద్యమంలో గణేశ్, ఉదయ్ పేర్లతో కొనసాగారు. రెండు దశాబ్దాల కాలం పూర్తిగా ఆంధ్రా ఒడిశా బోర్డర్ (ఏవోబీ)కు పరిమితమై పనిచేశారు. సైనిక వ్యూహాలు రచించడం, గెరిల్లా యుద్ధ తంత్రంలో రాటుతేలిన ఆయన ఉద్యమ ప్రస్థానం 1980ల్లో రాడికల్ విద్యార్థి సంఘంతో మొదలైంది. 1990లో పీపుల్స్‌వార్ పార్టీలో పూర్తికాల కార్యకర్తగా చేరారు. ఉద్యమంలోనే జిలానీ బేగం అనే మహిళను వివాహం చేసుకోగా, ఆమె ఎన్‌కౌంటరులో మరణించారు. 2004లో అప్పటి ప్రభుత్వంతో మావోయిస్టులు జరిపిన శాంతి చర్చల్లో ఆయన పాల్గొన్నారు. ఏవోబీ స్పెషల్ జోనల్ కార్యదర్శి బాకూరు వెంకటరమణ అలియాస్ గణేశ్ 2016 అక్టోబరు 24న రామ్‌గూడ ఎన్‌కౌంటరులో మరణించాక, ఆ బాధ్యతలను ఉదయ్ తీసుకున్నారు. ఆయనది తెలంగాణ రాష్ట్రం జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం వెలిశాల గ్రామం. ఆయన కుటుంబం నుంచి ముగ్గురు మావోయిస్టు పార్టీలోకి వెళ్లారు. వీరిలో పెద్ద అన్నయ్య గాజర్ల సారయ్య అలియాస్ ఆజాద్ ఎన్‌కౌంటరులో చనిపోయారు. మరో అన్నయ్య గాజర్ల అశోక్ అలియాస్ ఐతు దండకారణ్యంలో పనిచేస్తూ, తీవ్రంగా గాయపడ్డారు. అనంతరం పోలీసులకు లొంగిపోయారు. ఉదయ్‌పై తెలంగాణలో రూ.40 లక్షలు, ఏవోబీలో రూ. 25 లక్షల రివార్డు ఉంది. అలిపిరి వద్ద చంద్రబాబుపై జరిపిన మందుపాతర దాడి ఘటనలో, 76మంది జవాన్లను హత్యచేసిన తాడిమెట్ల ఘటనలో, నదిని దాటుతున్న జవాన్లపై బలిమెలలో దాడిచేసి హత్యచేసిన ఘటనలో ఉదయ్ నిందితుడు.

కిడారి, సోమ హత్యలకు స్కెచ్ అరుణదే

అరకు లోయలోని డుంబ్రిగుడ మండలం లివిటిపుట్టు వద్ద 2018 సెప్టెంబరు 23న టీడీపీ ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సివేరి సోమలను మావోయిస్టులు హత్యచేశారు. వారిద్దరి హత్యకు స్కెచ్‌ను అరుణే రూపొందించారని పోలీసులు అనేక సందర్భాల్లో ప్రకటించారు. ఆమెది విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలం కరకవానిపాలెం. ఆమెది పూర్తిగా ఉద్యమ కుటుంబం. తండ్రి లక్ష్మణరావు మావోయిస్టు పార్టీ మాజీ నేత. తల్లి లత, తమ్ముడు ఆజాద్ వేర్వేరు ఎన్‌కౌంటర్లలో మరణించారు. అరుణ భర్త చలపతి ఒడిశా రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా పనిచేస్తూ ఈ ఏడాది జనవరి నెలలో ఎన్‌కౌంటర్ అయ్యారు. అరుణ తలపై రూ.20 లక్షల రివార్డు ఉంది. అంజూ వివరాలు తెలియరాలేదు.

చర్చల టీమ్‌లో మిగిలింది ఒక్కరే..

ఉమ్మడి ఏపీలో 2004లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంతో మావోయిస్టులు చర్చ జరిపారు. ఈ చర్చల్లో అప్పట్లో మావోయిస్టు పార్టీ నాయకులు అక్కిరాజు హరగోపాల్ అలియాస్ రామకృష్ణ, చలం అలియాస్ సుధాకర్, గాజర్ల రవి అలియాస్ ఉదయ్; జనశక్తి పార్టీ నాయకులు రియాజ్, దేవేందర్ అలియాస్ అమర్ పాల్గొన్నారు. ఆ బృందంలో ఇప్పుడు అమర్ ఒక్కరే మిగిలారు.



కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజు, సజ్జల రామకృష్ణారెడ్డిపై జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు అర్చనా మజుందార్‌కు ఫిర్యాదు చేస్తున్న అమరావతి రాజధాని మహిళలు

మహిళలపై వ్యాఖ్యలు చేసిన వారిని వదలం

- జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు అర్చనా మజుందార్

గుంటూరు సిటీ, జూన్ 18(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని ప్రాంతంలో ఉన్న మహిళలపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసిన వారిని వదిలే ప్రసక్తి లేదని జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు అర్చనా మజుందార్ తెలిపారు. ఇక్కడ జరిగిన పరిణామాలను జాతీయ కమిషన్ చైర్‌పర్సన్‌తో పాటు, సంబంధిత శాఖల దృష్టికి తీసుకువెళ్లి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజు, సజ్జల రామకృష్ణారెడ్డి, సాక్షి మీడియాపై ఆమెకు అమరావతి మహిళలు, రైతులు రాతపూర్వకంగా ఫిర్యాదు అందజేశారు. అమరావతి మహిళలను రాక్షసులు.. పిశాచులు.. సంకరజాతికి చెందిన వారుగా సజ్జల అభివర్ణించారని తెలిపారు. రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చిన తమను జగన్ ఎన్నో విధాలుగా ఇబ్బందులు పెట్టారని కొందరు కమిషన్ ఎదుట కన్నీళ్లు పెట్టుకున్నారు. అమరావతి రాజధాని మహిళలను చూసిన వెంటనే... 'మిమ్మల్ని చూడటం ఆనందంగా ఉంది'ని అర్చనా మజుందార్ అన్నారు. 'ఇక్కడకు రాక ముందు మీ గురించి విన్నాను. ఇప్పుడు ప్రత్యక్షంగా చూడటం మరింత ఆనందాన్ని కలిగించింది' అని ఆమె అన్నారు. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ యాక్టివ్.. ప్రతి విషయాన్ని చక్కగా అర్థం చేసుకుని.. వివరించగలరని అభినందించారు.

మళ్లీ పెరిగిన ఎండ

- జంగమహేశ్వరపురంలో 40.1 డిగ్రీలు
- నేడు అక్కడక్కడ ఈదురుగాలులతో వర్షాలు

విశాఖపట్నం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంపైకి నైరుతి వైపు నుంచి గాలులు వీచినా.. పలుచోట్ల ఎండ తీవ్రత, ఉక్కపోత పెరిగాయి. కోస్తాతోపాటు దానికి ఆనుకుని ఉన్న రాయలసీమ జిల్లాల్లో బుధవారం ఎండ ప్రభావం ఎక్కువగా ఉంది. జంగమహేశ్వరపురంలో 40.1, తిరుపతిలో 39.4, కావలిలో 38.8, నెల్లూరులో 38.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అక్కడక్కడ వర్షాలు కురిశాయి. కాగా, పశ్చిమబెంగాల్ పరిసరాల్లో ఉన్న అల్పపీడనం బలపడి తీవ్ర అల్పపీడనంగా మారింది. ఇది వాయవ్యంగా పయనించనుంది. ఇంకా గుజరాత్ పరిసరాల్లో అల్పపీడనం స్థిరంగా ఉంది. వీటి ప్రభావంతో బుధవారం నైరుతి రుతుపవనాలు మధ్య, వాయవ్య, తూర్పుభారతంలో అనేక ప్రాంతాలకు విస్తరించాయి. రానున్న రెండు, మూడు రోజుల్లో రాజస్థాన్, మధ్యప్రదేశ్, యూపీ, బిహార్, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, జమ్మూకశ్మీర్ వరకూ విస్తరించనున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడ ఈదురుగాలులతో వర్షాలు కురుస్తాయని తెలిపింది.

ఇకపై పన్ను ఎగవేత కుదరదు

- ఇబ్బంది పెట్టకుండా పన్ను వసూలు చేయాలి
- రాబడి పెరిగితే మరింత అభివృద్ధి, సంక్షేమం
- ఆదాయార్జన శాఖలపై సమీక్షలో సీఎం
- ఈ ఏడాది ఆదాయం 1.24 లక్షల కోట్లుగా అంచనా

ఖజానాకు నష్టం కలిగిస్తే కఠిన చర్యలు

అమరావతి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వ్యాపారం చేసి పన్నులు ఎగవేయడం ఇకపై కుదరదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. వ్యవస్థలో లొసుగులను వాడుకుని ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగించేందుకు ప్రయత్నిస్తే కఠినంగా వ్యవహరిస్తామని తేల్చి చెప్పారు. సచివాలయంలో బుధవారం ఆదాయార్జన శాఖలపై నిర్వహించిన సమీక్షలో అధికారులకు రెవెన్యూ లక్ష్యాలను నిర్దేశించి, పలు సూచనలు చేశారు. పన్ను వసూళ్ల విషయంలో వ్యాపారులు, పన్ను చెల్లింపుదారులను ఇబ్బందులకు గురిచేయొద్దని చెప్పారు. పన్ను వసూళ్లకు సంబంధించి 2017 నుంచి ఉన్న సమాచారాన్ని విశ్లేషించాలని సూచించారు.ఆదాయాన్ని పెంచుకోగలిగితే అభివృద్ధి, సంక్షేమాన్ని మరింత విస్తృతం చేయగలుగుతామని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందికర పరిస్థితుల్లో ఉందని గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పులను సరిచేస్తేనే సమస్యలు తొలగుతాయని.. లేదంటే ఆర్థిక పరిస్థితి శాశ్వతంగా ఇబ్బందుల్లో పడుతుందని హెచ్చరించారు. విశాఖ, విజయవాడ లాంటి నగరాల నుంచి ఆదాయం మరింత పెరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా జీఎస్టీ, సహా వాణిజ్య పన్నుల వసూళ్లకు సంబంధించి ఆయా జిల్లాల జాయింట్ కమిషనర్లతో చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు.



పెరిగిన ఆదాయం

ఈ ఆర్థిక సంవత్సరానికి రూ. 1.24 లక్షల కోట్ల మేర ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నట్టు ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుతం ఆదాయం వసూళ్లు పెరిగాయని చెప్పారు. స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖలో 2025 ఏప్రిల్‌లో రూ. 906.12 కోట్లు, మేనెలలో రూ. 916 కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు. గతేడాది ఏప్రిల్‌లో రూ. 663.29 కోట్లు, మేనెలలో రూ.583 కోట్లు ఆదాయం ఉన్నట్టు అధికారులు చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జీఎస్టీ, వాణిజ్య పన్నుల విభాగంలో రూ. 43,020 కోట్లు వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు వెల్లడించారు. నూతన మద్యం విధానం వల్ల రాష్ట్ర ఆదాయం రూ. 2,432 కోట్ల మేర పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా సీఎం స్పందిస్తూ.. గనుల శాఖలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఉపగ్రహ సమాచారాన్ని అనుసంధానం చేయాలని ఆదేశించారు. ఖనిజాలు, ఇసుక తవ్వకాలకు సంబంధించి కచ్చితమైన డేటాను సేకరించడం వల్ల ఆదాయం 30-40 శాతం పెరిగే అవకాశం ఉందన్నారు. ఎర్రచందనం విక్రయం కోసం అంతర్జాతీయంగా ఉన్న ధరల్ని బేరీజు వేయాలని చెప్పారు. ఉత్తమ ప్రతిభ చూపే అధికారులనే ఆదాయార్జన శాఖల్లోని కీలకమైన విభాగాల్లో నియమించాలని ఆదేశించారు.

'కబుర్ల దేవత'కు కేంద్ర బాల పురస్కారం

మైరావణ నవలకు యువ పురస్కారం

- అవార్డులు ప్రకటించిన సాహిత్య అకాడమీ

న్యూఢిల్లీ, హైదరాబాద్ సిటీ, నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సాహిత్య అకాడమీ బాలసాహిత్య, యువ పురస్కారాలను ప్రకటించింది. గంగిశెట్టి శివకుమార్ రచించిన 'కబుర్ల దేవత' పుస్తకానికి బాల సాహిత్య పురస్కారం వచ్చింది. ప్రసాద్ సూరి రచించిన మైరావణ నవల సాహిత్య యువ పురస్కారానికి ఎంపికైంది. అకాడమీ అధ్యక్షుడు మాధవ్ కౌశిక్ అధ్యక్షతన బుధవారం సమావేశమైన ఎగ్జిక్యూటివ్ బోర్డు పలు భాషల్లో వెలువడిన ఉత్తమ రచనలను ఈ ప్రతిష్ఠాత్మక అవార్డులకు ఎంపిక చేసింది. ఈ ఏడాది డోగ్రీ భాషకు సంబంధించి యువ పురస్కారం ప్రకటించలేదు. పురస్కారాలను త్వరలో ఢిల్లీలో అవార్డులను ప్రదానం చేయనున్నారు. జ్ఞాపికతో పాటు రూ.50 వేల నగదు అందిస్తామని అకాడమీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రసాద్ సూరిది విశాఖపట్నం కాగా, గంగిశెట్టి శివకుమార్‌ది నెల్లూరు. తెలుగు భాషకు సంబంధించి బాల సాహిత్య పురస్కారాలకు జ్యూరీ సభ్యులుగా కన్నెగంటి అనసూయ, ఎం. భూపాల్ రెడ్డి, కిలపర్తి దాలినాయుడు ఉన్నారు. యువ పురస్కారాలకు జ్యూరీ సభ్యులుగా జీఎస్ చలం, కుప్పిలి పద్మ, పెద్దింటి అశోక్ కుమార్ వ్యవహరించారు.



నెల్లూరులో గంగిశెట్టి శివకుమార్‌ను సత్కరిస్తున్న అరసం నాయకులు



ప్రసాద్ సూరి

పాతికేళ్లకే పురస్కారం

సురాడ ప్రసాద్ (కలం పేరు ప్రసాద్ సూరి) 2000లో విశాఖ జిల్లా రాంబిల్లి మండలం వాడరాంబిల్లి గ్రామంలో జన్మించారు. రాంబిల్లిలోనే పదో తరగతి వరకు చదివారు. యలమంచిలి ప్రభుత్వకాలేజీలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. హైదరాబాద్ మాసబ్ట్యాంకులోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో బీఎఫ్ఏ, పెయింటింగ్‌లో డిగ్రీ పూర్తి చేశారు. ప్రస్తుతం గుజరాత్‌లోని బరోడా నగరంలో మహారాజా సాయాజిరావు యూనివర్సిటీలో ఎంఏ ఆర్కియాలజీ రెండో సంవత్సరం చదువుతున్నారు. 18వ ఏట నుంచే సాహిత్యం, చిత్రకళ, చరిత్ర, సినిమా రంగంపై ఆయనకు ఆసక్తి ఎక్కువ. 'మైరావణ' ఆయన మూడో నవల. 'మై నేమ్ ఈజ్ చిరంజీవి', 'బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్' అనేవి మిగతా నవలలు. చేపల వేట జీవనాధారంగా ఉన్న వాడ బలిజల వలస జీవిత కథలకు జానపద వీరగాథను జోడించి రాసిన నవలే మైరావణ. ఛాయా పబ్లికేషన్స్ ప్రచురించిన ఈ పుస్తకం వాడ బలిజల జీవితాలను తొలిసారిగా సాహిత్యంలో నమోదు చేసింది. ఈ అవార్డు సాహిత్యం పట్ల తన బాధ్యతను మరింత పెంచింది అని రచయిత ప్రసాద్ సూరి అన్నారు. తాను ఎంతో అధ్యయనం చేసి ఈ నవల రాశానని తెలిపారు.

బాల సాహిత్యంలో దిట్ట...

ఐదు దశాబ్దాలకు పైగా సాహిత్య సేవ చేస్తున్న గంగిశెట్టి శివకుమార్ చిన్నారుల కోసం 400కుపైగా కథలు రాశారు. నెల్లూరు జిల్లా రాపూరుకు చెందిన గంగిశెట్టి 54 ఏళ్లుగా రచనలు చేస్తున్నారు. తిరుపతి జిల్లా గూడూరులో ఉపాధ్యాయునిగా 2012లో ఉద్యోగ విరమణ పొందారు. తొలినాళ్లలో 'చందమామ'కు ఉప సంపాదకునిగా సేవలందించారు. పిల్లల కథలపై ఎస్వీ వర్సిటీలో పీహెచ్‌డీ చేశారు. వీరి కథలు పాఠశాల స్థాయిలో పాఠ్యాంశాలుగా ఉన్నాయి. పురస్కారాలు పొందిన ప్రసాద్ సూరి, గంగిశెట్టిలకు సాహిత్య ప్రముఖులు ఛాయా మోహన్, తాడి ప్రకాశ్, రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి, వల్లూరు శివప్రసాద్, పెనుకొండ లక్ష్మీనారాయణ, పెరుగు రామకృష్ణ, టేకుమళ్ల వెంకటప్పయ్య తదితరులు అభినందనలు తెలిపారు.



సింహగిరిపై యోగాసనాలు వేస్తున్న వేద విద్యార్థులు

యోగాంధ్రాకు 175 దేశాల ప్రతినిధులు

- విశాఖ జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా

విశాఖపట్నం, అమరావతి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో పాటు 175 దేశాల నుంచి ప్రతినిధులు హాజరవుతారని విశాఖ జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమాన్ని పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతోనే నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. విశాఖ నుంచి భీమిలి వరకూ 29.8 కి.మీ. పొడవున కార్యక్రమం నిర్వహిస్తామని, ఒక్క బీచ్ రోడ్డులోనే 3.26 లక్షల మంది పాల్గొంటారని చెప్పారు. ఇంకా జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పాల్గొనే వారితో కలిపితే మొత్తం ఐదు లక్షల మంది అవుతారన్నారు.

మరో నలుగురు ఐఏఎస్‌లకు బాధ్యతలు

'యోగాంధ్ర' కార్యక్రమానికి మరో నలుగురు ఐఏఎస్‌లను నియమిస్తూ సీఎస్ విజయానంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. యోగాంధ్రకు ప్రజలను సమీకరించేందుకు ఇప్పటికే సీనియర్ ఐఏఎస్ అధికారి డా. మల్లికార్జునను ప్రభుత్వం నియమించింది. ఆయనకు మద్దతుగా ఐఏఎస్‌లు ఎస్.రామసుందర్ రెడ్డి, రోణంకి కూర్మనాథ్, ఆర్.గోవిందరావు, ప్రకాశం జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణను నియమించింది.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో 'నన్నయ యోగాంధ్ర'

- 16,123 మంది విద్యార్థులతో మెగా యోగా కార్యక్రమం

దివాన్‌చెరువు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం నిర్వహించిన మెగా యోగాంధ్ర కార్యక్రమం తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంది. తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలోని వర్సిటీ ప్రాంగణంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో 16,123 మంది విద్యార్థులతో మెగా యోగా నిర్వహించారు. విద్యార్థులు చేసిన అతిపెద్ద యోగా ప్రదర్శనగా ఈ కార్యక్రమం తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుందని ఉపకులపతి ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీ తెలిపారు. ఈ మేరకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ ప్రతినిధులు వీసీ ప్రసన్నశ్రీకి ధ్రువపత్రాన్ని అందజేశారు.

ఎయిర్‌పోర్టుల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ

- మంత్రి బీసీ జనార్దనరెడ్డి వెల్లడి.. మౌలిక వసతుల కల్పనపై సమీక్ష

అమరావతి, జూన్18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని మంత్రి బీసీ జనార్దనరెడ్డి చెప్పారు. అమరావతి సహా పలు ఎయిర్‌పోర్టుల నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నామన్నారు. సాగరమాల కింద చేపడుతున్న పనుల పర్యవేక్షణ కోసం వచ్చేనెల 4న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాధికారులతో సమీక్ష నిర్వహిస్తామని వెల్లడించారు. బుధవారం విజయవాడలో మౌలిక సదుపాయాల కల్పనపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు 20కి తగ్గకుండా, ఎయిర్‌పోర్టులు 14కు తగ్గకుండా నిర్మించేలా కార్యాచరణను సిద్ధం చేస్తున్నామన్నారు. ఎయిర్‌పోర్టుల టెక్నికల్ ఎకనామికల్ ఫీజబిలిటీ రిపోర్టు తయారీకి కన్సల్టెంట్ల నియామకం కోసం టెండర్లను పిలుస్తున్నామని చెప్పారు. ఫైబర్‌నెట్ కార్యకలాపాల కోసం రూ.70.82 కోట్లు విడుదల చేశామని, ఈ నిధులతో 29 సంస్థలకు బకాయిలను చెల్లిస్తామని చెప్పారు.

రప్పా రప్పా నరుకుతాం...!











రాజారెడ్డి రాజ్యాంగాన్ని పల్నాడు నుంచి మొదలెడతాం... 2029లో వైసీపీ వచ్చిన వెంటనే గంగమ్మ తల్లి జాతరలో వేట తలలు నరికినట్లు రప్పారప్పా నరుకుతాం ఒక్కొక్కడిని... ఎవడైనా రానీ తొక్కి పడేస్తాం... రప్పా రప్పా నరుకుతాం నా కొడకల్లారా... ఐయాం డిక్లేరింగ్ ద వార్ జగన్ 2.0 అన్న వస్తాడు అంతు చూస్తాడు... ఇవన్నీ వైసీపీ నినాదాలు. ఇటీవల వివిధ సందర్భాలలో జగన్ పర్యటనల్లో ఆ పార్టీ కార్యకర్తలు చేతబట్టుకున్న ప్లకార్డుల్లో రాసుకున్న ఆణిముత్యాలు. ఏ పార్టీ కార్యకర్తలైనా తాము అధికారంలోకి వస్తే ఏమేం చేస్తామో వాటిని ప్లకార్డులపై రాసుకుని తమ ర్యాలీల్లో ప్రదర్శించడం రివాజు. అలాగే, వైసీపీ కార్యకర్తలు సాక్షాత్తూ ఆ పార్టీ అధినేత జగన్ పర్యటనల్లో ప్రదర్శించిన ప్లకార్డులివి.

ఒక్కొక్కరికి సినిమా చూపిస్తా..



- నాగమల్లేశ్వరరావును చంద్రబాబు పొట్టనపెట్టుకున్నారు
- మా పార్టీలోని కమ్మ నేతలను టార్గెట్ చేస్తున్నారు: జగన్

సత్తెనపల్లి(నరసరావుపేట), జూన్ 18(ఆంధ్రజ్యోతి): "చంద్రబాబుకు వత్తాసు పలుకుతున్న పోలీసు శాఖలోని వారిని హెచ్చరిస్తున్నా! మరో మూడు నాలుగేళ్లలో మా ప్రభుత్వం వస్తుంది. అప్పుడు ఒక్కొక్కరికి సినిమా చూపిస్తా" అని విపక్ష నేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి హెచ్చరించారు. ఏడాదికిందట బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకుని ఆత్మహత్య చేసుకున్న వైసీపీ గ్రామస్థాయి నేత నాగమల్లేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించేందుకు... బుధవారం జగన్ సత్తెనపల్లి నియోజకవర్గం రెంటపాళ్లకు వెళ్లారు. గ్రామంలో ఏర్పాటు చేసిన నాగమల్లేశ్వరరావు విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఎప్పట్లాగానే... అర్ధసత్యాలు, వక్రీకరణలతో ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తుండటంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు దెబ్బతిన్నాయని ఆరోపించారు. ఈ పరిపాలన ఎక్కువ రోజులు నడవదని, ప్రజలు మొట్టికాయలు వేసే రోజులు దగ్గరలోనే ఉన్నాయని జగన్ జోస్యం చెప్పారు.

కులం పేర్లతో...

కమ్మ, రెడ్డి అంటూ కులం పేర్లు ప్రస్తావిస్తూ జగన్ అనేక అసంబద్ధ వ్యాఖ్యలు చేశారు. కూటమి ప్రభుత్వం వైసీపీలోని కమ్మ నేతలపై కక్ష సాధిస్తోందని, వారిపై అక్రమ కేసులు బనాయించి జైళ్లల్లో పెట్టడం దుర్మార్గమని ఆక్రోశించారు. కమ్మ, రెడ్డి సామాజిక వర్గాల నేతలు చంద్రబాబుకు ఊడిగం చేయాలా అంటూ ధ్వజమెత్తారు. "కమ్మవారు మా పార్టీలో ఉంటే మీకు అభ్యంతరమా? నాగమలేశ్వరరావును చంద్రబాబు పొట్టనబెట్టుకున్నాడు. వల్లభనేని వంశీ, కొడాలి నాని, దేవినేని అవినాశ్, తలశిల రఘురాం, మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణపై కూడా కేసులు పెట్టారు. నంబూరు శంకరరావు, బొల్లా బ్రహ్మనాయుడు, పోసాని కృష్ణమురళి, ఇంటూరి రవిపై తప్పుడు కేసులు బనాయించారు. వీరు ఏం పాపం చేశారని కేసులు పెట్టి వేధిస్తున్నారు!" అని జగన్ ప్రశ్నించారు. విశాఖలో దగ్గుబాటి సురేశ్‌కు సంబంధించిన స్థలం అనుమతులను రద్దు చేశారని విమర్శించారు. ఊడిగం చేయలేదనే కమ్మ, రెడ్డి నేతలను చంద్రబాబు వేధిస్తున్నారని జగన్ ఆరోపించారు.

నరుకుతాం.. చంపుతాం!

(మొదటి పేజీ తరువాయి)

కొన్ని పద్ధతులున్నాయి. వైసీపీకి మాత్రం ఎలాంటి పద్ధతీ లేదు. పార్టీ అధ్యక్షుడు జగన్ అబద్ధాలు, అర్ధసత్యాలతో ప్రభుత్వంపై బురదజల్లుతూ, పోలీసులను బెదిరిస్తుండగా... ఆయన పార్టీ కార్యకర్తలు ఏకంగా 'నరుకుడు' భాషను బహిరంగంగా ప్రదర్శిస్తున్నారు.

ఇదేం భాష...

అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా బూతులే వైసీపీ రాజ్యాంగం! దాడులే... ఆ పార్టీ విధానం! ఇప్పుడు... అది మరింత శ్రుతిమించింది. విపక్ష హోదా కూడా లేని పరిస్థితుల్లో ఉన్నా 'మళ్లీ అధికారంలోకి వచ్చాక... చంపేస్తాం, నరికేస్తాం' అని బహిరంగంగానే హెచ్చరిస్తున్నారు. "ఎవడైనా రానీ.. తొక్కి పడేస్తాం! 2029లో వైఎస్సార్‌సీపీ వచ్చిన వెంటనే.. గంగమ్మతల్లి జాతరలో వేట తలలు నరికినట్టు.. రప్పా రప్పా నరుకుతాం నా కొడకల్లారా! వైఎస్ రాజారెడ్డి రాజ్యాంగం పల్నాడు నుంచి మొదలు, అన్న వస్తాడు.. అంతు చూస్తాడు!' అంటూ వైసీపీ కార్యకర్తలు ప్లకార్డులు, ఫ్లెక్సీలు ప్రదర్శించారు. తెనాలి, పొదిలి, సత్తెనపల్లి పర్యటనల్లో ఇవి కనిపించాయి. జగన్ పర్యటనలు, ఆ సందర్భంగా చోటు చేసుకుంటున్న పరిణామాలు వైసీపీ వికృతరూపానికి నిదర్శనమని టీడీపీ నేతలు పేర్కొంటున్నారు.

> **సైకోతత్వం...**
>
> - ఎన్నికల సమయంలో 'సిద్ధం' సభల ప్రాంగణంలో చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్ ఫ్లెక్సీలు పెట్టి వాటిని వైసీపీ కార్యకర్తల చేత కొట్టించి శాడిజం చాటుకున్నారు.
> - ఇటీవల జోగి రమేశ్ కుమారుడి వివాహ వేడుక సందర్భంగా... విజయవాడ ఇబ్రహీంపట్నంలో సైకిల్ తొక్కుకుంటూ వెళుతున్న చిన్న పిల్లాడిని తోసేసి, సైకిల్ లాక్కుని దాన్ని గాల్లో తిప్పి, నేలకేసి కొట్టి పైశాచికానందం పొందారు.
> - ఈనెల 3న తెనాలిలో రౌడీ షీటర్లను జగన్ పరామర్శించి తన మార్కు రాజకీయాన్ని చాటుకున్నారు.
> - ఈనెల 11న పొదిలిలో పొగాకు రైతుల పరామర్శ.. 15వేల పైచిలుకు మందితో దండయాత్ర చేశారు. ఆ సమయంలో రాజధానిపై జగన్ బ్యాచ్ చేసిన వ్యాఖ్యలకు శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మహిళలపైన, పోలీసులపైన వైసీపీ మూకలు దాడులు చేశాయి. ఈ కేసులో 24 మందిని అరెస్టు చేయగా... వారిలో 9 మందికి నేరచరిత్ర ఉన్నట్లు స్పష్టమైంది. వైసీపీ నేరగాళ్ల అడ్డా అనేందుకు ఇదే నిదర్శనమని టీడీపీ నేతలు చెబుతున్నారు.

ఇదేనా రాజకీయం...

ప్రభుత్వం తీసుకునే ప్రజావ్యతిరేక నిర్ణయాలపై ఆందోళనలు, నిరసనలకు పిలుపునివ్వడం ప్రతిపక్షాలు సర్వసాధారణంగా చేసే పనే! కానీ... జగన్ ఇప్పుడు చేస్తున్న 'ఆందోళనలు' వేరు. తెనాలిలో రౌడీ షీటర్లను పరామర్శించారు. పొదిలిలో పొగాకు రైతుల పరామర్శ పేరిట బలప్రదర్శనకు దిగారు. ఇక... బుధవారం సత్తెనపల్లి నియోజకవర్గం రెంటపాళ్ల పర్యటన మరింత నీచం, ఘోరం! ఎప్పుడో ఏడాది కిందట... వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తుందంటూ బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకుని ఆత్మహత్య చేసుకున్న నాయకుడి కుటుంబాన్ని జగన్ ఇప్పుడు పరామర్శించారు. అందులోనూ అడుగడుగునా అరాచకమే! సున్నితమైన ప్రాంతం, ఇరుకైన వీధులు... ఎక్కువమంది కాకుండా వందమందికే పర్యటనను పరిమితం చేసుకోండి అని పోలీసులు స్పష్టం చేసినా జగన్ పట్టించుకోలేదు. 'అంతా నా ఇష్టం' అనేలా వ్యవహరించారు. వందల వాహనాలు, వేలమందితో బలప్రదర్శనకు దిగారు.

నాడు అడుగేస్తే ఆంక్షలు..

వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు.. విపక్షంలో ఉన్న తెలుగుదేశం పార్టీకి కనీసం జిల్లాల్లో పర్యటనలు చేసే అవకాశం కూడా ఇవ్వలేదు. సాక్షాత్తు టీడీపీ అధినేత చంద్రబాబునే అడుగడుగునా ఆంక్షలతో అడ్డుకున్నారు. నాటి వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సభలు, సమావేశాల నిర్వహణపై ఆంక్షలు విధిస్తూ ఏకంగా జీవో నంబరు 1ని విడుదల చేశారు. 2023 ఆగస్టులో టీడీపీ అధినేత చంద్రబాబు సాగునీటి ప్రాజెక్టు సందర్శనలో భాగంగా అన్నమయ్య జిల్లాలో అంగళ్లు కూడలి వద్దకు చేరుకున్న సమయంలో... పోలీసులు ఆయన్ను అడ్డుకోవడమే కాకుండా హత్యాయత్నం కేసుతోపాటు రోడ్‌షోలో హింసను ప్రేరేపించారంటూ మొత్తం 254 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలపై కేసు పెట్టారు. ఈ కేసులో చంద్రబాబును ఏ1గా పెట్టడం గమనార్హం. అంతకుముందు 2023 ఫిబ్రవరిలో చంద్రబాబు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పర్యటనలోనూ పోలీసులు దారుణంగా వ్యవహరించారు. అనపర్తిలో చంద్రబాబు సభకు తొలుత అనుమతి ఇచ్చి... ఆ తర్వాత అనుమతి లేదంటూ అడ్డం తిరిగారు. సామర్లకోట నుంచి అనపర్తి వస్తున్న చంద్రబాబును బలభద్రపురం వద్ద అడ్డుకున్నారు. అయినా వెనక్కి తగ్గని చంద్రబాబు సుమారు 8 కిలోమీటర్లు కాలినడకనే అనపర్తికి చేరుకున్నారు. చిమ్మచీకటిలో గంట పదిహేను నిమిషాలు సెల్‌ఫోను లైట్లలోనే చంద్రబాబు నడుచుకుంటూ సభాస్థలి వద్దకు చేరుకున్నారు. ఇప్పుడు... అనుమతులతో తనకు పనిలేదని, ఆంక్షలు తనను అడ్డుకోలేవని జగన్ విచ్చలవిడిగా చెలరేగుతున్నారు. మందీమార్బలంతో జగన్ చేసిన హడావిడికి బుధవారం రెండు నిండు ప్రాణాలు బలయ్యాయి.

> **ఐదేళ్లు అదేగా చేసింది!**
>
> గుంటూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాం రాష్ట్రంలో ఎమర్జెన్సీని తలపించింది. టీడీపీ అగ్ర నేతలు మొదలు సామాన్య కార్యకర్తల వరకు జెండా పట్టుకోవడానికి వణికిపోయే పరిస్థితులు కల్పించారు. కేసులు, అరెస్టుల పేరుతో బీభత్సం సృష్టించారు. పల్నాడు ప్రాంతంలో చంద్రయ్య, జల్లయ్య మొదలు ఎంతోమంది నాయకులు కార్యకర్తలను వెంటాడి నరికి చంపారు. చంద్రబాబు మొదలుకొని అచ్చెన్నాయుడు, ధూళిపాళ్ల నరేంద్ర, దేవినేని ఉమా, కొల్లు రవీంద్ర, చింతమనేని ప్రభాకర్, అయ్యన్నపాత్రుడు, అలాగే నాటి వైసీపీ రెబల్ ఎంపీ రఘురామకృష్ణరాజు ఇలా ఏ ఒక్కరినీ వదలకుండా అరెస్టు చేసి జైలుకు పంపి వేధించారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారంటూ రంగనాయకమ్మ, వెంగళరావు మొదలు వందలాది మందిపై కేసులు పెట్టి జైలుకు పంపారు. ఆ అరాచకాలను భరించలేకే... ఎన్నికల్లో వైసీపీకి జనం బుద్ధి చెప్పారు. ఇంతటి దారుణ పరాజయం చవిచూసిన తర్వాత కూడా... వైసీపీలో మార్పు లేకపోవడం గమనార్హం. పైగా... నరికేస్తాం, చంపేస్తాం అని హెచ్చరిస్తుండటం ఆ పార్టీ నైజానికి అద్దం పడుతోంది. నేర చరితులకు, నేరగాళ్లకు అండగా ఉంటామని జగన్ స్పష్టమైన సంకేతాలు పంపుతుండటంతో... ఆయా శక్తులు మరింత రెచ్చిపోతున్నాయి.
>
> **పోలీసులు ఏం చేస్తున్నారు?**
>
> జగన్ సత్తెనపల్లి పర్యటన సందర్భంగా 'గోబ్యాక్' అని అక్కడక్కడ పెట్టిన ఫ్లెక్సీలను పోలీసులు రాత్రికి రాత్రి తొలగించారు. కానీ... చంపేస్తాం, నరికేస్తాం అని ప్లకార్డులు ప్రదర్శిస్తూ వీరంగం తొక్కుతున్న వైసీపీ శ్రేణులను మాత్రం అడ్డుకోలేకపోయారు. వైసీపీ హయాంతో పోల్చితే... ఇప్పుడు పోలీసులు మెతక వైఖరి ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొందరు పోలీసు అధికారులు నేటికీ వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని టీడీపీ నేతలే చెబుతున్నారు.

జగన్ పర్యటనలో రచ్చ రచ్చ

పరామర్శ పేరుతో బలప్రదర్శన

అనుమతి లేకున్నా జనసమీకరణ

- రెంటపాళ్లకు వంద మందికే అనుమతి
- వేలాది మందిని తరలించిన నేతలు

సత్తెనపల్లి(నరసరావుపేట) జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పరామర్శ పేరుతో బలప్రదర్శన చేశారు. అనుమతులు లేకపోయినా భారీగా జనసమీకరణ చేసి రచ్చ రచ్చ చేశారు. బారికేడ్లను తోసివేసి, అడ్డుకోబోయిన పోలీసులను నెట్టివేశారు. పోలీసుల నిబంధనలు ఉల్లంఘించి వారిపైనే దౌర్జన్యానికి దిగారు. ఇలా ఆద్యంతం రెచ్చగొట్టేలా బుధవారం వైసీపీ అధినేత జగన్ పల్నాడు జిల్లా పర్యటన సాగింది. ఆయన పర్యటనకు వెళ్లిన రెంటపాళ్ల గ్రామంలో రోడ్లు ఇరుకుగా ఉంటాయి. వేలాది మంది వెళితే ప్రమాదకరమని పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ముందుగానే హెచ్చరించారు. జగన్ సహా వంద మందిని మాత్రమే రెంటపాళ్లకు అనుమతిస్తామన్నారు. ఇందుకు విరుద్ధంగా వైసీపీ మాజీ ఎమ్మెల్యేలు బలప్రదర్శనకు దిగారు. పెద్దఎత్తున జనసమీకరణ చేశారు. పోలీసు ఆంక్షలను ఉల్లంఘించారు. 12 గంటలకు రెంటపాళ్ల రావాల్సిన జగన్ జనసమీకరణతో బల ప్రదర్శనగా సాయంత్రం 4.45కు చేరుకున్నారు. ఏదైనా సంఘటన జరిగితే అనుకూలంగా మార్చుకునేందుకు వైసీపీ కుట్రలో భాగంగా భారీగా జనసమీకరణ చేశారన్న విమర్శలు వస్తున్నాయి.

పోలీసులతో అంబటి వాగ్వాదం

పోలీసులు అనుమతి ఇవ్వకపోయినా జనసమీకరణ చేయాల్సిందేనని మాజీ ఎమ్మెల్యేలను వైసీపీ అధిష్ఠానం ఆదేశించింది. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే పరిస్థితులు వేరుగా ఉంటాయని హెచ్చరించినట్టు ప్రచారం జరిగింది. జగన్ రెంటపాళ్ల పర్యటన సందర్భంగా మాజీ మంత్రి అంబటి రాంబాబు, ఆయన సోదరుడు అంబటి మురళి ఓవర్ యాక్షన్ చేశారు. జగన్ పర్యటనలో ఆయన కాన్వాయ్‌తో పాటు మూడు వాహనాలు, వంద మందికి మాత్రమే అనుమతి ఉంది. ఈ నేపథ్యంలో మేడికొండూరు మండలం కొర్రపాడు వద్ద పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేశారు. జగన్ కాన్వాయ్‌తో పాటు మరో మూడు వాహనాలను రెంటపాళ్ల వైపు వెళ్లనిచ్చారు. అటుగా వస్తున్న అంబటి రాంబాబు, ఇతరుల వాహనాలను ఆపారు. దీంతో అంబటి రాంబాబు, మురళి కిందకు వాహనాల్లో నుంచి దిగి బారికేడ్లను లాగి పడేశారు. దమ్ముంటే ఆపాలంటూ పోలీసులకు సవాల్ విసిరారు. 'ప్రమాదాలు జరుగుతున్నాయి, ఐదు నిమిషాలు ఆగండి పంపిస్తాం' అని పోలీసులు చెప్పినా వినకుండా.. 'మాకు తెలుసు' అంటూ అంబటి కార్యకర్తలను రెచ్చగొడుతూ రెంటపాళ్ల వైపు వాహనాల్లో వెళ్లారు.



పోలీసు బారికేడ్లను తొలగిస్తున్న అంబటి రాంబాబు

పార్టీ శ్రేణుల అత్యుత్సాహం

జగన్ పర్యటన సందర్భంగా వైసీపీ శ్రేణులు సత్తెనపల్లిలో హల్‌చల్ చేశాయి. అనుమతులు లేకపోయినా ప్రదర్శన నిర్వహించారు. బైకుల హారన్ మోగిస్తూ.. ఆర్టీసీ వాహనాలకు అడ్డుగా బైక్‌లను నిలిపి ప్రయాణికులను ఇబ్బంది పెట్టారు. జగన్ పర్యటన నేపథ్యంలో పోలీసులు 25 చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. నంది గామ అడ్డరోడ్డులో 'అమరావతి ద్రోహి జగన్.. గోబ్యాక్ జగన్' అనే నినాదాలతో కొందరు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయగా, బుధవారం తెల్లవారేసరికి పోలీసులు తొలగించారు. సత్తెనపల్లి నుంచి రెంటపాళ్ల వరకు జగన్, నాగమల్లేశ్వరరావు ఫ్లెక్సీలను పెట్టారు. ఫ్లెక్సీలను తొలగించబోయిన మున్సిపల్ సిబ్బందిని వైసీపీ శ్రేణులు అడ్డుకున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు సత్తెనపల్లి పర్యటన సందర్భంగా టీడీపీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేయనీయకుండా అప్పటి మంత్రి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో వైసీపీ నేతలు అడ్డుకున్నారు.

వారిపై చర్యలు తప్పవు: ఎస్పీ

జగన్ పర్యటనలో నిబంధనలను అతిక్రమించారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ కంచి శ్రీనివాసరావు బుధవారం రాత్రి స్పష్టం చేశారు. రెంటపాళ్లకు భారీగా జనసమీకరణ చేశారన్నారు. సత్తెనపల్లి పట్టణంలో ట్రాఫిక్‌కు విఘాతం కలిగించారన్నారు. అనుమతులు లేకుండా ద్విచక్ర వాహనాలతో ప్రదర్శనలు నిర్వహించారన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించిన వారిపై చర్యలు ఉంటాయన్నారు.

> **రెచ్చగొట్టే వ్యాఖ్యలపై ఫిర్యాదు**
>
> రాజుపాలెం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): '2029లో వైసీపీ వచ్చిన వెంటనే గంగమ్మతల్లి జాతరలో వేట తలలు నరికినట్టు రప్పారప్పా నరుకుతాం ఒక్కొక్కడిని'.. అంటూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలంటూ టీడీపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం బలిజేపల్లి గ్రామానికి చెందిన మెరుగు రాధ అనే వైసీపీకి చెందిన మహిళ ప్రజలను రెచ్చగొట్టే విధంగా పలు వాట్సాప్ గ్రూపులలో పోస్టులు ఫార్వడ్ చేసింది.

జనం చెవిలో జగన్ పూలు!

- పల్నాడు పర్యటనలో కట్టుకథలు

(గుంటూరు-ఆంధ్రజ్యోతి)

వైసీపీ అధినేత జగన్ పల్నాడు జిల్లా పర్యటన అంతా అబద్ధాలు, కట్టుకథలతో సాగింది. చెప్పిందే మళ్లీ మళ్లీ చెప్పి అబద్ధాలను నిజం చేయాలని తెగ తాపత్రయపడ్డారు. రెంటపాళ్ల పర్యటనలో 'కమ్మ' సామాజిక వర్గంపై ఎనలేని ప్రేమను ఒలకబోస్తూ జగన్ మాట్లాడటం పలువురిని ఆశ్చర్యం కలిగించింది. అధికారంలో ఉన్నప్పుడు అవధులు లేకుండా అక్రమాలకు, అన్యాయానికి పాల్పడిన పలువురు మాజీ ఎమ్మెల్యేల పేర్లు ప్రస్తావిస్తూ.. ఏం పాపం చేశారని వాళ్ల మీద కేసులు పెట్టారంటూ ఆవేశంగా ప్రశ్నించారు. జగన్ పర్యటనలో ప్రశ్నలు, కట్టు కథలకు అసలు జవాబులు ఇవీ..

జగన్: 2024 జూన్ 4న నాగమల్లేశ్వరరావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ రోజు టీడీపీ అధికారంలోకి వచ్చిందని తెలియగానే సీఐ రాజేష్ కాల్చేస్తానని నాగమల్లేశ్వరరావును బెదిరించారు. జూన్ 5న నాగమల్లేశ్వరరావును స్టేషన్ నుంచి విడిచి పెడితే గుంటూరులోని తన సోదరుడు ఇంటికి వెళ్లాడు. అక్కడ పురుగు మందుతాగి చనిపోయాడు.

ఇదీ నిజం: 2024 జూన్ 4న ఎన్నికల ఫలితాలు వచ్చాయి. వైసీపీ గెలుస్తుందని నాగమల్లేశ్వరరావు రూ.2 కోట్ల వరకు బెట్టింగ్ పెట్టాడు. ఇందు కోసం అప్పులు చేశాడు. గ్రామస్థులతో గొడవ జరిగింది. ఇరువురు పోలీసులను ఆశ్రయించారు. అక్కడ నుంచి బయటకు వచ్చిన తర్వాత తాను డబ్బులు ఇవ్వాల్సిన వారిని బెదిరించేందుకు నాగమల్లేశ్వరరావు పురుగుల మందు తాగాడు. గుంటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ జూన్ 9న ప్రాణం విడిచాడు. పోలీసులు వేధింపుల మూలంగా నాగమల్లేశ్వరరావు ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రచారం చేసిన అంబటి రాంబాబు గ్యాంగ్ రెంటపాళ్ల గ్రామంలో భారీ దాడులకు పాల్పడింది.

జగన్: మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఏం పాపం చేశాడు?

నిజం: పెదకూరపాడు నియోజకవర్గంలో శంకరరావు చేయని అరాచకం లేదు. వైసీపీ పాలనలో ఆ నియోజకవర్గంలోని ఇసుకను తవ్వేసి వందల కోట్లు వెనకేశారు. అదేమని ప్రశ్నించిన వారిని అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేయించారు.

జగన్: మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు ఏం పాపం చేశాడు?

నిజం: వినుకొండ ఎమ్మెల్యేగా బొల్లా బ్రహ్మనాయుడు భూములు ఆక్రమించి, జగనన్న కాలనీల పేర్లతో రూ. కోట్ల అవినీతికి పాల్పడ్డాడు. ఆఖరికి గిట్టుబాటు ధర లేదని ప్రశ్నించిన రైతుపై ఏకంగా ఎంపీ సమక్షంలోనే చెప్పుతో దాడి చేసిన వ్యక్తిత్వం ఆయనిది. ఓట్లు వేసి గెలిపించిన వాళ్లు తన వద్దకు పని కోసం వస్తే ఎన్నికలప్పుడు ఇచ్చిన డబ్బులు తిరిగి కక్కమని సొంత పార్టీ కేడర్‌నే బూతులు తిట్టిన నైజం ఆయనిది. అటువంటి బ్రహ్మనాయుడును జగన్ వెనుకేసుకురావటం విస్మయం కలిగించింది.

జగన్: తెనాలి మాజీ ఎమ్మెల్యే శివ ఏం పాపం చేశాడు?

నిజం: శివ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తెనాలిలో ఆర్థిక నేరాలకు పాల్పడి, గంజాయి, రౌడీ మూకలను ప్రోత్సహించారు. ఎన్నికల రోజు ఓటరుపై దాడికి పాల్పడ్డారంటే ఎన్ని అక్రమాలకు పాల్పడ్డారో అర్థం చేసుకోవచ్చు.

జగన్: దగ్గుబాటి సురేశ్ స్థలం అనుమతులు రద్దు చేశారు

నిజం: విశాఖలో సినిమా స్టూడియో నిర్మాణం కోసం సురేశ్ ప్రొడక్షన్స్‌కు గతంలో దాదాపు 34 ఎకరాలు ఇచ్చారు. ఇందులో కొంత స్థలంలో మాత్రమే స్టూడియో కట్టారు. మిగిలిన స్థలం ఖాళీగా ఉంది. ఈ స్థలాన్ని సినిమా స్టూడియో నిర్మాణం కోసం మాత్రమే వినియోగించాలని.. రెసిడెన్షియల్, కమర్షియల్ అవసరాలకు వాడరాదని జీవోలో స్పష్టంగా పేర్కొన్నారు. 2019లో వైసీపీ అధికారంలోకి రాగానే ఈ ఖాళీ స్థలంపై ఆ పార్టీ నేతలు కన్నేశారు. 15 ఎకరాల్లో లే అవుట్ వేయించి సగం ప్లాట్లను వైసీపీ నేతలు కొట్టేశారు. దీంతో టీడీపీ ప్రభుత్వం ఆ 15 ఎకరాలను వెనక్కి తీసుకోవాలని నిర్ణయించింది. కాగా, గతంలో వైసీపీ ఎమ్మెల్యేలైన మరికొందరని ప్రస్తావిస్తూ మహానుభావులుగా జగన్ కీర్తించారు. తన పార్టీలో ఉండటమే వారు చేసిన తప్పా అని వెనకేసుకొచ్చారు. కొడాలి నాని, వంశీ, అబ్బయ్య చౌదరి, అవినాశ్ వంటి వారి గురించి ప్రస్తావిస్తూ వారిని కీర్తించేందుకు జగన్ ప్రయత్నించారు.



తీవ్ర గాయాలతో జీజీహెచ్‌లో సింగయ్య మృతదేహం



జయవర్ధన్‌రెడ్డి మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లిదండ్రులు

జగన్ పర్యటన.. ఇద్దరి మృతి!

- కాన్వాయ్‌లో వాహనం ఢీకొట్టడంతో వ్యక్తికి తీవ్ర గాయాలు ..చావుబతుకుల్లో ఉన్నా పట్టనట్లు వెళ్లిపోయిన వైసీపీ నేతలు
- పోలీసులు వచ్చి ఆస్పత్రికి తరలించే సమయానికే మృతి
- డాన్స్ చేస్తూ కుప్పకూలిన వైసీపీ కార్యకర్త
- రెండు కుటుంబాల్లో అంతులేని విషాదం
- కనీసం పరామర్శించని వైసీపీ అధినేత

సత్తెనపల్లి(నరసరావుపేట)/గుంటూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో వైసీపీ అధ్యక్షుడు జగన్ పర్యటన ఇద్దరి ప్రాణాలు బలితీసుకుంది. రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది. సత్తెనపల్లిలో జగన్ పర్యటన సందర్భంగా నృత్యం చేస్తూ కుప్పకూలిపోయి అదే పట్టణానికి చెందిన వైసీపీ కార్యకర్త పి. జయవర్ధన్‌రెడ్డి(30) మృతిచెందారు. రోడ్డుపై పడిపోయిన జయవర్ధన్‌రెడ్డిని అక్కడ ఉన్న వారు ద్విచక్ర వాహనంపై ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అలసటతో గుండెపోటుకు గురై మరణించినట్లు వైద్యులు పేర్కొన్నారు. అవివాహితుడైన జయవర్ధన్‌రెడ్డి సత్తెనపల్లిలో తన తండ్రి నిర్వహిస్తున్న ఆటోమొబైల్ షాపులో ఆయనకు చేదోడుగా ఉంటున్నారు. ఆయన మృతదేహాన్ని ఆస్పత్రి నుంచి కుటుంబసభ్యులు నేరుగా ఇంటికి తీసుకువెళ్లారు. సమాచారం తెలుసుకున్న పట్టణ సీఐ నాగమల్లేశ్వరరావు, పోలీసులు హుటాహుటిన వెళ్లి మృతదేహాన్ని తమకు అప్పగించాలని, పోస్టుమార్టం చేసి, కేసు నమోదు చేయాలని తెలిపారు. ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డితో మాట్లాడారు. తొలుత నిరాకరించినా చివరకు కుటుంబ సభ్యులు అంగీకరించారు. 174 సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. బీటెక్ పూర్తిచేసిన జయవర్ధన్‌రెడ్డి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నారు. ఉద్యోగం వచ్చిన వెంటనే పెళ్లి చేస్తావా అని అడిగాడని తల్లి వాపోయారు. చేతికంది వచ్చిన కొడుకు మరణించడంతో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు.

కాన్వాయ్‌లో వాహనం ఢీకొని...

గుంటూరు జిల్లా ఏటుకూరు సమీపంలోని లాల్‌పురం జాతీయ రహదారిపై జగన్ కాన్వాయ్‌లోని వాహనం ఢీకొని చీలి సింగయ్య(53) మరణించారు. జగన్‌కు పూలు చల్లేందుకు ముందుకొచ్చిన సింగయ్యను కాన్వాయ్‌లోని వాహనం ఢీకొంది. కింద పడిపోయిన సింగయ్య భుజంపైగా కారు చక్రం వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డారు. అయినా జగన్ గానీ, కాన్వాయ్‌లోని వాహనాలు గానీ ఆగలేదు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సింగయ్యను వైసీపీ నేతలు కనీసం ఆస్పత్రికి తరలించే ప్రయత్నం కూడా చేయలేదు. దీంతో స్థానికులు సింగయ్యను రోడ్డు పక్కన పడుకోబెట్టారు. సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్ ఏఎస్ఐ రాజశేఖర్ అక్కడికి చేరుకుని 108లో ఆయన్ను జీజీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే సింగయ్య మృతి చెందినట్లు నిర్ధారించారు. సింగయ్యది గుంటూరు రూరల్ మండలంలోని వెంగళాయపాలెం. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఆయన ప్లంబింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సింగయ్య మరణించడంతో ఆ కుటుంబం కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది. కాగా, మృతుల కుటుంబాలను జగన్ కనీసం పరామర్శించకపోవడంపై సొంత పార్టీ నేతలే విమర్శిస్తున్నారు.

జేబు దొంగల హల్‌చల్

జగన్ కాన్వాయ్ వెంట పెద్దసంఖ్యలో జేబుదొంగలు కూడా వచ్చారు. దారి పొడవునా చేతివాటం ప్రదర్శించారు. కార్యక్రమం తర్వాత జేబులు చూసుకున్న కార్యకర్తలు డబ్బు, సెల్‌ఫోన్లు మాయమయ్యాయంటూ లబోదిబోమన్నారు. ఇక జగన్ ప్రజల్లోకి వచ్చారంటే అక్కడ ఏదో ఒక ఘటన జరగడం ఖాయమని పోలీసు వర్గాలు అంచనాకు వచ్చాయి. శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా తాడేపల్లి నుంచి ఆదేశాలు వస్తున్నట్లు అనుమానిస్తున్నారు.

> **హెచ్చరికలు బేఖాతరు చేసినందుకే...: ఎస్పీ**
>
> జగన్ కాన్వాయ్‌లోని వాహనం ఢీకొని వైసీపీ కార్యకర్త సింగయ్య మృతి చెందడానికి పోలీసుల హెచ్చరికలు, ఆదేశాలను బేఖాతరు చేయడమే కారణమని గుంటూరు జిల్లా ఎస్పీ సతీశ్‌కుమార్ స్పష్టం చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్ పర్యటనలో అవాంఛనీయ ఘటనలేవీ లేకుండా చూడడానికే ముందస్తు ఆదేశాలు ఇచ్చామన్నారు. జగన్ కాన్వాయ్‌లోని 11 వాహనాలతో పాటు అదనంగా మరో 3 వాహనాలకు మాత్రమే అనుమతించినట్లు తెలిపారు. పోలీసుల నిబంధనలకు విరుద్ధంగా ఉదయం 9.30గంటలకు తాడేపల్లి నుంచి 35కిపైగా వాహనాలలో కాన్వాయ్‌గా రెంటపాళ్లకు బయలుదేరారని, దారిలో మరికొన్ని వాహనాలు ఈ కాన్వాయ్‌లో కలిశాయని పేర్కొన్నారు. తాము అనుమతి ఇచ్చిన వాహనాలతో జగన్ బయలుదేరి ఉంటే ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదన్నారు.

అంగన్వాడీ కార్యకర్తపై కత్తులతో దాడి

- కుప్పంలో వైసీపీ నేతల అరాచకం
- బాధితురాలిని ఆస్పత్రిలో పరామర్శించిన టీడీపీ నేతలు



చికిత్స పొందుతున్న నజియా బేగం

కుప్పం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారాన్ని కోల్పోయాక కూడా చిత్తూరు జిల్లా కుప్పంలో ఆ పార్టీ నేతల అరాచకాలు కొనసాగుతూనే ఉన్నాయి. కుప్పం మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు అక్తర్, తన తమ్ముడు అంజాద్‌తో కలిసి అంగన్వాడీ కార్యకర్త నజియా బేగంపై కత్తులతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచాడు. కుప్పం మండలం రాగిమానుమిట్ట గ్రామంలో బుధవారం జరిగిందీ దారుణం. బాధితురాలి కథనం మేరకు.. రాగిమానుమిట్ట గ్రామానికి చెందిన నజియా బేగం, అదే గ్రామంలో సుమారు 15 ఏళ్లుగా అంగన్వాడీ కార్యకర్తగా పనిచేస్తున్నారు. ఆమె కుటుంబసభ్యులు మొదటినుంచీ టీడీపీకి మద్దతుదారులుగా కొనసాగుతున్నారు. ఈ నెపంతో అదే గ్రామానికి చెందిన అక్తర్.. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో నజియా బేగంను ఉద్యోగం నుంచి తొలగించడానికి పలుమార్లు ప్రయత్నించాడు. ఉద్యోగానికి రాజీనామా చేయాలని బెదిరించాడు. ఎమ్మెల్సీ భరత్ దగ్గరకు తీసుకెళ్లి వార్నింగ్ ఇప్పించాడు. అయితే, తప్పు చేయనప్పుడు తానెందుకు రాజీనామా చేయాలని ఆమె ఎదురు తిరిగారు. దీంతో అక్తర్, అంజాద్ తదితర వైసీపీ నేతలు తరచూ ఆమెపై దౌర్జన్యానికి దిగేవారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక కూడా ఆ సోదరుల ఆగడాలు ఆగలేదు. బుధవారం తన ఇంటిముందు పంచాయతీ కుళాయి వద్ద నజియా బేగం తాగునీరు పట్టుకుంటుండగా అక్తర్ అక్కడికి వచ్చి పైపు లైన్ గేటు వాల్వ్‌ను విరగ్గొట్టి ఆమెతో వాగ్వాదానికి దిగాడు. ఇద్దరి మధ్యా మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. దీంతో నజియా బేగంపై అక్తర్ దాడికి పాల్పడ్డాడు. తమ్ముడు అంజాద్‌తో కలిసి కత్తులతో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడ్డ నజియా బేగంను కుటుంబ సభ్యులు కుప్పం ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, టీడీపీ మండల అధ్యక్షుడు ప్రేమ్ కుమార్, పట్టణ అధ్యక్షుడు రాజ్‌కుమార్ తదితరులు ఆస్పత్రికి వచ్చి ఆమెను పరామర్శించారు. విషయాన్ని పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లారు. అంగన్వాడీ కార్యకర్తపై దాడిని ఖండించారు. రౌడీషీటర్లు కూడా అయిన అక్తర్, ఆయన సోదరులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను డిమాండ్ చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కుప్పం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

గ్రూప్-1 కేసులో మధు రిమాండ్ పొడిగింపు

విజయవాడ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 కేసులో నిందితుడు పమిడికాల్వ మధుసూదన్ రిమాండ్‌ను కోర్టు పొడిగించింది. జిల్లాజైల్లో ఉన్న ఆయన్ను విజయవాడ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో బుధవారం హాజరుపరిచారు. వచ్చేనెల రెండోతేదీ వరకు రిమాండ్‌ను పొడిగిస్తూ న్యాయాధికారి దేవిక ఉత్తర్వులిచ్చారు. కాగా, సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో 11వ నిందితుడుసీహెచ్ శ్రీనివాసరావు బెయిల్ పిటిషన్‌పై తీర్పును ఏసీబీ కోర్టు న్యాయాధికారి పి.భాస్కరరావు ఈనెల 23వ తేదీకి రిజర్వ్ చేశారు.

రూ.5 లక్షలు జమ చేశాకే పిల్‌పై విచారణ

- మాజీ ఎంపీ హర్షకుమార్‌కు హైకోర్టు స్పష్టీకరణ

అమరావతి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయంచాలని పిల్ వేసిన మాజీ ఎంపీ హర్షకుమార్‌ను రూ.5లక్షలు రిజిస్ట్రీ వద్ద జమ చేయాలని హైకోర్టు ధర్మాసనం ఆదేశించింది. ఆ తరువాతే పిల్ విచారణ చేపడతామని స్పష్టం చేసింది. ప్రవీణ్ హత్యకు గురయ్యారని చెప్పేందుకు ఆధారాలు ఏమైనా ఉన్నాయా? అని ప్రశ్నించింది. ప్రవీణ్ మరణంపై విచారణకు ఆదేశించాలని కోరుతూ పిల్ వేయడానికి పిటిషనర్ ప్రవీణ్ కుటుంబ సభ్యులు కాదు కదా? అని ప్రశ్నించింది. ఇదే వ్యవహారంతో ముడిపడి ఉన్న ప్రజాప్రయోజన వ్యాజ్యాలతో ప్రస్తుత పిల్‌ను జత చేయాలని ఆదేశించింది. ఈ మేరకు చీఫ్‌జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. హర్షకుమార్ తరఫున న్యాయవాది బాలయ్య వాదనలు వినిపించారు.

ఫోన్ ట్యాపింగ్ ముమ్మాటికీ నిజం



(మొదటి పేజీ తరువాయి)

ఆమె విమానాశ్రయం వద్ద మీడియాతో మాట్లాడారు. తన ఫోన్ ట్యాపింగ్ చేసి, రికార్డు చేసిన ఆడియోను వైవీ సుబ్బారెడ్డి స్వయంగా తనకు వినిపించారని తెలిపారు. అయితే తన రాజకీయ భవిష్యత్తును నాశనం చేయడానికి కేసీఆర్, జగన్మోహన్‌రెడ్డి చేసిన అరాచకాలకంటే ట్యాపింగ్ చిన్నదిగా అనిపించడంతో ఆ సమయంలో ఫిర్యాదు చేయలేదని చెప్పారు. కేటీఆర్, కేసీఆర్‌తో జగన్‌కు ఉన్న సంబంధం ముందు రక్తసంబంధం కూడా చిన్నబోయిందని ఆమె ఎద్దేవా చేశారు. తనను ఆర్థికంగా, రాజకీయంగా ఎదగనీయకుండా, భవిష్యత్తును నాశనం చేసేందుకు జగన్ ఎన్నో కుట్రలు చేశారని, అందులో ఫోన్‌ట్యాపింగ్ కూడా భాగమేనని షర్మిల పేర్కొన్నారు. చెల్లి విషయంలో ఏ అన్నా చేయనన్ని ఘోరాలు నా విషయంలో జగన్ చేశారని ఆరోపించారు. తెలంగాణలో కేసీఆర్‌కు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న సమయంలో జగన్‌కు సంబంధం లేకపోయినా తనను ఎన్నో ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. ఆ సమయంలో ఎదురైన ఇబ్బందుల కారణంగా ఊపిరి తీసుకోలేని స్థితికి చేరుకున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే ట్యాపింగ్ విషయంపై పోరాటం చేయలేకపోయానని తెలిపారు. తనకు జగన్‌తో వ్యక్తిగత కక్షలు ఉండి ఉంటే, ఎంవోయూ రాసిచ్చి, వాటిని అమలుచేయడం లేదని అప్పుడే ఫిర్యాదు చేసేదాన్నని, సొంత తల్లినే కోర్టుకు ఈడ్చిన వ్యక్తి జగన్ అని ఆమె విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై ప్రస్తుత తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలు ఎటువంటి విచారణకు పిలిచినా తప్పక హాజరవుతానని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో నిష్పాక్షిక విచారణ చేపట్టాలని కోరారు. తప్పు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని రెండు రాష్ట్రాల ప్రభుత్వాలను షర్మిల డిమాండ్ చేశారు.

చట్టంతో చెలగాటం!

(మొదటి పేజీ తరువాయి)

బయటకొచ్చాయన్న ప్రచారం న్యాయవాదవర్గాల్లో జరిగింది. ఇద్దరు, ముగ్గురు జడ్జిల సమక్షంలోనే, తోటి కొలీగ్స్‌తో ఫోన్‌లోనో మాట్లాడిన విషయాలు బయటకు ఎలా వచ్చాయన్న చర్చ సాగింది. తమ ఫోన్ సంభాషణలను చాటుగా వింటున్నారని పక్కా ఆధారాలతో నిర్ధారించుకొన్న న్యాయమూర్తి దీనిపై సుప్రీంకోర్టుకు లేఖ రాశారు. చివరకు ఆయన లేఖ రాసిన విషయం కూడా బయటకొచ్చింది. ఆయన ఫోన్‌ను స్ర్కీనింగ్ చేయడం ద్వారానే ఇదంతా సాధ్యమైందని వెల్లడైంది. ఫోన్ సంభాషణలపై నిఘా ద్వారానే జగన్‌కు అవన్నీ తెలిశాయని, వ్యక్తిగతగోప్యతకు, ప్రాథమిక హక్కులకు భంగం కలుగుతోందని హైకోర్టు న్యాయమూర్తి ఒకరు సుప్రీంకోర్టుకు మరో లేఖ రాశారు. ఏకంగా జడ్జీల ఫోన్ కాల్స్‌కే రక్షణ లేకుండా పోయిందనే ఆందోళన వ్యక్తమైంది. మరోవైపు జగన్ ప్రభుత్వంలో ఐఏఎస్, ఐపీఎస్‌లు, ఇతర అధికారుల ఫోన్లను సైతం ట్యాపింగ్ చేశారన్న ఆరోపణలు వచ్చాయి. దీంతో ఫోన్‌లో మాట్లాడటం సంగతి అటుంచి వాట్సాప్ చాటింగ్, కాల్స్ చేసే సాహసం కూడా చేయకుండా మౌనంగా ఉండిపోయినవారు అనేకమంది ఉన్నారు. నాడు ప్రతిపక్ష టీడీపీతో పాటు జనసేన, మీడియా ప్రతినిధులపైనా నిఘా పెట్టారు. వారి ఫోన్‌లను నిరంతరం పరిశీలనలో ఉంచారని ఆరోపణలున్నాయి.

చట్టంతో సంబంధం లేకుండా..

ఫోన్ స్ర్కీనింగ్, ట్యాపింగ్ చేయడానికి జగన్ ప్రభుత్వం ఎలాంటి మార్గదర్శకాలు పాటించింది? ఏ చట్టాలను అనుసరించిందంటే సమాధానం లేదు. ఇవన్నీ చట్టపరిధిలో సాధ్యమయ్యేవి కాదు. అందుకే చట్టంతో సంబంధం లేకుండానే కీలక వ్యవస్థలను గుప్పిటపట్టి వాటిని దుర్వినియోగం చేశారన్న ఆరోపణలున్నాయి. వాస్తవానికి టెలిగ్రాఫ్ చట్టంలోని సెక్షన్ 5(2), సెక్షన్ 7(2)(బి) ప్రకారం వ్యక్తుల ఫోన్లు ట్యాప్ చేయాలంటే వారు దేశ అంతర్గత భద్రత, శాంతిభద్రతలకు ముప్పు కలిగించేవారు అయిఉండాలి. వారిని ఓ కంట కనిపెట్టాలని కోర్టులు ఆదేశించాలి. కానీ జగన్‌కు ఇవేవీ అవసరంలేదు. అందుకే మూడో కంటికి తెలియని టెక్నాలజీని వాడారని నాటి సీనియర్ అధికారులు చెబుతున్నారు.

పెగాసస్‌తో ఫోన్లపై దాడి

గత ప్రభుత్వంలో ఎక్కువగా జీరో క్లిక్ స్పైవేర్‌ను వాడారన్న ఆరోపణలున్నాయి. అందులో ఇజ్రాయెల్‌కు చెందిన సాంకేతికత పెగాసస్ ఒకటి. ఫోన్‌కు స్పైవేర్‌ను పంపి, పూర్తిగా నియంత్రణలోకి తెచ్చుకోవడం దీని ప్రత్యేకత. ఒక్కసారి ఈ దాడి మొదలయ్యాక సదరు ఫోన్‌లో ఉన్న ఫొటోలు, కాంటాక్ట్‌లు, కాల్‌డేటా, వీడియో, ఆడియో కాల్స్, తదితర కీలక సమాచారం హ్యాక్ చేసినవారి చేతికి వెళ్తుంది. ఎవరెవరు వాట్సాప్ కాల్ చేసుకుంటున్నారో, చాటింగ్‌లో ఏమేం మాట్లాడుతున్నారో సులువుగా తెలుసుకోగలిగారు. ప్రిడేటర్ (ఇంటెలెక్సా అలయన్స్), రెయిన్ (క్వాడ్రీమ్) వంటి సాఫ్ట్‌వేర్లతో ఐఫోన్, ఆండ్రాయిడ్ ఫోన్లలోకి చొరబడి నిఘా పెట్టారన్న ఆరోపణలున్నాయి. ఈ స్పైవేర్ దాడి అనేది ఇంకా చట్ట పరిధిలోకి రాలేదు. అందుకే నాటి ప్రభుత్వం పౌరులపై ఈ తరహా నిఘా, నియంత్రణ చేయడానికి ఏ చట్టాల నుంచి అనుమతి తీసుకోలేదు.

గుప్పిట్లో నెట్‌వర్కింగ్ వ్యవస్థ

ఫోన్ ట్యాపింగ్, స్ర్కీనింగ్‌లో రెండో రకం ఫోన్ నెట్‌వర్కింగ్ వ్యవస్థను వాడుకోవడం. టెలికామ్ ఆపరేటర్లను బెదిరించి, అదిరించి ఈ పని చేయించుకోవాలి. అయితే, 2019లో ఇజ్రాయెల్ ఓ కొత్త టెక్నాలజీ తీసుకొచ్చింది. టెలికామ్ ఆపరేటర్‌తో సంబంధం లేకుండా నెట్‌వర్క్‌ను గుప్పిట్లోకి తీసుకొని కావాల్సిన ఫోన్‌ను ట్యాపింగ్ చేయడం. ఇందుకోసం ఐఎంఎస్‌ఐ క్యాచర్స్, స్ట్రింగ్‌రేస్ వంటి సాంకేతికతలను వాడారన్న విమర్శలున్నాయి. ఐఎంఎస్‌ఐ క్యాచర్ ఓ పెద్ద సూటకేసులో ఇమిడిపోయేంత ఉంటుంది. ఎవరి ఫోన్‌ను ట్యాప్ చేయాలంటే వారున్న ప్రాంతానికి ఆ పరికరం ఉన్న సూట్‌కేసును తీసుకెళ్లి, సెల్‌టవర్ సిగ్నల్‌ను జామ్‌చేసి తమ పరిధిలోకి తీసుకుంటే చాలు. ఎవరెవరు, ఏం మాట్లాడుకుంటున్నారో వినడంతో పాటు రికార్డింగ్ చేసే అవకాశం ఉంది. ఈ టెక్నాలజీ వినియోగంపై చట్టబద్ధ నియంత్రణ లేకపోవడంతో ప్రభుత్వాలు, ప్రైవేటు సంస్థలు దీన్ని యథేచ్ఛగా ఉపయోగిస్తున్నాయి. జగన్ హయాంలో పెగాసస్ తర్వాత అత్యధికంగా ఐఎంఎస్‌ఐ క్యాచర్స్‌ను వాడారన్న ఆరోపణలున్నాయి. ఇప్పుడు కొత్తగా దేశీయంగా క్లియర్ ట్రెయిల్ సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. ఏఐ ఆధారంగా సెల్‌టవర్ నెట్‌వర్క్‌ను జామ్ చేయడంతో పాటు వ్యక్తుల సంభాషణను మూడోకంటికి తెలియకుండా వినొచ్చు, రికార్డు చేయవచ్చు. ఇవేవీ ఇప్పుడున్న టెలిగ్రాఫ్, ఐటీ చట్టాల పరిధిలో లేవు. కాబట్టి, వీటిని ఉపయోగించి నాడు ప్రతిపక్షం, మీడియా, పౌరహక్కులు, సామాజిక కార్యకర్తల ఫోన్‌లను గుట్టుగా పరిశీలించారని, అనేక మందిపై అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురిచేశారని జగన్ ప్రభుత్వంపై ఆరోపణలున్నాయి. టెలిగ్రాఫ్ చట్టంలోని సెక్షన్ 5(2), సెక్షన్ 7(2)(బి)ని ఉల్లంఘించినా, అధికార దుర్వినియోగానికి పాల్పడి ప్రజల వ్యక్తిగత గోప్యత హక్కుపై దాడిచేసినా కనీసం మూడేళ్ల జైలు వంటి కఠిన శిక్షలు ఉన్నాయి. అయితే, ఇవన్నీ చట్టపరిధిలో తప్పు చేశారని నిరూపితమైయితేనే. ఇప్పుడున్న టెక్నాలజీల్లో ఏదీ టెలిగ్రాఫ్, ఐటీ చట్టం పరిధిలో లేవు. కాబట్టి వాటిని సొంత ప్రయోజనాలకు వాడుకుంటున్నారు. మారుతున్న టెక్నాలజీ దుర్వినియోగంపై కఠిన చర్యలు ఉండేలా చట్టసవరణలు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

సుప్రీం చీవాట్లు పెట్టినా...

భారత పౌరుల గోప్యత హక్కుకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 భరోసా ఇస్తోంది. దాన్ని కాలరాసే విధంగా వ్యక్తుల వ్యక్తిగత జీవితాల్లోకి తొంగిచూడకుండా, వారి గోప్యతకు భంగం వాటిల్లనీయకుండా కఠినమైన ఆంక్షలు విధించింది. దేశ భద్రత, సమగ్రత, ప్రజారక్షణ కోసం కరడుగట్టిన నేరస్థులు, అనుమానితులపై చట్టబద్ధమైన అనుమతి తీసుకొని నిఘా పెట్టడానికి టెలిగ్రాఫ్ చట్టంలోని సెక్షన్ 5(2) వీలుకల్పిస్తోంది. ఉగ్రవాదులు, నక్సలైట్ల కుట్రలు, వ్యూహాలను ముందుగా పసిగట్టి అడ్డుకోవాలన్న సంకల్పంతోనే ఈ క్లాజు ప్రత్యేకమైన సందర్భంలో ట్యాపింగ్‌కు వీలు కల్పిస్తుంది. అయితే, పాలకులు మాత్రం దీన్ని అడ్డం పెట్టుకొని తమ రాజకీయ, వ్యక్తిగత ప్రత్యర్థుల ఫోన్ సంభాషణలను గుట్టుగా వింటున్నారు. ఈ చర్య నేరమని 1996లోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు చివాట్లుపెట్టినా, గట్టి హెచ్చరికలు చేసినా ఖాతరు చేయడం లేదు.

జగన్‌వి శవ రాజకీయాలు

- మంత్రులు నిమ్మల, గొట్టిపాటి, అనగాని ధ్వజం

అమరావతి, నరసరావుపేట, జూన్ 18(ఆంధ్రజ్యోతి): జగన్ శవ రాజకీయాలు చేస్తూ తాజాగా ఇద్దరి మరణానికి కారణమయ్యారని రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్ విమర్శించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో నిమ్మల మాట్లాడుతూ 'జగన్‌కు ప్రజాస్వామ్యం పట్ల గౌరవం లేదు. పోలీసులంటే లెక్కలేదు. కోర్టులు, నిబంధనలను ఖాతరు చేయరు. బెట్టింగ్ వల్ల ఆత్మహత్య చేసుకున్న వ్యక్తిని పరామర్శించడానికి జగన్ వెళ్లడం ఏమిటి? పరామర్శకు వెళ్లేటప్పుడు మందీమార్బలంతో హడావుడి ఏమిటి? డీజే పాటలు, తీన్‌మార్లతో ఎవరైనా పరామర్శకు వెళ్తారా! రప్పా రప్పా తలలు నరుకుతామంటూ ఫ్లెక్సీలు ప్రదర్శిస్తారా?' అని నిలదీశారు. ఇలాంటి వికృత చేష్టలకు మద్దతు పలికే జగనే రాజకీయాల్లో కొనసాగేందుకు అనర్హుడన్నారు. కాగా, జగన్ స్వార్థ రాజకీయానికి రెండు నిండు ప్రాణాలు బలయ్యాయని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ కాన్వాయ్‌లోని వాహనం ఢీకొని సింగయ్య తీవ్ర గాయాలై కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నా వైసీపీ నేతలెవ్వరూ ఆయన్ను ఆస్పత్రికి తీసుకెళ్లకుండా రోడ్డు పక్కనే వదిలేశారని, వారంతా మానవత్వం మరచిపోయారని విమర్శించారు. సింగయ్య మృతికి జగనే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఖాళీ అవుతున్న వైసీపీని కాపాడుకోడానికే జగన్ డ్రామాలాడుతున్నారని, ఆయన చేస్తున్నవన్నీ మోసపూరిత పరామర్శలు, వాగ్దానాలేనని, ఆ పార్టీనే ఒక మోసపూరిత పార్టీ అని గొట్టిపాటి విమర్శించారు. శవ రాజకీయాలు చేయడం జగన్‌కే చెల్లుబాటవుతుందని మంత్రి అనగాని అన్నారు. ప్రకృతి విపత్తుల సమయంలో బాధితులను పరామర్శించడం తెలియని జగన్ క్రిమినల్స్ పరామర్శకు మాత్రం ముందుంటారన్నారు. వైనాట్ 175పై బెట్టింగ్ కట్టి డబ్బులు పోగొట్టుకొని నాగమల్లేశ్వరరావు ఆత్మహత్య చేసుకున్నాడని, అతను చనిపోయిన ఏడాదికి పరామర్శ పేరుతో జగన్ నానా హంగామా చేశారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య విమర్శించారు. నాగమల్లేశ్వరరావు చనిపోయిన రోజు జగన్ ఆపద్ధర్మ సీఎంగా ఉన్నారని, ఆయన మృతికి జగనే కారణమని తెలిపారు. దేశం మొత్తం ఏపీ లిక్కర్ స్కాం వైపు చూస్తోందని, దానినుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు జగన్ ఫేక్ పరామర్శలు ప్రారంభించారని విమర్శించారు. జగన్‌కి జనాలు ఓట్లు వేయలేదనే కక్షతో రాష్ట్రంలో అలజడులు సృష్టించాలనే ప్రయత్నం చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నాదెండ్ల బ్రహ్మం విమర్శించారు. మొన్న బూతు.. నిన్న గంజాయి.. నేడు బెట్టింగ్.. ఇదీ జగన్ పరామర్శ యాత్రల తీరు అని ఆయన విమర్శించారు.

ఓటర్లకు పంచడానికి లిక్కర్ డబ్బు



చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని కోర్టులో హాజరు పరచడానికి తీసుకెళ్తున్న పోలీసులు

(మొదటి పేజీ తరువాయి)

స్థానంలో వైసీపీ అభ్యర్థిగా పోటీచేసిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సూచనల మేరకు.. ఆయన గన్‌మెన్ గిరి, మదన్, వ్యక్తిగత సహాయకుడు బాలాజీ, డ్రైవర్ రామరాజు ఈ సొమ్మును రవాణా కంపెనీలు ఉపయోగించే ట్రక్కు ద్వారా తరలించారని పేర్కొంది. దీనికి సంబంధించిన సాంకేతిక ఆధారాలను సేకరించామని. వాటి ఆధారంగా నిందితులను అరెస్టు చేశామని తెలిపింది. కొలంబో వెళ్తున్న చెవిరెడ్డిని, ఆయన సన్నిహితుడు వెంకటేశ్‌నాయుడిని సిట్ అధికారులు బెంగళూరు విమానాశ్రయంలో అరెస్టు చేసి మంగళవారం రాత్రి విజయవాడ తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. బుధవారం విజయవాడ సిట్ కార్యాలయంలో విచారించాక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షల అనంతరం ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం చెవిరెడ్డి, వెంకటేశ్ నాయుడికి వచ్చే నెల ఒకటో తేదీ వరకు రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి పి.భాస్కరరావు ఉత్తర్వులు ఇచ్చారు. అంతకుముందు సిట్ తరఫున ప్రాసిక్యూషన్స్ ఏడీ రాజేంద్రప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. గిరి, మదన్ 12 ఏళ్లుగా చెవిరెడ్డి వద్ద గన్‌మెన్‌గా పనిచేస్తున్నారని తెలిపారు. గిరిని విచారించి.. ఆయన ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా మిగిలిన నిందితులను పట్టుకున్నామన్నారు. 'చెవిరెడ్డి చెబితే ఆయన పీఏ బాలాజీ యాదవ్.. ఈ గన్‌మెన్, చెవిరెడ్డి కుమారుడు మోహిత్‌రెడ్డి ద్వారా డబ్బులను చేరవేశారు. ఈ కేసులో మోహిత్‌రెడ్డి 39వ నిందితుడిగా ఉన్నారు. గత ఏడాది ఫిబ్రవరి 22న హైదరాబాద్ నుంచి తిరుపతికి డబ్బులు తీసుకెళ్లినట్లు దర్యాప్తులో తేలింది. హైదరాబాద్‌లో ప్రథమ నిందితుడు కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి నుంచి ఈ డబ్బుల సంచులు తీసుకునేవారు. ఓటర్లకు పంపిణీ చేయడానికి హైదరాబాద్ నుంచి డబ్బులను విజయవాడ వైపు తీసుకొస్తుండగా ఎన్టీఆర్ జిల్లా గరికపాడు చెక్‌పోస్టు వద్ద రూ.8.37 కోట్లను సీజ్ చేశారు. నంద్యాలకు చెందిన చెవిరెడ్డి స్నేహితుడు వెంకటేశ్‌నాయుడికి హైదరాబాద్‌లో ఇల్లుంది. అక్కడి నుంచి ఈ డబ్బులు జిల్లాలకు చేరాయి. సొమ్ము తరలింపులో సైమన్ అనే వ్యక్తితోపాటు నెల్లూరు జిల్లా కావలికి చెందిన ప్రతాప్‌రెడ్డి పాత్ర కూడా ఉంది. వెంకటేశ్ నాయుడు, సైమన్ హైదరాబాద్ నుంచి ఫార్చ్యూనర్ కారులో తిరుపతికి నిత్యం డబ్బులు తీసుకెళ్లారు. దీనికి సంబంధించి టవర్ లొకేషన్లను సేకరించాం. ఈ డబ్బుతో బంగారం కొనుగోలు చేశారు. రాష్ట్ర ఖజానాకు చెందాల్సిన డబ్బులను ఈ బ్యాచ్ లూటీ చేసింది' అని తెలిపారు. చెవిరెడ్డి తరఫున దత్తకవి, రామచంద్రమూర్తి వాదనలు వినిపించారు. తెలంగాణలోని అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద పట్టుబడిన డబ్బులను గరికపాడు చెక్‌పోస్టు డబ్బులకు లింక్ చేసి చూపిస్తున్నారని అన్నారు.

పేపర్లు చించేసిన చెవిరెడ్డి

సిట్ కార్యాలయంలో చెవిరెడ్డిని విచారించాక.. వాంగ్మూలంపై సంతకాలు చేయాలని అధికారులు కాగితాలిచ్చారు. వాటిని ఆయన చించివిసిరేశారు. ఈ దృశ్యాన్ని సిట్ సిబ్బంది చిత్రీకరించారు. విచారణ సందర్భంగా ఆ వీడియోను న్యాయాధికారికి అందజేశారు. కాగా, ప్రభుత్వాస్పత్రి వద్ద, కోర్టు ఆవరణలో కూడా అరుపులు,కేకలతో చెవిరెడ్డి హంగామా చేశారు. అలాగే జైలు వద్ద కూడా కేకలు వేశారు. తనను అన్యాయంగా అరెస్టు చేశారని, తమ ప్రభుత్వం మళ్లీ వస్తుందని.. అధికారులు ఇదేజైలుకు రావానికి సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు.

మాల్దీవులకు వెళ్తుంటే అడ్డుకున్నారు: వెంకటేశ్‌నాయుడు

తన కుమారుడికి సెలవులు కావడంతో కుటుంబంతో మాల్దీవులకు వెళ్తుండగా బెంగళూరు విమానాశ్రయంలో అడ్డుకున్నారని నిందితుడు వెంకటేశ్ నాయుడు తెలిపారు. న్యాయాధికారి ముందు ఆయన, ఆయన భార్య మాట్లాడారు. తాము ఒకసారి ఓ వివాహ వేడుకలో ఉండగా విచారణకు రావాలని పిలుపు వచ్చిందని..తర్వాత వస్తానని చెప్పానని వెంకటేశ్ చెప్పారు. మరోసారి.. విచారణకు వస్తుండగా యాంజియో సమస్య వచ్చిందని.. అప్పటికప్పుడు ఆస్పత్రికి వెళ్లి.. సిట్ అధికారులకు మెయిల్ చేశానని.. ఫోన్ చేసి కూడా చెప్పానన్నారు. తర్వాత ఎప్పుడు రావాలో చెబితే వస్తానన్నానని, దీనికి సిట్‌అధికారుల నుంచి స్పందన రాలేదని తెలిపారు. బెంగళూరు విమానాశ్రయంలో ఇమిగ్రేషన్ సిబ్బంది అడిగితే తనపై ఎలాంటి కేసులూ లేవని చెప్పానన్నారు. విజయవాడలో ఏమైనా కేసు ఉందా అని అడిగినప్పుడు తనకు అనుమానం వచ్చిందని.. సాక్షిగా విచారణకు పిలిచిన తనపై ఎల్‌వోసీ ఎలా జారీ చేస్తారని ప్రశ్నించారు.

ప్రభుత్వానికి మా కుటుంబం టార్గెట్: హర్షిత్‌రెడ్డి

కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి తమ కుటుంబాన్ని టార్గెట్ చేసిందని చెవిరెడ్డి రెండో కుమారుడు హర్షిత్‌రెడ్డి ఆరోపించారు. తన తండ్రిపై పోక్సో కేసు పెట్టిందని మీడియాకు తెలిపారు. మద్యం వల్ల తాతయ్య, చిన్నాన్నను కోల్పోయామని, అప్పటినుంచి తాము మద్యం జోలికి వెళ్లలేదన్నారు. వ్యాపారం నిమిత్తం బయటకు వెళ్తుంటే పారిపోతున్నామంటూ అక్రమ కేసు పెట్టారన్నారు. చెవిరెడ్డి సిట్ అధికారులకు రాసిన లేఖను మీడియాకు విడుదల చేశారు. చెవిరెడ్డిని పరామర్శించేందుకు మాజీ మంత్రి పేర్నినాని,ఎమ్మెల్సీలు తలశిల రఘురాం,అరుణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు శ్రీకాంత్‌రెడ్డి, మల్లాది విష్ణు, దేవినేని అవినాశ్ కోర్టుకు వచ్చారు.

చెవిరెడ్డి స్వీయవాదనలు..

స్వయంగా న్యాయవాది అయిన చెవిరెడ్డి కోర్టులో వాదనలు వినిపించారు. బెంగళూరు నుంచి అర్ధరాత్రి సిట్ కార్యాలయానికి తీసుకొచ్చారని.. 4 గంటలపాటు విచారించి 26 ప్రశ్నలు అడిగారని.. వాటికి తాను చెప్పిన జవాబులు కాకుండా అధికారులు వారికి నచ్చిన సమాధానాలు రాసుకున్నారని తెలిపారు. ఆ కాగితాలను తనకిచ్చి సంతకం చేయాలని ఒత్తిడి చేశారని.. తాను చేయనని చెప్పానన్నారు. తర్వాత ఆ కాగితాలను వెనక్కి తీసుకుని 26 ప్రశ్నలకు సమాధానాలు సరిచేసి 27వ ప్రశ్నకు జవాబు సరిచేయకుండా ఇచ్చారని.. దానిని తాను ఒక కాగితంపై రాసి ఇచ్చి జత చేయాలని చెప్పినా చేయలేదన్నారు. తనపై కేసు ఉందని గానీ, విచారణకు హాజరు కావాలని గానీ ఏ రోజునా సిట్ నోటీసులు ఇవ్వలేదని చెప్పారు. తాను ఎగుమతులు-దిగుమతుల వ్యాపారంలో ఉన్నానని.. వ్యాపార రీత్యా వెళ్తున్నప్పుడు బెంగళూరు ఎయిర్‌పోర్టులో అరెస్టు చేశారని తెలిపారు. విచారణలో కొట్టారా అని న్యాయాధికారి అడుగగా.. మానసికంగా ఇబ్బంది పెట్టారని బదులిచ్చారు. గిరి,మదన్ తనకు గన్‌మెన్‌గా ఉన్నారని.గిరితో సిట్ అధికారులు తమకు అనుకూలంగా వాంగ్మూలం తీసుకున్నారని.. ప్రతిఫలంగా అతడికి పదోన్నతి కల్పించి విజయవాడలోని ఆక్టోపస్‌లో పోస్టింగ్ ఇచ్చారని తెలిపారు.10మంది సిట్ అధికారులు తనను వేధించారంటూ మదన్ ఆత్మహత్యకు యత్నించాడని.. దీనిపై డీజీపీకి లేఖ రాశాడని తెలిపారు. గరికపాడు చెక్‌పోస్టు వద్ద పట్టుబడిన రూ.8 కోట్లతో తనకు సంబంధం లేదన్నారు. అనంతరం రిమాండ్ విధించిన కోర్టు.. జైలులో చెవిరెడ్డికి మంచం, పరుపు, దిండు, దోమల తెర సమకూర్చేందుకు అనుమతిచ్చింది.

కార్లు, ట్రక్కుల్లో కోట్లు తరలించారు

- ఒంగోలు, తిరుపతి ప్రాంతాలకు రూ.250 కోట్లు
- 2024 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులకు పంచారు
- తాడేపల్లి, హైదరాబాద్ నుంచే డబ్బు సరఫరా
- చెవిరెడ్డి రిమాండ్ రిపోర్టులో సిట్ వెల్లడి

అమరావతి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్‌కు సన్నిహితుడైన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి(ఏ-38), ఆయన సన్నిహితుడు చెరుకూరు వెంకటేశ్‌నాయుడు(ఏ-34)తో కలిసి 2024లో ఓట్లు కొనేందుకు లిక్కర్ స్కాం ముడుపులను పంచారని ప్రత్యేక దర్యాప్తు బృందం పేర్కొంది. హైదరాబాద్, తాడేపల్లి నుంచి కార్లు, లారీల్లో రూ.250 కోట్లు ఒంగోలు, తిరుపతి ప్రాంతాలకు తరలించినట్లు చెవిరెడ్డి రిమాండ్ రిపోర్టులో తెలిపింది. ఒంగోలులో వైసీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీచేసిన ఆయన.. తన ఖర్చులతోపాటు వైసీపీ అభ్యర్థులకు పంపిణీ చేసేందుకు ఈ సొమ్ము వెచ్చించారని వెల్లడించింది. చంద్రగిరి అసెంబ్లీ అభ్యర్థిగా పోటీచేసిన ఆయన కుమారుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి.. తుడా చైర్మన్‌గా అధికారిక వాహనంలో డబ్బు తరలించినట్లు తెలిపింది. చెవిరెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఆయన వద్ద గన్‌మన్‌గా పనిచేసిన ప్రత్యక్ష సాక్షి బీఎన్ఎస్ఎస్ 183కింద న్యాయాధికారి ఎదుట ముందు వాంగ్మూలం కూడా ఇచ్చారని తెలిపింది. 'చెవిరెడ్డి ఆదేశాల మేరకు ఆయన దగ్గర పనిచేసే వ్యక్తులు హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని వెంకటేశ్‌నాయుడి నివాసం క్రిషివ్యాలీ అపార్ట్‌మెంట్ నుంచి.. తాడేపల్లిలోని ల్యాండ్‌మార్క్ విల్లా నుంచి పలుమార్లు ఒంగోలు, తిరుపతికి డబ్బులు తరలించారు. మోహిత్‌రెడ్డి తుడా చైర్మన్ హోదాలో వినియోగించిన తెల్ల ఫార్చ్యూనర్ కారు(ఏపీ39 బీవీ3259)లో 2024 ఫిబ్రవరి 1న, మరోమారు 20న తాడేపల్లిలోని ప్రణయ్ ప్రకాశ్ ఇంటి నుంచి సుమారు 8-9 కోట్ల రూపాయలు అట్టపెట్టెల్లో తీసుకుని తిరుపతికి తరలించారు. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో డబ్బు రవాణా జరిగింది. హైదరాబాద్ నుంచి విజయవాడకు ఎన్నికల సమయంలో తరలిస్తుండగా గరికపాడు చెక్ పోస్టు వద్ద పట్టుబడిన చిత్తూరు జిల్లా రిజిస్ట్రేషన్ లారీ(ఏపీ03 టీఏ4566)లోని 8.37 కోట్లు సైతం చెవిరెడ్డి ఎన్నికల ఖర్చు కోసం వెంకటేశ్‌నాయుడు పంపినవే. క్రిషివ్యాలీ అపార్ట్‌మెంట్‌లోని తన నివాసాన్ని వెంకటేశ్ మద్యం ముడుపుల సేకరణ కేంద్రంగా మార్చేశారు. 2024 ఏప్రిల్ 27, 28న.. మే 6, 7,8తేదీల్లో నోట్లకట్టలతో నింపిన బాక్సులను ఎద్దుల నవీన్ కృష్ణ(ఏ-36),హరీశ్(ఏ-37)కు అందజేశాడు. ఈనగదును చెవిరెడ్డి విజయం కోసం పంపిణీ చేశారు.' అని రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. మోహిత్‌రెడ్డి అధికారిక వాహనం పలుమార్లు తిరుపతి-తాడేపల్లి మధ్య.. హైదరాబాద్-తిరుపతి మధ్య తిరిగినట్లు టోల్ గేట్లలో రికార్డులు లభించినట్లు సిట్ వెల్లడించింది. హైదరాబాద్‌లోని వెంకటేశ్‌నాయుడి ఇంటి ముందు సీసీ కెమేరాల్లోనూ ఫుటేజీ లభ్యమైంది. తుడా చైర్మన్ వాహన లాగ్ రికార్డుల్లో తిరుపతి దాటి ఆ వాహనం వెళ్లలేదని ఉంది. కానీ ఆ వాహనంలో చెవిరెడ్డి గన్‌మెన్, డ్రైవర్ ఉన్నట్లు వారి సెల్ నెంబర్ల లోకేషన్ చెబుతోంది. దీనికి సంబంధించిన టెక్నికల్ ఆధారాల(సీడీఆర్)ను అధికారులు సేకరించారు.

ఎవరీ ప్రద్యుమ్న..?

- లిక్కర్ స్కామ్‌లో వెలుగులోకి కొత్త పేరు
- ఒంగోలులో ఇన్‌ఫ్రాం కంపెనీ అధిపతి
- విదేశాల్లో ఉన్నట్లు అనుమానం

అమరావతి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో జరిగిన రూ.3,500 కోట్ల మద్యం కుంభకోణం వ్యవహారంలో మరో కొత్తపాత్ర తెరపైకి వచ్చింది. కీలక నిందితుడు, గత ఎన్నికల్లో ఒంగోలు లోక్‌సభస్థానంలో వైసీపీ అభ్యర్థి అయిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితో ఆయనకున్న లింకేమిటో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తాజాగా ఆరా తీస్తోంది. ప్రద్యుమ్న చంద్రపాటి ఒంగోలు కేంద్రంగా ఇన్‌ఫ్రా కంపెనీ నిర్వహిస్తున్నారని తెలియవచ్చింది. గత ఏడాది ఎన్నికల సమయంలో ఎన్టీఆర్ జిల్లా గరికపాడు చెక్‌పోస్టు వద్ద తనిఖీల సందర్భంగా ఓ కారులో రూ.8.37 కోట్లు పట్టుబడ్డాయి. ఈ సొమ్ము చెవిరెడ్డిదని సిట్ తేల్చింది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన రాజ్ కసిరెడ్డి మద్యం ముడుపుల ద్వారా తీసుకున్న సొమ్మును.. హైదరాబాద్‌లో ఉంటున్న చెవిరెడ్డి సన్నిహితుడు వెంకటేశ్‌నాయుడి ద్వారా ఎన్నికల్లో పంచేందుకు చెవిరెడ్డి కోసం పంపినట్లు ఆధారాలు సేకరించింది. అయితే ఆ సొమ్ము తనదంటూ ఒంగోలుకు చెందిన ప్రద్యుమ్న అప్పట్లో కోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు తెలియడంతో సిట్ ఆయనపై దృష్టి సారించింది. ఆయన నిర్మాణ రంగం(ఈషా ఇన్‌ఫ్రా)లో ఉంటూ కొన్ని సినిమాలకు నిర్మాతగానూ వ్యవహరించినట్లు వెల్లడైంది. హైదరాబాద్ కేంద్రంగా ఓ చానల్‌కు డైరెక్టర్‌గానూ పనిచేశారు. ఆయన విదేశాలకు చెక్కేశారని అనుమానిస్తున్నారు.

మదన్‌రెడ్డివి తప్పుడు ఆరోపణలు

- సిట్ చిత్రహింసలకు గురిచేయలేదు : ఏజీ
- విచారణకు న్యాయవాదిని అనుమతించండి: హైకోర్టు

అమరావతి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో సాక్షిగా విచారణకు పిలిచి సిట్ అధికారులు చిత్రహింసలకు గురిచేశారని వైసీపీ నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వద్ద గన్‌మెన్‌గా పనిచేసిన హెడ్‌కానిస్టేబుల్ ఎన్.మదన్‌రెడ్డి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అడ్వొకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ హైకోర్టుకు నివేదించారు. మదన్‌రెడ్డి చెబుతున్న దాంట్లో ఏమాత్రం నిజం లేదని, అతన్ని విచారించిన సమయంలో వీడియో రికార్డింగ్ చేశామని తెలిపారు. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామన్నారు. పిటిషనర్‌ను విచారించే సమయంలో అడ్వొకేట్‌ను అనుమతిస్తే తమకు అభ్యంతరం లేదని పేర్కొన్నారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం మదన్‌రెడ్డి విచారణ సమయంలో అడ్వొకేట్‌ను అనుమతించాలని సిట్ అధికారులను ఆదేశించింది. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను జూలై 17వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. సిట్ అధికారులు తనను చిత్రహింసలకు గురిచేశారని, చట్టనిబంధనలను అనుసరించి పారదర్శకంగా దర్యాప్తు కొనసాగించేలా సిట్ అధికారులను ఆదేశించాలని కోరుతూ మదన్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. అలాగే, విచారణ సమయంలో అడ్వొకేట్‌ను అనుమతించేలా ఆదేశాలు ఇవ్వాలని ఆయన అనుబంధ పిటిషన్ వేశారు.

పీఎస్ఆర్‌పై తదుపరి చర్యలు నిలుపుదల

- జెత్వానీ కేసులో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

అమరావతి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): సినీనటి కాదంబరి జెత్వానీ కేసులో ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులుపై తదుపరి చర్యలన్నింటినీ నిలుపుదల చేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. తమపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ కాంతిరాణా తాతా, విశాల్ గున్ని, మరికొందరు వేసిన వ్యాజ్యాలతో పీఎస్ఆర్ పిటిషన్‌ను జత చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 30కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు.

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.*